

# పీపుల్స్‌వార్

కేంద్రకమిటీ సిద్ధాంత పత్రిక

(మార్క్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచిక)

జనవరి 2019

14


కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

**పీపుల్స్‌వార్‌-14**
**(ప్రత్యేక సంచిక)**
**జనవరి 2019**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అమరవీరులకు జోహార్లు | 5 |
| 2. | సంపాదకీయం: మార్క్సిజం అజేయం | 12 |
| 3. | 'మార్క్స్‌ - ఎంగెల్స్‌ - మార్క్సిజం' - లెనిన్‌ | 26 |
| 4. | కార్ల్‌మార్క్స్‌ సమాధివద్ద ఎంగెల్స్‌ ఉపన్యాసం | 67 |
| 5. | ఫ్రెడరిక్‌ ఎంగెల్స్‌ జీవిత చరిత్ర - లెనిన్‌ | 69 |
| 6. | అజేయమైన మార్క్సిజం అరుణపతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టండి – సీసీ, సీపీఐ (మావోయిస్టు) | 79 |
| 7. | విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్‌' వ్యూహాత్మక దాడిని ఓడిద్దాం –సీఎమ్‌సీ సర్క్యులర్‌ | 115 |



మార్క్స్ జననం - 1818, మే 5

మరణం - 1883, మార్చ్ 14

## మార్క్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచిక

ప్రపంచ కార్మికులారా! ఏకంకండి!

శ్రామికులకు పోయేది ఏమీలేదు – బానిస శృంఖలాలు తప్ప!

# అమరవీరులకు జోహార్లు

భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికీ, ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ నిర్దేశించిన కర్తవ్యాల సాధనకు అంకితమై, అలుపెరుగని కృషి చేస్తూ 'సమాధాన్' దాడిని ఓడించడానికి పోరాడుతూ ఈ సంవత్సర కాలంలో (2017 డిశంబరు నుండి 2018 నవంబరు వరకు) దేశవ్యాప్తంగా సుమారు 240 మంది కార్మికవర్గ పుత్రికలు, పుత్రులు అమరులయ్యారు. ఈ సంవత్సర కాలంలో మనకు పూజారి కాంకేర్ (తెలంగాణ), డీకేలో కసనూర్–హల్బి తుమిరిగుండ, ఆయిపేట, తిమ్మెం, చాకిలేరు, డోక్రిఘాట్ (ఏఓబీ)ల్లో భారీ నష్టాలు జరిగాయి. సీఆర్‌బీ కింద పనిచేసే వివిధ పార్టీ, పీఎల్‌జీఏ యూనిట్లలో 13 మంది, దండకారణ్యం(డీకే)లో 177 మంది, బీజేలో 18 మంది, ఆంధ్ర–ఒడిశా–సరిహద్దు ప్రాంతం(ఏఓబీ)లో 7గురు, ఒడిశాలో 10 మంది, తెలంగాణలో నలుగురు, మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ (ఎమ్ఎమ్‌సీ)లో 9 మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఒకరు ఈ కాలంలో అమరులైన వారిలో ఉన్నారు. వీరిలో మొత్తం 75 మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు.

ఈ సంవత్సర కాలంలో కేంద్రకమిటీ పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ దేవ్‌కుమార్ సింగ్ (అరవింద్, సుజిత్ దా), సీఆర్‌బీ స్టాఫ్ కామ్రేడ్ దడబోయిన స్వామి (ప్రభాకర్, సీఆర్‌బీ ప్రెస్, డివిసీఎమ్ స్థాయి), డీకేలో గడ్చిరోలిలో డీవీసీ కార్యదర్శి రౌతు విజేందర్ (శ్రీను), డీవీసీ సభ్యులు కామ్రేడ్స్ వాసుదేవ్ ఆత్రం (నందు, విక్రం), డోలేష్ ఆత్రం (సాయినాథ్), మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ టీం బాధ్యుడు సూర్య, ఒడిశాలో కందమాల్–కలహండి–బౌధ్–నువాపడా (కేకేబీఎన్) డివిజన్ కమిటీ సభ్యులు శంకర్ మాంఝీ (డేవిడ్, వినయ్), లక్మా కొర్రమ్ (మదన్), ఏఓబీలో మల్కనగిరి డీవీసీ సెక్రటేరియట్ సభ్యురాలు కామ్రేడ్ వలిగొండ ప్రమీల (శారద, జిలానీబేగం, మీన), బీజేలో లాతేహార్ జిల్లాలో ఇద్దరు సబ్‌జోనల్ కమాండర్లు కామ్రేడ్స్ శివలాల్, శ్రవణ్ యాదవ్, డీకేలో గడ్చిరోలిలో ఏరియా కమిటీ కార్యదర్శి ఒకరు, డీకేలో ఏసీ/పీపీసీఎమ్స్ 11, ఒడిశాలో ఏసీ/పీపీసీఎమ్ ఒకరు, తెలంగాణలో ఏసీ/పీపీసీఎమ్స్ ఇద్దరు, డీకేలో పీఎమ్/ పీఎల్‌జీఏ సభ్యులు 63 మంది, బీజేలో 16 మంది సభ్యులు, ఏఓబీలో పీఎమ్/పీఎల్‌జీఏ సభ్యులు ముగ్గురు, ఎమ్ఎమ్‌సీలో పీఎమ్/పీఎల్‌జీఏ సభ్యులు నలుగురు, ఒడిశాలో పీఎమ్/ పీఎల్‌జీఏ సభ్యులు నలుగురు, తెలంగాణలో పీఎమ్/పీఎల్‌జీఏ సభ్యులు ముగ్గురు, డీకేలో దక్షిణ బస్తర్ డివిజన్ జనతన సర్కార్ సాంస్కృతిక శాఖ అధ్యక్షురాలు కామ్రేడ్ పొడియం రాజే, ఆర్‌పీసీ నాయకులు తొమ్మిది మంది, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఏడుగురు, మిలీషియా కమాండర్లు, సభ్యులు 35 మంది, విప్లవ ప్రజానీకం ఎనిమిది మంది, ఏఓబీలో ఒక మిలీషియా సభ్యుడు, ఒడిశాలో ప్రజా నాయకులు కామ్రేడ్స్ సన్నీ సికాక, బారీ పిడికా, తెలంగాణలో ప్రజా నాయకులు కామ్రేడ్స్ శిడం శంభు, జివ్వాజి లక్ష్మినారాయణ బాతాలా రాజు, ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణల్లో పార్టీ సానుబూతిపరులైన గజ్జెల లక్ష్మి, కొండపల్లి కోటేశ్వరమ్మలు ఈ కాలంలో అమరులయ్యారు.

# సీపీఐ (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్‌కు అరుణారుణ జోహార్లు




పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ దేవ్‌కుమార్ సింగ్ (అరవింద్, సుజిత్, నిశాంత్) 2018, మార్చి నెల 3వ వారంలో తీవ్ర అనారోగ్యంతో 65 సం॥ల వయస్సులో తుదిశ్వాస విడిచాడు. ఆయన చాలా కాలం నుండి బీపీ, సుగర్ వ్యాధులతో పోరాడుతున్నాడు. 3సం॥ క్రితం కండ్లు బాగా దెబ్బతిన్నాయి. ఆయన చివరికి గుండెపోటుతో అమరులయ్యారు. బీహార్ రాష్ట్రం జహానాబాద్ జిల్లాలో దేవ్‌కుమార్‌సింగ్ ఒక మధ్య తరగతి రైతుకుటుంబంలో జన్మించాడు. పాట్నాలో బీఎస్సీ పూర్తి చేసారు. విద్యార్థి దశలోనే ఆనాటి విద్యార్థి యువజనోద్యమ వెల్లువలో క్రియాశీల పాత్ర పోషించాడు. ఆక్రమంలో విప్లవోద్యమంలోకి ప్రవేశించి సహచర విప్లవకారులతో కలిసి కమ్యూనిస్టు క్రాంతికారీ సంఘటన్ (సీకేఎస్)లో చేరాడు. ఆ తర్వాత సీకేఎస్‌ను మునుపటి పార్టీ యూనిటీలో విలీనం చేసారు. పార్టీ యూనిటీలో పనిచేసి కేంద్రకమిటీ నాయకులలో ఒకరిగా ఎదిగాడు. 1998లో పీపుల్స్‌వార్‌పార్టీ యూనిటీ రెండూ విలీనం కావడంతో ఐక్య పీపుల్స్‌వార్ పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడుగా పనిచేసాడు. పీపుల్స్‌వార్-ఎమ్‌సీసీఐ రెండు స్రవంతులు 2004లో విలీనమై సీపీఐ (మావోయిస్టు) ఏర్పడిన తర్వాత సీసీఎమ్‌గా, సీఎమ్‌సీ, ఈఆర్‌బీఎం సభ్యుడుగా పనిచేసాడు. 2013లో జరిగిన సీసీ-4వ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యుడుగా కోఆప్ట్ అయ్యి అమరుడయ్యేవరకు అదే బాధ్యతల్లో కొనసాగాడు. బీహార్-జార్ఖండ్ విప్లవోద్యమంలో 4 దశాబ్దాల పైబడిన విప్లవాచరణతో ఆయన విప్లవోద్యమ పెరుగుదలకు, విస్తరణకు చేసిన కృషి ఎంతో విలువైనది.

1970వ దశకం నాటి తీవ్ర కల్లోల పరిస్థితుల్లో, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో విద్యార్థి యువజనుల్లో పెల్లుబికిన కసి ఆనాటి ప్రజాస్వామిక ఉద్యమ వెల్లువకు తోడ్పడింది. అటువంటి వెల్లువలో మిలిటెంట్ విద్యార్థి నాయకుడు దేవ్‌కుమార్‌సింగ్ గొప్ప అనుభవాన్ని సంపాదించాడు. అప్పుడే బెంగాల్‌లో సీఎమ్ నాయకత్వంలోని నక్సల్బరి సాయుధ రైతాంగ పోరాటం దేశవ్యాపితంగా ప్రభావం చూపడంతో దేవ్‌కుమార్‌సింగ్ యొక్క సరైన పంథా

అన్వేషణ ఫలించింది. జేపీ నడిపిన సంపూర్ణ విప్లవ ఉద్యమం తనకు నెగెటివ్ టీచర్ అని, అది నక్సలిజం అనే సరైన మార్గానికి చేర్చిందని చెప్పాడు. అదే కాలంలో మధ్య బీహార్‌లో జరిగిన చారిత్రక భోజ్‌పూర్ రైతాంగ సాయుధ పోరాటం, కామ్రేడ్ జోహార్ ప్రభావం బలంగా ఉన్నాయి. ఆ ఉద్యమాల్లో దొర్లిన పొరపాట్లను సరిదిద్దుకునే వైఖరిని చేపట్టిన వారందరూ 1977-79 మధ్య సీకేఎస్‌లో చేరారు. ఇది కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ విప్లవ జీవితంలో తొలిమెట్టు.

కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ డెహరీ-ఆన్-సోన్ (రోహతాస్) ప్రాంతంలో కార్మిక ఉద్యమంతో సంబంధాలు పెట్టుకుని, అభివృద్ధి చేయడంలో విజయాలు సాధించాడు. ఆ క్రమంలోనే కామ్రేడ్ నారాయణ సన్యాల్ నేతృత్వంలోని సీపీఐ (ఎమ్ఎల్) పార్టీ యూనిటీతో సంబంధాలు ఏర్పడ్డాయి. 1980లో వారితో సీకేఎస్ యూనిట్ విలీనమై యూనిటీ ఆర్గనైజేషన్‌గా మార్పు చెందింది. 1982లో ఇదే పంజాబ్ కామ్రేడ్స్‌ను కలుపుకుని సీపీఐ (ఎమ్ఎల్) పార్టీయూనిటీగా సంఘటితమయ్యింది. ఇది కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ విప్లవ జీవితంలో రెండవ మెట్టు.

పీయూ పార్టీ 1980 దశకంలో మధ్య మరియు దక్షిణ బీహార్‌లలో సాయుధ పోరాటాన్ని ప్రారంభించింది. మగధ్, కోయల్-కైమూర్ ప్రాంతాలలో కేంద్రీకరించి పనిచేసింది. కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ పీయూ నాయకత్వంలో తన స్వంత ప్రాంతమైన జహనాబాద్‌లో తనలాగే జేపీ ఉద్యమ భ్రమల నుండి బయటపడిన మిలిటెంట్ యువకులపై ఆధారపడి భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని, వ్యవసాయక విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేసాడు. 1980ల మధ్య నాటికి పాట్నా, జహనాబాద్, గయ, ఔరంగాబాద్ జిల్లాల్లోని వందలాది గ్రామాల్లో రైతాంగ పోరాటాలు తెగువతోను, త్యాగ సాంప్రదాయాలతోను కొనసాగాయి. భూమిసేన బేనర్ కింద ప్రతీఘాతుక కుర్మీ భూస్వాములంతా ఏకమై విప్లవోద్యమ ప్రజాపునాదిని అణగదొక్కడానికి పెద్దఎత్తున దాడి చేసారు. పీడిత ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో మిలిటెంట్ ప్రతిఘటనా పోరాటాలు జరిగాయి. వాటిని ముందుకు తీసుకువెళ్ళేందుకు మొదటి రెగ్యులర్ ఎర్ర ప్రతిఘటనా సాయుధ దళాల నిర్మాణం జరిగింది.

కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ గొప్ప ఉద్యమ కారుడు. తన ఉపన్యాసాల ద్వారా రైతాంగాన్ని ఉత్సాహపరచి మిలిటెంటు పోరాటాలకు సిద్ధపరిచేవాడు. రైతాంగ మిలిటెంట్ పోరాటాలతో భూస్వాములు గ్రామాలను వదిలి పట్టణాలకు పారిపోయారు. భూస్వాముల ప్రైవేట్ సేనలను రైతాంగం వర్గకసితో పోరాడుతూ మిలిటెంట్ దాడుల్లో శిక్షించారు. సికారియ గ్రామానికి చెందిన రాంపర్వేష్, దుఖాన్‌సింగ్ లాంటివారిని, కన్సారా, రాంపూర్‌ఛాయి వంటి మారణకాండలు జరిపిన క్రూరమైన భూస్వాములను, రాజాయాదవ్, ఫేఖన్ వంటి బందిపోటు ముఠాలని నిర్మూలించారు. మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ సమితి నాయకుడుగా దేవ్‌కుమార్‌సింగ్ పాత్ర ప్రధానమైనది. అతడు పీడిత రైతాంగ నాయకుడుగా సమర్ధవంతంగా ప్రతిఘటనకు నాయకత్వం వహించి రైతాంగాన్ని భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటంలో ముందుకు నడిపించాడు.

మగధ్ రీజయన్‌లో పిప్రా, రురాస్, బిఘా, బెల్చీ, భగోడిహ్ వంటి చోట్ల దళితులపై అగ్రకుల భూస్వామ్య సైన్యాలు సాగిస్తున్న హత్యాకాండలకు నిరసనగా దళితులను సమీకరించి భూస్వామ్య ప్రైవేట్ సైన్యాలపై ప్రతిఘటనా చర్యలను విజయవంతం చేసాడు. 50కి పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. రైతాంగం, దళితులు భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో కదిలి విప్లవోద్యమం అభివృద్ధి చెందడం, అనేక ప్రాంతాలకు విస్తరించడంతో భూస్వాముల పునాదులు కదిలి, వారి అధికారం కూలిపోసాగింది. 1984 నుండి భూమిసేన నాయకులు ఎమ్‌కేఎస్‌ఎస్ పెట్టిన షరతులకు లొంగి వచ్చారు. వారిపై రైతాంగం జరిమానాలు విధించింది. ఆ ప్రాంతంలో పోలీసు క్యాంపులు ఎత్తివేశారు. రైతాంగం పై పెట్టిన తప్పుడు కేసులు ఉపసంహరించి, జైలు నుండి విడుదలచేసారు.

ఈ పరిణామాలను రాజ్యం చూస్తూ ఊరుకోలేదు. గయ డివిజన్‌లోకి వేల కొలది పోలీసు, పారామిలటరీ బలగాలు వచ్చాయి. క్యాంపులు పెట్టారు. దాడులు ప్రారంభించారు. 1983 లో మడువాలో ఎమ్‌కేఎస్‌ఎస్ మహాసభపై దాడిచేసి జరగకుండా విచ్ఛిన్నం చేసారు. 1986లో ఏప్రిల్ 19న అర్వల్‌లో ఎమ్‌కేఎస్‌ఎస్ రాష్ట్ర మహాసభపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 23 మందిని హత్యచేసారు. 70 మందిని గాయపరిచారు. దీనిని 'మినీ జలియన్‌వాలాబాగ్' అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల మందిని అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి జైళ్ళల్లో పెట్టారు. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా సర్వత్రా ప్రజా చైతన్యం వెల్లువెత్తింది. ఒకగొప్ప అల లాగ లక్షలాది మంది ప్రజలు సమీకృతులు కావడంతో సమరశీల ప్రజా ప్రతిఘటనా ఉద్యమాలు ముందుకు వచ్చాయి. అర్వాల్ సంఘటనకు నిరసనగా 1987లో రాష్ట్ర అసెంబ్లీని ఘెరావ్ చేసేంత ఉన్నత స్థాయికి ప్రజా నిరసనోద్యమం చేరుకుంది. ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను తాత్కాలికంగా ఉపసంహరించినా, తర్వాత ఎమ్‌కేఎస్‌ఎస్‌పై నిషేదం విధించి అసెంబ్లీ ఘెరావ్‌ను పాశవిక దాడులతో అడ్డుకుంది.

మగధ్ రిజియన్‌లో చారిత్రక ప్రజా వెల్లువకు దారితీసిన విప్లవోద్యమ నిర్మాత కామ్రేడ్ దేవ్‌కుమార్ నుండి నేర్చుకోవలసిన నూతనాంశాలు చాలానే ఉన్నాయి. 1. ప్రజా ఉద్యమాన్ని చట్ట వ్యతిరేకంగా నడపడం 2. చిన్న ప్రాంతంలోనే ఉద్యమం జరుగుతున్నా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి ప్రజా సంఘనిర్మాణం చేయడం. 3. ఎమ్‌కేఎస్‌ఎస్‌ను క్రియాశీలంగా నడపడం 4. వేల సంఖ్యలో క్రియాశీలక కార్యకర్తలు వారి సంఖ్యకు పదింతలు సభ్యత్వంతో సంఘాన్ని నడపడం 5. సాయుధ దళ కార్యకలాపాలను ప్రజా ఉద్యమంతో సమన్వయించడం 6. బహిరంగ ప్రజాసంఘాన్ని రహస్య సంఘ నిర్మాణంతో మిలితం చేసి నడపడం 7. అగ్రకుల భూస్వామ్యాన్ని ఓడించేందుకు అన్ని కులాల పీడితవర్గాన్ని ఐక్యంగా నిలబెట్టి మిలిటెంట్ పోరాటం చేయడం మొదలైనవి.

మొత్తం పలామా జిల్లా అంతటా, రోహతాస్, భబువా, ఔరంగాబాద్, పట్నా, భోజ్‌పూర్, బక్సర్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాలకు ఉద్యమం విస్తరించింది. 1988–90ల మధ్య కోయల్ కైమూర్ ప్రాంతంలో కూడా ఒక ప్రజావెల్లువవచ్చి మరి కొన్ని గెరిల్లా దళాల్ని ఏర్పరిచారు. మిలీషియా మద్దతుతో టీసీఓసీల ద్వారా శత్రు సైనిక ఆపరేషన్లను విజయవంతంగా నిలువరించగలిగారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల నుంచి విముక్తి ప్రాంతాల లక్ష్యంతో గెరిల్లా జోన్ల నిర్మాణానికి జరిగిన కృషిలో కామ్రేడ్ దేవ్‌కుమార్ అవగాహన, ఆచరణ తోడ్పడ్డాయి. బీహార్‌లో గెరిల్లాజోన్లు ఏర్పాటు మూల మలుపుకు కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ కీలక భూమికను పోషించాడు. 1987 నుండి దేవ్‌కుమార్‌సింగ్ రాజకీయ, నిర్మాణ, సైనిక కార్యక్రమాలను రూపొందించడంలోను, రాజకీయ, సైనిక శిక్షణ అందించడంలోను, మిలిటరీ కమాండ్ వ్యవస్థల నిర్మాణంలోను, శత్రు బలగాల నుండి ఆయుధాలు స్వాధీనం చేసుకుని గెరిల్లా దళాలను సాయుధం చేయడంలోను ముఖ్యమైన పాత్రను నిర్వహించాడు. ఆవిధంగా పార్టీ చేసిన కృషి ఫలితంగా బీహార్‌లో 1995 నుండి రాజ్య వ్యతిరేక సాయుధ పోరాటం ప్రధాన లక్షణంగా మారింది.

1994–2000 మధ్య కాలంలో 9 ఆంబుష్‌లు, 10 రెయిడ్లు విజయవంతం చేసారు. 60 మంది పోలీసులను ఖతంచేసి 176 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అనేక టీసీఓసీలలో దేవ్‌కుమార్‌సింగ్ ప్రధాన పాత్ర పోషించడమే కాక పీఎల్‌జీఏ నిర్మాణంలో కూడా ప్రధానం అయ్యాడు. ఆ విధంగా గెరిల్లా యుద్ధాన్ని, పార్టీ పంథాను అభివృద్ధి చేయడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు.

2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్‌లో అన్ని కమిటీలలోకి తిరిగి ఎన్నికకావడం జరిగింది. రీజనల్ మిలటరీ కమిషన్‌లో ఉండి పలు టీసీఓసీలకు, కేంద్రీకృత ఆపరేషన్లకు నేతృత్వం అందించాడు. పార్టీలో ఉన్నత స్థాయి ఉత్తమ కమాండర్లలో కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ ఒకడిగా కేడర్ల ప్రేమాభిమానాలను చూరగొన్నాడు. చొరవ, దృఢసంకల్పం, ధైర్య సాహసాలు, త్యాగనిరతి, సమయస్ఫూర్తి దేవ్‌కుమార్‌సింగ్‌లో నున్న యుద్ధకళను ఇనుమడింపచేసాయి. సైనిక అవసరాలు పరిష్కరించే విధంగా సప్లై బాధ్యతలు నిర్వహించడంలోను, ఐఈడీలను రూపొందించడంలోను, శిక్షణనివ్వడంలోను దేవ్‌కుమార్‌సింగ్ పాత్ర ఎన్నదగినది.

కామ్రేడ్ దేవ్‌కుమార్‌సింగ్ రెండుసార్లు అరెస్టయ్యి చిత్రహింసలను, జైలు నిర్బంధాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ఆయన జీవితం పార్టీకి, పీడిత వర్గాల యువతీయువకులకు ఆదర్శం. తీవ్రమైన అనారోగ్యంతో, వ్యూహాత్మక ప్రాంతంలో ప్రత్యక్ష నేతృత్వం అందిస్తూ వారి మధ్యనే అమరుడయ్యాడు. కార్మిక కర్షక యోధుడు, కమాండర్, నాయకుడు దేవ్‌కుమార్‌సింగ్ పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు. ✦

# సీనియర్ మహిళా కామ్రేడ్ నిడికొండ ప్రమీల
# (శారద, మీనా, జిలానీబేగం)



కామ్రేడ్ ప్రమీలను 2018 అక్టోబర్ 12న ఏఓబీలోని మల్కన్‌గిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో పోలీసులు అరెస్టు చేసి బూటకపు ఎదురు కాల్పులు పేరిట హత్య చేసారు. 23 సం॥ల సుదీర్ఘ విప్లవ జీవితం ఆమెది. 41 సం॥ల క్రితం తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బచ్చన్న పేట మండలం పోచన్న పేట గ్రామంలో దిగువ మధ్యతరగతి కుటుంబంలో ఐదుగురిలో చివరి సంతానంగా జన్మించింది. నాటి వీర తెలంగాణ పోరాటం నుండి నేటి మావోయిస్టు ఉద్యమం వరకు ఆ గ్రామ ప్రజలు విప్లవోద్యమంలో భాగం పంచుకుంటూనే ఉన్నారు. కామ్రేడ్ ప్రమీల అన్నావదినలు గౌర్రె పోచన్న, భారతక్క మన పార్టీ అమరులు.

కామ్రేడ్ ప్రమీల 1995 చివరిలో విప్లవ జీవితాన్ని ప్రారంభించింది. మొదట స్థానిక చేర్యాల ఏరియా దళ సభ్యురాలుగా ఒక సం॥ పనిచేసింది. తర్వాత నెక్కొండ ఏరియా దళంలోకి మారింది. 1997లో ఎన్‌టీఎఫ్‌డీ మొదటి పీఎల్ సభ్యురాలుగా బదిలీ అయ్యింది. 1998లో అనారోగ్యానికి గురై హాస్పటల్‌కు వెడుతున్న క్రమంలో అరెస్టయ్యి 8 నెలలు జైలు నిర్బంధాన్ని అనుభవించింది. 1999 నుండి ఏటూరు నాగారం దళంలో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నది. 1999 జూన్‌లో పార్టీ అనుమతితో తను ఇష్టపడిన కామ్రేడ్‌ను వివాహం చేసుకుంది. 2000 సం॥లో ఏరియా కమిటీలోకి ప్రమోట్ అయ్యింది. 2001లో అదే ఏరియాలో ప్రత్యేక మహిళా దళానికి కమాండర్‌గా నియమించబడింది. ఆర్గనైజేషన్ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల, మహిళల సమస్యలను చొరవతో పరిష్కరించింది. 2003లో మహదేవ్‌పూర్ ఎల్ఓఎస్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టింది. 2005లో తీవ్ర అనారోగ్యం కారణంగా హాస్పటల్‌కు వెడుతుండగా విజయవాడలో ఎస్ఐబీ పోలీసులు అరెస్టు చేసారు. చిత్రహింసలు పెట్టి 16 నెలలు జైలులో నిర్బంధించినా మొక్కవోని ధైర్యంతో జైలులో కూడా పోరాటాలు నిర్వహించింది. జైలు నుండి విడుదలై వచ్చాక కేకేడబ్ల్యూ డివిజన్‌లో ఉత్సాహంగా పనిచేసింది.

2008లో తన సహచరుడుతో కలిసి ఏఓబీ ఉద్యమంలో భాగంగా పనిచేయడానికి సిద్ధపడింది. 2009 ప్రారంభంలో మల్కన్‌గిరి డివిజన్‌లోని పొడియా ఏరియా కమిటీలో చేరి, జిల్లా ఉద్యమంలో భాగమై డీవీసీఎమ్‌గా కోఆప్ట్ అయ్యింది. అక్కడే 2015 చివరి వరకు పొడియా ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేసింది. స్థానిక భాష నేర్చుకుని ఒడిశా ప్రాంతంలో ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించింది. శీలకోటలో 16 మంది మిలీషియా, సీఎన్ఎమ్ సభ్యులను బూటకపు ఎదురు కాల్పుల్లో హత్యచేసినపుడు ఆ ప్రాంత ప్రజల మధ్యనే ఉండి ఉద్యమాన్ని ముందుకు నడిపించింది. రాంగూడ పెద్ద ఘటనలో 31 మంది అమరులయిన తర్వాత ఆ ప్రజల మధ్య పనిచేసి వారికి ధైర్యాన్నిచ్చింది. 2016లో కా॥ ప్రమీల ఎమ్‌కేవీ డివిజన్‌కు బదిలీ అయ్యి 2017 వరకు పెదబయలు ఏరియాలో పనిచేసింది. 2017 నుండి డీవీసీ సెక్రటరేట్ సభ్యురాలుగా డివిజన్ ప్రజారంగం బాధ్యతలు నిర్వహించింది.

కామ్రేడ్ ప్రమీల 23 సం॥ల విప్లవ జీవితంలో తెలంగాణ, ఏఓబీలలో వివిధ ఏరియాలలో వివిధ రకాల బాధ్యతలను నిర్వహించింది. తీవ్రమైన అనారోగ్యం ఉన్నా కొండలు గుట్టలు ఎక్కిదిగుతూ, శత్రు దాడులను విరోచితంగా ప్రతిఘటిస్తూ కార్పెట్ సెక్యూరిటీ మధ్యనే మొక్కవోని పట్టుదలతో పనిచేసింది. అందరితో కలుపుగోలుగా, ఉత్సాహంగా కలిసిపోయే ప్రమీల అందరి అవసరాలు పట్టించుకునేది. చొరవతో ధైర్యసాహసాలతో ముందుకే నడిచింది. విప్లవాదర్శాలకు కట్టుబడిన విప్లవ యోధ కా॥ ప్రమీల అమరత్వం పార్టీకి తీవ్రనష్టం. కా॥ ప్రమీలకు వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. ✦

**ప్రతి వ్యక్తీ ఎప్పుడో ఒకనాడు మరణించక తప్పదు. కాని ఒకరి చావుకూ మరొకరి చావుకూ తేడా ఉంటుంది. దాని ప్రాముఖ్యత కూడా వేరు విధంగానే ఉంటుంది. పురాతన చైనా గ్రంథకర్త జుమాచిన్ ఇలా అన్నాడు. నిమరణం అందరికీ సమానమే. కాని కొందరి మృత్యువు థాయ్ పర్వతం కంటే బరువుగానూ, మరికొందరి మృత్యువు ఈక కంటే తేలికగానూ ఉంటుంది. ప్రజల కోసం మరణించడం థాయ్ పర్వతం కంటే బరువైనది. కాని ఫాసిస్టుల కోసం పనిచేయడం, దోపిడీగాళ్లు, ప్రజలనణిచే వారి తరపున చావడం కాకి ఈక కంటే తేలికైనది.**

*– మావో (ప్రజలకు సేవ చేయండి. మావో రచనలు 3వ సంపుటి నుండి)*

## సంపాదకీయం

# మార్క్సిజం అజేయం

మార్క్సిజం గురించి లెనిన్ ఏం చెప్పాడో ఒక్కమాటలో ముందు చూద్దాం. 'మార్క్స్ యొక్క అభిప్రాయాల, ఉపదేశాల వ్యవస్థ మార్క్సిజం. మానవ జాతి అన్ని దేశాలలోకంటెనూ అత్యంత పురోగమనాన్ని సాధించిన మూడు దేశాలలోనూ పందొమ్మిదవ శతాబ్దంలోని ప్రధాన సైద్ధాంతిక స్రవంతులు మూడింటినీ–సాంప్రదాయసిద్ధమైన జర్మన్ తత్వశాస్త్రాన్నీ, సాంప్రదాయసిద్ధమైన ఇంగ్లిష్ అర్థశాస్త్రాన్నీ, సాధారణంగా ప్రచారంలో వున్న ఫ్రెంచ్ విప్లవ సిద్ధాంతాలు సహా ఫ్రెంచ్ సోషలిజాన్నీ–ఇంకా అభివృద్ధి చేసి పరిణతికి తీసుకువచ్చిన మహా ప్రతిభాశాలి మార్క్స్' –లెనిన్

తత్వశాస్త్రంలో జడతార్కిక భావవాద అంశాలను తొలగించి గతితార్కిక భౌతికవాదాన్ని, అర్థశాస్త్రంలో శ్రమజన్య విలువ సిద్ధాంతం నుండి అదనపు విలువ సిద్ధాంతాన్ని, రాజకీయరంగంలో వర్గపోరాట సిద్ధాంతాన్ని, కార్మికవర్గ నియంతృత్వంను అభివృద్ధి చేసాడు. ఈయేడు మనం కూడా మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నాం. మార్క్సిజం అజేయమని చాటుతున్న చరిత్రలోకి వెళ్లేముందు మనం మార్క్స్ జీవిత చరిత్రను సంక్షిప్తంగా పరిచయం చేసుకుందాం.

కారల్ మార్క్స్ 1818 మే అయిదవ తేదీన జర్మనీలోని రైన్ రాష్ట్రంలో గల ట్రయర్ నగరంలో జన్మించాడు. ఆయన తల్లి హెన్రెట్టా, తండ్రి హెన్రిచ్ మార్క్స్. ఆ దంపతులకు తొమ్మిదిమంది పిల్లలు. వాళ్లలో మూడోవాడు మార్క్స్.

మార్క్స్ తండ్రి హెన్రిచ్ మార్క్స్ ఒక న్యాయవాది. ఆ రోజుల్లో క్రైస్తవమతం స్వీకరించడం స్వేచ్ఛాప్రవృత్తికి చిహ్నంగా భావించేవారు. యూధుడైన హెన్రిచ్ కూడా ఆ ప్రకారమే ప్రొటస్టంట్ క్రైస్తవ మతం స్వీకరించాడు.

1835లో మార్క్స్‌ను ఆయన తండ్రి ఒక సంవత్సరం కోసం బాన్ విశ్వవిద్యాలయానికి, ఆ తర్వాత బెర్లిన్ విశ్వవిద్యాలయానికి న్యాయశాస్త్ర అధ్యయన లక్ష్యంతో పంపించాడు. 1836 అక్టోబర్ 22న మార్క్స్ బెర్లిన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగంలో ప్రవేశించాడు. క్రిమినల్ చట్టం, రోమన్ న్యాయశాస్త్రం, మానవ సమాజ శాస్త్రం అనే మూడు లెక్చర్లు తీసుకున్నాడు. కానీ మార్క్స్ ఆసక్తి న్యాయశాస్త్రం నుంచి చాలా తొందరలోనే చరిత్రకు, అటు నుండి తత్వశాస్త్రానికి మరలింది. 'నేను చదవాల్సింది న్యాయ శాస్త్ర గ్రంథాలు. అయితే, అన్నిటినీ మించి తత్వశాస్త్ర గ్రంథాలు చదవాలన్న తపన 'బయలుదేరింది.' అంటూ ఆయన తన మిత్రులకు రాశాడు.

మార్క్స్ మొదట ఆదర్శవాది. ప్రత్యేకంగా కాంట్, ఫీష్‌ల భావాలు, వాల్టేర్, రూసోలు బోధించిన ఫ్రెంచ్ సంస్కారం ఆయనను ప్రభావితం చేశాయి. పందొమ్మిదేళ్ళ చిరుత ప్రాయంలో ఆ విద్యార్థి తన గురువుగారు హెగెల్ తత్వశాస్త్ర సారాన్ని ఔపోసన పట్టాడు. అదే గతితర్క విధానం. బెర్లిన్‌కు చేరిన కొద్ది నెలలలోపే ఆయన యువ హెగెలియన్ల బృందంలో క్రియాశీల సభ్యుడయ్యాడు. ఈ బృందాన్ని వామపక్ష హెగెలియన్లు అని కూడా పిలుస్తారు. హెగెల్ శిష్యుడుగా మారటమన్నది తన జీవితంలోనే కొత్త మలుపుకు దారితీసిన నిర్ణయమని ఆయన చెప్పుకున్నాడు.

హెగెల్ ఆదర్శవాదిగా వ్యవహరించిన మాట నిజం. అన్ని ఘటనలకు మూలం భావాల అభివృద్ధేనని ఆయన విశ్వసించాడు. దాన్నే 'అఖండ భావం' అన్నాడు. భౌతిక ప్రపంచం కేవలం ఈ అఖండ భావ ప్రతిబింబం మాత్రమేనని హెగెల్ అభిప్రాయం. 'అఖండసత్యం' అనేది గతితర్కంతో పొసగేదేకాదు. అలాగే హెగెల్ ప్రష్యన్ రాజ్యాన్ని సమర్థించడం కూడా గతితర్క విరుద్ధమే. హెగెల్ తత్వశాస్త్రం తాను ఆకాంక్షించిన రాజకీయ, రాజ్యాంగబద్ధ స్వేచ్ఛల సాధన నిజానికి పెట్టుబడిదారీ ఉత్పత్తి మూలంగా పౌరులు ఆర్థిక స్వతంత్రతని పొందడం వల్ల సాధ్యపడిందని గ్రహించడంలో విఫలమైంది. సంపదను, స్వేచ్ఛలను సృష్టించిన క్రమమే సామాజికంగా అణచివేతకు, దోపిడీకి గురువుతున్న ప్రజలతో కూడిన ఒక నూతన వర్గాన్ని కూడా సృష్టించిందనే విషయాన్ని కూడా ఈ తత్వశాస్త్రం గ్రహించలేక పోయింది. బూర్జువా విమోచనోద్యమం వ్యక్తికి చెందిన రాజకీయ స్వేచ్ఛలను ప్రజాస్వామిక రాజ్యాంగాల ద్వారా సాధించడంలో సఫలమైంది. అయితే తాత్విక స్థాయిలో రాజకీయ విమోచనకు, ఆర్థికాభివృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించడంలో విఫలమైంది. ఇరవైయేళ్ళ వయస్సులో మార్క్స్ యువ హెగెలియన్ల క్లబ్ సభ్యుడైనాడు. అడుగు పెట్టినచోటనల్లా అతి ప్రధాన వ్యక్తి కావడం మార్క్స్ తెలివి తేటలకు నిదర్శనం. హెగెలియన్ల క్లబ్బులోనూ అదే జరిగింది. 1841లో బెర్లిన్ యూనివర్శిటీలో చదువు ముగిసేదాకా మార్క్స్ ఈ క్లబ్బులో కొనసాగాడు. చివరకు 1841లో బెర్లిన్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు పట్టాను తత్వశాస్త్రం మీదనే పొందాడు. అది డెమొక్రిటస్, ఎపిక్యురస్‌ల తత్వశాస్త్ర దృక్పథాలపైన సిద్ధాంత గ్రంథం.

బెర్లిన్ విశ్వవిద్యాలయంలో చదువు ముగించుకుని 1842లో బయటకు వచ్చిన తర్వాత మార్క్స్ పశ్చిమ జర్మనీలో వామపక్ష ఆలోచనాధోరణికి వాహికగా కొత్తగా ప్రారంభమైన 'రైనిష్ జీటుంగ్' అనే పత్రికకు సంపాదకుడయ్యాడు. 'రైనిష్ జీటుంగ్' సంపాదకుడిగా ఆయన అనుభవం ఆయనను ఆర్థిక, సామాజిక సమస్యలతో సంబంధంలోకి తెచ్చింది. అదే సమయంలో ఆయన సమకాలీన సోషలిస్టు రచనలతో సంబంధం పెట్టుకోవడం ప్రారంభించాడు. ఆ క్రమంలో ఆయన 1843లో జర్మనీ వదిలేసి పారిస్‌కు ప్రయాణం అయ్యాడు.

పారిస్‌లో ఆయన గడపిన సంవత్సరాలు ఆయనను ఫ్రెంచి సోషలిస్టుల భావాలతో మాత్రమేకాక, ఇంగ్లీష్ అర్థశాస్త్రవేత్తల రచనలతో కూడా సంబంధంలోకి తెచ్చాయి. ఎంగెల్స్ సలహాతో ఆయన అర్థశాస్త్ర అధ్యయనాన్ని చేపట్టాడు. అక్కడే ఆయన మొట్టమొదటిసారిగా ఆడం స్మిత్, రికార్డో, మెక్‌కల్లోచ్, జేమ్స్‌మిల్, ఫ్రెంచ్ అర్థశాస్త్రవేత్త జె.బి.సేల రచనలను తీవ్రంగా అధ్యయనం చేశాడు.

ప్రష్యన్ ప్రభుత్వ కోరికపై, ప్రమాదకర విప్లవకారుడని చెప్పి మార్క్స్‌ని 1845లో పారిస్ నుండి వెళ్ళగొట్టారు. అక్కడి నుంచి మార్క్స్ బ్రసెల్స్ వెళ్ళాడు. 1846లో ఆయన మొదటిసారి ఇంగ్లండ్ వెళ్ళాడు. చార్టిస్టుల రూపంలో సాగుతున్న ఇంగ్లిష్ కార్మికవర్గ ఉద్యమంతోనూ, తొలి ట్రేడ్ యూనియన్ నాయకులతోనూ, ఆయనకు అప్పుడే పరిచయం కలిగింది. ఆయన మళ్ళీ లండన్‌కు 1847 చలికాలంలో ప్రయాణించి 'ఫ్రెటర్నల్ డెమొక్రట్స్' అనే సంస్థ సమావేశంలో పాల్గొన్నాడు. చివరిగా 1848 విప్లవ సంవత్సరంలో తన కార్యకలాపాలకుగాను జర్మనీ నుంచి, పారిస్ నుంచి బహిష్కరించబడి 1849లో లండన్ చేరాడు. అది ఇక ఆయన శాశ్వత నివాసం అయిపోయింది.

అప్పటికే కమ్యూనిస్టు నిష్ణాతుడుగా, దృఢమైన వ్యక్తిగా గుర్తింపు ఉన్న మార్క్స్‌కు కార్యక్రమాన్ని రాసే బాధ్యతను కమ్యూనిస్టు లీగ్ అప్పజెప్పింది. మార్క్స్, ఎంగెల్స్ కలిసి ఈ కార్యక్రమాన్ని 1848 జనవరిలో పూర్తి చేసి లండన్‌లో అప్పజెప్పగా, అదే సంవత్సరం ఫిబ్రవరిలో కార్యక్రమం అచ్చయింది. దీనికి వారు 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'గా నామకరణం చేసారు. దీనితో మానవ చరిత్రలో చాల ప్రముఖమైన ఒకే ఒక డాక్యుమెంటుగా ఇది ఉనికిలోకి వచ్చింది.

కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రపంచ కార్మికవర్గం మొట్టమొదటి విప్లవ కార్యక్రమం. ఇది కార్మికులకు సోషలిజం దారిలో పురోగమించడానికి  కార్మికవర్గ దృక్పథం అందించడంతో పాటు ఆచరణకు బలమైన పునాదులను వేసింది. ఇది పెట్టుబడిదారీ విధానం నుండి వారిని ఎలా రక్షించుకోవాలి. ఎలా దాన్ని రద్దు చేయాలో నూతన సోషలిస్టు వ్యవస్థను ఎలా నిర్మించాలో కూడా కార్మికులకు చూపింది.

కమ్యూనిస్టు మేనిఫెస్టో రాసి ఇప్పటికీ 170 సంవత్సరాలు గడిచాయి. ఇప్పటికీ కమ్యూనిస్టు మేనిఫెస్టో పెట్టుబడిదారీ శత్రువుల దాడుల నుండి అభేద్యంగా నిలిచి, తరాల విప్లవ అనుభవంలో న్యాయబద్ధతను నిరూపించుకుంటూ, ప్రపంచ కార్మికవర్గానికి స్పష్టమైన మార్గదర్శిగా, శిలలాగా నిలబడి ఉంది. మార్క్స్‌కు ముందు మేధావుల్లో, 1848 కు ముందు పెట్టుబడిదారీ విధానాన్ని

విశ్లేషించడంలో, సోషలిజం కోసం సాగే పోరాటంలో ఎత్తుగడలు, అంతిమ లక్ష్యం పట్ల చాల అస్పష్టత ఉంది. అది అనాగరికంగా, ఊహాజనితంగా, దుస్సాహసికంగా, అవకాశవాదంతో కూడి కలగా పులగంగా ఉంది. అయితే మార్క్స్-ఎంగెల్స్‌లు ఈ ఆదర్శవాదాన్ని, తెలియనితనాన్ని, పిడివాదాన్ని కమ్యూనిస్టు మేనిఫెస్టో ద్వారా గట్టిగా దెబ్బతీసారు. మొట్ట మొదటి సారిగా శాస్త్రీయమైన సోషలిజాన్ని ఆవిష్కరించారు. మార్క్సిజం ప్రధానంగా కమ్యూనిస్టు మేనిఫెస్టోతో రూపుదిద్దుకొని దశాబ్దాలు గడుస్తున్న కొద్ది విస్తరిస్తూ చాల బలంగా తయారైంది.

పెట్టుబడిదారీ సమాజపు సామాజిక, ఆర్థిక మూలాలను విమర్శనాత్మకంగా విశ్లేషించడం ద్వారా ఆ సమాజపు 'చలన సూత్రాన్ని' అర్థంచేసుకున్నాడు.

'కారల్ మార్క్స్ తన సన్నిహిత సహచరుడైన ఫ్రెడరిక్ ఏంగెల్స్‌తో కలిసి గతితార్కిక భౌతికవాద తత్వశాస్త్రాన్ని ఒక పద్ధతిగా, ఒక దృక్పథంగా అభివృద్ధి చేశారు. సామాజికాభివృద్ధి చలన నియమాలను లేదా చరిత్ర గురించిన భౌతికవాద భావనను కనుగొనేందుకు గతితార్కిక పద్ధతిని అన్వయించారు. అదే చారిత్రక భౌతికవాదం.'

'తత్వవేత్తలు ప్రపంచాన్ని అనేక విధాలుగా వ్యాఖ్యానించారు. కాని అసలు విషయ మేమంటే దాన్ని మార్చడం.' అన్నాడు మార్క్స్.

ప్రపంచంలో మార్పు ఎలా జరుగుతుందో పరిశీలిస్తూ వర్గ ప్రయోజనాలు రక్షణ కోసం ఆచరణాత్మక నాయకత్వాన్ని అందించడం, సోషలిజం లక్ష్యాన్ని చేరడం కోసం దారి చూపుతూ ప్రపంచంలో సోషలిజాన్ని నిర్మించడం కోసం మార్క్సిస్టు తత్వశాస్త్రం కార్మికవర్గానికి దారిచూపుతుంది.

మార్క్స్ జీవిత కాలమంతా, రాజకీయ కృషికి వెచ్చించిన సమయాన్ని మినహాయిస్తే ప్రధానంగా ఆర్థిక విమర్శా కర్తవ్యానికే అంకితమైంది. అంటే పెట్టుబడిదారీ సమాజాన్ని గురించి ఆర్థిక శాస్త్ర రచయితలు వెలిబుచ్చిన భావాల గురించి సమగ్ర అధ్యయనం చెయ్యడమే. 1850వ దశకమంతా ప్రతిరోజూ ఎన్నో గంటలపాటు ఆయన బ్రిటిష్ మ్యూజియపు అధ్యయన శాలలో 'రాజకీయ అర్థశాస్త్రపు చిక్కుముడులు, పర్యవసానాలను అన్వేషిస్తూ గడిపాడు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా బ్రిటిష్ మ్యూజియంలో గడిపి ఆ తరువాత తన సోహో లాడ్జింగ్‌కో, గ్రాఫ్టన్ టెర్రస్‌కో, చాక్‌ఫాం సమీపంలోని మేట్‌లాండ్ పార్క్‌రోడ్‌కో చేరి అర్థరాత్రి దాటేదాకా చదువుతూ, రాస్తూ గడిపేవాడు. అలా ఆయన 'పెట్టుబడి' గ్రంథ రచనకు పూనుకొన్నాడు.

'టువర్డ్స్ ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' (రాజకీయ అర్థశాస్త్ర విమర్శ దిశగా) అనే వ్యాసాలు 1859లో ప్రచురించాడు. 1865 నాటికల్లా అర్థశాస్త్ర సిద్ధాంతంపై ఆయన మహత్తర రచనలోని పెట్టుబడి మొదటి భాగపు రాతప్రతి పూర్తయింది. ఆ తరువాతి రెండు సంపుటాల మీద కృషి, విపరీతమైన రాజకీయ కార్యాచరణల వత్తిడులవల్ల, తరువాత అనారోగ్యంవల్లా కుంటుపడుతూ, వాయిదా పడుతూ వచ్చింది. వాటిని ఆయన జీవిత కాలంలో పూర్తి చేయడం ఆయనకు సాధ్యం కాలేదు. 1883లో ఆయన మరణించే నాటికి ఆ రెండు సంపుటాలు అసంపూర్తి చిత్తు ప్రతుల రూపంలో, చిట్టాల రూపంలో మిగిలిపోయాయి. తన జీవితంలో విలువైన కాలాన్ని మార్క్స్ ఈ కర్తవ్యానికే అంకితం చేశాడు. మార్క్స్ రాసిన 'పెట్టుబడి' గ్రంథానికి 150 ఏళ్ళు పూర్తి అయ్యాయి.

పెట్టుబడి సంపుటాలను ఎంగెల్స్ విధేయంగా సమీకరించి రెండో సంపుటాన్ని 1885 లోనూ, మూడవ సంపుటాన్ని 1894లోనూ ప్రచురించాడు. అర్థశాస్త్ర చరిత్ర గురించిన నాల్గవ సంపుటం కూడా ఉండాలని మార్క్స్ భావించాడు. కాని ఈ విషయం మీద మార్క్స్ రాసుకున్న చిట్టాలను సంకలనం చేయడం పూర్తయ్యేవరకూ ఎంగెల్స్ బతకలేదు. ఈ చిట్టాలన్నింటిని ఒక దగ్గరపెట్టి 1905లో జర్మన్‌లో 'థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూ' అనే పేరుతో కారల్ కాట్స్కీ అచ్చువేసినాడు. దానిని ఇంగ్లిష్‌లో మూడు భాగాలుగా 1963, 1968, 1971లలో ప్రచురించారు.

ఇతర అర్థశాస్త్రవేత్తలందరితోనూ, అర్థశాస్త్రవేత్తగా మార్క్స్ విభేదించిన అంశమేమంటే, మార్కెట్ వెనుక ఉన్న ఉత్పత్తి సంబంధాల గురించి ఆయన చూపిన శ్రద్ధ. వినిమయ చర్యలో మనుషులు ఏ ఒప్పంద సంబంధాలలోకి వస్తారో ఆ సారాంశం మీద ఆయన శ్రద్ధ పెట్టాడు. ఒక ఉత్పత్తి విధానంగా, పెట్టుబడిదారీ విధానపు రహస్యమేమిటో అన్వేషించాలని ఆయన పూనుకున్నాడు. ఆ ఉత్పత్తి విధానపు లోలోపల ఉన్న ఘర్షణల ప్రత్యేక స్వభావం ఏమిటో కనిపెట్టాలనీ, ఆ స్వభావమే చరిత్రలో దాని స్థానాన్ని, దాని అభివృద్ధిని, దాని చలనాన్ని, దాన్ని తోసివేసి రానున్న భవిష్యత్ సమాజాన్ని నిర్ణయిస్తుందని ఆయన భావించాడు.

సుప్రసిద్ధమైన తన గ్రంథం, పెట్టుబడిలో, ఆయన తన శ్రమజన్య విలువ సిద్ధాంతాన్ని విశదీకరించారు. కార్మికుని నుండి రాబట్టే అదనపు విలువ అనేది పెట్టుబడిదారీ విధానంలో దోపిడీ ధరించే విశిష్ట రూపంగా ఎలా ఉంటుందో ఆయన వెల్లడి చేశారు. ఆ అదనపు విలువే పెట్టుబడిదారీ వర్గపు సంపదకు వనరుగా ఉండే లాభం రూపాన్ని ధరిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో దోపిడీ స్వేచ్ఛాయుతమైన, సమాన విలువల మారకం ముసుగు కింద సాగుతుందని ఆయన వెల్లడి చేశారు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి అంటే, ఏకకాలంలో సమాజంలోని ఒక బృందం చేతులలో ఆస్తి పోగుపడడం మరొక విశాల సామాజిక బృందం నిరాశ్రితం కావడం. ఈ రెండో వర్గం ఉత్పత్తి సాధనాల నుంచి దూరం చేయబడి, ప్రత్యామ్నాయ జీవనాధారాల కొరతవల్ల ఏ స్థితికి చేరుతుందంటే తమను తాము ఒక యజమానికి అమ్ముకోవడానికి సిద్ధపడుతుంది. ఆ యజమాని ఉత్పత్తి సాధనాలు కలిగి ఉంటాడు. ఆ ఉత్పత్తి సాధనాల మీద శ్రామికుడు పని చేయ వలసి ఉంటుంది.

శ్రమశక్తి అంటే ఏమిటి? దాని ఉత్పత్తి గురించి ఏ అర్థంలో మాట్లాడాలి? శ్రమశక్తి అంటే ప్రధానంగా 'పదార్థాన్ని గ్రహించడం ద్వారా మానవ అవయవాలకు బదిలీ అయ్యే శక్తి' అని మార్క్స్ అన్నాడు. అంటే దాని ఉత్పత్తిగాని, నిర్ణిత కాలంలో పునరుత్పత్తిగానీ మానవ అవయవాలలో పోషక పదార్థాలను అందించడంలో, శ్రమక్రమంలో ఖర్చయిపోయిన శక్తిని తిరిగి పూరించడంలో ఉంది. దీన్ని మరో మాటలో చెప్పాలంటే శ్రమశక్తి అంటే ఒక మనిషి నిర్ణీత సమయంలో సాధించే శ్రామిక కార్యకలాపం లేదా భౌతికశక్తి వినియోగం. అది దానంతటి అదే సరుకు అయి పోతుంది. అది శ్రామికుడి మనుగడలో ఉంది.

మార్క్స్ సృష్టించిన ఆర్థిక సిద్ధాంతం వాస్తవంగా పెట్టుబడిదారీ సమాజం ఎలా పని చేస్తుందో చూపే నమూనా. అది ఒక అమూర్త చిత్రం. అతి సంక్లిష్ట ప్రపంచానికి సంబంధించిన అతి ప్రధానమైన లక్షణాలను, ప్రాభల్యంగల ధోరణులనూ అది మన ముందు విస్పష్టంగా చూపుతుంది. ఆ చిత్రాన్ని మనం సరిగా అర్థం చేసుకున్నప్పుడే ప్రభావశీలంగా పనిచేయగలం.

"సామాజిక ఉత్పత్తికి, పెట్టుబడిదారి యాజమాన్యానికి మధ్య గల వైరుధ్యం కార్మికవర్గం, బూర్జువా వర్గాల మధ్య వైరుధ్యంగా వ్యక్తమవుతుంది". (ఏంగెల్స్-డూరింగ్ సిద్ధాంత ఖండన).

పెట్టుబడి సంచయన క్రమం అంటే కేవలం విస్తృత పునరుత్పత్తి క్రమం మాత్రమే కాదు. పెట్టుబడిదారీ సంబంధాల విస్తృత పునరుత్పత్తి కూడా.

పెట్టుబడి సంచయన క్రమం పెట్టుబడిదారీ విధానం అంతరించి పోయే భౌతిక పరిస్థితులను కూడా సృష్టిస్తుంది.

మార్క్స్ పెట్టుబడి గ్రంథ రచన చేస్తూనే మొదటి ఇంటర్నేషనల్ ఏర్పాటుకు కృషి చేసాడు. జర్మనీ, ఫ్రాన్స్‌లతో పాటు ఇతర యూరోపియన్ దేశాల విప్లవ పోరాటాల్లో పాల్గొంటూ వచ్చాడు. ఈ కార్యకలాపాల వలన పెట్టుబడి గ్రంథ రచన వాయిదాపడుతూ వచ్చింది. అలాగే మార్క్స్ పరిశోధన అనంతంగా సాగి కూడ రచన ఆలస్యం అయింది. ఆయన పరిశోధన కోసమే రష్యన్ భాషను నేర్చుకోవడానికి ప్రాధాన్యతనిచ్చి నేర్చుకొన్నాడు. దీని ద్వారా ఆయన అధ్యయనం ఎంత లోతుగా ఉంటుందో మనం తెలుసుకోవచ్చు.

1864లో మొదటి ఇంటర్నేషనల్ ప్రారంభ సమావేశం లండన్‌లో జరిగింది. అతి ప్రధానమైన దాని జర్మన్ విభాగానికి మార్క్స్ కార్యదర్శి అయ్యాడు. ప్రతి మంగళవారం మార్క్స్ జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనేవాడు. కార్మికోద్యమానికి, విముక్తి ఉద్యమానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన సమస్యలను దాని దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించేవాడు. కార్మిక జన బాహుళ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపగల ప్రపంచ రాజకీయ పరిణామాలను తెల్పేవాడు.

ఇంగ్లండ్‌లో సార్వజనీన ఓటింగుకై సాగే పోరాటంలో ఇంటర్నేషనల్ పాల్గొనడం చాలా ముఖ్యమని మార్క్స్ భావించాడు. 'సార్వజనిక ఓటింగ్ హక్కును తమకు అనుకూలంగా వాడుకోగల పరిణత స్థాయికి కార్మికవర్గం చేరుకున్నదని, సంఘటితమైందని' ఆయన అన్నాడు. జాతీయ విముక్తి ఉద్యమాలకు మద్దతునివ్వడం చాలా అవసరమని మార్క్స్ ఇంటర్నేషనల్ విధాన నిర్ణయాల సందర్భంలో నిరంతరం చెబుతుండేవాడు. మార్క్స్ చొరవ ఫలితంగా ఇంటర్నేషనల్ ఐరిష్ విప్లవకారులకు ధైర్యంగా మద్దతు పలికింది. ఇంటర్నేషనల్ లోపల 1870 ప్రాంతాలకల్లా జనరల్ కౌన్సిల్‌కూ, బకూనిన్ నాయకత్వంలోని అరాచకవాదులకూ తలెత్తిన ఘర్షణలో సన్నిహితంగా భాగం పంచుకున్నాడు. ఇంటర్నేషనల్ పనిచేసిన ఆ కాలంలో (1864-72) లండన్‌లో రెండు మహాసభలు, అయిదు సమావేశాలు జరిగాయి. మార్క్స్ లండన్ సమావేశాలలోనూ (1864-1871), హేగ్ మహాసభ (1872)లోనూ ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. మార్క్స్ సూచనల మేరకు ఆ మహాసభ ఎనిమిది గంటల పనిదినం, స్త్రీలు, బాల శ్రామికులకు రక్షణ, కార్మికవర్గ సహకార సంఘాలు వగైరా తీర్మానాలను ఆమోదించింది. ఆర్థిక, రాజకీయ పోరాటాల సమన్వయానికి పిలుపునిచ్చింది. 1871 లో జనరల్ కౌన్సిల్ తరపున పారిస్ కమ్యూన్‌ను సమర్థించే సుప్రసిద్ధ కరపత్రం 'ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం' రచించాడు. ఆయనే చెప్పుకున్నట్టు ఆ కరపత్రం ఆయనను 'లండన్‌లోకెల్లా అతి పెద్ద ఆరోపణాపరుడు'గా మార్చివేసింది.

మార్క్స్ ఇతర అనేక శాస్త్రాలను అధ్యయనం చేసినట్టే మార్క్స్-ఏంగెల్స్‌లు యుద్ధ శాస్త్రాన్ని సైతం అధ్యయనం చేసి అనేక విషయాలను, ఎత్తుగడలను ముందుకు తెచ్చారు. వాటిని మనం అర్థం చేసుకొని అన్వయించుకోవలసిన అవసరం ఎంతో ఉంది.

"బూర్జువా వర్గం స్వయంగా తనకే చావును తెచ్చి పెట్టే ఆయుధాలను తయారు చేయడం మాత్రమే కాదు. ఆ ఆయుధాలను ధరించాల్సిన మనుషులను అంటే ఆధునిక శ్రామిక వర్గాన్ని-కార్మిక వర్గాన్ని కూడా ఉనికిలోకి తెచ్చింది". - (మార్క్స్-ఏంగెల్స్- కమ్యూనిస్టు ప్రణాళిక).

యుద్ధం మొదలయిన కళలన్నింటిలాగే ఇప్పుడు తిరుగుబాటు ఒక కళ. తిరుగుబాటు చెయ్యడానికి కొన్ని నియమాలున్నాయి. వాటిని నిర్లక్ష్యం చేసిన పార్టీ నాశనం అయిపోతుంది. ఆ పార్టీ స్వభావాన్ని బట్టీ, ఆనాడు ఉన్న పరిస్థితుల నుంచీ ఈ తార్కిక నియమాలు రూపొందుతాయి.

మొట్టమొదటి విషయం ఏమంటే, పరిణామాలను ఎదుర్కోవడానికి పూర్తిగా సిద్ధం కాకుండా తిరుగుబాటు ప్రారంభించవద్దు. తిరుగుబాటులో చిన్న మార్పు జరిగితే దానికి అనంతమైన పరిణామాలుంటాయి. వాటి విలువ రోజు రోజుకూ మారవచ్చు. మనతో తలపడే శక్తులకు నిర్మాణ, క్రమశిక్షణా, అధికార సౌకర్యాలున్నాయి. వాళ్లకు వ్యతిరేకంగా బలంగా పోరాడకపోతే మనం ఓడిపోతాం. నాశనమవుతాం.

రెండో అంశం ఏమంటే, ఒకసారి ప్రారంభమయిన తరువాత, తిరుగుబాటు గమనం అత్యంత నిశ్చయాత్మకతతో, దాడిపూర్వకంగా ఉంటుంది. ఏ సాయుధ తిరుగుబాటుకైనా ఆత్మరక్షణా స్థితిలో ఉండడం మరణం వంటిది. అది శత్రువుతో ఇంకా తలపడే లోపే ఓడిపోతుంది. శత్రు బలగాలు చెల్లాచెదురుగా ఉన్నప్పుడు వాళ్లను సర్‌ప్రైజ్‌లో పెట్టాలి. ఎంత చిన్నవైనా ప్రతీరోజూ నూతన విజయాలకు సన్నాహాలు చెయ్యాలి. -మార్క్స్

విప్లవం బలమైన సమైక్య విప్లవ ప్రతీఘాతాన్ని ఉత్పన్నం చేస్తూ పురోగమిస్తుంది. అంటే అది అంతకంతకూ తీవ్రమైన ఆత్మరక్షణ చర్యలు తీసుకునే విధంగా శత్రువును నెడుతుంది. ఆ విధంగా అంతకంతకూ బలమైన దాడి పద్ధతులను రూపొందిస్తుంది. ('ఫ్రాన్సులో వర్గపోరాటం, 1848-1850' ముందుమాటలో కార్ల్ మార్క్స్ ముందుకు తెచ్చిన ప్రతిపాదన)

కారల్ మార్క్స్ ప్రధానంగా పెట్టుబడి, కార్మికులకు చెందిన సాధారణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడని చెప్పుకొంటారు. కాని ఆయన యూరోపియన్ కార్మికులు, పెట్టుబడితో పాటు జాతులు, నల్లజాతి ప్రజలు, మహిళలు, వ్యవసాయిక దేశాలపై లోతైన అధ్యయనం కొనసాగించాడు.

కమ్యూనిస్టు మేనిఫెస్టోలో మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రపంచ కార్మికులారా! ఏకంకండి! అని నినదించడంతో పాటు, 'కార్మికులకు ఏ దేశం లేదు' అని చెప్పారు. అలాగే పెట్టుబడిదారీ విధానం ప్రపంచ మార్కెట్‌ను దోపిడి చేయడం ద్వారా. ఉత్పత్తి, వినియోగంలో ప్రతి దేశంలో సర్వదేశాలకు చెందిన (కాస్మోపాలిటెన్) స్వభావాన్ని తీసికొస్తుందని" చెప్పాడు.

"జాతి అనే పాక్షికత్వం, సంకుచిత ఆలోచన ధోరణి అనేది అంతకంతకు అసాధ్యం అవుతుంది." అని కూడ చెప్పారు. (మార్క్స్, ఎంగెల్స్ కలెక్టడ్ వర్క్స్ 6-488 పేజీ)

అయితే మార్క్స్ 60, 70వ దశకాల్లో తన లోతైన అధ్యయనంతో తన సిద్ధాంతాన్ని మరింతగా అభివృద్ధి పరిచాడు.

మార్క్స్ కార్మికవర్గంతో పాటు రైతాంగం కూడ విప్లవ వర్గం అని గుర్తించాడు. ఆయన పోలెండ్‌లో రైతాంగ తిరుగుబాటును సమర్థించాడు. పోలెండ్ విముక్తికి, దేశంలో జరుగుతున్న వ్యవసాయ విప్లవమే ప్రధానమైనదని చెప్పాడు.

జాతుల పోరాటాల విషయంలో ఐర్లండ్ జాతి, ప్రజల పోరాటాన్ని మార్క్స్ తన రచనల్లో ఎత్తిపట్టాడు. ఇంగ్లండు కార్మికులు, పెట్టుబడిదారీ సంకెళ్ళ నుండి విముక్తి కావాలంటే ఐరిష్ జాతి ముందు విముక్తి కావలసి ఉంటుందని ఆయన నొక్కి చెప్పాడు.

1870లో రాసిన 'కాన్ఫిడెన్షియల్ కమ్యూనికేషన్ ఆన్ ఐర్లండ్' అనే వ్యాసంలో ఐర్లండ్‌లో జరుగుతున్న రైతాంగ, జాతి పోరాటాలు ఒక దానితో ఒక్కటి ముడిపడి ఉన్నాయని, వీటిని సమర్థించాలని రాసాడు.

మహిళ సమస్యపై మార్క్స్ '1844 మ్యాను స్క్రిప్టుల్లో' ఇలా రాసాడు. సామాజిక దొంతరలకు, ఆదిపత్యానికి పునాదిగా, లింగ అణచివేత కీలకంగా ఉందని ఆయన పురుష–మహిళల మధ్య ఉన్న సంబంధాన్ని సహజత్వం, చరిత్ర నుండి పరిశీలించి చెప్పాడు. అలాగే పేద కార్మిక మహిళలు ఎదుర్కొనే దోపిడి, లింగ వివక్ష లాగానే ఫ్రెంచి ధనిక, మధ్యతరగతి మహిళలు కూడ లింగ వివక్షతో జరిగే హింసాకాండతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని 1846లో 'పుషేట్ ఆన్ సుసైడ్స్' పుస్తకంలో రాసాడు.

మార్క్స్ తరువాత కాలంలో రష్యా, చైనా, ఇండియా సమాజాలపై అధ్యయనం సాగించాడు. 1846లో 'ది జర్మన్ ఐడియాలజీ' అనే గ్రంథంలో మార్క్స్ 1. తెగ లేదా ఆదివాసి 2. బానిసత్వంతో కూడిన పురాతన గ్రీకు, రోమ్ 3. అర్థ బానిసత్వం కూడిన ఫ్యూడల్ 4. వేతన బానిసత్వ కార్మికుడితో కూడిన బూర్జువా లేదా పెట్టుబడిదారీ విధానం 5. సోషలిస్టు సమాజాలుగా ఉత్పత్తి విధానాలను విభజించాడు. అయితే 1857–58లో మార్క్స్ తన గ్రుండెస్సీ గ్రంథంలో 'ఆసియా తరహా ఉత్పత్తి విధానం' గురించి పేర్కొన్నాడు. ఇందులో ముఖ్యంగా ఇండియాలో సమాజ స్వభావాన్ని పేర్కొన్నాడు. దీన్ని ఆయన చాల దీర్ఘకాలం పాటు గ్రామ ప్రాతిపదికపై కొనసాగే సామాజిక సంబంధాలతో కూడుకొని, సమిష్టి ఆస్థితో కలిగి లాంచనప్రాయమైన బానిసత్వం లేకుండా ఉంటుందని, పైన తెల్పిన ఉత్పత్తి విధానం కలిగిన సమాజాలతో పోలిస్తే విశిష్టత కలిగి ఉంటుందని చెప్పాడు. ఇంకా ఆయన అధ్యయనంలో భారతదేశంలో జరిగిన అనేక తిరుగుబాట్లు గురించి చెబుతూ సిపాయి తిరుగుబాటును భారత ప్రజల ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా (ఇండియా రివోల్ట్) పేర్కొన్నాడు.

ఇండియా గురించి మార్క్స్ తరచుగా 'ది ట్రిబ్యున్' పత్రికలో రాయడంతో సహ, నోట్స్ ఆన్ కోవలస్కీ (1879), నోట్స్ ఆన్ ఇండియన్ హిస్టరీ (1860), ఎత్నోలాజికల్ నోట్‌బుక్స్ (1880-82) గ్రంథాలలో ఎంతో వివరంగా రాసాడు. 'ది జర్మనీ ఐడియాలోజి, గ్రుండెస్సీలో మార్క్స్ భారతదేశంలో కులం పుట్టుక, దాని పాత్ర గురించి వివరంగా రాసాడు.

కమ్యూనిస్టుపార్టీ మేనిఫెస్టో రష్యన్ ఎడిషన్ కోసం మార్క్స్ -ఎంగెల్స్ 1882లో రాసిన ముందు మాటలో రష్యాలో సంపద (భూమి) సామూహిక రూపాలపై ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించారు.

"పశ్చిమంలో కార్మికవర్గ విప్లవానికి సంకేతంగా ఒకవేళ రష్యన్ విప్లవం తయారవుతే, అవి రెండు ఒక దాని కొక్కటి పూరకంగా మారి, కమ్యూనిస్టు అభివృద్ధికి ప్రారంభ బిందువుగా వర్తమాన రష్యాకు చెందిన భూమిపై సామూహిక హక్కు (కామన్ ఓనర్‌షిప్) ఉపయోగపడవచ్చు." (మార్క్స్-ఎంగెల్స్ కలెక్టడ్ వర్క్స్-24-426 పేజీ)

అంతేగాక మార్క్స్ దక్షిణాసియా, ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా, ఇంకా ఎన్నో వ్యవసాయిక, పశుపెంపక, వేటాడి బ్రతికే సమాజాల పై అనేక రచనలు చేసాడు. ఇవన్నీ సరిగా వెలుగులోకి రాలేదు. [రెఫర్- 'మార్క్స్ ఎట్ ది మార్జిన్స్' మరియు 'మార్క్స్ ఎట్ 200: బియాండ్ కాపిటల్ అండ్ క్లాస్ ఎలోన్' (ఈపీడబ్ల్యూ అక్టోబర్ 6, 2018) : కెవిన్ బి. అండర్సన్]

మార్క్స్ ద్విశత వార్షికోత్సవాల సందర్భంగా ఈ కొత్త కోణాలను మనం లోతుగా అధ్యయనం చేయాలి. ఈ అధ్యయనం ద్వారా మనం లోతైన అవగాహన పెంచుకోవడంతో పాటు భారతదేశంపై మార్క్స్ జరిపిన పరిశోధనను ఆధారం చేసుకొని మన దేశంలో మార్క్సిజాన్ని వ్యతిరేకించే వారికి గట్టిగా సమాధానం ఇవ్వగలుగుతాం.

మార్క్సిస్టు వ్యతిరేకులు మార్క్సిజాన్ని అడుగడుగునా వ్యతిరేకించారు. మార్క్సిజంలో ముఖ్యమైన సిద్ధాంతాలను పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే బెర్న్‌స్టీన్ లాంటి రివిజనిస్టులు వ్యతిరేకించారు. పెట్టుబడిదారీ విధానం సంపదను పెంచి, కార్మికవర్గాన్ని అభివృద్ధి చేస్తుందని, అందువలన పెట్టుబడిదారీ విధానాన్ని రద్దుచేసి సోషలిజం కోసం పోరాడడం అనవసరమని వీరు వాదించారు. కాని మార్క్స్ తన ఆర్థిక సిద్ధాంతాల ద్వారా కార్మికవర్గం దినదినం ఎలా దారిద్ర్యానికి గురవుతుందో, పిడికెడు మంది పెట్టుబడుదారులు సంపదనంతా ఎలా స్వంతం చేసుకుంటారో విశ్లేషించడమే గాక దాని వలన కార్మికవర్గం ఆకలి, దారిద్ర్యానికి, రోగాలకు ఎలా గురవుతుందో వివరంగా చెప్పాడు. ఈ స్థితిగతులను అర్థం చేసుకొన్న కార్మికవర్గం పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి సోషలిజాన్ని విజయవంతం చేస్తుందని, మార్క్స్ శాస్త్రీయంగా నిరూపించాడు. మార్క్స్ సిద్ధాంతం ఉనికిలోకి వచ్చిన తరువాత చరిత్ర ఈ వాస్తవాన్ని అడుగడుగునా నిరూపించింది. అందుకే మార్క్సిజం అజేయం అని మనం అంటున్నాం.

కారల్‌మార్క్స్ అందించిన సిద్ధాంతం వెలుగులోనే రష్యా, చైనా దేశాలతో పాటు ప్రపంచంలో మూడవ వంతు ప్రాంతంలో సోషలిజం ఉనికిలోకి వచ్చింది. ఈ కాలమంతటా మార్క్సిస్టు సిద్ధాంతం అభివృద్ధి చెంది మార్క్సిజం-లెనినిజం-మావోయిజంగా రూపొంది మరింత బలోపేతం అయింది. 'కమ్యూనిజం అనే భూతంగా' ఈ సిద్ధాంతం ఇప్పటికీ సామ్రాజ్యవాదాన్ని గజగజ వణికిస్తూనే ఉంది.

మార్క్స్ అమితంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న జెన్నీ పూర్తి పేరు జెన్నీవన్ వెస్ట్ ఫాలెన్. ఆమె అసాధారణ స్థైర్యం, సౌశీల్యం గల వ్యక్తి. 1843 జూన్ 19న మార్క్స్, జెన్నీలు పెళ్ళి చేసుకున్నారు. ప్రియాతి ప్రియమైన భార్య, ఆమె పిల్లలకు దయామయురాలైన తల్లి. విశ్వసనీయురాలైన కార్యదర్శి, ప్రతినిధి, తెలివైన సలహాదారు. అండనివ్వగల కామ్రేడ్-అన్నీ జెన్నీయే. కార్మికోద్యమ ప్రారంభానంతరం, విప్లవ సమరంలో, ధైర్య సాహసాలతో, ఆశాభావంతో, నిస్వార్థంగా, విశ్వసనీయంగా సోషలిజం అంతిమ విజయంపై కొండంత నమ్మకంతో తమ భర్తల సరసన నిలిచిన మహిళలకు ఆమె ఓ ఉదాహరణ. మార్క్స్ ఆమె కంటే నాలుగేళ్ళు చిన్నవాడు. ఒక మామూలు లాయర్ కొడుకైన మార్క్స్‌ను ప్రేమించింది. మార్క్స్, జెన్నీల సంతానంలో ముగ్గురు కూతుళ్ళు-జెన్నీ, లారా, ఎలియనార్‌లు మాత్రమే పెరిగి పెద్దవాళ్ళయ్యారు. మిగిలిన పిల్లలందరూ మరణించారు. ఎనిమిదేళ్ళ వయసు దాకా పెరిగిన ఎడ్గార్ అనే పిల్లవాడి మరణం తల్లీ తండ్రినీ బాగా కుంగదీసింది. వాళ్ళిద్దరూ రాసుకున్న ఉత్తరాల్లో ఆ పిల్లవాడి ప్రసక్తి చాలా కాలం పాటు కనబడుతూనే ఉండేది. వారి కూతుళ్లూ కార్మికవర్గ విప్లవ కార్యకలాపాలలో పాలుపంచుకున్నారు.

జెన్నీ, మార్క్స్ జీవితానికి ఒక మూలస్తంభంగా నిలిచిందని చెప్పాలి. భర్త మేధనూ, దానికి మరింత పదునుపెట్టే ఆయన రచనా వ్యాసంగాన్నీ ఆమె అర్థం చేసుకున్నది. ఆయన అభివృద్ధి కోసం కనీసావసరాలను కూడా త్యాగం చేసిన వ్యక్తిగా ఆమె తన వర్గపు స్త్రీలందరిలోనూ ఉన్నతురాలిగా నిలిచింది.

సంవత్సరాల తరబడి వాళ్ళు అనుభవించిన దారిద్ర్యం వాళ్ళ సంతానంలో కొందరిని బలితీసుకున్నది. వృద్ధాప్యంలో అనారోగ్యంతో వున్న మార్క్స్, కాన్సర్‌తో మరణశయ్యపై నున్న భార్యకు చివరి వీడ్కోలు పలికాడు. 1881 డిసెంబర్ 2న జెన్నీ మరణించింది. అది మార్క్స్‌కు అశనిపాతం. జీవితంలో ఎన్నడూ ఎరుగనంత దారుణమైన దెబ్బ.

అంతర్జాతీయ కార్మిక పోరాటం పట్ల ఆమె విధేయతను ఎంగెల్స్ గుర్తు చేశాడు. 'సునిశితమైన సవిమర్శక అవగాహన, పొరబాటుపడని రాజకీయ చాతుర్యం, మహత్తరమైన అంకితభావం

గల అలాటి మహిళ విప్లవోద్యమానికి ఎంతటి సేవ చేసిందో ప్రపంచానికి ఎన్నడూ తెలియదు. పత్రికల్లో ఎన్నడూ ప్రచురించబడలేదు. ఆమె ఎంత చేసిందో ఆమెతో కలసి పనిచేసిన వారికే తెలుసు. ఆమె వ్యక్తిగత లక్షణాల గురించి నేను చెప్పనక్కరలేదు. ఆమె మిత్రలకు తెలుసు. వారెన్నడూ అవి మరచిపోలేరు. ఇతరులను సంతోషపరచడమే తన సంతోషంగా భావించిన మహిళ ఎవరన్నా వున్నారా అంటే అది జెన్నీ' అంటూనే తన భార్య మరణం వల్ల మార్క్సుకు కలిగిన బాధ ఎంతటిదో చెపుతూ 'మార్క్స కూడా చనిపోయాడు'. అన్నమాటతో ఎంగెల్స్ ముగించాడు.

తొలి రోజుల పోరాటాల వల్లా, దారిద్ర్యం వల్లా మార్క్స ఆరోగ్యం పాడైపోయి 1870ల చివరి నాటికి ఆయన అంతకంతకూ ఎక్కువ కాలం పని మానివేసి విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. వైద్యుల సలహా మేరకు హారోగేట్, మాల్వెర్న్, ఛానల్ దీవులు, కాల్స్‌బాద్(ఇప్పుడు కార్లోవీవరీ), అల్జీర్స్, జెనీవా, ఫ్రాన్స్ దక్షిణాదిలాంటి విశ్రాంతి ప్రదేశాలకు ఆయన వెళ్ళవలసి వచ్చింది. శ్రామిక వర్గ మహోపాధ్యాయుడు కార్ల్ మార్క్స మార్చ్ 14న పగలు 2.45కు పడక కుర్చీలో కూర్చుని ప్రశాంతంగా కన్ను మూశాడు. ఎంగెల్స్‌తోపాటు యావత్ ప్రపంచ కార్మికులు రోదించారు. 1883 మార్చ్ 17న మార్క్సును హైగేట్ శ్మశాన వాటికలో భార్య సమాధి పక్కనే ఆయనను సమాధి చేశారు.

అక్కడ ఎంగెల్స్ ఎంతో ఉద్వేగంతో మార్క్స ప్రతిభావంతమైన శాస్త్రీయ ఆవిష్కరణల గురించి మాట్లాడాడు. శాస్త్రవేత్తగా, విప్లవ యోధుడిగా మార్క్స ఎంత మహోన్నతుడో ఇలా చెప్పాడు:

'నిరంకుశ రాచరిక ప్రభుత్వాలు, రిపబ్లిక్‌లు కూడా ఒక్కలాగే ఆయనను తమ భూభాగాల నుండి బహిష్కరించాయి. బూర్జువా వర్గమంతా–మితవాదులైనా, కుహనా ప్రజాతంత్రవాదులైనా ఆయనపై నిందలు కురుపించేందుకు పరస్పరం పోటీలు పడ్డారు. ఇవన్నీ సాలెగూళ్ళ బూజులాంటివన్నట్లు ఆయన పట్టించుకోకుండా వదిలేశాడు. అత్యవసరమైతేనే సమాధానమిచ్చేవాడు. సైబీరియా గనులనుండి కాలిఫోర్నియా దాకా ఐరోపా, అమెరికాలలోని అన్ని భాగాలలో ఆయన లక్షోపలక్షల మంది విప్లవ కార్మిక సహచరుల ప్రియతమ, గౌరవనీయ నేతగా గౌరవ మన్ననలు పొంది, మరణించి సంతాపాలందుకున్నాడు. ఆయనకు ఎందరో ప్రత్యర్థులుండవచ్చు కానీ, వ్యక్తిగత శత్రువు ఒక్కరూ లేరని చెప్పేందుకు నేను సాహసిస్తున్నాను'.

అంతర్జాతీయ కార్మికోద్యమం తన మహానాయకుడికి వీడ్కోలు చెప్పింది. సమాధి దగ్గర జర్మన్ కార్మికవర్గం పేరిట లీబ్‌నెక్ట్ ఇలా ప్రతిన బూనాడు. 'దుఃఖించడానికి మారుగా మేము

అస్తమించిన మహావ్యక్తి స్ఫూర్తితో పనిచేస్తాము. మాకు ఆయన బోధించినది, ఆశించినది ఏమిటో దాన్ని సాధ్యమైనంత త్వరగా సాధించడానికే సర్వశక్తులూ ధారపోస్తాము. ఆ విధంగానే మేము ఆయన స్మృతి దివ్యంగా నిలుపుకుంటాము. ప్రియాతి ప్రియమైన నెచ్చెలీ! మాకు నీవు చూపిన మార్గంలో కడదాకా నడుస్తాం. నీ సమాధి దగ్గర ప్రతిన బూనుతున్నాం'.

'ఆయన పేరు, కృషి యుగయుగాలు శాశ్వతంగా వెలుగొందుతాయి.'

కారల్ మార్క్స్ 200వ జయంతిని ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక ప్రజలు జరుపుకున్నారు. శ్రామిక వర్గ విప్లవ జెండా నెత్తిపట్టిన విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మార్క్సిజం–లెనినిజం–మావోయిజం అజేయమైనదనీ, అది శాస్త్రీయమైనదనీ దృఢంగా విశ్వసిస్తూ దానిని తమ కార్యాచరణకు కరదీపికగా చేపట్టి పురోగమిస్తుండగా, మార్క్సిజానికి తీరని ద్రోహం చేసిన దాని ప్రధాన శతృవులు, నయవంచకులు రివిజనిస్టులు, సోషల్ సామ్రాజ్యవాదులు సైతం మార్క్సుజయంతిని జరుపుకోవడాన్ని బట్టి ప్రజలలో దానిపట్ల గల అపార విశ్వాశాన్ని అర్థం చేసుకోవచ్చు.

మన దేశంలోని రివిజనిస్టులు, నయా రివిజనిస్టులు వామపక్షాలకు చెందిన నానా గోత్రికులు ప్రపంచ వ్యాప్తంగా కారల్ మార్క్స్ 200వ జయంతిని జరుపుకున్నట్టే ఇక్కడా జరుపుకున్నారు. మార్క్స్ చూపిన మార్గంలో ఆచరణాత్మకంగా పోరాడాలనీ రివిజనిస్టులు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంటుంది.

జర్మనీ నగరం ట్రయర్‌లో మార్క్స్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 17 అడుగుల ఎత్తు నాలుగు టన్నుల బరువు గల కాంస్య విగ్రహం చైనా శిల్పి ఉయ్‌వెయ్‌షన్ ఈ విగ్రహాన్ని రూపొందించాడు. ఈ విగ్రహానికి సోషల్ సామ్రాజ్యవాద చైనా ప్రభుత్వం నిధులను సమకూర్చింది.

మార్క్స్ రచించిన సిద్ధాంతం నేటికీ ప్రకాశిస్తున్నదనీ, ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం వాస్తవమైనదనీ, ప్రపంచమంతా దానిని గౌరవిస్తున్నదనీ చైనా అధ్యక్షుడు, సోషల్ సామ్రాజ్యవాది నయవంచక జిన్‌పింగ్ మార్క్స్ 200వ జయంతి సందర్భంగా బీజింగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నాడు. మార్క్సిజం వెలుగులోనే చైనా విప్లవం పరిపూర్తి అయిందనీ చెప్పాడు. ఇలా చెప్పకుండా వారికి పూట గడువదు. చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకునే జిన్‌పింగ్ మరెంతో కాలం ప్రపంచ ప్రజలను మోసపుచ్చలేడు. మొన్నటి రష్యాలా, నిన్నటి చైనా ముసుగును సైతం ప్రపంచ శ్రామిక వర్గం చించిపారేసి వాస్తవాలు గ్రహించే రోజులు దగ్గర పడుతున్నాయి.

మార్క్స్ 200వ జయంతి సందర్భంగా ఐర్లాండ్‌లోని మేనూత్ నగరంలోని మేనూత్ యూనివర్శిటీలో రెండురోజుల సెమినార్ నడిచింది. పరిశోధకులు, మేధావులు దాదాపు 15 దేశాల నుంచి 200 మందికి పైగా హాజరై మార్క్స్ సిద్ధాంతంపై చర్చించారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ దేశాల నుంచి వచ్చిన వారు అందులో పాల్గొన్నారు. శ్రామిక ప్రజలూ వారి శత్రువులూ మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేయడం చరిత్రలో కొత్తేమీ కాదు. ఒకరు ఈ దోపిడీ వ్యవస్థను బద్దలు కొట్టడానికి దానిని ఒక గొప్ప శాస్త్రంగా, శస్త్రంగా వినియోగించుకుంటే, మరొకరు మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందనీ, 'చరిత్ర అంతం' అంటూ ప్రకటించే కాలం చెల్లిన ఆత్మస్తుతి సిద్ధాంతాల రూపకల్పనకు, విఫల ప్రయత్నాలకు పూనుకుంటున్నారు. వందేళ్ల క్రితమే కామ్రేడ్ లెనిన్ ఇలాంటి వారినుద్దేశించే సూటిగా, స్పష్టంగా ఇలా అన్నాడు. 'చరిత్రయొక్క గతితర్కం ఎలాంటిదంటే, సిద్ధాంత రంగంలో మార్క్సిజం విజయాన్ని సాధించే సరికి, దాని శత్రువులకు కూడా మార్క్సిస్టు వేషం వేసుకొనక విధిలేక పోయింది'.

గత 50 సంవత్సరాలుగా మన పార్టీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై పోరాడుతోంది. మార్క్సిజం లెనినిజం మావోయిజాన్నే నేటి మావోయిజంగా మన పార్టీ భావిస్తోంది. దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని అనుసరిస్తూ దేశంలోని పలు ప్రాంతాలలో గెరిల్లా జోన్లనూ, వాటిలో గెరిల్లా బేసులను నిర్మిస్తూ ప్రజల ప్రత్యామ్నాయ రాజ్యాధికారాన్ని ఏర్పరుస్తోంది. సామ్రాజ్యవాదులు, వారి ప్రయోజనాలను ఈడేర్చే భారత పాలక వర్గాలు దేశంలో మన పార్టీని దేశ అంతర్గత భద్రతకు (నిజానికి వారి విచ్చలవిడి దోపిడీ, భద్రతలకే!) అత్యంత ప్రమాదకరంగా పేర్కొంటూ అసాధారణ స్థాయిలో అణచివేత చర్యలను కొనసాగిస్తున్నారు. మన పార్టీనీ, దాని నాయకత్వంలో కొనసాగుతొన్న విప్లవోద్యమాన్ని రక్షించుకొంటూ విప్లవాన్ని విజయవంతం చేయడమే మన లక్ష్యంగా ఉండాలి. భారతదేశ విప్లవ విజయంతో మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని మరింత ఉన్నత స్థాయికి చేర్చాలి. ✦

"కమ్యూనిస్టులు ఇతర కార్మికవర్గ పార్టీలకు వ్యతిరేకంగా విడిగా ఒక పార్టీని ఏర్పాటుచేయరు" "మొత్తంగా కార్మికవర్గ ప్రయోజనాల కంటే భిన్నమైనటువంటి వేరే ప్రయోజనాలు వారికి లేవు."

(కమ్యూనిస్టు ప్రణాళిక)

# కారల్ మార్క్స్

## (మార్క్సిజం వివరణ సహితమైన మార్క్స్ సంక్షిప్త జీవిత సంగ్రహం)

### (మూలం: లెనిన్ రచించిన 'మార్క్స్-ఏంగెల్స్-మార్క్సిజం')

కారల్ మార్క్స్ 1818 మే 5వ తేదీన ప్రష్యా దేశానికి చెందిన రైన్ రాష్ట్రంలోని ట్రీయర్ పట్టణంలో జన్మించాడు. అతని తండ్రి న్యాయవాది. పుట్టుకతో యూదు మతస్థుడైనా 1824లో అతడు ప్రొటెస్టెంటు మతం పుచ్చుకున్నాడు. వారిది సంస్కృతి కలిగిన సంపన్న కుటుంబం అయితే విప్లవం పట్ల అభిమానం ఉన్న కుటుంబం కాదు. ట్రీయర్ పట్టణంలోని జిమ్నాసియంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని మార్క్స్ మొదట బోన్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించి, ఆ తరువాత బెర్లిన్ విశ్వవిద్యాలయానికి మార్చుకొని, అక్కడ న్యాయశాస్త్రాన్నీ, ముఖ్యంగా చరిత్రనీ, తత్వశాస్త్రాన్నీ అధ్యయనం చేశాడు. అతడు 1841లో ఎపిక్యూరస్ తత్వశాస్త్రం పైన స్నాతక వ్యాసాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించి తన విశ్వవిద్యాలయ అధ్యయనాన్ని ముగించాడు. తన అభిప్రాయాలను బట్టి ఆ రోజుల్లో అతను హెగెల్ తరహా భావవాది. అతను బెర్లిన్‌లో ఉన్నప్పుడు హెగెల్ తత్వశాస్త్రం నుండి నాస్తిక మరియు విప్లవ భావ సారాంశాలను గ్రహించడానికి ప్రయత్నించిన "వామపక్ష హెగెల్‌వాదుల" (బ్రూనో బౌవర్ తదితరులు) సర్కిల్‌లో చేరాడు.

విశ్వవిద్యాలయ చదువును పూర్తి చేసిన తర్వాత తనకు ప్రొఫెసర్ ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో మార్క్స్ తన నివాసాన్ని బోన్ పట్టణానికి మార్చుకున్నాడు. కాని ప్రభుత్వం అవలంబిస్తున్న అభివృద్ధి నిరోధక విధానాన్ని - 1832లో లుడ్విగ్ ఫ్యుయెర్ బాఖ్‌ను ప్రధానాచార్య పదవి నుండి తొలగించి, 1836లో అతని విశ్వవిద్యాలయప్రవేశాన్ని తిరస్కరించడం, 1841లో యువ ప్రొఫెసర్ బ్రూనో బౌవర్‌ను బోన్ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలివ్వకుండా అడ్డుకోవడం - ఇదంతా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా తన జీవితాన్ని గడుపుదామనే ఉద్దేశాన్ని అతడు వదులుకునేలా చేసింది. ఆ రోజుల్లో జర్మనీలో వామపక్ష హెగెల్‌వాదుల అభిప్రాయాలు అతి త్వరితగతిన అభివృద్ధి చెందాయి. లుడ్విగ్ ఫ్యుయెర్ బాఖ్, ముఖ్యంగా 1836 తర్వాత క్రైస్తవ ధర్మశాస్త్రాన్ని (థియోలజీని) విమర్శించడం ప్రారంభించి, భౌతికవాదాన్ని సమర్థించడం మొదలు పెట్టాడు. 1841 నాటికల్లా అతని తత్వ సిద్ధాంతంలో భౌతికవాదానిదే పూర్తిగా పైచేయి అయింది ("క్రిస్టియన్ మతసారం" అనే అతని రచనలో). అతను రచించిన "భవిష్యత్ తత్వశాస్త్ర సూత్రాలు" అనే గ్రంథం 1843లో వెలువడింది. ఈ గ్రంథాలు "మనస్సుపై కలిగించే స్వేచ్ఛా ప్రభావాన్ని ఎవరి మటుకు వారు స్వయంగా అనుభవించాల్సిందే" అని ఏంగెల్స్ ఆ గ్రంథాల గురించి రాశాడు. ''మేము (అంటే మార్క్స్‌తో సహా వామపక్షపు హెగెల్‌వాదులం) తక్షణమే

ఫ్యుయెర్‌బాఖ్‌వాదులం అయిపోయాం" అని రాశాడు ఏంగెల్స్. ఆ రోజుల్లోనే వామపక్షపు హెగెల్‌వాదులతో కొన్ని విషయాలలో ఏకీభవించే రైన్ రాష్ట్రపు బూర్జువా వర్గంలో అతివాద భావాలు కలిగిన కొందరు వ్యక్తులు కొలోన్ పట్టణంలో "రైనిష్ జీటుంగ్" అనే పేరుతో ఒక ప్రతిపక్ష పత్రికను ఆరంభించారు (దీని మొదటి సంచిక 1842 జనవరి 1వ తేదీన వెలువడింది). పత్రికకు ప్రధాన రచయితలుగా ఉండమని మార్క్స్‌నూ, బ్రూనో బౌవర్‌నూ పత్రిక వారు ఆహ్వానించారు. 1842 అక్టోబర్‌లో ఆ పత్రికకు మార్క్స్ ప్రధాన సంపాదకుడుగా నియమితుడై తన నివాసాన్ని బోన్ నుండి కొలోన్‌కు మార్చుకున్నాడు. మార్క్స్ సంపాదకత్వం కింద ఆ పత్రిక విప్లవ ప్రజాస్వామిక ధోరణి నానాటికి మరింత ప్రస్ఫుటం అవుతూ వచ్చింది. దానితో ప్రభుత్వం ఆ పత్రికను మొదట రెండు స్థాయిల సెన్సార్ పరిశీలనకూ, తరువాత మూడు స్థాయిల సెన్సార్ పరిశీలనకూ గురిచేసి 1843 జనవరి 1న ఆ పత్రికను నిషేధించడానికే ప్రభుత్వం నిశ్చయించుకుంది. ఆ తేదీకి ముందే సంపాదకత్వానికి మార్క్స్ రాజీనామా ఇచ్చినప్పటికీ, పత్రికను అదేమీ రక్షించలేకపోయింది. చివరకు 1843 మార్చిలో పత్రిక ఆగిపోయింది. రైనిష్ జీటుంగ్ పత్రికకు మార్క్స్ రాసిన ప్రధాన వ్యాసాల్లో దిగువ వివరించినవే (రచనల పట్టిక[1] చూడండి) కాకుండా, మొసెల్ లోయలో ద్రాక్ష పంట పండించే రైతుల స్థితిగతుల గురించి ఒక వ్యాసం[2] కూడా ఉందని ఏంగెల్స్ రాశాడు. తన పత్రికా రచనా స్థాయిని గమనంలోకి తీసుకొని రాజకీయ అర్థశాస్త్రంలో తనకున్న జ్ఞానం ఇంకా సరిపోదని మార్క్స్ గ్రహించి పట్టుదలగా అర్థశాస్త్ర అధ్యయనానికి పూనుకున్నాడు.

1843లో క్రుయిజ్‌నాఖ్ పట్టణంలో తన బాల్య స్నేహితురాలూ, తాను విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే పెళ్లి చేసుకునేందుకు నిర్ణయించుకున్న జెన్నీ వొన్ వెస్ట్‌ఫాలెన్‌ను మార్క్స్ పెళ్లి చేసుకున్నాడు. ఆయన భార్యది అభివృద్ధి నిరోధక భావాలు కలిగిన ప్రష్యన్ ధనిక కుటుంబం. అత్యంత అభివృద్ధి నిరోధక కాలమైన 1850-1858 కాలంలో ఆమె పెద్ద సోదరుడు ప్రష్యా దేశపు ప్రభుత్వంలో ఆంతరంగిక శాఖా మంత్రిగా ఉండేవాడు. 1843 శరత్తులో ఆర్నాల్డ్ రూగే(రూగే జననం 1802; మరణం 1880; వామపక్షపు హెగెల్‌వాది; 1825 నుండి 1830 వరకు జైలు జీవితం; 1848 తదుపరి విదేశ ప్రవాస జీవితం; 1866-1870 బిస్మార్క్ అనుచరుడు)తో కలిసి అతివాద పక్షపు మాసపత్రిక నొకదానిని విదేశాలలో ప్రచురించే నిమిత్తం మార్క్స్ పారిస్ వెళ్లాడు. ఈ మాసపత్రిక - "దోయిచ్-ఫ్రాన్ జోజిషె యార్‌బ్యూఖర్" ("జర్మన్ ఫ్రెంచి ఇతిహాస వార్షిక సంచికలు") - మొదటి సంచిక ఒక్కటే వెలువడింది. ఆ పత్రికను జర్మనీలో రహస్యంగా పంచి పెట్టడంలో కలిగిన చిక్కుల మూలంగానూ, రూగెతో మార్క్స్‌కు కలిగిన అభిప్రాయభేదాల కారణంగానూ పత్రికను ఆపివేయాల్సి వచ్చింది. "అస్తిత్వం గల ప్రతి

విషయాన్నీ నిర్దాక్షిణ్యంగా విమర్శించడాన్నీ'', ప్రత్యేకంగా "ఆయుధాలతో విమర్శ"[3]ను ప్రకటించుతూ, ప్రజారాసులకూ, శ్రామికవర్గానికీ విజ్ఞప్తి చేస్తూన్న విప్లవకారునిగా ఈ పత్రికలో తాను రాసిన వ్యాసాలతో మార్క్స్ అప్పటికే ముందుకొచ్చాడు.

1844 సెప్టెంబర్‌లో కొద్ది రోజులు పారిస్‌లో గడపడానికి ఫ్రెడరిక్ ఎంగెల్స్ పారిస్ వచ్చాడు. అప్పటి నుండి మార్క్స్‌కు ఆయన అత్యంత సన్నిహిత మిత్రుడయాడు. పారిస్‌లో ఉంటున్న విప్లవ గ్రూపుల ఉద్రేకపూరితమైన జీవితంలో వీరిద్దరూ అమితోత్సాహంతో పాల్గొని వివిధ రకాల పెటీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాలను శక్తివంతంగా ప్రతిఘటిస్తూ (1847లో మార్క్స్ తాను రచించిన "తత్వశాస్త్ర దారిద్ర్యం"లో ప్రూడన్ సిద్ధాంతాన్ని ముక్కలుముక్కలుగా విమర్శించి తోసివేయడం ప్రత్యేక ప్రాముఖ్యత గలది) విప్లవాత్మక శ్రామికవర్గ సోషలిజం, లేక కమ్యూనిజం (మార్క్సిజం) యొక్క సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనూ రూపొందించారు. 1844-48 మధ్య మార్క్స్ రాసిన రచనలు "గ్రంథవివరణ"లో చూడండి. ప్రష్యన్ ప్రభుత్వం అతి పట్టుదలతో కోరడం చేత, ప్రమాదకరమైన విప్లవకారుడని చెప్పి మార్క్స్‌ని 1845లో పారిస్ నుండి వెళ్లగొట్టారు. అప్పుడాయన బ్రసెల్స్ వెళ్లిపోయాడు. 1847 వసంతకాలంలో మార్క్స్, ఏంగెల్స్‌లు "కమ్యూనిస్ట్ లీగ్"[4] అనే ఒక రహస్య ప్రచార సంఘంలో చేరారు; ఈ లీగ్ యొక్క 2వ కాంగ్రెస్ (లండన్, 1847 నవంబర్)లో వీరిద్దరూ ప్రముఖ పాత్ర వహించి, కాంగ్రెస్ కోరిక పైన ప్రఖ్యాత "కమ్యూనిస్టు ప్రణాళిక"ను రచించారు. ఈ ప్రణాళిక 1848 ఫిబ్రవరిలో ప్రచురించబడింది. అత్యంత మేధోసంపత్తి, స్పష్టతతో కూడిన ఒక నూతన ప్రపంచ దృక్పథాన్ని - సామాజిక జీవిత క్షేత్రాన్ని కూడా పరివేష్టించుతూన్నట్టి సుసంగతమైన భౌతికవాదాన్ని, అభివృద్ధిని గురించి **అత్యంత సమగ్రంగా, ప్రగాఢంగా ఇచ్చిన సిద్ధాంతంగా గతితర్కాన్ని, వర్గపోరాటసిద్ధాంతాన్నీ, నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టికర్త అయిన శ్రామికవర్గపు విశ్వచారిత్రక విప్లవ పాత్రనీ - ఈ గ్రంథం ప్రతిభాన్వితమైన సుస్పష్టతా దీప్తులతో ప్రదర్శించుతూంది.**

1848 ఫిబ్రవరి విప్లవం[5] ఆరంభం కాగానే బెల్జియం ప్రభుత్వం మార్క్స్‌ను ఆ దేశం నుండి వెళ్లగొట్టింది. అప్పుడు ఆయన తిరిగి పారిస్ వెళ్లి, అక్కడ కొన్నాళ్లుండి మార్చి విప్లవానంతరం[6] జర్మనీకి వెళ్లిపోయి కొలోన్ పట్టణంలో నివాసం ఏర్పరచుకున్నాడు. మార్క్స్ ప్రధాన సంపాదకత్వం కింద "నోయె రైనిష్ జీటుంగ్" అనే పత్రిక కొలోన్‌లో 1848 జూన్ 1వ తేదీ నుండి 1849 మే 19 వరకూ వెలువడింది. ప్రపంచంలోని అన్ని దేశాల శ్రామికవర్గ, ప్రజాతంత్ర ఉద్యమాలు తదుపరి నిర్ధారణ పరిచినట్లే, 1848-49 విప్లవ ఘటనల చరిత్ర నూతన సిద్ధాంతాన్ని ప్రతిభావంతంగా స్థిరపరిచింది. విజయాన్ని సాధించిన విప్లవ ప్రతీఘాతకులు మార్క్స్‌పై మొదట కోర్టు చర్యను ప్రారంభించి (1849 ఫిబ్రవరి 9వ తేదీన కోర్టు ఆయనను

నిర్దోషి అని తీర్పు చెప్పి విడుదల చేసింది), తరువాత (1849 మే 16వ తేదీన) అతనిని జర్మనీ నుండి వెళ్లగొట్టింది. తదుపరి మార్క్స్ మొదట పారిస్ వెళ్లాడు. కానీ 1849 జూన్ 13వ తేదీన ప్రదర్శన జరిగిన తర్వాత[7] అతనిని మళ్లీ మరొకసారి ఫ్రెంచి ప్రభుత్వం పారిస్ నుండి వెళ్లగొట్టింది. అప్పుడు ఆయన లండన్ వెళ్లి జీవితాంతం వరకూ లండన్ లోనే నివసించాడు.

విదేశీ ప్రవాసిగా అతను ఎంతో నికృష్టమైన జీవితాన్ని గడిపాడు. ఈ విషయం మార్క్స్, ఏంగెల్స్‌ల ఉత్తర ప్రత్యుత్తరాల వల్ల (ఇవి 1913లో ప్రచురించబడ్డాయి) మనకు స్పష్టంగా తెలుస్తోంది. మార్క్స్, అతని కుటుంబం దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. ఎంతో స్వార్థత్యాగంతో ఏంగెల్స్ నిరంతరం ధన సహాయం చేయబట్టిగానీ, లేకుంటే మార్క్స్ తన "పెట్టుబడి" గ్రంథాన్ని పూర్తి చేయలేకపోవడమే కాకుండా, అత్యంత ఆకలితో బాధపడి చనిపోయి ఉండేవాడు. అంతేకాదు, అప్పుడు చలామణీలో ఉన్న పెటీబూర్జువా సోషలిస్టు, కార్మికవర్గేతర సోషలిస్టు సాధారణ సిద్ధాంతాలకూ, ధోరణులకూ వ్యతిరేకంగా మార్క్స్ విధివిరామం లేకుండా నిర్దాక్షిణ్యమైన సమరాన్ని సాగించాల్సి రావడమే గాక, ఒక్కొక్కప్పుడు కర్కోటకమూ అమానుషమైన వ్యక్తిగత దూషణ (హెర్ ఓగ్ట్[8])లను కూడా ఆయన తిప్పికొట్టాల్సి వచ్చింది. రాజకీయ ప్రవాసుల సర్కిల్స్‌తో కలవకుండా వారికి దూరంగా ఉంటూ, ప్రధానంగా అర్థశాస్త్ర అధ్యయనమందే తన శక్తిసామర్థ్యాలను వినియోగించుతూ, అనేక చారిత్రాత్మక గ్రంథాల రూపంలో (చూడండి గ్రంథ వివరణ పట్టిక) ఆయన తన భౌతికవాద సిద్ధాంతాన్ని వివరించాడు. తాను రచించిన "రాజకీయ అర్థశాస్త్ర విమర్శనపై వ్యాసాలు" (1859), "పెట్టుబడి" (1వ సంపుటం, 1867) గ్రంథాలలో ఈ శాస్త్రాన్ని ఆయన విప్లవాత్మకంగా రూపొందించాడు (చూడండి ఈ వ్యాసంలో దిగువన ఉన్న మార్క్స్ సిద్ధాంతం అనే భాగం).

1850ల చివరిలో, 60లలోనూ తిరిగి పెల్లుబికిన ప్రజాతంత్రఉద్యమాలు మరలా మార్క్స్‌ని ఆచరణలోకి దింపాయి. 1864లో (సెప్టెంబర్ 28వ తేదీన) అంతర్జాతీయ కార్మికుల సంఘం (ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్) - ప్రఖ్యాతి పొందిన మొదటి ఇంటర్నేషనల్ - లండన్‌లో స్థాపించబడింది. ఈ సంఘానికి ఆయువుపట్టూ, ప్రాణమూ మార్క్సే. ఇది ప్రకటించిన మొదటి "విజ్ఞప్తి"నీ[9], అనేక తీర్మానాలు, ప్రకటనలు, ప్రణాళికలను ఆయనే రచించాడు. వివిధ దేశాల కార్మికోద్యమాలను సమైక్యపరుస్తూ, మార్క్స్‌యపూర్వ యుగపు కార్మికవర్గేతర సోషలిజం (మజ్జినీ, ప్రౌధాన్, బకునిన్, బ్రిటన్‌లోని ఉదారవాద ట్రేడ్‌యూనియనిజం, జర్మనీలో లాసాల్ పక్షపు మితవాద దిశ ఊగిసలాటలూ వగైరా) ధరించిన వివిధ రూపాలను ఒక సంయుక్త కార్యాచరణ మార్గంలో సమన్వయపరచడానికి కృషి చేస్తూ, ఈ ముఠాల యొక్క, బోధనా గ్రూపుల యొక్క సిద్ధాంతాలనన్నింటినీ ప్రతిఘటించుతూ, వివిధ దేశాలలో ఉన్న శ్రామికవర్గం

యొక్క కార్మికవర్గీయ పోరాటం యావత్తూ అవలంబించదగిన ఏకైక ఎత్తుగడను మార్క్స్ రూపొందించాడు. పారిస్ కమ్యూన్ పతనం (1871) తర్వాత – దీనిపై మార్క్స్ తాను రచించిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం 1871" అనే గ్రంథంలో ప్రగాఢమూ, నిర్దిష్టమూ, ప్రతిభావంతమూ, కార్యాచరణకు ఉపయోగపడే విప్లవాత్మక పరిశీలన నిచ్చాడు – బకునిన్ అనుచరుల విఘటన చర్యల ఫలితంగా ఇంటర్నేషనల్‌లో చీలికలు ఏర్పడి యూరప్‌లో ఇక ఆ సంస్థ నిలబడి ఉండడానికి అవకాశం లేకపోయింది. ఇంటర్నేషనల్ హేగ్ కాంగ్రెస్ (1872) తర్వాత ఇంటర్నేషనల్ సాధారణ కార్యాలోచనా సమితి (జనరల్ కౌన్సిల్)ని మార్క్స్ న్యూయార్క్‌కు బదిలీ చేయించాడు. మొదటి ఇంటర్నేషనల్ తన చారిత్రక పాత్రను పూర్తిచేసి, అన్ని ప్రపంచ దేశాల్లోనూ ఉన్న కార్మికోద్యమం యొక్క విస్తృతాభివృద్ధి దశకు – నిజానికి ఉద్యమం సవిస్తరంగా అభివృద్ధి చెంది, వ్యక్తిగతంగా వివిధ జాతీయ రాజ్యాల్లో అనేక సోషలిస్టు కార్మికవర్గ పార్టీల స్థాపన జరిగిన చారిత్రక దశకు – తావిచ్చి కార్యరంగం నుండి నిష్క్రమించింది.

ఇంటర్నేషనల్‌లో కష్టసహితమైన శ్రమతో పాటు సైద్ధాంతిక రచనలు మరింత ప్రయాసను కలిగించిన ఫలితంగా మార్క్స్ ఆరోగ్యం దెబ్బతింది. అయినప్పటికీ, రాజకీయ అర్థశాస్త్రాన్ని పున:రూపొందించాలనీ, పెట్టుబడి గ్రంథాన్ని పూర్తి చేయాలనీ తాను పూనుకొన్న కార్యాన్ని ఆయన సాగించుతూనే వచ్చాడు. ఇందుకోసమని ఆయన అనేక నూతన విషయాలను సేకరించి, ఎన్నో భాషలను (ఉదాహరణకు రష్యన్ భాషను) నేర్చుకున్నాడు. కాని అస్వస్థత కారణంగా పెట్టుబడి గ్రంథాన్ని ఆయన పూర్తి చేయలేక పోయాడు.

1881 డిసెంబర్ 2వ తేదీన ఆయన భార్య చనిపోయింది. 1883 మార్చి 14వ తేదీన తాను తన పడకకుర్చీలో కూర్చుని ఉండి ప్రశాంతంగా మరణించాడు. లండన్ హైగేట్ శ్మశానంలో ఆయన భార్య సమాధి పక్కనే ఆయన భౌతికకాయాన్ని భూస్థాపితం చేశారు. మార్క్స్ కుటుంబం నికృష్ట దారిద్ర్యాన్ని అనుభవించుతూన్న రోజుల్లో ఆయన పిల్లల్లో కొందరు శైశవ దశలోనే లండన్‌లో చనిపోయారు. ముగ్గురు కుమార్తెలు – ఎలియనోర్ ఎవెలింగ్, లారా లాఫార్గ్, జెన్నీ లాంగ్వెట్ – ఇంగ్లీషు, ఫ్రెంచి సోషలిస్టులను పెళ్లి చేసుకున్నారు. జెన్నీ లాంగ్వెట్ కుమారుడు ఇప్పుడు ఫ్రెంచి సోషలిస్టు పార్టీలో సభ్యుడు.

## మార్క్స్ సిద్ధాంతం

మార్క్స్ యొక్క అభిప్రాయాల, ఉపదేశాల వ్యవస్థే మార్క్సిజం. మానవజాతి అన్ని దేశాలలో కంటే అత్యంత పురోగమనాన్ని సాధించిన మూడు దేశాలలో 19వ శతాబ్దంలోని ప్రధాన సైద్ధాంతిక స్రవంతులు మూడింటినీ – సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్రం, సాంప్రదాయ ఇంగ్లీషు రాజకీయ అర్థశాస్త్రాన్నీ, సాధారణంగా ప్రచారంలో ఉన్న ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలతో సహా

ఫ్రెంచి సోషలిజాన్నీ – ఇంకా అభివృద్ధి చేసి పరిణతికి తీసుకువచ్చిన మహాప్రతిభాశాలి మార్క్స్. మార్క్స్ యొక్క – అతని ప్రత్యర్థులు సహితం మెచ్చుకొన్నట్టి అద్భుతమైన సుసంగతం, సమైక్యతనూ కలిగిన అభిప్రాయాలను – వాటి సంపూర్ణ రూపంలో ఆధునిక భౌతికవాదం, ఆధునిక శాస్త్రీయ సోషలిజంగానూ, ప్రపంచంలోని నాగరిక దేశాలన్నింటిలోనూ ఉన్న కార్మికోద్యమం యొక్క సిద్ధాంతంగానూ, కార్యక్రమంగానూ పరిఢవిల్లినట్టి అభిప్రాయాలను – వివరించాలంటే, మార్క్సిజం యొక్క ప్రధాన విషయాన్ని, అనగా మార్క్స్ ఆర్థిక సిద్ధాంతాన్ని వివరించే ముందు మొట్టమొదట ఆయన సాధారణ ప్రపంచ దృక్పథాన్ని క్లుప్తంగా చెప్పుకోవడం మనకెంతైనా అవసరం.

## తాత్విక భౌతికవాదం

1844–45లో తన అభిప్రాయాలు ఒక రూపాన్ని దాల్చిన నాటి నుండి, మార్క్స్ భౌతికవాదాన్నే అనుసరించాడు. అందులోనూ ముఖ్యంగా అతడు లుడ్విగ్ ఫొయెర్‌బఖ్ అనుచరుడు. ఫొయెర్‌బఖ్ లోనిబలహీనతలు, అతని భౌతికవాదం ఉండవలసినంత సుసంగతంగానూ, సమగ్రంగానూ ఉండకపోవడంలోనే ఉన్నాయనిమార్క్స్ క్రమంగా గ్రహించాడు. హెగెల్ ప్రతిపాదించిన భావవాదం యొక్క శృంఖలాలను ధైర్యంగా తెంచేసుకొని వాటిని వదిలేయడం లోనూ, అదివరకే "18వ శతాబ్దంలో, ముఖ్యంగా ఫ్రాన్స్‌లో, అప్పటికి నిలదొక్కుకొని ఉన్న రాజకీయ సంస్థలతోనే కాకుండా మతంతోనూ, మీమాంస శాస్త్రంతోనే కాకుండా ("హేతుబద్ధమైన తత్వశాస్త్రం బదులు" తత్‌భిన్నంగా "మైకంతో కూడిన ఊహాగానం" అనే అర్థంలో).... అధిభౌతికవాదం అంతటితోనూ" పోరాటాన్ని సాగించుతూన్నట్టి భౌతికవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలోనూ ఫొయెర్‌బఖ్ యొక్క చారిత్రక "శక స్థాపన" ప్రాముఖ్యత ఉందని మార్క్స్ అభిప్రాయం ("సారస్వత వారసత్వం"లో "పవిత్రం"). "దేనినైతే హెగెల్ 'భావం' అని నామకరణం చేసి, దానిని ఏకంగా ఒక స్వతంత్ర ప్రమాతగా తయారు చేసేశాడో, అట్టి ఆలోచనా విధానమే హెగెల్ ఉద్దేశంలో వాస్తవిక ప్రపంచానికి డెమియూర్గొస్ (సృష్టికర్త, విశ్వకర్మ) ... తద్విరుద్ధంగా భావన అనేది భౌతిక ప్రపంచం మానవుని మెదడులో ఆలోచన రూపాలుగా మార్పు చెంది వెల్లడి అయ్యేదే తప్ప మరొకటి కాదనే నా అభిప్రాయం" అని మార్క్స్ రాశాడు ("పెట్టుబడి" 1వ సంపుటం, 2వ కూర్పుకు చివరి మాట). మార్క్స్ యొక్క ఈ భౌతికతాత్విక విధానంతో సంపూర్ణంగా ఏకీభవించుతూ, దానికి వివరణ చెపుతూ, తాను రచించిన "డూరింగ్ సిద్ధాంత ఖండన"లో (ఈ గ్రంథాన్ని చూడండి) – ఈ గ్రంథాన్ని లిఖిత ప్రతి రూపంలో మార్క్స్ చదివాడు – ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఇలా రాశాడు : "ప్రపంచం యొక్క ఐక్యత దాని అస్తిత్వంలో లేదు ... దాని వస్తూత్వంలోనే ఉంది ప్రపంచం యొక్క వాస్తవ ఐక్యత; కాగా తత్వశాస్త్ర ప్రకృతి శాస్త్రాల యొక్క ప్రయాసభరితమై దీర్ఘకాలంగా సాగుతూన్నట్టి క్రమాభివృద్ధి ... దీనిని రుజువు

పరుస్తూంది.....” “ద్రవ్యం యొక్క అస్థిత్వ విధమే చలనం. చలనం లేని ద్రవ్యంకానీ, ద్రవ్యం లేని చలనం కానీ ఎన్నడూ తటస్థించి ఉండలేదు సరికదా, ఇక తటస్థించబోదు కూడాను.... కాగా, ఇక ఆలోచన అంటే ఏమిటి? చైతన్యం అంటే ఏమిటి? ఇవి ఎక్కడి నుండి పుట్టుకొస్తున్నాయి? .... అని ఎవరైనా ప్రశ్నిస్తే, అవి మానవ మస్తిష్కం యొక్క ఉత్పత్తులే అనీ, దాని పరిసరాల నుండే, దాని పరిసరాలతో పాటుగానే క్రమాభివృద్ధిని చెందినట్టి ప్రకృతి ఉత్పాదితమే మానవుడు అనీ స్పష్టంగానే తెలుస్తూంది; ఇక ఆఖరి విభజన దృష్ట్యా, మానవ మస్తిష్క జన్యములు కూడా ప్రకృతి ఉత్పాదితములే అవడం వల్ల, తతిమ్మా ప్రకృతికి ఎంతమాత్రమూ విరుద్ధంగా ఉండక పోవడమే గాకుండా, ప్రకృతితో అనుగుణ్యంగానే ఉంటాయన్న విషయం స్వయంవ్యక్తమే.” “హెగెల్ భావవాది, అనగా, అతని మనస్సులో ఉండే ఆలోచనలు, వాస్తవములైన వస్తువుల యొక్క, విధానాల యొక్క, కొద్దో గొప్పో అనిర్దిష్టములైన బింబాలు (ఏంగెల్స్ ఎబ్బిల్డర్ అనగా ప్రతిబింబాలు అనే పదాన్ని వాడాడు; అప్పుడప్పుడు ఆయన ‘ముద్రలు’ అని కూడా అంటుంటాడు) కాకపోవడమే గాకుండా. తద్భిన్నంగా, ఇటుంచి అటు, ప్రపంచ పుట్టుకకు పూర్వమే ఎక్కడో ఏ చోటనో ఉనికి కలిగి ఉంటూన్నట్టి ‘భావం’ యొక్క వాస్తవ రూపాన్ని ధరించిన బింబాలే ఈ వస్తువులూ, ఈ వస్తువుల యొక్క క్రమాభివృద్ధీ అని ఆయన నమ్ముతాడు.” తాను రచించిన “లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్” అనే గ్రంథంలో ఏంగెల్స్ ఫొయెర్‌బాఖ్ యొక్క సిద్ధాంతాలపై తన అభిప్రాయాలనూ, మార్క్స్ అభిప్రాయాలనూ వివరించుతాడు; అంతకు పూర్వం 1844-1845లో మార్క్స్, తానూ కలిసి హెగెల్, ఫొయెర్‌బాఖ్‌ల గూర్చీ, చరిత్ర యొక్క భౌతిక భావనను గూర్చీ రాసిన పాత లిఖిత ప్రతిని మరొకసారి చదివిన మీదటే ఆ గ్రంథాన్ని అచ్చుకు పంపించాడు. ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఈ విధంగా రాశాడు : “తత్వశాస్త్రం అంతటి యొక్క, ప్రత్యేకించి ఇటీవలి తత్వశాస్త్రం యొక్క మౌలికమైన ప్రశ్న ఆలోచనకీ ఉనికికీ, ఆత్మకీ ప్రకృతికీ ఉన్న సంబంధం గురించే ... ఏది ప్రధానం - ఆత్మా, ప్రకృతా అన్న ప్రశ్నే .... తత్వవేత్తలు ఈ ప్రశ్నకు ఇచ్చిన సమాధానాలువారిని రెండు పెద్ద గ్రూపులుగా విడగొట్టింది. ప్రకృతి కంటే ఆత్మే ముందు అని ఘోషించి, దానిని అనుసరించి చివరికి, దాని చేతనే ప్రపంచం ఏదో ఒక విధంగా సృష్టించబడిందని ఊహించినవారు భావవాద పక్షమయ్యారు. ఇక ప్రకృతే ముందు అని భావించేవారు, భౌతికవాదం యొక్క వివిధ కోణాలకు చెందుతారు.” (తాత్విక) భావవాద, భౌతికవాద భావనలను మరే ఇతర అర్థాలతో వాడినా, అది గందరగోళానికే దారితీస్తుంది. ఏదోవిధంగా మతంతో ఎల్లప్పుడూ సంబంధాన్ని పెట్టుకున్న భావవాదాన్ని నిష్కర్షగా తిరస్కరించడమే కాకుండా, ఈనాడు విశేషంగా ప్రచారంలో ఉంటూన్న హ్యూమ్, కాంట్ అభిప్రాయాలను, వివిధ రూపాల్లో ఉన్న అనిశ్చయవాద (ఎగ్నాస్టిసిజం), విమర్శావాద (క్రిటిసిజం), నిశ్చయవాదా (పాజిటివిజం)లను - ఇట్టి తత్వశాస్త్రాన్ని

కూడా, భావవాదానికి "అభివృద్ధి నిరోధక" సూచకమగు రాయితీయేననీ, ఎంత న్యాయదృష్టితో చెప్పదలిచినా, "అవమానకర ముఖాలతో దొడ్డిదారిన భౌతికవాదాన్ని ఒప్పుకుంటూ ప్రపంచం ముందు మాత్రం భౌతికవాదాన్ని తోసిపుచ్చడమే"నని మార్క్స్ నిష్కర్షగా తిరస్కరించాడు. ఈ ప్రశ్న విషయమై పైన పేర్కొన్న మార్క్స్, ఏంగెల్స్‌ల గ్రంథాల నుండే కాకుండా, 1868 డిసెంబర్ 12వ తేదీన మార్క్స్ ఏంగెల్స్ పేర రాసిన ఉత్తరం కూడా గమనార్హం. అందులో సుప్రసిద్ధ ప్రకృతి శాస్త్రవేత్త థామస్ హక్స్‌లీ చెప్పిన వాక్యాలను గూర్చి ప్రస్తావించుతూ ఆ వాక్యాలలో హక్స్‌లీ మామూలు కంటే "హెచ్చుగానే భౌతికవాద ధోరణిలో" మాట్లాడాడనీ, "మనం వాస్తవంగా పరిశీలిస్తూ మరియు ఆలోచించినంత కాలమూ భౌతికవాదం నుండి బయటపడలేం" అని హక్స్‌లీ అన్నప్పటికీ, ఈ మాటల వల్ల అనిశ్చయవాదానికీ, హ్యూమ్‌వాదానికీ అతడు "దొంగ ద్వారం" తెరిచే ఉంచుతున్నాడని హక్స్‌లీని మార్క్స్ తీవ్రంగా ఆక్షేపించాడు. అవసరానికీ, స్వేచ్ఛకీ ఉన్న సంబంధాన్ని గురించి మార్క్స్ యొక్క అభిప్రాయాన్ని తెలుసుకోవడం మనకు ప్రత్యేకంగా అవసరం. "అవసరాన్ని తెలుసుకొని దాన్ని తీర్చడమే స్వేచ్ఛ. 'అవసరాన్ని మనం అర్థం చేసుకోనంతవరకు అది గుడ్డి'గా ఉన్నట్లు మనకు కనిపిస్తుంది." (ఏంగెల్స్ – "డూరింగ్ సిద్ధాంత ఖండన"). ప్రకృతిలో స్వతస్సిద్ధ నియమాలు ఉంటాయనే సూత్రాన్ని గుర్తించడం, (ఏ విధంగానూ తెలియనివే కాకుండాతెలుసుకోబడగలిగిన "స్వయం పదార్థం" "మన కోసమైన పదార్థంగా"నూ, "పదార్థాల సారం" "సంఘటన"గానూ, పరివర్తన చెందుతున్నదో సరిగా అ విధంగానే) అవసరం స్వేచ్ఛలోకి గతితార్కిక పరివర్తన చెందుతూందనే విషయాన్ని గుర్తించడం అన్నమాట. ఫొయెర్‌బాఖ్ యొక్క భౌతికవాదంతో సహా "పాతకాలపు" భౌతికవాదాల్లో ఉన్న మౌలికమైన లోపాలను (బ్యూఖ్నర్, ఓగ్ట్, మోలెషోట్, వీరి "అపభ్రంశపు" భౌతికవాదాలలో ఉన్న లోపాల గురించి ఇక చెప్పనే అవసరం లేదు) మార్క్స్, ఏంగెల్స్‌లు ఈ విధంగా వివరించారు: "(1) ఈ భౌతికవాదం 'ప్రధానంగా యాంత్రికంగా' ఉండిపోయి, రసాయనశాస్త్ర, జీవశాస్త్రాలలో జరిగిన అధునాతనాభివృద్ధిని (ద్రవ్యం యొక్క విద్యుత్ సంఘటన సిద్ధాంతాన్ని అని కూడా మనమీనాడు చేర్చాల్సి ఉంటుంది) లెక్కలోకి తీసుకోవడం లేదు; (2) పూర్వకాలపు భౌతికవాదం చారిత్రక విరుద్ధంగానూ, గతితార్కిక విరుద్ధంగానూ (గతితార్కిక వ్యతిరేకం అనే అర్థంలో అధిభౌతికంగానూ) ఉంటూ, క్రమాభివృద్ధి దృక్పథాన్ని సుసంగతంగా గానీ, సవిస్తరంగా గానీ అనుసరించడం లేదు; (3) "మానవ సారాన్ని" అనిర్దిష్టమని భావించిందే తప్ప, దానిని (చారిత్రికంగా నిర్దిష్టంగా నిర్వచింపబడిన) "అన్ని సామాజిక సంబంధాల" "సమ్మిళితమ"ని చెప్పకపోవడం చేత, ప్రపంచానికి "అర్థం" మాత్రమే "చెప్పింది"; ప్రపంచానికి అర్థం చెప్పడం కాదు అసలు విషయం, ప్రపంచాన్ని "మార్చడం" అసలు విషయం; అంటే "విప్లవాత్మక ఆచరణ ప్రక్రియ" యొక్క ప్రాముఖ్యతను అది అర్థం చేసుకోలేదన్నమాట.

హెగెల్ గతితార్కిక సిద్ధాంతం అత్యంత సమగ్రమైన, అత్యంత విషయగర్భితమైన, అత్యంత ప్రగాఢమైన క్రమాభివృద్ధి సిద్ధాంతం కావడం వల్ల, అది సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్రపుగొప్ప పురోగతిని సూచిస్తున్నదనీ మార్క్స్, ఏంగెల్స్‌లు భావించారు. క్రమాభివృద్ధి, పరిణామ నియమాలను నిర్వచించే అన్ని సూత్రీకరణలూ పాక్షిక దృష్టినీ, విషయ దారిద్ర్యాన్నీ ప్రదర్శిస్తున్నాయనీ, ప్రకృతిలోనూ, సమాజంలోనూ వాస్తవంగా జరిగే క్రమాభివృద్ధి గమనానికి (దాట్లూ, మహావిపత్తులూ, విప్లవాలూ – గమనం తరచు ఈ రూపాల్లో సాగుతూంటుంది) అపార్థాలు కల్పించి వికృత రూపాల్లో ప్రదర్శిస్తున్నాయనీ వారు భావించారు. "చైతన్యవంతమైన గతితర్కాన్ని" (హెగెల్‌వాదంతో సహా అన్ని రకాల భావవాదాల వినాశకరమైన దాడి నుండి) "కాపాడి ప్రకృతి యొక్క భౌతిక భావనలో దానిని వినియోగించిన వారం బహుశా మార్క్సూ, నేను – మేమిద్దరమే అయి ఉంటాం ...గతితర్కాన్ని పరీక్షించేది ప్రకృతే. ఈ పరీక్షకు కావాల్సిన అత్యంత సంపన్నవంతమైన సామగ్రిని" (రేడియం, ఎలక్ట్రానులు, మూలద్రవ్యాల పరివర్తనలు వగైరాలు కనుక్కోకముందే ఈ వ్యాసం రాయడం జరిగింది!) "ఆధునిక ప్రకృతి శాస్త్రం రోజు రోజుకూ మరింత అధికంగా సమకూర్చిందనీ, ఆ విధంగా అది అంతిమ విశ్లేషణలో ప్రకృతి విధానం గతితార్కికమే తప్ప అధిభౌతికం కాదని రుజువు చేసింది."[10]

ఏంగెల్స్ ఇలా రాస్తాడు : "మహత్తర మౌలిక చింతన – ప్రపంచం సంపూర్ణంగా తయారై పోయినట్టి వస్తువుల క్లిష్ట సముదాయమనేది కాదనీ, క్రమాల క్లిష్ట సముదాయమే ప్రపంచమనీ, ఈ విధానాల సముదాయంలో స్థిరంగా ఉన్నట్టే మనకు కనపడే వస్తువులే కాకుండా వాటితో సహా ఆలోచనా రూపంలో మెదడులో ఉన్న వాటి ప్రతిబింబాలు, అనగా భావనలు కూడా పుట్టుతూ అంతరించి పోతూ, ఈ విధంగా నిరంతరమైన మార్పులను పొందుతూనే ఉంటాయి అనే మౌలికమైన ఈ మహత్తర చింతన, సాధారణ చైతన్యంలోకి ఎంతగా చొచ్చుకొని పోయిందంటే, ఈ స్థూల రూపంలో దీనినిప్పుడు, అందులోనూ ముఖ్యంగా హెగెల్ కాలం నుండి, ఎవ్వరూ సందేహించనైనా సందేహించరు. కాని మౌలికమైన ఈ అభిప్రాయాన్ని నోటితో అంగీకరించడమూ, దాన్ని వాస్తవంగా ప్రతి పరిశోధనా రంగంలోనూ సవివరంగా వినియుక్తం చేయడమూ, ఈ రెండూ పూర్తిగా వేర్వేరు విషయాలు."

"గతితార్కిక తత్వశాస్త్రానికి ఏదీ శాశ్వతం కాదు, ఏదీ అఖండం కాదు, ఏదీ పవిత్రం కాదు. ప్రతి వస్తువు యొక్క, ప్రతి వస్తువులోనూ ఉన్న మార్పుచెందే స్వభావాన్ని అది బైటపెడుతుంది; పుట్టుక, మరణం అనే అవిచ్ఛిన్న క్రమవిధానం తప్ప, క్రిందిదశ నుండి ఉచ్ఛదశకు నిరంతరమూ ఆరోహించే క్రమవిధానం తప్ప దాని ముందు మరేదీ నిలబడజాలదు.

కాగా మానవ మస్తిష్కంలో ఏర్పడిన ఈ విధానం యొక్క కేవల ప్రతిబింబం తప్ప గతితార్కిక తత్వశాస్త్రం అంటే మరొకటేమీ కాదు." ఈ రీతిగా, మార్క్స్ చెప్పినట్లు, "బాహ్య ప్రపంచం, మానవ చింతన రెండింటి చలనం యొక్క సాధారణ నియమాలను వివరించే శాస్త్రమే" గతితర్కం.

హెగెల్ తత్వశాస్త్రంలో ఉన్న ఈ విప్లవాత్మక అంశాన్ని మార్క్స్ స్వీకరించి దానిని ఇంకా అభివృద్ధి చేశాడు. "కడమ విజ్ఞానశాస్త్రాలన్నింటి పైనా అధికారాన్ని చెలాయించే తత్వశాస్త్రమేదీ " గతితార్కిక భౌతికవాదానికి అవసరం లేదు. వెనుకటి తత్వశాస్త్రాలన్నింటిలోనూ ఇక మిగిలినదంతా "ఆలోచనా విధాన శాస్త్రమూ, దాని నియమాలూ అనగా వ్యవహారిక తర్కమూ, గతితర్కమూ."[12] మార్క్స్ కూడా హెగెల్‌ను అనుసరిస్తూ గతితర్కంలో ఈనాడు జ్ఞాన సిద్ధాంతం లేక విజ్ఞానవాదం, "గ్నోసియాలజీ"* అని చెప్పబడేది కూడా ఇమిడే ఉంది అన్నాడు. ఈ విజ్ఞానవాదం కూడా తన ఇతివృత్త విషయం పట్ల, జ్ఞానం యొక్క ఆవిర్భావాన్నీ, క్రమాభివృద్ధినీ, అజ్ఞానం జ్ఞానంలోకి పరివర్తననూ అధ్యయనం చేసి సామాన్య ధర్మాలను చెప్పడంలో చారిత్రక దృష్టిని పాటించాలి.

ఈనాడు క్రమాభివృద్ధి భావం, పరిణామ భావం సామాజిక చైతన్యంలో సంపూర్ణంగా నాటుకొని పోయింది; అయితే ఈ నాటుకొని పోవడం హెగెల్ తత్వశాస్త్రం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో జరిగింది. కాని హెగెల్ ప్రాతిపదికను తీసుకొని మార్క్స్, ఏంగెల్స్‌లు చేసిన సూత్రీకరణను పరిశీలించితే మామూలుగా చలామణీ అవుతున్న పరిణామ భావం కంటే ఈ భావం ఎంతో సమగ్రంగానూ, ఎంతో విషయగర్భితంగానూ ఉంది. ఇదివరలో గడచిపోయిన దశలన్నింటినీ పునరుక్తం చేస్తూన్నట్లే పైకి కనపడినా, మరొక రీతిలో ఉచ్ఛస్థాయిలో పునరుక్తం చేసే పరిణామాభివృద్ధి ("శత్రు వైరుధ్యం"), ఒక విధంగా చెప్పాలంటే, సరళరేఖలో కాకుండా వలయాకృతులలో సంభవించే పరిణామాభివృద్ధి – "గెంతుల రూపంలో అభివృద్ధి"; దుర్భిక్షాలు, విప్లవాలు; "క్రమానుగతిలో అడ్డంకులు"; పరిణామం గుణంలోకి పరివర్తన చెందడం; ఒక నిర్దిష్ట వస్తువు పైన గానీ, ఒక నిర్దిష్ట సంఘటన లోపలి నుండి గానీ, లేక ఒక నిర్దిష్ట సమాజం లోపలి నుండి గానీ వివిధ శక్తులు, వివిధ ధోరణులు పనిచేసేటప్పుడు, ఆ శక్తుల యొక్క, ధోరణుల యొక్క వైరుధ్యాల ఫలితంగా, ఘర్షణల ఫలితంగా ఆ వస్తువులోనూ, ఆ సంఘటనలోనూ, ఆ సమాజంలోనూ అంతర్గర్భితంగా ఉత్పన్నమయ్యే అభివృద్ధి కారకాలైన ప్రేరేపణలు – ప్రతి సంఘటన లోనూ అంతర్భాగాలుగా ఉన్న అన్ని అంశాల మధ్యనూ ఉన్న (ఆ సంఘటనలో ఉండే కొత్త అంశాలను ఎప్పటికప్పుడు చరిత్ర బహిర్గతం చేస్తూనే ఉంటుంది) పరస్పరాశ్రయమైన, అత్యంత సన్నిహితమూ, అభేద్యమూ అయిన సంబంధమూ, ఏకరూపాన్ని కలిగినట్టి నియమబద్ధమైనట్టి సర్వసామాన్యమైనట్టి చలన విధానాన్ని సమకూర్చేటట్టి సంబంధం – (మామూలు క్రమాభివృద్ధి సిద్ధాంతం కంటే) అత్యంత సంపన్నవంతమైన క్రమాభివృద్ధి

సిద్ధాంతమైన గతితర్కం యొక్క స్వభావ లక్షణాలలో ఇవి కొన్ని మాత్రమే. (మార్క్స్ 1868 జనవరి 8వ తేదీన ఏంగెల్స్‌కు రాసిన ఉత్తరాన్ని చదివితే, ఎంత అసందర్భంగా భ్రమపడినప్పటికీ భౌతిక గతితర్కం అని ఏ విధంగానూ పొరపాటునైనా అనుకోవడానికి వీలులేని స్టయిన్ ప్రతిపాదించిన "కొయ్యత్రిశాఖ విభాగ" సిద్ధాంతాన్ని మార్క్స్ ఎలా పరిహాసం చేశాడో తెలుస్తుంది.)

## చరిత్ర యొక్క భౌతిక భావన

పాతకాలపు భౌతికవాదంలో ఉన్న అసంగతాన్ని, అసంపూర్ణతను, పాక్షిక దృష్టిని తెలుసుకొని "సమాజాన్ని గురించిన శాస్త్రాన్ని భౌతికవాద పునాదులకు అనుగుణంగా ఉండేలా మేళవింపజేసి, ఆ శాస్త్రాన్ని ఈ పునాదుల పైన పునర్నిర్మించడం"[13] అవసరమని మార్క్స్ నిశ్చయించుకున్నాడు. అస్థిత్వంలో నుండే చైతన్యం పుట్టుతూందే కాని అటు నుంచి ఇటు మాత్రం కాదని భౌతికవాదం స్థూలంగా వివరించుతూండడం చేత, సామాజిక అస్థిత్వం నుండే సామాజిక చైతన్యం పుట్టిందని మానవ సామాజిక జీవితానికి భౌతికవాదాన్ని వర్తింపజేసి చెప్పాలి. "ప్రకృతి పట్ల మానవుడు క్రియాశీలంగా వ్యవహరించే విధానాన్ని, తన జీవితంలోని సూటి ఉత్పత్తి విధానాన్ని సాంకేతిక శాస్త్రం బహిర్గతం చేస్తూ, తద్వారా మానవుని సామాజిక సంబంధాలు రూపొందే విధానాన్నీ, ఆ సంబంధాల నుండి ఉత్పన్నమయ్యే మానసిక భావనలనూ బహిర్గతం చేస్తుంది" అని మార్క్స్ రాశాడు (పెట్టుబడి, 1వ సంపుటం). "అర్థశాస్త్ర విమర్శనపై వ్యాసాలకు చేర్పులు" అనే తన గ్రంథానికి తాను రాసిన పీఠికలో, మానవ సమాజానికీ, మానవ సమాజ చరిత్రకూ వర్తింపజేయబడిన భౌతికవాదం యొక్క మూలసిద్ధాంతాలకు ఈ కింది విధంగా ఒక సమగ్ర సూత్రీకరణను ఇచ్చాడు:

"మానవులు తమకు జీవితావసరములైన వస్తువులను సామాజికంగా ఉత్పత్తి చేసుకోవడంలో పరస్పరం తమలో తమకు అగత్యములూ, తమ సంకల్పంతో నిమిత్తం లేకుండా స్వతంత్రములూ అయినట్టి నిర్దిష్ట సంబంధాలను, భౌతికంగా తమకున్న ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో నిర్దిష్టమైన దశకు అనుగుణ్యంగా ఉండే ఉత్పత్తి సంబంధాలను ఏర్పరచుకుంటారు.

"ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తమే సమాజం యొక్క ఆర్థిక నిర్మాణంగా ఏర్పడుతుంది; ఈ ఆర్థిక నిర్మాణమే సమాజం యొక్క వాస్తవమైన పునాది; ఈ పునాది పైనే న్యాయశాస్త్ర, రాజకీయ పైకట్టడాల నిర్మాణం జరుగుతుంది; సామాజిక చైతన్యం యొక్క నిర్దిష్ట రూపాలు ఈ పునాదికి అనుగుణ్యంగా ఉంటాయి. భౌతిక జీవితావసరాల ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక జీవిత విధానాలను స్థూలంగా నిర్ణయిస్తుంది. మానవుల అస్థిత్వాన్ని నిర్ణయించేది వారి చైతన్యం కాదు; తద్విరుద్ధంగా వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని

నిర్ణయిస్తుంది. వాటి క్రమాభివృద్ధిలో ఒకానొక నిర్దిష్ట దశలో సమాజం యొక్క భౌతిక ఉత్పాదక శక్తులు, ఆ దశలో అప్పటికి స్థిరపడిపోయిన ఉత్పత్తి సంబంధాలతో – దీనినే న్యాయశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే అప్పటికి స్థిరపడిపోయి, ఆ సమాజంలోనే అమలు జరుగుతున్న ఆస్థి సంబంధాలతో – ఘర్షణ పడతాయి. ఇంతకు ముందల్లా ఉత్పాదక శక్తుల అభివృద్ధి రూపాలను ధరించిన ఈ సంబంధాలు, ఈ దశలో ఉత్పాదక శక్తులకు సంకెళ్లుగా తయారవుతాయి. ఈ తరుణంలోనే సామాజిక విప్లవ శకం ఆరంభమవుతుంది. ఆర్థిక పునాదులలో మార్పు కలగడంతో ఆ పునాదుల పైన నిర్మితమైన బ్రహ్మాండమైన పైకట్టడము యావత్తూ ఇంతో అంతో త్వరితగతిన పరివర్తన చెందుతుంది. ఇటువంటి పరివర్తనలను పరిశీలించడంలో, ప్రకృతి శాస్త్రాలకు స్వాభావికమైన యథార్థతతో నిర్దేశించడానికి వీలైన ఆర్థిక ఉత్పత్తి పరిస్థితుల పరివర్తనకూ, న్యాయ, రాజకీయ, మానసిక, తత్వశాస్త్రీయ – ఒక్క మాటలో చెప్పాలంటే, ఏ రూపాల్లో ప్రజలు ఈ ఘర్షణను గుర్తించి అటో ఇటో తేల్చుకుందామని పోరాటాన్ని సాగిస్తారో అట్టి – భావశాస్త్రీయ రూపాలకూ ఉన్న తారతమ్యాన్ని ఎల్లప్పుడూ గమనిస్తూనే ఉండాలి.

“ఒక వ్యక్తి పైన మనకుండే అభిప్రాయం అతనికి తన పట్ల ఉండే స్వాభిప్రాయం పైన ఎలా ఆధారపడి ఉండదో, అదే విధంగా ఒక పరివర్తన దశను మనం విశదపరిచేటప్పుడు, కేవలం దాని చైతన్య స్థితినే ఆధారం చేసుకొని మనం విశదపరచం. తద్వ్యతిరేకంగా, భౌతిక జీవితంలో ఉన్న వైరుధ్యాలను బట్టి, సామాజిక ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్యనున్న వైరుధ్యాలను బట్టే ఈ చైతన్య స్థితిని మనం విశదపరచాల్సి ఉంటుంది. స్థూలంగా మనం సింహావలోకనం చేసి చూసినట్టయితే, సమాజం యొక్క ఆర్థిక నిర్మాణంలో ఆసియా ఖండ పురాతనకాల, ఫ్యూడల్, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాలను అభ్యుదయకరమైన శకములుగానే మనం భావించవచ్చు.” (మార్క్స్ 1866 జులై 7వ తేదీన ఏంగెల్స్‌కు రాసిన ఉత్తరంలో “ఉత్పత్తి సాధనాల వల్లనే శ్రమతీరు నిర్ధారించబడుతుందనేదే మన సిద్ధాంతం” అనే సంక్షిప్త సూత్రీకరణ ఇవ్వడం గమనార్హం.)

చరిత్ర యొక్క భౌతిక భావనావిష్కరణ, ఇంకా సరిగా చెప్పాలంటే, సామాజిక సంఘటనా క్షేత్రంలో భౌతికవాదపు దృఢమైన కొనసాగింపు, విస్తరణ వెనుకటి చారిత్రక సిద్ధాంతాలలో ఉన్న రెండు ప్రధాన దోషాలను తొలగించి వేసింది. మొదటి దోషం : అసలు ఆ సిద్ధాంతాలు చేసింది ఏదైనా ఉన్నదీ అంటే, భావశాస్త్రానికి సంబంధించిన ప్రేరక హేతువులను, ఆ హేతువులను ఉత్పత్తి చేస్తున్న కారణాలేమిటనే విషయాన్ని పరిశోధించకుండా, సామాజిక సంబంధాల క్రమాభివృద్ధి యొక్క స్వతస్సిద్ధమైన నియమాలను గ్రహించకుండా, భౌతిక వస్తూత్పత్తి అభివృద్ధి స్థాయిలోనే ఈ సంబంధాల యొక్క బీజాలు నాటుకొని ఉన్నాయన్న సంగతి గుర్తించకుండా

కేవలం మానవుల చారిత్రక కార్యశీలత లోని భావపరమైన ప్రేరక హేతువులను మాత్రమే పరిశీలించడం. రెండవ దోషం ఏమిటంటే, వెనుకటి సిద్ధాంతాలు ప్రజారాసుల చర్యలను లెక్కలోకి తీసుకునేవి కావు. అలా కాకుండా ప్రజారాసుల సామాజిక జీవిత పరిస్థితులను, ఆ పరిస్థితులలో కలిగే మార్పులను శాస్త్రీయ యధార్థతతో అధ్యయనం చేయడానికి చారిత్రక భౌతికవాదం తొలిసారిగా అవకాశం కలిగించింది. మార్క్స్‌కు పూర్వమున్న "సాంఘిక శాస్త్రమూ", చరిత్ర రచనా శాస్త్రమూ ఎంత అతిగా చెప్పినప్పటికీ, అవి కేవలం పైపై విషయాలను, ఒక్కటొక్కటిగా సంభవించే విషయాలనే కుప్పగా పోసి చరిత్రకి సంబంధించిన కొన్ని పార్శ్వాలనే వివరించాయి. అన్ని పరస్పర వ్యతిరేక ధోరణులను క్షుణ్ణంగా పరిశీలించడం వల్లనూ, ఈ ధోరణులు సమాజంలో ఉన్న వివిధ వర్గాల జీవన, ఉత్పత్తి పరిస్థితుల వ్యక్తీకరణగా నిర్వచించడం వల్లనూ, వేర్వేరు "ప్రధాన" భావాలను ఎంచి చూపించడంలో లేదా వాటిని వ్యాఖ్యానించడంలో స్వీయాత్మకతకు గురికాక పోవడం వల్లనూ ఎట్టి మినహాయింపులు లేకుండా అన్ని భావాలు, ధోరణులు భౌతిక ఉత్పత్తి శక్తుల యొక్క స్థితిలోనే తమ బీజాలను కలిగి ఉన్నాయని నిరూపించడంతో సామాజికార్థిక వ్యవస్థల పుట్టుక, అభివృద్ధి, పతన విధానాలను సర్వతోముఖంగానూ, సమగ్రంగానూ అధ్యయనం చేయడానికి మార్క్సిజం దారి చూపింది. ప్రజలే తమ చరిత్రను సృష్టించుకుంటారు. కాని ప్రజల, ప్రజాసమూహాల యొక్క ప్రేరక హేతువులను ఏది నిర్ణయించుతుంది? అంటే, పరస్పర విరుద్ధమైన భావాల, ఆశయాల సంఘర్షణలకు మూలకారణం ఏమిటి? మానవ సమాజాల సంపూర్ణ రాసిలో ఈ సంఘర్షణలన్నిటినీ మొత్తంగా కూడి కలిపితే వచ్చిన ఫలితం దేనిని నిరూపిస్తోంది? చరిత్ర అంతటిలోనూ ప్రదర్శితమవుతున్న మానవ క్రియాశీల శక్తి కంతటికీ ప్రాతిపదికగా ఏర్పడుతున్న భౌతిక జీవితావసరాల ఉత్పత్తికి అవసరమైన బాహ్యగతాత్మక పరిస్థితులు ఏవి? ఈ పరిస్థితుల క్రమాభివృద్ధి యొక్క నియమం ఏమిటి? - వీటన్నిటి ప్రాముఖ్యత వైపు మన దృష్టిని సారింపజేసి, అపరిమిత వైవిధ్య వైరుధ్యాలను కలిగిన విధానమే అయినప్పటికీ, ఏకైక నియమబద్ధమైన విధానంగా చరిత్రను శాస్త్రీయ పద్ధతులలో అధ్యయనం చేసే మార్గాన్ని మార్క్స్ మనకు చూపించాడు.

## వర్గ పోరాటం

మనం ఏ సమాజాన్ని తీసుకున్నా, ఆ సమాజ సభ్యులలో కొందరి ఆశయ సాఫల్యయత్నంతో మరికొందరి ఆశయ సాఫల్య యత్నాలు విరోధించుతాయనీ, సామాజిక జీవితం వైరుధ్యాలతో నిండి ఉందనీ, జాతులకు-సమాజాలకూ, అంతేకాకుండా, జాతులు, సమాజాలలో అంతర్గతంగా కూడా పోరాటం ఉంటూందనీ, దీనికి తోడు ఒకదాని వెంట మరొకటి విప్లవ-అభివృద్ధి నిరోధక

దశలూ, శాంతి–యుద్ధ దశలూ, స్థంభన–త్వరిత పురోగమన, క్షీణదశలూ సంభవిస్తాయని చరిత్ర వెల్లడిస్తున్న విషయం సర్వసాధారణంగా అందరికీ తెలిసిందే. చిక్కుచిక్కుగా, కల్లోలంలా కనపడే ఈ వ్యవస్థను నడిపించే నియమాలను కనుగొనగలిగే వర్గపోరాట సిద్ధాంతమనే మార్గాన్ని మార్క్సిజం మనకు అందించింది. మనం తీసుకున్న ఒక నిర్దిష్ట సమాజంలోగానీ, సమాజాల సమూహంలో గానీ ఉన్న సభ్యులందరి ఆశయాల సముదాయాన్నంతటినీ అధ్యయనం చేసిన తర్వాతనే ఈ ఆశయ సాఫల్య యత్నాల యొక్క ఫలితానికి శాస్త్రయుక్తమైన నిర్వచనం మనం ఇవ్వగలుగుతాం. కాగా ఈ పరస్పర విరుద్ధమైన సాఫల్య యత్నాలకు ఉండే మూలకారణం, ఆయా సమాజాలు ఏయే వర్గాల కింద విభజింపబడుతున్నాయో ఆ విభిన్న వర్గాల యొక్క స్థాన, జీవిత రీతుల విభేదంలోనూ ఉంటుంది. "కమ్యూనిస్టు ప్రణాళిక"లో మార్క్స్ ఇలా రాశాడు : "ఇంతవరకూ అస్థిత్వంలో ఉన్న సమాజ చరిత్ర అంతా (ఆదిమ సమాజ చరిత్ర మినహా – అని ఏంగెల్స్ తర్వాత చేర్చాడు) వర్గపోరాటాల చరిత్ర అనే చెప్పాలి. స్వతంత్రుడు–బానిస, కులీనుడు–సామాన్యుడు, ప్రభువు–భూదాసుడు, శ్రేణిపౌరుడు–చేతిపనివాడు....ఒక్కమాటలో చెప్పాలంటే పీడకుడూ పీడితుడూ నిరంతరం ఒకరికొకరు ప్రత్యర్థిగా నిలబడి, ఎడతెగకుండా ఒకప్పుడు ప్రచ్ఛన్నంగానూ మరొకప్పుడు బహిరంగంగానూ, ప్రతిసారీ కూడా మొత్తం సమాజం యొక్క విప్లవకరమైన పునర్నిర్మాణంతోనో లేదా ఈ కలహవర్గాల సమిష్టి నాశనంతోనో సమాప్తమయ్యే పోరాటాన్ని సాగిస్తూ వచ్చారు.... ఫ్యూడల్ సమాజపు శిథిలాల నుండి మొలకెత్తిన ఆధునిక బూర్జువా సమాజం వర్గవైషమ్యాలను అంతమొందించలేదు. పైగా పాతవాటి స్థానే కొత్త వర్గాలనూ, కొత్త పీడనా పరిస్థితులనూ, పోరాటం యొక్క నూతన రూపాలనూ స్థాపించింది. ఐనప్పటికీ మన శకానికి, అంటే మన బూర్జువా శకానికి ఈ క్రింది విశిష్ట లక్షణం ఉంది : అది వర్గవైషమ్యాలను సరళం చేసింది. మొత్తం సమాజం రెండు మహత్తర శత్రు శిబిరాలుగా, సూటిగా ఒకదాని కెదురుగా మరొకటి నిలిచి ఉన్న రెండు గొప్ప వర్గాలుగా అంతకంతకూ మరింతగా చీలిపోతూ ఉంది. ఆ వర్గాలే బూర్జువా వర్గం, శ్రామిక వర్గం." ఫ్రెంచి మహా విప్లవం జరిగిన నాటి నుండి ఘటనల యొక్క వాస్తవిక పూర్వరంగమైన వర్గపోరాటమే అనేక దేశాల్లో ఉంటున్నట్టు యూరప్ చరిత్ర విస్పష్టంగా బయటపెట్టింది. ఫ్రాన్సులో రాజరిక పునరుద్ధరణ కాలం నాటికే[14] చరిత్ర ఘటనల గమనాన్ని సాధారణీకరణ చేసిన మీదట ఫ్రెంచి చరిత్ర అంతటికీ వర్గపోరాటమే మూలకారణమని ఒప్పుకొనక తప్పదని పలువురు ఫ్రెంచి చరిత్రకారులు (తీయెర్రీ, గీజోట్, మిగ్నెట్, థేర్స్) రాశారు. ఇక ఆధునిక శకం – బూర్జువా వర్గ పరిపూర్ణ విజయం, ప్రజా ప్రతినిధి సంస్థలు, విస్తృతమైన (సార్వజనీనమైనది కాకపోతే) ఎన్నిక హక్కు, ప్రజల కోసం చౌక దినపత్రికలు వగైరాలు, బలపడుతూ నిరంతరం విస్తరిస్తున్న కార్మిక సంఘాలు, యజమానుల

సంఘాలు ఇత్యాదులు నెలకొనిన శకం – చారిత్రక ఘటనలకు వర్గపోరాటమే ప్రధానమైన చోదకశక్తి అని వెనుకటి కంటే మరింత ప్రత్యక్షంగా (అప్పుడప్పుడు అత్యంత ఏకపక్షంగానూ, "శాంతియుతంగానూ", "రాజ్యాంగబద్ధంగానూ" జరిగినప్పటికీ) బైట పెట్టింది. ప్రతి వర్గం యొక్క క్రమాభివృద్ధి పరిస్థితులను విశ్లేషించే సందర్భంలో, ఆధునిక సమాజంలోని ప్రతి వర్గం యొక్క స్థానాన్ని వస్తుగతమైన విశ్లేషణకు లోనుగావించడానికి గాను సాంఘిక శాస్త్రం నుండి మార్క్స్ ఏమి కోరాడో, మార్క్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళికలోని ఈ క్రింది పేరా వివరిస్తోంది: "ఈనాడు బూర్జువా వర్గాన్ని ముఖాముఖీ ఎదిరించి నిలబడే వర్గాలన్నిటిలోనూ ఒక్క శ్రామికవర్గం మాత్రమే అసలైన విప్లవ వర్గం. ఇతర వర్గాలు ఆధునిక పరిశ్రమ సమక్షంలో క్షీణించిపోయి చిట్టచివరికి  అదృశ్యమై పోతాయి; దాని యొక్క ప్రత్యేకమైనట్టీ, ముఖ్యమైనట్టీ ఉత్పన్నం శ్రామికవర్గమే. మధ్యతరగతి లోని క్రింది శ్రేణులు, చిన్న కార్ఖానా ఉత్పత్తిదారుడు, దుకాణదారుడు, చేతిపనివాడు, రైతు, ఈ శ్రేణులన్నీ మధ్యతరగతిలో చిన్న భాగాలుగా తమ అస్థిత్వం అంతరించిపోకుండా కాపాడుకొనేందుకు బూర్జువా వర్గంతో పోరాడుతాయి. కాబట్టి ఇవి విప్లవకరమైనవి కావు, సాంప్రదాయికమైనవి. అంతేకాదు, అభివృద్ధి నిరోధకమైనవి కూడా. ఎందువల్లనంటే అవి చరిత్ర రథచక్రాన్ని వెనక్కి తిప్పడానికి ప్రయత్నం చేస్తాయి. ఒకవేళ ఇవి ఎప్పుడైనా యాదృశ్చికంగా విప్లవకరంగా మారాయంటే అది కేవలం రాబోయే కాలంలో అవి శ్రామికవర్గంలోకి బదిలీ చేయబడే విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే ఆ విధంగా చేస్తాయన్నమాట. ఈ విధంగా అవి తమ ప్రస్తుత ప్రయోజనాలను కాపాడుకోకుండా భవిష్యత్ ప్రయోజనాలను కాపాడుకుంటాయి. శ్రామికవర్గంగా మారేందుకై అవి తమ దృక్పథాన్ని పరిత్యజించుతాయి." అనేక చరిత్ర గ్రంథాల్లో (గ్రంథ వివరణ పట్టిక చూడండి) వ్యక్తిగతంగా ప్రతివర్గం యొక్క స్థానాన్నీ, ఒక్కొక్కప్పుడు ఒక వర్గంలోనే ఉన్న వివిధ గ్రూపులు లేక శ్రేణుల స్థానాన్ని పరిశీలిస్తూ, ఏ కారణం చేత ఏ విధంగా "ప్రతి వర్గపోరాటమూ ఒక రాజకీయ పోరాటమే" అవుతూందో చూపుతూ, భౌతికవాద తత్వ చరిత్ర రచనా శాస్త్రానికి ఉజ్వలమూ, గంభీరమూ అయినట్టి ఉదాహరణలను మార్క్స్ మనకు చూపుతాడు. చారిత్రక క్రమాభివృద్ధి యొక్క ఫలిత ప్రేరణను నిర్ణయించేందుకుగాను, ఒక వర్గం మరొక వర్గంలోకీ, గతం భవిష్యత్తులోకీ మారేటప్పుడు సామాజిక సంబంధాల్లో ఎట్టి క్లిష్ట పరిస్థితుల సంచయం, పరివర్తన స్థాయిలు ఏర్పడతాయో మార్క్స్ పరిశీలించి నిరూపిస్తాడో అందుకు పైన చెప్పిన వాక్యాలే చక్కని తార్కాణం.

మార్క్సిజాన్ని అత్యంత ప్రగాఢంగా, సమగ్రంగా, వివరణాత్మకంగా ధృవీకరిస్తూ దాన్ని ఆచరణయోగ్యం చేస్తున్నది ఆయన ఆర్థిక సిద్ధాంతమే.

## మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం

“ఆధునిక సమాజం యొక్క అంటే, పెట్టుబడిదారీ, బూర్జువా సమాజం యొక్క ఆర్థిక చలన నియమాలను బహిర్గతం చేయడమే ఈ గ్రంథం యొక్క అంతిమ ఉద్దేశ్యం” అని “పెట్టుబడి” గ్రంథపు ముందుమాటలో అంటాడు మార్క్స్. చారిత్రకంగా నిర్వచించగలిగిన నిర్దిష్టమైన ఒక సమాజాన్ని తీసుకొన్నట్లయితే ఆ సమాజం యొక్క ఉత్పత్తి సంబంధాల పుట్టుక, అభివృద్ధి, క్షీణతపై పరిశోధన - ఇదే మార్క్స్ ఆర్థిక సిద్ధాంతంలోని విషయం. పెట్టుబడిదారీ సమాజాల్లో సరుకుల ఉత్పత్తే ప్రాబల్యాన్ని కలిగి ఉంటుంది, అందుచేత మార్క్స్ యొక్క విశ్లేషణ సరుకు యొక్క విశ్లేషణతో ఆరంభమవుతుంది.

### విలువ

మానవుని అవసరాన్ని ఏదైతే తీరుస్తుందో అదే సరుకు, ఇది మొదటి విషయం; ఒక సరుకును మరొక సరుకుతో మారకం చేసుకోవచ్చు, ఇది రెండవ విషయం. ఒక వస్తువుకు ఉండే ఉపయోగమే దాని ఉపయోగపు విలువ. ఒక రకపు ఉపయోగపు విలువల సంఖ్యను మరొక రకపు ఉపయోగపు విలువల సంఖ్యతో మార్పిడి చేసుకొనేటప్పుడు ఆ ఉత్పత్తి విలువ సంఖ్యలకు ఉండే సామ్యం, అంటే ఈ నిష్పత్తి రూపంలో ఉన్న మారకపు విలువ (సూక్ష్మంగా చెప్పాలంటే, విలువ) మనకు మొదట తారసిల్లుతుంది. ఇలా జరిగే లక్షలాది, కోట్లాది మార్పిళ్లలో ఒక ఉపయోగపు విలువతో మరొక ఉపయోగపు విలువను నిరంతరం సమాన సంబంధాన్ని ఏర్పరచి మారకం చేసుకోవడం, ఒకదానితో ఒకటి అత్యంత వైరుధ్యాన్ని కలిగి ఉండి ఏ విషయంలోనూ ఏమాత్రం సమానతా లేనట్టి ఉపయోగపు విలువల మారకాలు సైతం ఎడతెగకుండా జరుగుతూనే ఉంటాయని రోజువారీ అనుభవం వల్ల మనకు తెలుస్తూనే ఉంది. నిర్దిష్ట సామాజిక సంబంధాల వ్యవస్థలో ఒకదానితో మరొకదానికి నిరంతరం సమానత ఏర్పడుతున్న రకరకాల వస్తువులలో ఉన్నట్టి సామాన్యమైన గుణం ఏమిటి? అవన్నీ కూడా శ్రమయొక్క ఉత్పాదితాలు కావడమే వాటన్నిటికీ ఉన్న సామాన్య గుణం. ఈ ఉత్పత్తి వస్తువులను మారకం చేసుకోవడంలో మనుష్యులు అత్యంత వైవిధ్యతతో కూడిన వివిధ రకాల శ్రమలను కూడా సమాన ప్రాతిపదికపై మారకం చేసుకుంటారు. సరుకుల ఉత్పత్తే సామాజిక సంబంధాల వ్యవస్థ; ఈ వ్యవస్థలో వ్యక్తిగత ఉత్పత్తిదారులు అత్యంత వైవిధ్యపు ఉత్పత్తి వస్తువులను (శ్రమ యొక్క సామాజిక విభజన) తయారు చేస్తుంటారు; ఉత్పత్తి చేయబడిన వస్తువులన్నీ మారకం చేసుకోవడంలో, ఒకదానితో మరొకదానికి సమానత ఏర్పడుతుంది. అదే విధంగా, ఉత్పత్తిలో ఏ ఒక్క ప్రత్యేక శాఖ కోసం వినియోగించిన శ్రమ కాకుండా, ఏ ఒక్క రకమైన శ్రమ కాకుండా నిరపేక్షమైన మానవ శ్రమే - సాధారణమైన మానవ శ్రమే - సరుకులన్నిటికీ ఉన్న సామాన్య

గుణం. ఏ సమాజంలోనైనా సరే, ఆ సమాజంలో ఉన్న అన్ని సరుకుల యొక్క మొత్తపు విలువ రూపంలో ఉన్నటువంటి శ్రమశక్తి అంతా మానవ శ్రమశక్తేనని కోటానుకోట్ల మారకాలు దీనిని రుజువు చేస్తున్నాయి. తత్ఫలితంగా వ్యక్తిగతంగా ప్రతి సరుకూ సామాజికంగా అవసరమైన శ్రమకాలం అంతటిలోనూ కొంత భాగాన్నే సూచిస్తుంది. విలువ యొక్క పరిమాణాన్ని, సామాజికంగా అవసరమైన శ్రమ లేక ప్రత్యేకమైన ఉపయోగపు విలువ కలిగిన ఆ నిర్దిష్ట సరుకును, ఆ నిర్దిష్ట ఉపయోగపు విలువను ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమకాలం నిర్ణయిస్తుంది. "మన శ్రమశక్తిచే ఉత్పత్తి చేయబడిన పలు రకాల ఉత్పత్తి వస్తువులను ఒకదానితో మరొకటి మార్చుకోవడం వల్లనే వాటి విలువలకు ఒక సమానతను మనం ఏర్పరచడమే గాకుండా, అట్టి మారకపు ప్రక్రియ వల్లనే వాటిని ఉత్పత్తి చేయడంలో వినియోగించబడిన వివిధ రకాల శ్రమను మానవ శ్రమ రూపంలో వాటికొక సామ్యాన్ని కూడా నిర్ణయిస్తున్నాం. ఇలా చేస్తున్నామనేది మనకు తెలియనే తెలియదు; అయినప్పటికీ మనం అలా చేస్తూనే ఉంటాం."[15] ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే సంబంధమే విలువ అని ఒక వెనుకటి అర్థశాస్త్రవేత్త అన్నాడు; "వస్తువుల మధ్య ఉండే సంబంధంగా పైకి ముసుగు వేసి చూపించబడిన సంబంధం" అనే మాటలను అతడు తన మాటలకు చేర్చి ఉండాల్సింది. ఒక నిర్దిష్టమైన చారిత్రక సామాజిక పద్ధతిలో ఉన్న సామాజిక ఉత్పత్తి సంబంధాల యొక్క, అంతేకాకుండా సర్వవ్యాప్తమైన మారకపు సంఘటన, కోటానుకోట్ల సార్లు పునరావృతమౌతున్న మారకపు సంఘటన రూపంలో ప్రత్యక్షమవుతూ ఉన్న సంబంధాల యొక్క దృక్పథం నుండి పరిశీలించినప్పుడే విలువ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోగలుగుతాం. "విలువలుగా పరిగణించేటప్పుడు, అన్ని సరుకులూ కూడా పేరుకొని పోయినట్టి నిర్దిష్ట శ్రమకాలపు రాసులే అన్నమాట."[16] సరుకులలో ఇమిడి ఉన్న శ్రమ యొక్క ద్వంద్వ స్వభావాన్ని సవివరంగా పరిశీలించిన తర్వాత, విలువ యొక్క, ధనం యొక్క రూపాన్ని పరిశీలించడానికి మార్క్స్ పూనుకుంటాడు. ఇలా అధ్యయనం చేయడంలో, విలువ యొక్క ధనరూపం ఎలా ఉత్పత్తి అయిందో అధ్యయనం చేయడమే, మార్పిడి అభివృద్ధి యొక్క చారిత్రక క్రమాన్ని అధ్యయనం చేయడమే, వ్యక్తిగతంగా, కాకతాళీయంగా జరిగిన మార్పిడి ప్రక్రియలు (ఒక నిర్దిష్ట పరిమాణంలో ఉన్న ఒక సరుకును మరొక సరుకుతో మారకం చేసుకున్నప్పుడు సంభవించే "ప్రాథమిక లేక యాదృశ్చిక విలువ రూపం"), ఒక నిర్దిష్టమైన సరుకు కోసమే వివిధ రకరకాల సరుకులను మారకం చేసుకునే సర్వసాధారణమైన విలువ రూపం కింద ఎలా మార్పు చెందిందో, ఈ ప్రత్యేకమైన సరుకు బంగారం రూపాన్ని వహించి, బంగారమే సర్వసాధారణమైన కొలమానం కింద ఏర్పడేటట్టి పరిస్థితుల్లో, విలువ యొక్క ధనరూపం ఎలా ఏర్పడుతుందో తెలుసుకోవడమే మార్క్స్ ఉద్దేశ్యం. మారకం యొక్క అభివృద్ధి క్రమంలోనూ, సరుకుల ఉత్పత్తిలోనూ ఉద్భవించే ఉచ్ఛదశే ధనం కాబట్టి వ్యక్తిగత రూపంలో ఉన్న మొత్తం శ్రమ యొక్క సామాజిక స్వభావాన్నీ,

మార్కెట్ ద్వారా వ్యక్తిగత ఉత్పత్తిదారులను పరస్పరం ఐక్యపరిచే సామాజిక బంధనాన్ని ధనం కప్పిపుచ్చేస్తుంది. మార్క్స్ ధనం యొక్క వివిధ పనులను సవిస్తరమైన వివరాలతో విశ్లేషించి వివరించాడు; ఈ సందర్భంగా ఒక్కొక్కప్పుడు (సాధారణంగా "పెట్టుబడి" గ్రంథంలో మొదటి ప్రకరణాల్లో ఉన్నట్లు) మార్క్స్ యొక్క నిరపేక్షమైన వివరణ విధానం అనిర్దిష్ట పద్ధతుల్లో, కొన్ని చోట్ల అత్యల్ప స్థాయిలో నడుస్తున్నట్లు కనబడినా, ఆ విధానం మారకం యొక్క అభివృద్ధి చరిత్రనూ, సరుకుల ఉత్పత్తి చరిత్రనూ వివరించేటట్టి వాస్తవికాంశాల బ్రహ్మాండ సముదాయాన్నే నిజంగా పునరుత్పత్తి చేస్తూందన్న విషయాన్ని మనం ప్రత్యేకంగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "ధనం అనే విషయాన్ని మనం పరిశీలించేటప్పుడు, అది సరుకుల మారకపు విధానంలో ఒక నిర్దిష్టమైన దశను తెలియజేస్తుంది. కేవలం సరుకుల యొక్క తుల్యతనే తెలియజేసేదైతేనేమి, చలామణీ సాధనంగా నైతేనేమి, చెల్లింపు సాధనంగా నైతేనేమి, నిల్వచేసుకొనేందుకైతేనేమి, సర్వసాధారణమైన డబ్బు రూపంలో నైతేనేమి, ధనం నిర్వర్తించే ప్రత్యేక వ్యాపారాలు, ఆయా వ్యాపారాల యొక్క సాపేక్ష విస్తృతినీ, ప్రాబల్యాన్నీ అనుసరించి సామాజికోత్పత్తి క్రమంలోని విభిన్న దశలను ఒక్కొక్క దానినీ సూచిస్తాయి." (పెట్టుబడి, 1వ సంపుటం)

## అదనపు విలువ

సరుకుల ఉత్పత్తి యొక్క అభివృద్ధి ఒక నిర్దిష్ట దశ చేరుకొనేటప్పటికి ధనం పెట్టుబడిలోకి మారిపోతుంది. సరుకుల చలన ప్రసారం యొక్క సూత్రం స-ధ-స (సరుకు-ధనం-సరుకు), అనగా ఒక సరుకు కొనడం కోసం ఒక సరుకు అమ్మడం రూపంలో ఉండేది. కాని ఇప్పుడు తద్విరుద్ధంగా పెట్టుబడి యొక్క సాధారణ సాంకేతికం ధ-స-ధ, అనగా అమ్మకం కోసమే (లాభం వచ్చేటట్టుగా అమ్మకం కోసమే) కొనడం రూపంలో ఉంటోంది. చలనంలో వినియోగించిన ధనం యొక్క అసలు విలువ కంటే ఎక్కువగా వచ్చిన విలువకు అదనపు విలువ అని మార్క్స్ పేరు పెట్టాడు. పెట్టుబడిదారీ విధానపు చలన ప్రక్రియలో ధనం ఈ విధంగా "పెరుగుతూందనే" విషయం అందరకూ తెలిసిందే. ఈ విధమైన "పెరుగుదలే" ధనాన్ని ఒక ప్రత్యేకమైనట్టి, చారిత్రకంగా నిర్దేశింపబడినట్టి, సామాజిక ఉత్పత్తి సంబంధమైనట్టి పెట్టుబడి కింద రూపొందించుతూంది. సరుకుల పంపిణీనుంచి అదనపు విలువ పుట్టనేరదు. ఎందుకంటే దానికి తెలిసింది తుల్యముల మారకమే. ధరలు పెంచడం వల్ల కూడా అదనపు విలువ పుట్టేందుకు వీలు లేదు. ఎందువల్లనంటే కొనేవారి యొక్క అమ్మేవారి యొక్క లాభాలు, నష్టాలు సమంగానే ఉండగా ఇక్కడ మనకు తటస్థపడుతున్నది ఒక వ్యక్తిగతమైన సంఘటన కాకుండా, అందుకు మారుగా సర్వవ్యాప్తంగా సగటున జరిగే సామాజిక సంఘటన. అదనపు విలువ లభించాలంటే

ధనాన్ని కలిగినవాడు “ఏ సరుకు యొక్క ఉపయోగపు విలువకు, విలువను సృష్టించగలిగే విశిష్ట గుణం ఉందో అట్టి సరుకును మార్కెట్‌లో వెతికి పట్టుకోవాలి”[17] – ఆ సరుకు ఎటువంటిదై ఉండాలంటే, దాని వినియోగ క్రమమే విలువను సృష్టించే విధానం కూడా అయి ఉండాలి. అటువంటి సరుకు ఉంది – అదే మానవ శ్రమశక్తి. అది శ్రమను ఖర్చు చేస్తుంది, ఆ శ్రమ విలువను సృష్టిస్తుంది. ధనం ఉన్న వ్యక్తి శ్రమశక్తిని దాని విలువను చెల్లించి కొంటాడు; అన్ని సరుకుల విలువలాగే ఆ శ్రమశక్తి విలువ కూడా దానిని ఉత్పత్తి చేయడానికి అవసరమయ్యే సామాజిక శ్రమకాలాన్ని బట్టి నిర్ణయించబడుతుంది (అంటే కార్మికుడూ, అతని కుటుంబమూ జీవించడానికి అయ్యే వ్యయం). ధనం ఉన్న వ్యక్తి శ్రమశక్తిని కొన్న తర్వాత, దానిని వినియోగించే అధికారం, అనగా రోజంతా – మాటవరుసకు 12 గంటలు అనుకుందాం – అతనికి దఖలు పడుతుంది. అయితే, శ్రామికుడు తన జీవన భృతికి అవసరమైన ఖర్చుకు సమానమైన విలువను కలిగిన వస్తువును 6 గంటల్లోనే (“అవసరమైన” శ్రమకాలంలోనే) సృష్టించేస్తాడు; ఇక మిగిలిన 6 గంటల్లోనూ (“అదనపు” శ్రమకాలం) “అదనపు” వస్తువును, లేక అదనపు విలువను సృష్టిస్తాడు; ఈ అదనపు విలువకు పెట్టుబడిదారుడు కార్మికునికి ఏమీ చెల్లించడు. కాబట్టి ఉత్పత్తి విధాన దృష్ట్యా, పెట్టుబడిలో రెండు వేర్వేరు భాగాలను మనం గుర్తించాల్సి ఉంటుంది: ఉత్పత్తి సాధనాల (యంత్రాలు, పనిముట్లు, ముడిపదార్థాలూ వగైరా) కోసం వినియోగించబడిన స్థిర పెట్టుబడి; ఈ ఉత్పత్తి సాధనాల విలువ ఏ విధమైన మార్పునూ చెందకుండానే తయారైన వస్తువులోకి మారిపోతుంది (అంతా ఒకే సమయంలో గానీ లేదా అప్పుడప్పుడు కొన్ని కొన్ని భాగాలుగా గానీ). ఇక రెండో భాగం శ్రమశక్తి కోసం వినియోగించబడిన అస్థిర పెట్టుబడి. పెట్టుబడిలోని ఈ భాగం యొక్క విలువ స్థిరమైనది కాదు, కాగా శ్రమ క్రమంలోనే అదనపు విలువను సృష్టిస్తూ, పెరుగుతూనే ఉంటుంది. ఈ కారణం వల్ల, పెట్టుబడి ఏ విధంగా శ్రమశక్తిని దోపిడీ చేస్తూందో స్పష్టంగా చూపించాలంటే, అదనపు విలువను, మొత్తం పెట్టుబడితో పోల్చకుండా, అస్థిర పెట్టుబడి ఒక్కదానితో మాత్రమే పోల్చి చూడాలి. ఈ విధంగా పైన పేర్కొన్న ఉదాహరణలో, అదనపు విలువ రేటు, ఈ నిష్పత్తికి మార్క్స్ చెప్పినట్లుగా 6:6, అనగా 100 శాతం.

చారిత్రకంగా చూసినట్లైతే, పెట్టుబడి ఉద్భవించడానికి రెండు ముఖ్యమైన పరిస్థితులు ఉండి తీరాలి. మొదటిది, కొందరు వ్యక్తుల దగ్గర కొంతవరకు ధనం పోగుపడి ఉండాలి; దీనికి తోడు ఆ సమయంలో మొత్తం మీద సరుకుల ఉత్పత్తి సాపేక్షికంగా ఉన్నత స్థాయిలో జరుగుతూ ఉండాలి. ఇక రెండో పరిస్థితి, ద్వివిధ స్వేచ్ఛను అనుభవిస్తున్న శ్రామికుడు ఉండాలి, అనగా ఎట్టి నిర్బంధమూ, ఎట్టి ప్రతిబంధకమూ లేకుండా తన శ్రమశక్తిని స్వేచ్ఛగా అమ్ముకోవడానికి వీలును కలిగి ఉన్న శ్రామికుడుగా ఉండాలి; దీనికి తోడు భూమితోనూ, సాధారణంగా సరుకుల

ఉత్పత్తి సాధనాల తోనూ ఏ సంబంధమూ లేకుండా స్వేచ్ఛగా ఉంటూ, ఏ యజమానితోనూ ముడిపడి ఉండనట్టి, తన శ్రమశక్తిని అమ్ముకొనడం వల్లనే తప్ప ఇతరత్రా మరే విధంగానూ తన జీవనోపాధిని సాగించుకోవడానికి పూర్తిగా అశక్తుడైనట్టి కార్మికుడు, "శ్రామికుడు" అయి ఉండాలి.

అదనపు విలువను వృద్ధి చేయడానికి ప్రధానంగా రెండు విధానాలున్నాయి: రోజూ పనిచేయవలసిన కాలాన్ని అధికం చేయడం ("అఖండ అదనపు విలువ") ఒక విధానం; రోజుకు "అవసరమైన" పనికాలాన్ని తగ్గించడం ("సాపేక్ష అదనపు విలువ") రెండో విధానం. మొదటి విధానాన్ని విశ్లేషించి, రోజూ పనిచేయాల్సిన కాలాన్ని తగ్గించడానికి కార్మికవర్గం ఏ విధంగా పోరాడిందీ, ఈ పనికాలాన్ని పొడిగించడానికి (14వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకు), పనికాలాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు (19వ శతాబ్దంలో ఫ్యాక్టరీ చట్టాలు) ఏ విధంగా జోక్యం కలుగజేసుకొన్నదీ మనస్సుకు నాటేటట్లు మార్క్స్ చూపించాడు. "పెట్టుబడి" గ్రంథం వెలువడిన తర్వాత ప్రపంచంలోని నాగరిక దేశాలన్నిటిలోనూ ఉద్భవించిన కార్మికోద్యమ చరిత్ర ఈ పరిస్థితులను రుజువు చేస్తూ వేలాదివేల నూతన విషయాలను ప్రదర్శిస్తున్నది.

సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి విధానాన్ని విశ్లేషిస్తూ, ఏ ప్రధాన చారిత్రక దశల వల్లనైతే శ్రమ ఉత్పాదక శక్తిని పెట్టుబడి అధికం చేసిందో అట్టి ప్రధాన చారిత్రక దశలు మూడింటినీ మార్క్స్ పరిశోధించాడు: 1) సాధారణ సహకారం; 2) శ్రమ విభజన, కార్ఖానా ఉత్పత్తి; 3) యంత్రాలు, బృహత్ స్థాయి పరిశ్రమ. పెట్టుబడి యొక్క అభివృద్ధిని మార్క్స్ ఎంత నిశితంగా పరిశీలించి, దాని మౌలిక స్వభావాలను ఎంత నగ్నంగా బట్టబయలు చేశాడో రుజువు చేసేందుకు, సందర్భవశాత్తూ రష్యాలోని కుటీర పరిశ్రమల ఉత్పత్తి విధానంపై చేసిన వివిధ అంశాలతో కూడిన విస్తృత పరిశోధనలే పైన పేర్కొన్న మొదటి రెండు దశలకు కావలసినన్ని ఉదాహరణలను సమకూర్చుతున్నాయి. 1867లోనే మార్క్స్ వర్ణించినట్లుగా బృహత్ స్థాయి యంత్ర పరిశ్రమల యొక్క విప్లవకర ఫలితాలను తర్వాతి అర్ధశతాబ్ది కాలంలో అనేక "కొత్త" (రష్యా, జపాను మొదలైన) దేశాలలో జరిగిన విషయాలే వెల్లడి చేశాయి.

ఇంకా ముందుకుపోతే, పెట్టుబడి సంచయాన్ని అనగా అదనపు విలువలో కొంత భాగాన్ని పెట్టుబడి కింద మార్చి, ఈ భాగాన్ని తన స్వంత అవసరాలనుగానీ, ఆశయాలనుగానీ తీర్చుకునేందుకు వినియోగించకుండా కేవలం కొత్త ఉత్పత్తి కోసమే వినియోగించడం అనే విషయానికి మార్క్స్ ఇచ్చిన విశ్లేషణ నవీనమైనదీ, అత్యంత ముఖ్యమైనదీనూ. ఈ సందర్భంగా (ఆడమ్ స్మిత్ మొదలు) పూర్వపు సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తలందరి పొరపాటునూ మార్క్స్ బైటపెట్టాడు. వీరందరూ పెట్టుబడిగా పరివర్తనం చెందుతూందన్న మొత్తం అదనపు విలువంతా

అస్థిర పెట్టుబడిగా ఏర్పడుతుందని చెప్పింది పొరపాటుగా మార్క్స్ చూపాడు. వాస్తవానికి ఈ అదనపు విలువ ఉత్పత్తి సాధనాలు, అస్థిర పెట్టుబడి అనే రెండు భాగాల మధ్య విభజింపబడుతూంది. మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి భాగం కంటే స్థిర పెట్టుబడి భాగం అత్యధికంగా పెరుగుతుండడం పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క క్రమాభివృద్ధి లోనూ, అది సోషలిజంలోకి పరివర్తన చెందడంలోనూ అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉందనే విషయాన్ని మనం గమనించాలి.

పెట్టుబడి సంచయం కార్మికుల స్థానే యంత్రాలని ఉపయోగించడం త్వరితం చేసిన ఫలితంగానూ, ఒకవైపు ధనం సృష్టించడం, రెండోవైపు దారిద్ర్యం సృష్టించడం ఫలితంగానూ "శ్రమజీవుల నిలవ సైన్యం" అనే కార్మికుల "సాపేక్ష అధిక సంఖ్య", లేదా "పెట్టుబడిదారీ విధానపు అధిక జనాభా"ను కూడా సృష్టించుతూంది. ఇది అత్యంత వైవిధ్య రూపాలు ధరించి, పెట్టుబడి ఉత్పత్తిని అధిక పరిమాణంలోనూ, వేగంగానూ పెంచే అవకాశాన్ని కలుగజేస్తుంది. పరపతి అవకాశాలు అధికం కావడమూ, ఉత్పత్తి సాధనాల రూపంలో పెట్టుబడి సంచయమూ – ఇవన్నీ, అపరిమితోత్పత్తి కారణంగా మొదట సగటున పది సంవత్సరాల కొకసారి, తర్వాత అంతకంతకు సుదీర్ఘమూ, అనిర్దిష్టపు కాలవ్యవధితో జరుగుతున్న పెట్టుబడిదారీ దేశాల్లో సంభవిస్తున్న ఆర్థిక సంక్షోభాలను అర్థం చేసుకోవడానికి కీలక కారణాలుగా పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానంలో ఇప్పుడు జరుగుతున్న పెట్టుబడి సంచయానికీ, ప్రథమదశ అని చెప్పబడుతున్న దశలో జరిగిన పెట్టుబడి సంచయానికీ ఉన్న వ్యత్యాసాన్ని మనం తెలుసుకోవాలి: ఉత్పత్తి సాధనాల నుండి కార్మికుని బలవంతంగా వేరుచేయడం, రైతును భూమి నుండి తరిమేయడం, సాముదాయిక భూములను కాజేయడం, వలసలు, జాతీయ రుణాల వ్యవస్థలు, రక్షణ సుంకాలు – ఈ పద్ధతుల్లో ప్రథమ పెట్టుబడి సంచయనం జరిగింది. "ప్రథమ సంచయనం" ఒక ధృవాన "స్వేచ్ఛను అనుభవించుతున్న" శ్రామికుడినీ, రెండో ధృవాన ధనంతో కూడిన స్వంతదారుడినీ, అంటే పెట్టుబడిదారుడినీ సృష్టించింది.

"పెట్టుబడిదారీ విధానపు సంచయనం యొక్క చారిత్రక ధోరణి" గురించి మార్క్స్ తన సుప్రసిద్ధ మాటల్లో ఈ విధంగా వర్ణించాడు : "సరుకులను ఎవరైతే వాస్తవంగా ఉత్పత్తి చేస్తారో అట్టి ఉత్పత్తిదారులనుండి, అతి తుచ్ఛమైనట్టీ, నీచాతినీచమైనట్టీ, అతి స్వల్పమైనట్టీ, అతి క్షుద్రమూ, అసహ్యకరమూ అయినట్టీ భావాలను రెచ్చగొట్టడం ద్వారా, నిర్దాక్షిణ్యమైన మూర్ఖ కర్కోటక పద్ధతులలో ఆస్తి హక్కులు లాక్కోవడం జరుగుతుంది. కష్టపడి అర్జించుకున్న స్వంత ఆస్తి (రైతు, చేతిపనివాని యొక్క), అంటే ఏకాకిగా స్వతంత్రంగా తనమట్టుకు తాను కష్టించుతూన్న శ్రమజీవి తన శ్రమ పరిస్థితులలో, ఒక విధంగా చెప్పాలంటే, మిళితమై పోయి ఏకమైపోయిన ఫలితంగా

సంభవించిన ఆస్తి అంతరించిపోయి దాని స్థానే ఇతరుల యొక్క నామమాత్ర స్వేచ్ఛాయుత శ్రమను దోచుకోవడం పైన ఆధారపడినట్టి పెట్టుబడిదారీ విధానపు స్వంత ఆస్థి అవతరిస్తోంది..... కాయకష్టం చేసి తనంతటతాను ఆర్జించుకున్న శ్రామికుని ఆస్తి కాదు ఇప్పుడు గుంజుకోవలసింది; అనేక మంది శ్రామికులను దోచుకుంటున్న పెట్టుబడిదారుని ఆస్తినే ఇప్పుడు గుంజుకోవాలి. పెట్టుబడిదారీ విధానపు ఉత్పత్తిలో అంతర్గర్భితంగా ఉండే నియమాల యొక్క క్రియాశక్తి, పెట్టుబడి కేంద్రీకరణ వల్లనే ఈ ఆస్థి హక్కులు లాక్కోవడం జరుగుతుంది. ఒక పెట్టుబడిదారుడు తన తోటి పెట్టుబడిదార్లను ఎంతమందినో నాశనం చేస్తాడు. ఈ కేంద్రీకరణతో పాటే, అనగా కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో అనేక పెట్టుబడిదారులు నాశనమై పోవడమనేది పెద్దయెత్తున జరుగుతూనే, శ్రమ విధానం యొక్క సహకార రూపమూ, సాంకేతిక పద్ధతులలో భౌతిక విజ్ఞానశాస్త్రాలను లక్ష్యసాధన కోసం చైతన్యవంతంగా వినియోగించడమూ, క్రమపద్ధతిలో భూమిని సాగుచేయడమూ, శ్రమ పరికరాలను ఇక ఏ ఇతర పరికరాల వల్లనూ కాకుండా సమిష్టిగానే ఉపయోగించడానికి మాత్రమే వీలయ్యే శ్రమపరికరాలుగా మార్పు చేయడమూ, ఉత్పత్తి సాధనాలను సమిష్టి సామాజిక శ్రమ యొక్క సాధనాలుగా ఉపయోగించడం ద్వారా అన్ని ఉత్పత్తి సాధనాలనూ ఆర్థిక పెంపు వైపు కేంద్రీకరించడమూ, ప్రపంచ మార్కెట్ వలలో ప్రజలందరూ చిక్కుకొని పోవడమూ .. ఇదంతా రానురాను మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి పొందడమూ, వీటన్నిటితోపాటు పెట్టుబడిదారీ విధానం యొక్క అంతర్జాతీయ స్వభావం కూడా అభివృద్ధి చెందడమూ సంభవిస్తుంది. ఈ పరివర్తనా విధాన ఫలితంగా చేకూరిన లాభాలనన్నింటినీ గుత్తాధికారంగా తమ గుప్పెట్లోనే పెట్టుకున్నట్టి బడా పెట్టుబడిదారుల సంఖ్య క్రమేణా తగ్గుతూండడంతో పాటు దారిద్ర్యమూ, బాధలూ, బానిసత్వమూ, నీచత్వమూ, దోపిడీ స్థాయి కూడా పెరిగిపోతూనే ఉంటుంది. కాగా దీనితోనే దినదినం అధిక సంఖ్యలో పెరుగుతూ, మరే ఇతర కారణాలు లేకుండానే కేవలం పెట్టుబడిదారీ విధాన యంత్రం ఫలితంగానే క్రమశిక్షణను అలవరచుకొని, ఐక్యతను కలిగి, సంఘటితపడిన కార్మికవర్గం యొక్క విప్లవం కూడా అభివృద్ధి అవుతూనే ఉంటుంది. ఉత్పత్తి విధానంతో పాటే పుట్టి పెరిగి, దీనితోపాటే, దీని కిందనే పరిఢవిల్లిన పెట్టుబడి యొక్క గుత్తాధిపత్యం ఆ ఉత్పత్తి విధానానికే ఇప్పుడు సంకెలగా తయారవుతుంది. ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ, శ్రమను సామాజికీకరణ చేయడమూ ఎంత ఉచ్ఛస్థాయిని అందుకుంటాయంటే, వాటిపై పెరుగుతున్న ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క కవచంలో అవి ఇక ఇమడలేక పోతాయి. ఈ కవచమే తప్పనిసరిగా బ్రద్దలై పటాపంచలై పోతుంది. పెట్టుబడిదారీ విధానపు ప్రైవేటు ఆస్థి యొక్క మరణాన్ని చాటిస్తూ మరణ మృదంగం వినబడుతుంది. ఆస్థి హక్కులు లాక్కొన్నవారి ఆస్థి హక్కులే లాక్కొనబడతాయి". ("పెట్టుబడి", 1వ సంపుటం)

మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తిని "పెట్టుబడి" గ్రంథం 2వ సంపుటంలో, మార్క్స్ నూతన పద్ధతులలో అత్యున్నతంగా విశ్లేషించి పరిశీలించాడు. ఈ విశ్లేషణ అత్యంత ముఖ్యమైనది. వెనుకటిలాగానే ఈ విషయాన్ని కూడా దాని మట్టుకు అది వ్యక్తిగతంగా సంభవించిన ఘటనలా కాకుండా, సర్వవ్యాప్త స్వరూపంలో ఉన్న ఘటనగానూ, సమాజపు ఆర్థిక వ్యవస్థలో ఏ స్వల్ప భాగానికో సంబంధించిన ఘటనగా కాకుండా ఆర్థిక వ్యవస్థ కంతటికీ సంబంధించిన ఘటనగానూ మార్క్స్ తీసుకున్నాడు. సాంప్రదాయిక ఆర్థిక శాస్త్రవేత్తలు చేసిన పైన పేర్కొన్న పొరపాటును దిద్దుతూ మార్క్స్ మొత్తం సామాజిక ఉత్పత్తినంతటినీ రెండు పెద్ద భాగాల కింద విభజించాడు : 1) ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి, 2) వినిమయ వస్తువుల ఉత్పత్తి. ఇలా విభజించిన తర్వాత మొత్తం సామాజిక పెట్టుబడి వ్యాప్తిని – వెనుకటి పరిమాణంలో జరిగే పునరుత్పత్తీ, పెట్టుబడి సంచయనమూ, ఈ రెండు రూపాల్లోనూ కూడా సోదాహరణంగా లెక్కలనిస్తూ సవివరంగా పరిశీలించాడు. విలువ నియమాన్ని ప్రాతిపదికగా తీసుకొని, లాభం యొక్క సగటురేటు ఏ విధంగా నిర్దేశించబడుతుందో ఆ సమస్యను "పెట్టుబడి" గ్రంథం 3వ సంపుటంలో మార్క్స్ పరిష్కరించాడు. అర్థశాస్త్రంలో మార్క్స్ తీసుకొచ్చినట్టి బ్రహ్మాండమైన పురోగమనం దేనిలో ఉందంటే, అపభ్రంశ అర్థశాస్త్రమూ, ఆధునిక "సీమాంత ఉపయోగపు విలువ సిద్ధాంతం"[18] తరచుగా పరిమితం చేయబడుతున్నట్టి వ్యక్తిగత దృష్టాంతాల దృక్పథం నుండీ, బాహ్యగతాత్మకంగానూ, పైపైన కనపడే పోటీ విధానం యొక్క అంశాల దృక్పథం నుండీ తన పరిశీలనను జరపకుండా, పెద్దమొత్తపు ఆర్థిక ఘటనల దృక్పథం నుండే, మొత్తం సమగ్ర సామాజిక ఆర్థిక వ్యవస్థా దృక్పథం నుండే మార్క్స్ తన పరిశీలనను జరుపుతాడు. అదనపు విలువ పుట్టుకను మార్క్స్ మొదట విశ్లేషించి, అది తరువాత లాభం, వడ్డీ, భూమిశిస్తు కింద అది విభజింపబడడాన్ని పరిశీలిస్తాడు. ఒక వ్యాపారంలో ఆ వ్యాపార ఫలితంగా వచ్చిన అదనపు విలువకూ, ఆ వ్యాపారంలో మదుపుగా పెట్టిన మొత్తం పెట్టుబడికీ ఉండే నిష్పత్తే ఆ వ్యాపారంలో వచ్చిన లాభం. "ఘనమైన అంగక్రమ సంఘటన గల" పెట్టుబడి (అనగా అస్థిర పెట్టుబడి కంటే స్థిరపెట్టుబడే అతి ప్రబలంగా, సామాజిక సగటుకు మించి హెచ్చుగా ఉండడం అన్నమాట) సగటు లాభం రేటు కంటే తక్కువ లాభాన్నే సమకూర్చుతుంది; "లఘువైన అంగక్రమ సంఘటన గల" పెట్టుబడి సగటు లాభం రేటు కంటే హెచ్చు లాభాన్ని సమకూర్చుతుంది. పెట్టుబడిదారుల మధ్య ఉండే పరస్పర పోటీ వల్ల పరిశ్రమలో ఒక భాగం నుండి మరో భాగానికి పెట్టుబడులు స్వేచ్ఛగా మార్చేందుకుండే వీలువల్లనూ, రెండు సందర్భాల్లోనూ లాభాల రేటు సగటు లాభం రేటుకు కుదించబడుతుంది. ఒక నిర్దిష్ట సమాజంలో సరుకులన్నింటి విలువల యొక్క మొత్తం ఆ సరుకుల వివిధ ధరల మొత్తంతో సరిపోతూనే ఉంటుంది; కానీ ఒకే తరహాకు చెందిన వ్యాపారాల్లో వ్యక్తిగతంగా వ్యాపార సంస్థల పరస్పర పోటీ వల్లనూ, ఉత్పత్తి యొక్క వివిధ

భాగాల పరస్పర పోటీ వల్లనూ, సరుకులను వాటి విలువలతో సమానంగా ఉన్న అమ్మకం ధరలకు అమ్మకుండా, వినియుక్తమైన పెట్టుబడికి సగటు లాభం రేటును కలిపితే వచ్చిన మొత్తానికి సమానమైనట్టి ఉత్పత్తి ధరలకు అమ్ముతూ ఉంటారు.

ఈ విధంగా సర్వవిదితమూ నిర్వివాదమూ అయినట్టి ధరలకూ, విలువలకూ ఉండే తేడాలూ, లాభాలు సమస్థాయిలో ఉంటూండడమనే విషయాన్ని మార్క్స్ తన విలువ నియమానికి ఆధారంగా తీసుకొని కూలంకషంగా విశదీకరించాడు; అన్ని సరుకుల మొత్తం విలువ అన్ని ధరల మొత్తానికి సమానంగా సరిపోతూండడమే దీనికి కారణం. అయినప్పటికీ, విలువ (సామాజికమైన), ధర(వ్యక్తిగతమైన)తో సరిపడడం సులువుగానూ, ప్రత్యక్షంగానూ కాకుండా అతిక్లిష్టమైన మార్గంలో జరుగుతుంది. కేవలం మార్కెట్ సంబంధం వల్లనే పరస్పర సంబంధం ఏర్పడిన, ఒకరి నుండి మరొకరు వేరుపడిపోయి ఎవరి మట్టుకు వారే ఉత్పత్తి చేసే ఉత్పత్తిదారులను కలిగిన సమాజంలో, నియమం అనేది సామాజికమూ, సర్వవ్యాప్తమూ అయిన ఒక సగటు నియమంగానే బహిర్గతమవుతుంది; ఇలాంటి సందర్భంలో ఒకసారి ఇటూ, మరోసారి అటూ – మధ్యమ స్థానానికి రెండు వైపులా ఊగిసలాడుతున్న తేడాలు మొత్తం మీద ఒకదానినొకటి తుడిచి పెట్టేస్తుంటాయి.

శ్రామిక ఉత్పాదక శక్తి అధికమైందీ అధికమైందీ అంటే, అస్థిర పెట్టుబడి కంటే స్థిర పెట్టుబడి పెరుగుదల వేగంగా ఉందన్నమాటే. అదనపు విలువ కేవలం ఒక్క అస్థిర పెట్టుబడి యొక్క వ్యాపారం అవడమే కారణంగా, లాభం రేటు (అనగా అదనపు విలువకూ, పెట్టుబడిలో ఉన్న అస్థిర భాగాని కొక్కదానికే కాకుండా, పెట్టుబడి అంతటికీ ఉండే నిష్పత్తి) పడిపోయే స్వభావాన్ని సూచించడం సహజమే. ఈ స్వభావాన్నీ, ఈ స్వభావాన్ని కప్పిపుచ్చుతున్న లేదా ప్రతిఘటించుతున్న అనేక విషయాలను మార్క్స్ సవివరంగా విశ్లేషణ చేసి చూపిస్తాడు. “పెట్టుబడి” గ్రంథం 3వ సంపుటంలో, వడ్డీ వ్యాపారపు పెట్టుబడులు, వర్తకపు పెట్టుబడులు, ధన పెట్టుబడులపై ఎంతో వివరంగా చెప్పిన ప్రకరణాల గురించి ప్రస్తావించడం మానేసి, ఆ గ్రంథంలో భూమిశిస్తు సిద్ధాంతాన్ని వివరించే ముఖ్యమైన భాగాన్ని మనమిప్పుడు పరిశీలించాల్సి ఉంది. భూమి యొక్క విస్తీర్ణం పరిమితమైనది కాబట్టీ, దానికి తోడు పెట్టుబడిదారీ దేశాల్లో భూమి యావత్తూ ప్రత్యేకంగా వ్యక్తుల అధీనంలో ఉంది కాబట్టీ, వ్యవసాయ దినుసుల ఉత్పత్తి ధరలు, సగటు రకం భూమిలో ఉత్పత్తి చేయడానికయ్యే ఖర్చును బట్టి కాకుండా, నాసిరకం భూమిలో ఉత్పత్తి చేయడానికయ్యే ఖర్చును బట్టీ, దినుసులను భూమి నుండి మార్కెట్‌కు విడుదల చేసే సగటు స్థితిగతుల పైన కాకుండా, నాసిరకం స్థితిగతులను బట్టీ ఉంటాయి. ఈ ఖరీదులకూ, మంచిరకం భూమిలో (లేక మంచి పరిస్థితులలో) ఉత్పత్తికయ్యే ఖరీదులకూ ఉండే వ్యత్యాసమే

తేడాశిస్తు (డిఫరెన్షియల్ రెంట్) రూపంలో ప్రత్యక్షమవుతుంది. ఈ విషయాన్నే సవివరంగా పరిశీలించి, వివిధ భూఖండాల భూసారంలో ఉండే వ్యత్యాసాల వల్లనూ, భూమిపై పెట్టిన పెట్టుబడుల వ్యత్యాసాల వల్లనూ ఎలా ఈ తేడాశిస్తు ఏర్పడుతూందో చూపిస్తూ, మేలురకం భూములు రానురాను నాసిరకంగా మారిపోతుండడమే ఈ తేడాశిస్తు ఏర్పడడానికి కారణమంటూ చెప్పిన రికార్డో పొరపాటు ("అదనపు విలువ సిద్ధాంతాలు" అనే అధ్యాయంలో రాడ్‌బెర్టుస్‌పై మార్క్స్ చేసిన విమర్శ ముఖ్యంగా గమనార్హం)ను మార్క్స్ స్పష్టంగా సంపూర్ణంగా బైటపెట్టాడు. తద్వ్యతిరేకంగా, ఈ మార్పు అటునుంటి ఇటు జరగవచ్చు; నాసిరకం భూములు మంచిరకం భూములుగా (వ్యవసాయ సాంకేతిక పద్ధతుల పురోగమనం, పట్టణాల అభివృద్ధి, తదితర కారణాల ఫలితంగా) మారిపోవచ్చు. కాగా "భూమి క్రమంగా నిస్సారమవడం వల్ల ప్రతిఫలం క్రమేణా తగ్గిపోక తప్పదు అనే అప్రతిష్టపాలైన నియమం" పూర్తిగా పొరపాటే కాకుండా, ఈ తప్పుడు సిద్ధాంతమే పెట్టుబడిదారీ విధానం యొక్క లోపాలను, పరిమితులను ప్రకృతికే అంటగట్టుతోంది. ఇంతే కాకుండా, పరిశ్రమ అన్ని విభాగాలలోనూ, సాధారణంగా జాతీయ ఆర్థిక వ్యవస్థలోనూ వచ్చే లాభం మొత్తం మీద సరిసమానంగానే ఉండడం సంపూర్ణ స్వేచ్ఛాయుతమైన పోటీనీ, పరిశ్రమ యొక్క ఒక విభాగం నుండి మరో విభాగానికి పెట్టుబడిని స్వేచ్ఛగా తరలించుకొనే అవకాశాన్నీ సూచిస్తోంది. అయితే భూమిపై ప్రైవేటుస్వామ్యం ఉండడం భూమిపై గుత్తాధిపత్యాన్ని సృష్టిస్తుంది. ఈ గుత్తాధిపత్యం ఫలితంగా పెట్టుబడి స్వేచ్ఛగా మారడానికి ప్రతిబంధకం ఏర్పడుతుంది. వ్యవసాయంలో పెట్టే పెట్టుబడి తక్కువ స్థాయి ఘనాంగ నిర్మాణంతో ఉండడమనేదే దాని యొక్క విశిష్ట స్వభావం; తత్ఫలితంగా వ్యక్తిగతంగా ఎక్కువ రేటుతో లాభాలు వస్తుంటాయి. లాభం రేటు అంతటా స్వేచ్ఛగా సరిసమానమయ్యే విధానంలో, ఈ గుత్తాధిపత్యం ఫలితంగా వ్యవసాయ దినుసులు పాల్గొనవు; భూస్వామి గుత్తాధికారి అవడం చేత, వ్యవసాయపు దినుసుల ధరను సగటు ధరకు మించిన స్థాయిలో ఉంచగలుగుతాడు; ఈ గుత్తాధికారపు ధరే అఖండ శిస్తు (absolute rent)ను పుట్టించుతూంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో తేడా శిస్తును రద్దు చేయడానికి వీల్లేదు. కానీ – ఉదాహరణకు భూమిని జాతీయం చేయడం వల్లనూ, ప్రభుత్వ ఆస్థిగా చేయడం వల్లనూ అఖండ శిస్తును ఎత్తివేయడానికి అవకాశం ఉంది. భూమిని రాజ్యాంగయంత్రపు ఆస్థిగా చేయడమంటే ప్రైవేటు భూఖామందుల గుత్తాధిపత్యాన్ని క్రుంగదీయడమే; వ్యవసాయ రంగంలో మరింత వ్యవస్థాబద్ధమైన, మరింత సంపూర్ణ స్వేచ్ఛాయుతమైన పోటీకి దారితీస్తుంది. కాబట్టే బూర్జువా వర్గంలోని రాడికల్ వాదులు భూమిని జాతీయం చేయాలనే ప్రగతిశీలమైన కోర్కెను పదేపదే వెలిబుచ్చుతూ వచ్చారని మార్క్స్ వివరించాడు; కానీ నేటి పరిస్థితులలో అతి ముఖ్యమైనట్టీ, "అతి సున్నితమైనట్టీ" – సాధారణంగా ఉత్పత్తి సాధనాలపై ఉన్న గుత్తాధికారానికి ఎక్కడ "దెబ్బ తగులుతుందో" అనే

భయంతో "భూమిని జాతీయం చేయడం" అనే మాట చెవిన పడేసరికే బూర్జువా వర్గంలో అధిక సంఖ్యాకులు హడలిపోతారు. (మార్క్స్ 1862 ఆగస్టు 2వ తేదీన ఏంగెల్స్‌కు రాసిన ఉత్తరంలో లాభం రేటు గురించీ, అఖండ శిస్తు పైన తాను చేసిన సిద్ధాంతాన్ని గురించీ అత్యంత సుబోధకంగానూ, స్పష్టంగానూ వివరిస్తాడు. "మార్క్స్-ఏంగెల్స్ ఉత్తరప్రత్యుత్తరాలు" 3వ సంపుటి, 77-81 పేజీలు. అదే గ్రంథంలోని 86-87 పేజీలలో ఉన్న 1862 ఆగస్టు 9 ఉత్తరాన్ని కూడా చూడండి) భూమి శిస్తు యొక్క చరిత్రను తెలుసుకోవాలంటే మార్క్స్ చేసిన విశ్లేషణను మనం గమనించాలి. శ్రమ రూపంలో ఉన్న శిస్తు (భూస్వామి యొక్క భూమి మీద కష్టపడుతూ తత్ఫలితంగా ఎప్పుడైతే అదనపు ఫలితాన్ని రైతు సృష్టిస్తాడో అప్పుడు) ఏ విధంగా (రైతు తన స్వంత భూమిలో అదనపు ఉత్పత్తిని సృష్టించుకొని, "ఆర్థికేతర ఒత్తిడుల" కారణంగా దానిని భూస్వామికి సమర్పించుకుంటాడో అప్పుడు) దినుసు రూపంలో ఉన్న శిస్తుగా గానీ, ఇతర వస్తురూపంలో ఉన్న శిస్తుగా గానీ మారిపోతుందో, తరువాత నగదు శిస్తు [దినుసు రూపంలో ఉన్న శిస్తును నగదులోకి మార్చిన శిస్తు. పూర్వం రష్యాలో సరుకు ఉత్పత్తి హెచ్చుగా అభివృద్ధి అయిన కారణంగా "ఒబ్రోక్" (క్విట్ రెంట్) రూపంగా వసూలు చేసిన పన్ను)] లోకి మారిపోతుందో, ఇక చిట్టచివరకు రైతుకు బదులు, రైతు స్థానే కూలికి పనివాళ్లను పెట్టి వ్యవసాయం చేయించే వ్యవసాయపు ముస్తాజరీ వ్యాపారస్తులు బయలుదేరారో అప్పుడు ఈ నగదు శిస్తు పెట్టుబడిదారీ విధానపు శిస్తు కింద ఎలా మారిందో మార్క్స్ విశ్లేషించి చూపుతాడు. "పెట్టుబడిదారీ విధానపు శిస్తు యొక్క పుట్టుక"ను పరిశీలించిన సందర్భంగా, వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధాన పరిణామం గురించి మార్క్స్ ప్రధానంగా వివరించిన అనేక అభిప్రాయాలు (రష్యా లాంటి వెనుకబడిన దేశాలకు ఎంతో ముఖ్యమైనట్టి అభిప్రాయాలు) ముఖ్యంగా గమనించదగినవి. "వస్తురూపంలో ఉన్న శిస్తు, నగదు రూపంలో ఉన్న శిస్తు కింద మారిపోయేటప్పుడు, ఈ మార్పుతో కూడా రోజువారీ కూలికోసం కిరాయికి పనిచేసే నిరాస్తిపరులైన శ్రామికుల వర్గం ఒకటి విధిగా ఏర్పడడమే గాకుండా, నగదు శిస్తు విధానం ఏర్పడక ముందే అందుకు సూత్రధారులుగా వీరు ఏర్పడతారు. ఈ వర్గం ఇంకా ఏర్పడుతుండే కాలంలోనే, అక్కడక్కడ ఈ నూతన వర్గం బయలుదేరుతున్నప్పుడే వెనుకటి ఫ్యూడల్ వ్యవస్థ రోజుల్లో కాస్త ధనికులైన బానిస రైతులు తమ వద్ద ఊడిగం చేయడానికి ఇతర పేద బానిస రైతులను ఎలాగైతే పెట్టుకునేవారో సరిగా అలాగే ప్రభుత్వానికి శిస్తు చెల్లించుతూ కాస్త స్థితిపరులైన రైతులు వ్యవసాయ కూలీలను దోచుకొనే పద్ధతి తప్పనిసరిగా బయలుదేరుతుంది. ఈ విధంగా మోతుబరి రైతులే కొంత ధనాన్ని కూడబెట్టుకొనే సామర్థ్యాన్ని సంపాదించుకొని, భవిష్యత్తులో తామే పెట్టుబడిదారులుగా మారిపోయే అవకాశం ఉంటుంది. ఈ విధంగా వృద్ధ భూఖామందుల, తమంతట తామే కష్టించి వ్యవసాయం చేసుకొనే రైతుల మధ్య నుంచే వ్యవసాయ వ్యవస్థకు

వెలుపలనే ఉన్న పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క సాధారణ అభివృద్ధి కారణం వల్ల పెట్టుబడి పెట్టగలిగిన రైతులను భవిష్యత్తులో సృష్టించే నారుమడి ఒకటి తయారవుతుంది" (పెట్టుబడి, 3వ సంపుటి, పేజీ 332). "వ్యవసాయిక ప్రజానీకంలో ఈ విధంగా కొందరి నుండి ఆస్తి హక్కులు లాక్కొనబడి భూముల నుండి తొలగించి వేయబడిన ఫలితంగా పారిశ్రామిక పెట్టుబడికి అవసరమైన శ్రామికులు 'విడుదల కాబడడమే' కాకుండా, వారి జీవనభృతీ, వారు వినియోగించాల్సిన శ్రమసరుకూ తయారై, దానితో పాటు దేశీయ మార్కెట్ కూడా ఒకటి ఏర్పడుతుంది" (పెట్టుబడి, 1వ సంపుటి, పేజీ 778). మొదట వ్యవసాయిక ప్రజానీకం దరిద్రులై పోయి, నాశనమై పోయి, తత్ఫలితంగా తర్వాత పెట్టుబడికి అవసరమైన నిరుద్యోగపు నిలవ సైన్యం కింద తయారవుతారు. ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ, "వ్యవసాయపు ప్రజల్లో కొంతభాగం ఎల్లప్పుడూ పట్టణ జీవితానికి లేదా పరిశ్రమల్లోకి, అంటే వ్యవసాయేతర కష్టించే శ్రామికవర్గంలోకి మారిపోతూన్న పరిస్థితిలో ఉంటుంటారు....సాపేక్షికమైన అదనపు జనాభా యొక్క ఈ మూలాధారం నిరంతరం నిరవధికంగా అలా ప్రవహిస్తూనే ఉంటుంది.... ఈ పరిస్థితుల ఫలితంగా వ్యవసాయకూలీకి కనిష్ట పరిమాణపు కూలిడబ్బులే లభిస్తూ, ఒక కాలు ఎల్లప్పుడూ దుర్భర దారిద్ర్యం అనే ఊబిలో దిగబడుతూనే నిలబడి ఉంటాడు" ("పెట్టుబడి", 1వ సంపుటి, పేజీ 668). తాను సాగు చేస్తున్న భూమికి రైతు తానే స్వంత యజమానిగా ఉండడమే స్వల్ప స్థాయిలో జరిగే ఉత్పత్తికి పునాదిగా ఏర్పడుతూ, అది నిలబడి ఉండడానికీ, సాంప్రదాయిక రూపాన్ని వహించడానికీ మూలకారణంగా పరిణమించుతోంది. కానీ ఈ విధమైన అల్ప స్థాయి ఉత్పత్తి సంకుచితమైన ఆదిమ ఉత్పత్తి వ్యవస్థకూ, ఆదిమ సమాజానికీ మాత్రమే సరిపడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో "రైతాంగాన్ని దోచుకొనే పద్ధతీ, పారిశ్రామిక శ్రామికవర్గాన్ని దోచుకొనే పద్ధతీ, రెండూ ఒక్కటే; రూపం లోనే తేడా. ఇద్దరినీ దోచుకుంటున్నది ఒక్కటే. పెట్టుబడే. వ్యక్తిగత పెట్టుబడిదారులు వ్యక్తిగత రైతులను తనఖాలూ, వడ్డీల ద్వారా దోచుకుంటారు; పెట్టుబడిదారీ వర్గమంతా ఏకమై ప్రభుత్వపు పన్నుల రూపంలో రైతు వర్గాన్ని దోచుకుంటుంది" ('ఫ్రాన్స్‌లో వర్గపోరాటాలు' రచన నుండి). "రైతుకు సాగు చేసుకొనేందుకు కొద్దిగా పొలాన్ని ఉండనివ్వడం అనేది భూమి నుండి పెట్టుబడిదారుడు లాభాలను, వడ్డీని, పన్నును పిండడానికి ఒక సాకుగా ఏర్పడుతూందే తప్ప మరేమీ కాదు; ఇదంతా జరుగుతుండగా ఇక భూమిని సాగుచేసుకొనే రైతు తన జీవన భృతిని ఎలా సంపాదించుకోగల్గుతాడనే విషయం ఆ రైతుకే వదిలేశారు" (18వ బ్రూమేర్ అనే వ్యాసం నుండి). పెట్టుబడిదారీ సమాజానికి అంటే పెట్టుబడిదారీ వర్గానికి రైతు తన జీవన భృతికి సంపాదించుకునే డబ్బులో కొంత భాగాన్ని తప్పనిసరిగా ధారపోస్తూ "తన భూమికి తానే యజమానినని నటిస్తూ, ఐర్లండ్ దేశపు కౌలుదారీ రైతు స్థాయికి" దిగజారి పోతున్నాడు (ఫ్రాన్స్‌లో వర్గపోరాటాలు వ్యాసం నుండి). "పెట్టుబడిదారీ

పద్ధతిలో ఉత్పత్తి విధానాన్ని సాగిస్తున్న దేశాల్లో కంటే, సన్నకారు రైతుల భూయాజమాన్యం ప్రబలంగా ఉన్న దేశాల్లోనే ధాన్యపు ధరలు తక్కువగా ఉండడానికి గల కారణాలలో ఒక కారణం" ఏది? (పెట్టుబడి 3వ సంపుటి, పేజీ 340) ఈ కారణాల్లో ఒక కారణం ఏమిటంటే: తన అదనపు ఉత్పత్తిలో కొంత భాగాన్ని ఎట్టి ప్రతిఫలమూ లేకుండానే సమాజానికి (అంటే పెట్టుబడిదారీ వర్గానికి) రైతు ధారపోస్తున్నాడు. "ఈ తక్కువ ధరలు (ధాన్యం యొక్క, ఇతర వ్యవసాయ దినుసుల యొక్క) ఉత్పత్తిదారుల యొక్క బీదతనం ఫలితమే తప్ప, వారి శ్రమ ఉత్పాదకత వల్ల ఎంతమాత్రమూ కాదు" (పెట్టుబడి 3వ సంపుటి, పేజీ 340). చిన్నతరహా ఉత్పత్తి విధానం యొక్క సర్వసాధారణ రూపాన్ని కలిగిన పద్ధతి అయిన చిన్న కమతాల సాగుబడి విధానం, పెట్టుబడిదారీ విధానంలో రానురాను క్షీణించిపోయి, పతనమైపోయి నశించిపోతుంది. "వస్తుత: చిన్న కమతాల సాగుబడి విధానంలో, సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తులు అభివృద్ధి పొందేందుకు, శ్రమ యొక్క సామాజిక రూపాలకూ, పెట్టుబడుల యొక్క సామాజిక సాంద్రీకరణానికీ, ఉచ్ఛస్థాయిలో పశువుల పెంపకానికీ, వ్యవసాయంలో క్రమేణా ఉన్నత స్థాయిలో విజ్ఞానశాస్త్ర వినియోగానికీ ఏమాత్రమూ తావుండదు. అధిక వడ్డీలు, పన్నుల విధానమూ, దానిని సర్వే సర్వత్రా తప్పనిసరిగా దారిద్ర్యంలో ముంచివేసి తీరుతాయి. భూమిని కొనడానికే పెట్టుబడి వినియోగం అయిపోవడం వల్ల, వ్యవసాయం మీద పెట్టవలసిన పెట్టుబడికి లోటు కలుగుతుంది. ఉత్పత్తి సాధనాలు అంతులేకుండా ఎక్కడికక్కడే చెదిరిపోయి, ఉత్పత్తిదారులు ఎవరిమట్టుకు వారు వేరుపడిపోతారు." (కోఆపరేటివ్ సొసైటీలు, అంటే సన్నకారు రైతు సంఘాలు అత్యంత ప్రగతిశీలమైన బూర్జువా పాత్రనే నిర్వహిస్తున్నప్పటికీ, ఈ పోకడను పూర్తిగా బలహీనపరుస్తున్నప్పటికీ దానిని పూర్తిగా రూపమాపలేక పోయాయి. కాగా ఈ సహకార సంఘాలు మోతుబరి రైతులకే అధికంగా ఉపయోగకరంగా ఉంటాయితప్ప గ్రామీణ పేదరైతాంగానికి ఏ కొద్దిగానో తప్ప ఇంచుమించు ఏమాత్రమూ ఉపయోగపడడం లేదనే విషయాన్ని కూడా మనం మరిచిపోకూడదు; అంతేకాక ఈ సంఘాలు కూలి శ్రామికులను దోచుకునేందుకూ తయారవుతాయి.) "మానవ శక్తులు బ్రహ్మాండంగా వృధా అయిపోతున్నాయి. ఉత్పత్తి పరిస్థితులు అంతకంతకు మరింతగా దిగజారడమూ, ఉత్పత్తి సాధనాల ధరలు పెరగడమూ అనేది చిన్న కమతాల ఆస్థి విధానంలో తప్పనిసరిగా సంభవించి తీరాల్సిన నియమమే." పరిశ్రమలో వలెనే వ్యవసాయంలో కూడా "ఉత్పత్తిదారుడిని బలిపెడితేనేగాని" పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తి పద్ధతులలో మార్పు తీసుకురాదు. "ఒక్కచోటే సాంద్రీకృతమైన ఫలితంగా పట్టణ కార్మికుల ప్రతిఘటనాశక్తి అధికమవుతుండగా, విశాల దేశంలో గ్రామీణ శ్రామిక జనం నాలుగు మూలలా చెదిరిపోవడం వల్ల వారి ప్రతిఘటనాశక్తి తగ్గిపోతుంటుంది. పట్టణ పరిశ్రమలలో వలెనే ఆధునిక వ్యవసాయంలో కూడా శ్రమ ఉత్పాదకత అంతకంతకూ అధికమౌతుండడం, చలనంలోకి తీసుకొని

రాబడిన శ్రమ యొక్క పరిమాణం పెంచబడుతుండడం అనేవి కేవలం శ్రమశక్తిని వృధా చేసి రోగాల పాల్జేయడం ద్వారానే ఇది సాధించబడుతోంది. అంతేకాక పెట్టుబడిదారీ విధానపు వ్యవసాయంలో జరిగిన అభ్యుదయమంతా శ్రామికుని కొల్లగొట్టడమనే కళలోనే కాకుండా, భూమిని కొల్లగొట్టడమనే కళలో కూడా సాధించిన అభ్యుదయమే... అందుచేత పెట్టుబడిదారీ ఉత్పత్తి సాంకేతిక శాస్త్రాన్ని అభివృద్ధిపరచి, వివిధ విధానాలను సమ్మేళనం చేసి సామాజికంగా సమైక్యం చేస్తున్నదీ అంటే సంపదకంతటికీ మూలాధారమైన భూమినీ, శ్రామికుడినీ మాత్రం క్షీణింపజేసి నాశనం చేయడం వల్లనే చేయగలుగుతోంది" (పెట్టుబడి 1వ సంపుటి, 13వ ప్రకరణం చివరి భాగం).

**సోషలిజం**

పైన వివరించిన దానిని బట్టి సమకాలీన సమాజ అభివృద్ధికి చెందిన ఆర్థిక నియమం మూలంగానే పెట్టుబడిదారీ సమాజం సోషలిస్టు సమాజంలోకి తప్పక పరివర్తన చెందుతుందనే విషయానికి మార్క్స్ తక్కువ ప్రాధాన్యతనిచ్చాడనే విషయం ఇక్కడ గమనార్హం. బృహత్ స్థాయి ఉత్పత్తీ, పెట్టుబడిదారీ విధానపు కార్టెల్సూ, సిండికేట్లూ, ట్రస్టులూ – వీటన్నిటి అభివృద్ధీ, ఇవేకాక ఆర్థిక పెట్టుబడి పరిమాణం, శక్తి యొక్క బ్రహ్మాండమైన విజృంభణ, ఈ రూపాలలో అత్యంత ఆశ్చర్యాన్ని కొల్పేటట్టుగా ప్రత్యక్షంగా సాక్షాత్కారమవుతున్నట్టిన్నీ, కనబడుతున్నట్టీ, మార్క్స్ మరణానంతరం ఈ అర్ధశతాబ్దిలో అత్యంత త్వరితగతిన వేలకొలది రూపాల్లో పురోగమించుతున్నట్టి శ్రమ సామాజికీకరణ – ఇవన్నీ విధిగా రానున్న సోషలిజం అవతరణకు ప్రధాన భౌతికపునాదినందిస్తున్నాయి. ఈ పరివర్తనాన్ని ముందుకు నడిపే మేధోపర, నైతిక శక్తీ, ఈ పరివర్తనాన్ని అమలుపరిచే భౌతిక శక్తీ పెట్టుబడిదారీ విధానం చేత స్వయంగా తర్ఫీదు చేయబడిన శ్రామికవర్గమే. బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా వివిధ రూపాలనూ, నానాటికి అత్యంత విభిన్న స్వరూపాలను దాల్చుతున్న విషయ వైవిధ్యంతోనూ ప్రత్యక్షమవుతున్నట్టి శ్రామికవర్గ పోరాటం, రాజకీయాధికారాన్ని శ్రామికవర్గం హస్తగతం చేసుకునే ("శ్రామికవర్గ నియంతృత్వ") లక్ష్యాన్ని కలిగిన రాజకీయ పోరాట రూపాన్ని విధిగా ధరించి తీరుతుంది. ఉత్పత్తి యొక్క సామాజికీకరణ ఉత్పత్తి సాధనాలు సమాజం యొక్క ఆస్థిగా మారడానికే, అనగా "ఆస్థి హక్కులు లాక్కొన్నవారి ఆస్థి హక్కులే లాక్కొనబడడానికే" విధిగా దారితీసి తీరుతుంది. ఈ మార్పు యొక్క ప్రత్యక్ష ఫలితంగా, శ్రామిక ఉత్పాదకశక్తి అధికంగా పెరిగిపోవడమూ, పనిగంటలు తగ్గడమూ, వీటితో పాటు ఆదిమ పద్ధతులలో వ్యక్తిగతంగా సాగుతున్న స్వల్ప స్థాయి ఉత్పత్తి యొక్క శిథిలాలూ, అవశేషాలూ అంతరించిపోయి, వాటి స్థానాన్ని అభివృద్ధి చెందిన సమిష్టి శ్రమ ఆక్రమిస్తుంది. వ్యవసాయానికీ, పరిశ్రమకీ ఉన్న బంధాన్ని పెట్టుబడిదారీ విధానం

తొలగించినప్పటికీ, దాని యొక్క ఉన్నత స్థాయి అభివృద్ధి మూలంగా ఆ బంధాన్ని కొనసాగించేలా నూతన శక్తులను తయారు చేసుకుంటుంది; అయితే అదే సమయంలో, విజ్ఞాన శాస్త్రాలను చైతన్యవంతంగా వినియుక్తం చేయడం పైననూ, సమిష్టి శ్రమను సమ్మేళన చేయడం పైననూ (గ్రామసీమల వెనుకబాటుతనాన్నీ, ఏకాంత జీవితాన్నీ, అనాగరికమైన మొరటుతనాన్నీ రూపుమాపుతూ, దీనితోపాటు పెద్ద పట్టణాలలో బ్రహ్మాండమైన ప్రజారాసుల విపరీత అసహజ సాంద్రీకరణని అంతమొందిస్తూ), ప్రజాసంఖ్యను ప్రపంచం మీద పున:సర్దుబాటు చేయడం పైననూ ఆధారపడిన వ్యవసాయ, పరిశ్రమల పరస్పరాశ్రయం యొక్క నూతన సంబంధ విశేషాలను పెట్టుబడిదారీ వ్యవస్థే తన అభివృద్ధి యొక్క అత్యున్నత దశలో స్థాపించుతుంది. నూతన రూపాన్ని ధరించిన కుటుంబాన్నీ, స్త్రీల ప్రతిపత్తిలోనూ భావితరం వారిని పెంచడంలో నూతన పద్ధతులనూ ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉన్నతోన్నత దశలే స్థాపించుతాయి : స్త్రీలను, పిల్లలను కూలీలుగా వినియోగించడమూ, పెట్టుబడిదారీ విధాన ఫలితంగా పితృస్వామిక కుటుంబ విచ్ఛిత్తీ – ఇవి ఆధునిక సమాజంలో అతి భయంకర, విపత్కర, అసహ్య రూపాలను ధరించుతాయి. ఇన్ని జరుగుతున్నప్పటికీ "…..నూతన పారిశ్రామిక వ్యవస్థే కుటుంబ పరిధులకు ఆవల నున్న ఉత్పత్తి విధానంలో స్త్రీలకు, యువకులకు, ఆడ–మగ అనే విచక్షత లేకుండా పిల్లలకు ముఖ్యపాత్రను కలుగజేస్తూ, ఉచ్ఛస్థాయిలో ఉన్న కుటుంబ జీవితానికీ, స్త్రీపురుష సంబంధాలకూ నూతన ఆర్థిక పునాదులను సృష్టిస్తోంది. పురాతనకాలపు రోమ్, గ్రీస్ లేదా ప్రాచ్యదేశాల కుటుంబ వ్యవస్థ రూపాలే శాశ్వతమైనవీ, పరిపూర్ణ పరిణతిని చెందినవనీ భావించడం ఎంత అసందర్భంగా ఉంటుందో, ఆ విధంగానే ట్యూటన్–క్రిస్టియన్ రూపాన్ని వహించిన కుటుంబ వ్యవస్థే శాశ్వతమైనదీ, పరిపూర్ణ పరిణతి చెందినదనీ భావించడం అంత అసందర్భంగానూ ఉంటుంది; ఆమాట కొస్తే, ఈ రూపాలన్నీ మొత్తం మీద చారిత్రకాభివృద్ధిలో దశలవారీగా సంభవించిన ఒక క్రమానుగతిని సూచిస్తున్నాయి. అంతేకాక, కార్మికుల గ్రూపులలో స్త్రీ పురుష భేదం గానీ, వయోభేదం గానీ పాటించకుండా సమిష్టిగా పనిచేయడమనే విషయం సరైన పరిస్థితులలో గనుక జరిగితే, దయతో కూడిన అభివృద్ధికే అది తప్పనిసరిగా మూలకారణం కాగలదని స్పష్టంగా కనబడుతూనే ఉంది. అయితే మానవ క్రమాభివృద్ధిలో స్పాంటేనియస్‌గా పెరిగినట్టి ఉత్పత్తి విధానం శ్రామికుని కోసమే ఉనికి కలిగి ఉండడానికి బదులు, ఉత్పత్తి విధానం కోసమే శ్రామికుడు ఉనికిలో ఉన్నాడనే స్వభావాన్ని కలిగినట్టి పెట్టుబడిదారీ వ్యవస్థ కింద అమానుష రూపాన్ని ధరించి దుర్నీతికీ, బానిసత్వానికీ చీడపురుగుల పుట్టగా తయారవుతూంది" (పెట్టుబడి, 1వ సంపుటి, 13వ అధ్యాయం చివరి భాగం). ఫ్యాక్టరీ పద్ధతిలో, "ఒక నిర్దిష్ట వయస్సు దాటిన ప్రతి శిశువుకూ ఉత్పత్తి దక్షతను దోహదం చేసేందుకై అవలంభించబడుతున్న బోధనా పద్ధతులలో, ఉత్పత్తిదాయకమైన శ్రమను విద్యతోనూ, వ్యాయామంతోనూ మేళవించే విద్యావిధానం కూడా

ఒక బోధనా పద్ధతిగానే కాకుండా, సంపూర్ణాభివృద్ధి చెందిన మానవులను సృష్టించే ఏకైక విధానంగా రూపొందేలా బోధనా పద్ధతులను కలిగిన భావి విద్యా విధానపు బీజాలు" కూడా ఇమిడే ఉంటాయి (అదే గ్రంథంలో అదే చోట). గత కాలంలో జరిగి పోయిన చరిత్రను వివరించి చెప్పడానికి ఉపయోగపడేందుకే కాకుండా, భవిష్యత్తును గూర్చి నిర్భయంగా నిర్ణయాలను చేయడానికీ, ఆ నిర్ణయాల లక్ష్య సాధనకు ధైర్యమైన కార్యాచరణను నిర్ణయించుకోవడానికి ఉపకరించేలా జాతీయత, రాజ్యాంగయంత్ర సమస్యలను రెంటినీ ఒక చారిత్రక ప్రాతిపదిక కలిగిన విషయాలుగా మార్క్సీయ సోషలిజం పరిగణిస్తుంది. సామాజికాభివృద్ధి యొక్క బూర్జువా శకంలో జాతులు ఒక అనివార్యమైన ఉద్భవం, ఒక అనివార్యమైన రూపం. "జాతిలోనే తానొక అంతర్భాగంగా ఏర్పడితేనే తప్ప," "జాతీయత" ("ఆ పదానికి బూర్జువా వర్గం ఇచ్చే అర్థంలో మాత్రం కాకుండానే") కలిగి ఉంటేనే తప్ప, బలీయమైన అభివృద్ధిని గానీ, ఒక నిర్దిష్ట రూపాన్ని గానీ కార్మికవర్గం పొందగల్గేది కాదు. కానీ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన కొలదీ, పెట్టుబడిదారీ విధానమే జాతీయ అడ్డంకులను అంతకంతకు మరింత తీవ్రంగా భగ్నం చేసి, జాతీయ ఏకాకితనాన్ని నాశనం చేసి, జాతీయ వైషమ్యాల స్థానే వర్గవైషమ్యాలను స్థాపిస్తుంది. అందుచేతనే బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో "కార్మికులకు మాతృదేశం లేదు" అనే విషయమూ, అన్ని దేశాల్లో కాకపోయినా, కనీసం నాగరిక దేశాల్లోనైనా ఉన్న కార్మికుల "ఐక్యకార్యాచరణ" శ్రామికవర్గం యొక్క విముక్తికి ముఖ్యమైన షరతుల్లో ఒకటి ("కమ్యూనిస్టు ప్రణాళిక") అనే విషయమూ అక్షరాలా నిజం అనడంలో ఎంత మాత్రమూ సందేహం లేదు. సమాజం పరస్పరం పరస్పర వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి ప్రత్యక్షంగా సమాజానికి అతీతంగా ఉన్న "అధికార శక్తి" లేనిదే సమాజం మనడానికే వీల్లేని పరిస్థితుల్లో, కట్టుదిట్టమైన పశుబలప్రయోగ రూపాన్ని ధరించిన రాజ్యాంగయంత్రమనే రాజ్యవ్యవస్థ, సమాజ అభివృద్ధి ఒక నిర్దిష్ట దశకు చేరుకోగానే ప్రాదుర్భవిస్తుంది. వర్గవైరుధ్యాల్లో నుండి పుట్టిన రాజ్యాంగయంత్రం, "వర్గాలన్నింటిలోనూ మిక్కిలి బలోపేతమై ఆర్థికంగా బలవత్తరమైన వర్గం యొక్క రాజ్యాంగయంత్రంగా తయారవుతుంది. తన చేతిలో చిక్కిన రాజ్యాంగయంత్ర సహాయంతో ఈ వర్గం రాజకీయంగా ప్రాబల్యం వహించి, తద్వారా అణగారిపోయి ఉన్న వర్గాలను మరింత అణగదొక్కి దోచుకోవడానికి నూతన సాధనాలను సంపాదిస్తుంది. ఈ విధంగా పూర్వకాలపు రాజ్యాంగయంత్రం బానిసలను అణగదొక్కి ఉంచడానికి బానిస యజమానులకు ఉపయోగపడిన రాజ్యాంగయంత్రంగా ఎలాగైతే ఏర్పడిందో, ఆ తర్వాతి కాలంలో ప్రభువర్గాల చేతుల్లో రైతు బానిసలనూ, బానిస సేవకులనూ అణచిపెట్టి ఉంచటానికి ఉపయోగపడినట్టి ఫ్యూడల్ రాజ్యాంగయంత్రంగా ఎలా ఏర్పడిందో, ఆ విధంగానే ఆధునిక ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వపు రాజ్యాంగయంత్రం కూలిశ్రమను దోచుకోవడానికి పెట్టుబడి చేతిలో ఒక సాధనంగా ఏర్పడింది." ("కుటుంబం, స్వంత ఆస్థి, రాజ్యాంగయంత్రాల పుట్టుపూర్వోత్తరాలు"

అనే రచనలో తన అభిప్రాయాలనూ, మార్క్స్ అభిప్రాయాలనూ ఏంగెల్స్ వివరిస్తూ రాశాడు) బూర్జువా రాజ్యాంగయంత్రాలన్నిటిలో అత్యంత స్వేచ్ఛాయుతమూ, అభ్యుదయకరమూ అయినట్టి ప్రజాస్వామ్య ప్రజా రిపబ్లిక్ కూడా ఏ విధంగానూ ఈ వాస్తవ విషయాన్ని తొలగించకుండా, దీని రూపాన్ని మాత్రమే మార్చింది (ప్రభుత్వానికీ, షేర్ మార్కెట్‌కీ ఉన్న సంబంధమూ, ఉద్యోగస్థులూ, వార్తాపత్రికా వ్యవస్థ మొదలైన శ్రేణులలో – ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ – ఉన్న దుర్నీతి దీనికి తార్కాణం). వర్గాలనే అంతమొందించడానికి దారితీయడం వల్ల, తత్ఫలితంగా రాజ్యాంగయంత్రమే అంతమొందేటట్లు చేస్తుంది సోషలిజం. ఏంగెల్స్ "డ్యూరింగ్ సిద్ధాంత ఖండన" అనే గ్రంథంలో ఇలా రాస్తాడు : "మొత్తం సమాజానికంతటికీ ప్రాతినిధ్యం వహించి రాజ్యాంగయంత్రం చేయబూనే మొదటి కార్యమే – సమాజం పేరిట ఉత్పత్తి సాధనాలను తన కైవసం చేసుకోవడమే – రాజ్యాంగయంత్రంగా తాను నిర్వహించే కడపటి స్వతంత్ర కార్యం కూడా. సామాజిక సంబంధాల్లో ఒక రంగం తర్వాత మరో రంగంలో రాజ్యాంగయంత్ర జోక్యం ఇక అనావశ్యకమైపోయి, ఈ జోక్యం కలుగజేసుకోవటం అనేది చివరకు దానంతటదే ఆగిపోతుంది. వ్యక్తుల పైన పరిపాలన పోయి, దాని స్థానే వ్యవహారాల నిర్వహణ, ఉత్పత్తి విధానాల నిర్వహణ చేస్తుంది. రాజ్యాంగయంత్రాన్ని 'తొలగించడం' అంటూ జరగదు; దానంతట అదే క్షీణించి పోతుంది.'' "స్వతంత్రులూ, సమానులూ అయినట్టి ఉత్పత్తిదారుల సంఘపు ప్రాతిపదిక పైన ఉత్పత్తిని ఆర్గనైజు చేస్తూ తదుపరి, సమాజం యావత్తూ రాజ్యాంగయంత్రాన్ని పురాతన వస్తు ప్రదర్శనశాలలో, రాట్నమూ, కంచుగొడ్డలి వీటి సరసనే దాని నిజస్థానంలో భద్రపరుస్తుంది." (ఏంగెల్స్ : "కుటుంబం, స్వంత ఆస్థి, రాజ్యాంగయంత్రాల పుట్టుపూర్వోత్తరాలు'')

చిట్టచివరకు ఒక విషయం చెప్పాల్సి ఉంది : ఆస్థిహక్కులు లాక్కొన్నవారి ఆస్థి హక్కులు లాక్కొనబడుతున్న కాలంలో కూడా తమ మనుగడను సాగించుకుంటున్న సన్నకారు రైతుల పట్ల మార్క్సీయ సోషలిజం అవలంభించే వైఖరిని వివరించాల్సిన సందర్భంలో, మార్క్స్ అభిప్రాయాలను వెల్లడించుతూ ఏంగెల్స్ చేసిన ప్రకటనను మనం ఉదహరించాల్సి ఉంది : "రాజ్యాంగయంత్ర శక్తిని మనం హస్తగతం చేసుకొన్న తర్వాత, బడా భూస్వాముల భూములను బలప్రయోగంతో లాక్కొన్నట్లుగా సన్నకారు రైతుల భూములను (పరిహారం చెల్లించా, చెల్లించకుండానా అనే ప్రశ్నతో నిమిత్తం లేకుండానే) బలాత్కారంగా లాక్కోవడమనే విషయాన్నే మనం తలపెట్టం. సన్నకారు రైతు విషయంలో మన కర్తవ్యం ఏమంటే : మొదట అతని స్వంత వ్యాపారాన్నీ, అతని స్వంత ఆస్థినీ బలాత్కారంగా కాకుండా ఉదాహరణపూర్వకంగా అతనికి నమ్మకం కలిగించి, ఇందుకు అతనికి సామాజిక సహాయాన్ని అందజేసి, వాటిని సహకార

సంస్థలుగా పరివర్తనకు దారితీయడం. ఇక అటు తర్వాత సన్నకారు రైతుకి అనేక లాభాలను ముందు ముందు చూపించడానికి కావల్సిన వనరులు మన చేతిలో ఉంటాయి; ఈ లాభాలు జరుగుతాయనేది అతనికి నేడే స్వయంగా కనపడుతుంది కూడా."[19] (ఏంగెల్స్ రాసిన "ఫ్రాన్స్, జర్మనీలలో రైతు సమస్య" అనే రచనలో 17వ పేజీ. అలెక్సేయేవా కూర్పు, మూలం "న్యూ జీత్"[20]లో ప్రచురితమైంది)

## వర్గపోరాటం లోని ఎత్తుగడలు

వెనుకటి కాలం నాటి భౌతికవాదంలో ఉండే ప్రధాన లోపాల్లో ఆచరణయోగ్యమైన విప్లవ క్రియాశీల శక్తికి అవసరమైన పరిస్థితులనుగానీ, దాని ప్రాముఖ్యతను గానీ గుర్తించలేక పోవడం ముఖ్యమైనదని 1844-1845 నాటికే మార్క్స్ పరిశీలించి తెలుసుకొని, తన సిద్ధాంత గ్రంథాల రచనతో పాటు, శ్రామికవర్గం సాగించే వర్గపోరాటంలో ఆ వర్గం అవలంభించాల్సిన ఎత్తుగడలను రూపొందించేందుకు తదేక దీక్షతో తన జీవితకాలాన్నంతటినీ వినియోగించాడు. ఈ ఎత్తుగడలకు సంబంధించిన అనేక విషయాలు మార్క్స్ రాసిన అన్ని గ్రంథాల్లోనూ, అందులోనూ ముఖ్యంగా 1913లో నాలుగు సంపుటాలుగా ప్రచురించబడిన ఏంగెల్స్‌తో ఆయన జరిపిన ఉత్తరప్రత్యుత్తరాల్లోనూ మనకు లభిస్తాయి. ఈ విషయాలన్నిటినీ సంగ్రహించి, సంకలనం చేసి, అధ్యయనం చేసి పరిశీలించాల్సిన పని ఇంకా ఎంతో మిగిలి ఉంది. ఈ కారణం వల్ల ఈ విషయాన్ని గురించి ఇప్పుడు క్లుప్తంగా సాధారణ సూత్రాలను మాత్రమే వివరించాల్సి ఉంటుంది. ఈ భాగాన్ని వివరించని భౌతికవాదం అసంపూర్తిగా, ఏకపక్షంగా, జీవంలేనిదిగా తయారవుతుందని మార్క్స్ న్యాయంగానే అభిప్రాయపడ్డాడని మనం గట్టిగా నొక్కి చెప్పాల్సి ఉంది. తన భౌతిక గతితార్కిక భావనా ప్రమేయాలన్నింటితోనూ తు.చ. తప్పకుండా అనుగుణ్యంగా ఉంటున్నట్టి శ్రామికవర్గపు ఎత్తుగడ సాధించాల్సిన మౌలిక కర్తవ్యాన్ని మార్క్స్ స్పష్టంగా నిర్వచించాడు. ఒక నిర్దిష్ట సమాజంలో ఉన్న అన్ని - ఒక్కటైనా తప్పకుండా అన్ని - వర్గాల యొక్క పరస్పర సంబంధాలన్నింటి మొత్తాన్నీ స్వతస్సిద్ధంగా పరిశీలించడం, దానిపై ఆధారపడి ఆ సమాజం యొక్క బాహ్యగతాత్మకమైన అభివృద్ధిక్రమ దశనూ, ఆ సమాజానికీ, తదితర సమాజాలకూ ఉన్న పరస్పరాశ్రయ సంబంధాలనూ పరిశీలించడం ఇదొక్కటే పురోగామివర్గం అవలంభించాల్సిన సరైన ఎత్తుగడలకు పునాదిగా ఏర్పడగలుగుతుంది. ఇదే సమయంలో, అన్ని వర్గాలూ, అన్ని దేశాలూ స్థిరపడిపోయినవే అని భావించకుండా, అవి చలనశీలమైనవనే దృక్పథాన్ని, అంటే చలనరహిత స్థితిలో ఉన్నట్టు కాకుండా చలన స్థితిలో ఉన్నట్టు (ఈ చలన నియమాలు ఆయా వర్గాల ఉనికి యొక్క ఆర్థిక పరిస్థితులను బట్టి నిర్ణయమవుతుంటాయి) మనం భావించాలి. ఇక చలనాన్ని కూడా గతకాలపు దృష్ట్యానే కాకుండా, భవిష్యత్ కాల

దృష్ట్యానూ పరిశీలిస్తూ, అదే సమయంలో బాగా మెల్లగా జరుగుతున్న మార్పులను మాత్రమే గమనించే "పరిణామవాదుల" అపభ్రంశపు భావనల ప్రకారం కాకుండా, ఏంగెల్స్ పేర మార్క్స్ రాసినట్టు, "ఇరవై సంవత్సరాల కాలంలో జరిగిన క్రమాభివృద్ధినంతటినీ ఒక్కరోజులోనే సంభవించిందా అనిపించేటంతటి ప్రమాణంతో, ఉత్తరోత్తరా ఇరవై సంవత్సరాలూ ఒక్క దినంలో సంక్షిప్తపరచబడే దినాలు సంభవించవచ్చు కూడా," అనే గతితార్కిక దృక్పథంతో చూడగలగాలి (ఉత్తరప్రత్యుత్తరాలు, 3వ సంపుటి, పేజీ 127). అభివృద్ధిలోని ప్రతిదశలోనూ, ప్రతి క్షణంలోనూ మానవ చరిత్రలో స్వతస్సిద్ధంగా అనివార్యమైన ఈ గతితర్కాన్ని శ్రామికవర్గపు ఎత్తుగడలు లెక్కలోకి తీసుకొంటూ, ఇటు రాజకీయంగా నిస్తబ్దతతో ఉన్న కాలాన్ని, "శాంతియుతంగా" అని సాధారణంగా చెప్పబడే నత్తనడకతో మందగతిన సాగుతున్న క్రమాభివృద్ధి కాలాన్ని పురోగామి వర్గం యొక్క వర్గచైతన్యాన్నీ, బలాన్నీ, సంఘర్షణ సామర్థ్యాన్నీ పెంపొందించుకోవడానికి వినియోగించుకుంటూ, అటు ఈ వినియుక్త కార్యాన్నంతటినీ ఈ వర్గం తలపెట్టిన ఉద్యమం యొక్క "అంతిమ లక్ష్యసాధన" దిశగా నడిపించడం కోసమూ, "ఇరవై సంవత్సరాలు ఒక్క దినంలోనే సంక్షిప్తపరచబడే" రోజులలో నిర్వర్తించాల్సిన బృహత్తర కార్యాలను ఆచరణలో సాధించగలిగే శక్తిని ఈ వర్గంలో సృష్టించడం కోసమూ వినియోగించుకుంటూండాలి. ఈ సందర్భంగా మార్క్స్ ప్రతిపాదించిన రెండు వాదనలు ప్రత్యేకంగా అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి : వీటిలో ఒక వాదన "తత్వశాస్త్ర దారిద్ర్యం" అనే గ్రంథంలో మార్క్స్ వివరించాడు: ఆ వాదన శ్రామికవర్గం యొక్క ఆర్థిక పోరాటానికీ, ఆర్థిక సంస్థలకూ చెందినది. రెండవ వాదన "కమ్యూనిస్టు ప్రణాళిక"లో వివరించి ఉంది. ఇది శ్రామికవర్గపు రాజకీయ కర్తవ్యాలకు సంబంధించినది. మొదటి వాదన ఈ విధంగా ఉంటుంది: "భారీ స్థాయిలో ఉత్పత్తి చేసే పరిశ్రమ ఒకరితో ఒకరికి పరిచయం లేనట్టి అనేక మంది ప్రజల సమూహాన్ని ఒక్కచోట సాంద్రీకరిస్తుంది. పోటీవల్ల వారి స్వప్రయోజనాల్లో భేదాలు ఏర్పడతాయి. కానీ వేతన స్థాయి పడిపోకుండా నిలబెట్టుకోవాల్సిన అవసరం వల్ల యజమాని పట్ల వారందరికీ సామాన్యంగా ఉండే ప్రతిఘటనా మానసికత వారిలో ఐక్యతను-కలయికను పురికొల్పుతుంది.... మొదట వేర్వేరుగానే ఉండి తర్వాత గ్రూపులుగా ఏర్పడిన ఈ కలయికలు ఇక నిరంతరం ఐక్యంగా నిలబడిన పెట్టుబడిని ఎదుర్కోవలసి వచ్చేటప్పటికల్లా, కూలిస్థాయిని నిలబెట్టుకోవడం కంటే ఈ ఐక్యతను నిలబెట్టుకోవడమే వారికి (కార్మికులకు) అంతకంతకూ మరింత అవసరమౌతుంది... ఈ పోరాటంలో – వాస్తవమైన అంతర్యుద్ధంలో – రానున్న యుద్ధానికి అవసరమయ్యే శక్తులన్నీ ఐక్యమై అభివృద్ధి చెందుతుంటాయి. పరిస్థితులు ఒకసారి ఈ స్థాయికి చేరే సరికి ఈ కలయిక రాజకీయ స్వభావం సంతరించుకుంటుంది." అనేక దశాబ్దాల వరకూ ఆర్థిక పోరాటం,

ట్రేడ్‌యూనియన్ ఉద్యమం అవలంబించాల్సిన, "రానున్న యుద్ధానికి" తన శక్తులనన్నిటినీ సమీకరించుకునేందుకు అత్యంత దీర్ఘకాల వ్యవధిలో శ్రామికవర్గం అవలంబించాల్సిన కార్యక్రమం, ఎత్తుగడలు అన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి. దీనితోపాటు, బ్రిటీష్ కార్మికోద్యమ అనుభవం నుండి మార్క్స్, ఏంగెల్స్‌లు అనేక ఉదాహరణలు – పారిశ్రామిక 'సౌభాగ్యం' కార్మికుల దృష్టిని పోరాటం నుండి మరలించడానికి, 'కార్మికులను కొనివేయడానికి' ఎలా దారితీస్తుందో ("ఉత్తరప్రత్యుత్తరాలు", సంపుటి 1, పేజీ 136), ఈ సౌభాగ్యం సాధారణంగా కార్మికులను ఎలా 'దుర్నీతిపాలు చేస్తూందో' (సంపుటి 2, పేజీ 218); ఏ విధంగా బ్రిటీష్ శ్రామిక వర్గం 'బూర్జువా'గా తయారైందో – 'అన్ని జాతుల కంటే బూర్జువా జాతైన ఈ జాతి చిట్టచివరకు బూర్జువా వర్గం సరసనే బూర్జువా ప్రభువర్గాన్నీ, బూర్జువా శ్రామికవర్గాన్నీ' ఉంచుకునే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టే కనబడుతూంది (సంపుటి 2, పేజీ 290); బ్రిటీష్ కార్మికోద్యమం యొక్క 'విప్లవశక్తి' ఎల్లాగైతే నీరుకారిపోతోందో (సంపుటి 3, పేజీ 124); 'స్పష్టంగా కనపడుతున్న ఈ బూర్జువా అంటుజాడ్యాన్ని వదిలించుకోవాలంటే' ఏ విధంగా ఇంగ్లీషు కార్మికులు బహుశా చాలాకాలమే వేచి ఉండాల్సి వస్తుందో (సంపుటి 3, పేజీ 127); ఏ విధంగా బ్రిటీష్ కార్మికోద్యమంలో 'చార్టిస్ట్ బలం' లోపించిందో (1866, సంపుటి 3, పేజీ 305); బ్రిటీష్ కార్మిక నాయకులు 'రాడికల్ బూర్జువా వర్గానికీ, కార్మికులకూ మధ్యస్థగా ఉండే రకం'గా ఏ విధంగా తయారవుతున్నారో (హొలియోక్ ఉదాహరణను పేర్కొంటూ రాసినది, సంపుటి 4, పేజీ 209); బ్రిటీష్ గుత్తాధిపత్యం వల్ల, ఈ గుత్తాధిపత్యం సాగినంత కాలం బ్రిటీష్ కార్మికుడు ఎలా 'ముందుకు కదలడో' (సంపుటి 4, పేజీ 433) – పేర్కొన్నారు. కార్మికోద్యమం యొక్క మొత్తం చలనం (ఫలితంతో సహా), ఆర్థిక పోరాటం యొక్క ఎత్తుగడలు ఆశ్చర్యాన్ని కలిగించే విశాలత్వంతో, సమగ్రమైన, గతితార్కికమైన, నిజమైన విప్లవాత్మకతతో కూడిన అద్భుతమైన దృక్పథం నుండి పరిశీలించబడ్డాయి.

రాజకీయ పోరాటంలో చేపట్టాల్సిన ఎత్తుగడలను గురించి మౌలికమైన మార్క్సిస్టు సూత్రాన్ని "కమ్యూనిస్టు ప్రణాళిక" ఈ విధంగా నిర్వచిస్తోంది : "కమ్యూనిస్టులు కార్మికవర్గం యొక్క తక్షణ కోర్కెల కోసమూ, కార్మికవర్గం యొక్క తాత్కాలిక ప్రయోజనాలు అమలులోకి తెచ్చేందుకూ పోరాడుతారు; కానీ ప్రస్తుత ఉద్యమంలో భవిష్యత్ ఉద్యమాన్నీ పరిరక్షింప బూనుకుంటారు." ఈ కారణం చేతనే "1846లో ఏ పార్టీ అయితే క్రాకోవ్‌లో తిరుగుబాటు[21]ను లేవదీసిందో ఆ పార్టీ"నే పోలెండ్‌లోని ఆ "వ్యవసాయ విప్లవ" పార్టీనే 1848లో మార్క్స్ బలపరిచాడు. జర్మనీలో కూడా 1848–1849ల లోనూ మార్క్స్ తీవ్ర అతివాద విప్లవ ప్రజాస్వామ్యాన్ని బలపరిచి, ఎత్తుగడలను గురించి తాను ఆనాడు చెప్పిన మాటలను తదుపరి ఎన్నడూ కూడా ఆయన

ఉపసంహరించుకోలేదు. జర్మన్ బూర్జువా వర్గం “మొదటి నుండీ కూడా ప్రజలకు ద్రోహం చేసే ధోరణిని” కలిగి ఉందనీ (రైతాంగంతో మిత్రత్వాన్ని నెరపుకొని ఉండినట్టయితే మాత్రం బూర్జువా వర్గం తన కర్తవ్యాలను సంపూర్ణంగా నెరవేర్చగలిగి ఉండేది), “పురాతన సమాజం యొక్క కిరీటధారులైన ప్రతినిధులతో రాజీపడి తీరుతుందనీ” మార్క్స్ అభిప్రాయపడ్డాడు. బూర్జువా ప్రజాస్వామిక విప్లవ యుగంలో జర్మన్ బూర్జువా వర్గపు స్థానాన్ని మార్క్స్ విశ్లేషించి వివరించాడు – ఆ విశ్లేషణ ఏమంటే, చలన స్థితిలో ఉన్న సమాజాన్ని పరిశీలించడం, అదైనా కేవలం ప్రతీప చలన దిశా కోణం నుండే పరిశీలించి, దృక్స్థానాన్ని తీసుకొని పరిశీలించనట్టి భౌతికవాద పద్ధతికి దృష్టాంతమైన విశ్లేషణ అని సందర్భవశాత్తూ మనమిక్కడ చెప్పాల్సి ఉంది – ఆ విశ్లేషణ సారాంశాన్ని ఈ విధంగా వివరించాడు : “తనపై తనకే విశ్వాసం లేకుండా, ప్రజల మీద విశ్వాసం లేకుండా పై స్థానాల్లో ఉన్న వారి మీద అసంతృప్తితో మూలుగుతూ, దిగువన ఉన్న వాళ్లను చూసి వణికిపోతూ .... ప్రపంచ ఝంఝామారుతానికి హడలిపోతూ ... ఏ సందర్భంలోనూ శక్తిలేక, అన్ని సందర్భాల్లోనూ అభిప్రాయచౌర్యం చేస్తూ ..... చొరవ అనేది లేకుండా ... నడివయస్సులో ఉన్న ప్రజల నూతన యవ్వనోత్సాహపు ఆవేశాలకు విధివశాత్తూ నాయకత్వం వహించాల్సి వచ్చి, వాటిని తన ముసలితనపు ప్రయోజనాల కోసం మళ్లింపజూస్తున్న పాపాల పుట్ట అయిన ముసలితుక్క...” (‘నోయెరైనిషె సైటుంగ్’, 1848; ‘సారస్వత వారసత్వం’, 3వ సంపుటి, పేజీ 212).[22] ఇరవై ఏళ్ల తర్వాత ఏంగెల్స్ పేర రాసిన ఉత్తరంలో (‘ఉత్తర ప్రత్యుత్తరాలు’, 3వ సంపుటి, పేజీ 224), స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ముమ్మందు పోరాడాల్సిన అవసరం కంటే ఇప్పుడు బానిసతనంతో కూడిన శాంతే మంచిదని బూర్జువా వర్గం నిశ్చయించుకోవడమే 1848 విప్లవ ఓటమికి కారణమని మార్క్స్ రాశాడు. 1848–1849 నాటి విప్లవ తరుణం అంతమొందిన తర్వాత, మాటిమాటికి విప్లవం, విప్లవం అంటూ ఆటలాడుకొనే ధోరణిని మార్క్స్ ప్రతిసారీ వ్యతిరేకిస్తూ (షాప్పెర్, విల్లిఖ్ వీరిద్దరికీ వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం), నూతన దశలో పైకి “శాంతియుతంగా” కనబడుతూనే, నూతన విప్లవాల కోసం సన్నద్ధం కాగలిగే సామర్థ్యాన్ని అలవరచుకోవాలని అతడు ఖండితంగా చెబుతూ వచ్చాడు. ఎట్టి భావంతోనైతే ఈ కార్యకలాపాలను సాగించాలని మార్క్స్ అభిప్రాయపడ్డాడో, 1856లో అభివృద్ధి నిరోధక శక్తులు జర్మనీలో రాజ్యమేలుతున్న అంధకారయుగంలో ఉన్న పరిస్థితుల గురించి అతడు వేసిన అంచనాయే తెలుపుతోంది : “జర్మనీలో ఉన్న విషయమంతా శ్రామిక విప్లవాన్ని రైతు యుద్ధం యొక్క 2వ పునశ్చరణ వంటి దేదైనా ఒకదానితో బలపర్చగలిగే అవకాశం పైనే ఆధారపడి ఉంటుంది” (సంపుటి 2, పేజీ 108). జర్మనీలో ప్రజాతంత్ర (బూర్జువా) విప్లవం పూర్తికానంతవరకూ, రైతాంగపు ప్రజాతంత్ర శక్తిని అభివృద్ధి చేయడానికై చేపట్టాల్సిన ఎత్తుగడల

వైపే సోషలిస్టు శ్రామికవర్గపు దృష్టి ఉండేలా మార్క్స్ కేంద్రీకరించాడు. లాసాల్, ముఖ్యంగా జర్మన్ యుంకర్ల[23] యొక్క ప్రష్యన్ జాతీయత యొక్క చర్యలపై పట్టీపట్టనట్లు ఉంటూ, పరోక్షంగా మద్దతు ఇస్తుండడం వల్ల, లాసాల్ వైఖరి "బాహ్యగతాత్మకంగా పరిశీలించి చూస్తే ... కార్మికోద్యమాన్ని ప్రష్యాకి అప్పగించివేసే ద్రోహం చేయడమే" అని మార్క్స్ సందర్భానుసారంగా అభిప్రాయపడ్డాడు (సంపుటి 3, పేజీ 210). 1865లో మార్క్స్, ఏంగెల్స్‌లు కలిసి పత్రికలలో ఒక సంయుక్త ప్రకటన చేద్దామనే ఉద్దేశ్యంతో ఇరువురూ తమ అభిప్రాయాలను ఉత్తరాల ద్వారా తెలుపుకుంటున్న సందర్భంలో ఏంగెల్స్ ఇలా రాశాడు: "... వ్యవసాయమే ప్రధాన వృత్తిగా గల దేశంలో .... ఫ్యూడల్ వర్గపు మహా ప్రభువులు 'కొరడా దెబ్బల'తో గ్రామీణ శ్రామికవర్గంపై చేస్తున్న పితృస్వామిక 'దోపిడీ'ని గురించి పల్లెత్తు మాటైనా అనకుండానే, పరిశ్రమలలో శ్రమిస్తున్న కార్మికవర్గం పేరుతో బూర్జువా వర్గంపై దాడి చేయడం కేవలం దుర్మార్గం తప్ప మరేమీ కాదు" (సంపుటి 3, పేజీ 217). 1864 నుండి 1870 వరకూ, జర్మనీలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని సమాప్తి గావించే కాలావధి వరకూ, ప్రష్యా, ఆస్ట్రియా దేశాల దోపిడీ వర్గాలు ఈ విప్లవాన్ని ఏదో ఒక విధంగా పైనుంచే నడిపించి పూర్తి చేయడానికి ప్రయత్నించిన శకపు చరమదశలో, బిస్మార్క్‌తో నాటకీయ మంతనాలు జరుపుతున్న లాసాల్‌ని ఖండించడమే కాకుండా, "ఆస్ట్రియన్ అభిమానం" కనబరుస్తూ, ప్రత్యేకతావాదం వైపు మొగ్గుతున్న లీబ్‌క్నెక్ట్‌ను మందలించి సరిదిద్దడమే కాకుండా, బిస్మార్క్‌నూ, ఆస్ట్రియన్ అభిమానులనూ ఒకే విధమైన నిర్దాక్షిణ్యంతో ఎదుర్కొనే విప్లవాత్మక ఎత్తుగడలను, "విజేత" అయిన ప్రష్యన్ యుంకర్‌కు సమ్మతం కానప్పటికీ, అతనికి వ్యతిరేకంగా కూడా ప్రష్యన్ సైనిక విజయాల వల్ల సృష్టించబడిన పునాదులను ప్రాతిపదికగా తీసుకొని విప్లవ పోరాటాన్ని తిరిగి ప్రారంభించగలిగే ఎత్తుగడలను చేపట్టాలని మార్క్స్ గట్టిగా కోరాడు (ఉత్తరప్రత్యుత్తరాలు, 3వ సంపుటి, పేజీలు – 134, 136, 147, 179, 204, 210, 215, 418, 437, 440–441). 1870 సెప్టెంబర్ 9వ తేదీన మార్క్స్ చేసిన ప్రఖ్యాత ఇంటర్నేషనల్ విజ్ఞప్తిలో, సమయం ఆసన్నం కాకముందే తిరుగుబాటు ప్రారంభించకూడదని ఫ్రెంచి శ్రామికవర్గాన్ని హెచ్చరించాడు. కానీ ఆ తిరుగుబాటు వాస్తవంగా (1871) ప్రారంభం కాగానే "స్వర్గాన్నే ముట్టడిస్తున్నారు" అని (కూగెల్‌మన్ పేర మార్క్స్ రాసిన ఉత్తరం)[24] వారి యొక్క విప్లవాత్మక చొరవను అత్యంత ఉత్సాహంతో ఆహ్వానించాడు. ఇదివరకు ఆక్రమించుకున్న స్థానాన్ని వదులుకోవడం కంటే, యుద్ధం చేయకుండానే ఆయుధాల్ని వదిలేయడం కంటే, అనేక ఇతర పరిస్థితులలో వలెనే ఈ పరిస్థితిలో కూడా సంభవించిన విప్లవచర్య యొక్క ఓటమి మార్క్సిస్టు గతితార్కిక భౌతికవాద దృష్ట్యా చూస్తే, శ్రామికవర్గ పోరాటపు సాధారణ గతిలోనూ, ఫలితంలోనూ తక్కువ నష్టదాయకమైనది. యుద్ధం చేయకుండానే ఆయుధాల్ని

వదిలేసి ఉంటే శ్రామికవర్గంలో నిరాశానిస్పృహలను సృష్టించి, వారి పోరాట సామర్థ్యాన్ని నాశనం చేసి ఉండేది. రాజకీయంగా స్తబ్దత అలుముకొని, బూర్జువా న్యాయమే ప్రబలి ఉన్న కాలంలో, చట్టసమ్మతమైన పద్ధతులతోనే పోరాటాన్ని సాగించాల్సి ఉంటుందనే విషయాన్ని పూర్తిగా గుర్తెరిగినందువల్లనే, సోషలిస్టు వ్యతిరేక చట్టం[25] అమలులోకి వచ్చిన తర్వాత మోస్ట్ యొక్క "విప్లవకర పదజాలాన్ని" 1877లోనూ, 1878లోనూ మార్క్స్ నిశితంగా ఖండించాడు; అంతేకాకుండా, అధికార సోషల్ డెమోక్రటిక్ పార్టీలో తాత్కాలికంగా అధికారాన్ని చెలాయించి సోషలిస్టు వ్యతిరేక చట్టాన్ని ప్రతిఘటించడానికి గాను చట్టవిరుద్ధమైన పద్ధతుల్లో పోరాటాన్ని లేవదీయడానికి తక్షణమే దృఢచిత్తాన్నీ, పట్టుదలనూ, విప్లవాత్మక ఉద్రేకాన్నీ ప్రదర్శించని అవకాశవాదాన్ని ఆయన దృఢంగానూ, మరింత నిశితంగానూ ఖండించాడు. ("ఉత్తరప్రత్యుత్తరాలు", సంపుటి 4, పేజీలు 397, 404, 418, 422, 424; సోర్గె పేర మార్క్స్ రాసిన ఉత్తరాలు కూడా గమనార్హం)

**జులై-నవంబర్, 1914**

***

## వివరణలు

1. "గ్రనాత్" విజ్ఞాన సర్వస్వ నిఘంటువు కోసమని 1914లో లెనిన్ రాసిన వ్యాసానికి చివర మార్క్సిస్టు రచనలు, మార్క్సిజం గురించిన గ్రంథాలపై సమీక్షను లెనిన్ అనుబంధంగా చేర్చాడు. ప్రస్తుత కూర్పులో ఈ సమీక్ష వదిలివేయబడింది. పేజీ 8.

2. మార్క్స్ రచించిన "మొసెల్ విలేఖరి సమాధానం" అనే వ్యాసానికి వరిస్తుంది. పేజీ 8.

3. మార్క్స్ రచించిన "హెగెలియన్ న్యాయశాస్త్రంపై విమర్శనా వ్యాసం" కు ముందుమాట. పేజీ 9.

4. "కమ్యూనిస్టు లీగ్" – ఇది విప్లవ కార్మికవర్గ మొదటి అంతర్జాతీయ ఆర్గనైజేషన్. ఇది 1847 వేసవిలో లండన్‌లో ఏర్పడింది. దానికి ఆర్గనైజర్లు, నాయకులు మార్క్స్, ఏంగెల్స్‌లే. లీగ్ ఆదేశానుసారం మార్క్స్, ఏంగెల్స్‌లు "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"ను రచించారు. బూర్జువా వర్గాన్ని కూలదోయడం, వర్గవైషమ్యంపై ఆధారపడిన పాత బూర్జువా సమాజాన్ని నాశనం చేయడం, వర్గాలూ, ప్రైవేటు ఆస్తీ లేనట్టి నూతన సమాజాన్ని స్థాపించడం అనే లక్ష్యాన్ని లీగ్ అనుసరించింది. శ్రామికవర్గ విప్లవకారులకు పాఠశాలగానూ, శ్రామికవర్గ పార్టీకి బీజాంకురంగానూ, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ (మొదటి ఇంటర్నేషనల్)కు పూర్వవర్తిగానూ ముఖ్యమైన చారిత్రాత్మక పాత్రను నిర్వర్తించింది. 1852 నవంబర్ వరకు కమ్యూనిస్టు లీగ్ తన మనుగడ సాగించింది. ఏంగెల్స్ రచించిన "కమ్యూనిస్టు లీగ్ చరిత్ర

గురించి" అనే వ్యాసంలో లీగ్ చరిత్ర వివరించబడింది. పేజీ 9.

5. 1848 ఫిబ్రవరి ఫ్రెంచి విప్లవానికి ఇది వర్తిస్తుంది. పేజీ 10.

6. జర్మనీ, ఆస్ట్రియాలలో 1848 మార్చిలో మొదలైన బూర్జువా విప్లవానికి ఇది వర్తిస్తుంది. పేజీ 10.

7. 1848 విప్లవం స్థాపించిన రాజ్యాంగ వ్యవస్థను శాసన నిర్మాణ సభ అధ్యక్షుడు, అధిక సంఖ్యాకులు ఉల్లంఘించడం వలన, ఈ ఉల్లంఘనకు నిరసనగా పెటీబూర్జువా వర్గపు పార్టీ ("పర్వతం") పారిస్‌లో నిర్వహించిన ప్రజాప్రదర్శనకు ఇది వర్తిస్తుంది. ఈ ప్రదర్శనను ప్రభుత్వం చెదరగొట్టింది. పేజీ 10.

8. " 'ఆల్గెమైనే సైటుంగ్'పై నేను తెచ్చిన అభియోగం" అనే శీర్షికతో కె.ఫోగ్ట్ రాసినట్టి దూషణపూరిత కరపత్రానికి ప్రతిగా "శ్రీఫోగ్ట్" అనే పేరుతో మార్క్స్ రాసిన కరపత్రాన్ని గూర్చి లెనిన్ ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. పేజీ 10.

9. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ యొక్క ప్రారంభ "విజ్ఞప్తి"కి ఇది వర్తిస్తుంది. పేజీ 11.

10. ఏంగెల్స్ తన "డ్యూరింగ్ సిద్ధాంత ఖండన" రచన యొక్క 11వ ప్రకరణకు రాసిన ముందుమాట నుండి తీసుకున్నది. పేజీ 16.

11. ఏంగెల్స్ రాసిన "లుడ్విగ్ ఫ్యూర్‌బాఖ్ మరియు సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్ర ముగింపు" నుండి తీసుకున్నది. పేజీ 16.

12. ఏంగెల్స్ రాసిన "డ్యూరింగ్ సిద్ధాంత ఖండన" రచన యొక్క వివరణల నుండి తీసుకున్నది. పేజీ 17.

13. ఏంగెల్స్ రాసిన "లుడ్విగ్ ఫ్యూర్‌బాఖ్ మరియు సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్ర ముగింపు" నుండి తీసుకున్నది. పేజీ 18.

14. రాజరిక పునరుద్ధరణ కాలం - ఫ్రాన్స్ దేశపు చరిత్రలో ఫ్రెంచి బూర్జువా విప్లవంచే 1792లో కూలదోయబడిన బోర్బన్ వంశం తిరిగి అధికారం చెలాయించిన 1814-1830ల కాలం. పేజీ 22.

15. ఇది మార్క్స్ యొక్క "పెట్టుబడి" గ్రంథం, 1వ సంపుటిలోని "సరుకులు" అనే భాగం నుండి తీసుకున్నది. పేజీ 24.

16. ఇది మార్క్స్ రాసిన "అర్థశాస్త్ర విమర్శనా వ్యాసాలు" నుండి తీసుకున్నది. పేజీ 25.

17. ఇది మార్క్స్ రాసిన "పెట్టుబడి" గ్రంథంలోని 4వ భాగమైన "డబ్బు పెట్టుబడిగా మారడం" నుండి తీసుకున్నది. పేజీ 26.

18. "సీమాంత ఉపయోగపు విలువ" అనే సిద్ధాంతం గత శతాబ్ది చివరలో మార్క్సిస్టు శ్రమవిలువ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఆస్ట్రియన్ పంథా అని పిలువబడుతున్న అర్థశాస్త్రజ్ఞులచే చెప్పబడింది. అపభ్రంశపు అర్థశాస్త్రం యొక్క రకాలలో ఇదొకటి. అయితే ఇది అపభ్రంశపు అర్థశాస్త్రం యొక్క ఇతర రకాల వలే సరుకు యొక్క విలువను కేవలం దాని ఉపయోగాన్ని బట్టే నిర్ధారించకుండా, మానవుని కనీస ముఖ్యావసరాన్ని తృప్తి పరిచే సరుకుల విధి యొక్క ఏకాంకానికి ఉన్న అంతిమ ఉపయోగాన్ని బట్టే నిర్ణయిస్తుంది. ఆస్ట్రియన్ పంథా యొక్క అన్ని ఇతర ఆర్థిక, తాత్విక వాదాల ముఖ్య లక్షణం లాగానే, సీమాంత ఉపయోగ సిద్ధాంతపు ముఖ్య లక్షణం కూడా పెట్టుబడిదారీ విధానపు దోపిడీ స్వభావాన్ని కప్పిపుచ్చటమే. పేజీ 31.

19. ఏంగెల్స్ రచించిన "ఫ్రాన్స్, జర్మనీలలో రైతు సమస్య" నుండి. పేజీ 41.

20. "డీ న్యూ జీత్" (నూతన కాలం) – ఇది జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ సిద్ధాంత వారపత్రిక. ఇది 1883 నుండి 1923 వరకు స్టుట్‌గార్ట్ నుండి వెలువడింది. అక్టోబర్ 1917 వరకు కాట్‌స్కీ, అతని తర్వాత క్యూనోవ్ పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. మార్క్స్, ఏంగెల్స్‌ల రచనలలో కొన్ని ఈ పత్రికలో తొలిసారిగా ప్రచురితమయ్యాయి. ఈ పత్రికా సంపాదకులకు ఏంగెల్స్ సలహాలిచ్చి సహాయపడడమే గాకుండా, మార్క్సిజం నుండి వారు పెడతోవలను అనుసరించినందుకుగాను వారిని అతడు తరచుగా విమర్శిస్తుండేవాడు కూడా. ఏంగెల్స్ మరణానంతరం, 1890 దశాబ్ది ఉత్తరార్థంలో ఈ పత్రిక రివిజనిస్టు వ్యాసాలను వ్యవస్థాబద్ధంగా ప్రచురించడం ప్రారంభించింది. ఈ వ్యాసాలలో "సోషలిజం సమస్యలు" అనే శీర్షికతో బెర్న్‌స్టయిన్ రచించిన వ్యాసపరంపర కూడా ఉంది. ఈ వ్యాస పరంపర మార్క్సిజానికి వ్యతిరేకంగా క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఈ పత్రిక మధ్యస్థ స్థానం తీసుకొని సోషల్ జాతీయ దురహంకారులనే వాస్తవంగా బలపరిచింది. పేజీ 41.

21. 1815 నుండి ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాల ఉమ్మడి కంట్రోలు కింద ఉండిన క్రాకోవ్ రిపబ్లిక్ లోని జాతీయ విముక్తి ఉద్యమానికి ఇది వర్తిస్తుంది. తిరుగుబాటుదార్లు జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించారు. ఫ్యూడల్ సేవలను రద్దు చేస్తూ, పరిహారపు చెల్లింపు లేకుండానే రైతులకు భూమిని బదిలీ చేసే వాగ్దానం చేస్తూ జాతీయ ప్రభుత్వం ప్రణాళికను ప్రకటించింది. ప్రభుత్వం జారీచేసిన ఇతర ప్రణాళికలు జాతీయ కర్మాగారాల స్థాపననూ, వాటిలో పనిచేసే కార్మికులకు

వేతనాల హెచ్చింపునూ, సమాన పౌరహక్కులు ప్రవేశపెట్టడమూ కూడా ప్రకటించాయి. అయినప్పటికీ ఈ తిరుగుబాటు శీఘ్రంగానే అణచివేయబడింది. పేజీ 44.

22. ఈ ఉల్లేఖన మార్క్స్ రచించిన "బూర్జువా వర్గమూ, విప్లవ ప్రతీఘాతమూ" లోనిది. పేజీ 45.

23. యుంకర్ – ప్రష్యన్ భూస్వామ్య కులీన వర్గ సభ్యుడు. పేజీ 45.

24. 1871, ఏప్రిల్ 12న మార్క్స్ ఎల్. కుగెల్‌మన్ పేర రాసిన ఉత్తరం నుండి. పేజీ 46.

25. సోషలిస్టు వ్యతిరేక చట్టం – కార్మికవర్గ సోషలిస్టు ఉద్యమాన్ని అణచివేసే ఉద్దేశ్యంతో 1878లో బిస్మార్క్ ప్రభుత్వంచే ప్రవేశపెట్టబడింది. సోషల్ డెమోక్రటిక్ పార్టీ యొక్క అన్ని ఆర్గనైజేషన్లను, కార్మికుల ఆర్గనైజేషన్లను, కార్మికుల పత్రికలనూ అది నిషేధించింది. సోషలిస్టు సాహిత్యం జప్తు చేయబడింది. సోషల్ డెమోక్రాట్లు హింసించబడి దేశం నుండి వెళ్లగొట్టబడ్డారు. ఆ తర్వాత 1890లో కార్మికోద్యమం పెద్దయెత్తున పెరగడంతో దాని ఒత్తిడి మూలంగా ఈ చట్టం రద్దు చేయబడింది. పేజీ 46.

26. ఏంగెల్స్ వ్యాసానికి కిరీటంగా ఉన్న గీతిక రష్యన్ కవి నెక్రాసోన్ రచించిన "దోబ్రోల్యూబోవ్ స్మృతి" అనే పద్యం నుండి తీసుకోబడింది. పేజీ 48.

27. ఏంగెల్స్ తన "జర్మనీలో రైతు యుద్ధం "అనే రచనకు రాసిన ముందుమాటకు వివరణ. పేజీ 51.

28. ఏంగెల్స్ రాసిన "జాతీయ ఆర్థిక వ్యవస్థ విమర్శకు రేఖాచిత్రం" అనే రచనకు ఇది వర్తిస్తుంది. పేజీ 53.

***

**"కమ్యూనిస్టులు కార్మికవర్గపు తక్షణ లక్ష్యాల సాధనకోసమూ, అప్పటి ప్రయోజనాలకోసమూ పోరాడుతారు. అయితే వాళ్ళు వర్తమాన ఉద్యమంలో ఆ ఉద్యమపు భవిష్యత్తుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆభవిష్యత్తు పట్ల శ్రద్ధ వహిస్తారు."**

(కమ్యూనిస్టు ప్రణాళిక)

# లండన్ హైగేట్ శ్మశానవాటికలో కార్ల్ మార్క్స్ సమాధి వద్ద ఫ్రెడరిక్ ఎంగెల్స్ ఉపన్యాసం - 17 మార్చ్, 1883

మార్చ్ 14వ తేదీన మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు ఈ ప్రపంచంలో ఉన్న అతి గొప్ప ఆలోచనాపరుడు ఇక ఆలోచించడం మానివేశాడు. ఆయనను విడిచిపెట్టి రెండు నిమిషాలు అయ్యిందో లేదో తిరిగి వచ్చి చూస్తే తన మడత కుర్చీలో, ప్రశాంతంగా, ఇక లేవలేని నిద్రలోకి జారిపోయి ఉన్నాడు.

ఈ మానవుడి మరణంతో ఐరోపా, అమెరికాలలో మిలిటెంటు కార్మికవర్గానికి, చారిత్రక విజ్ఞానశాస్త్రానికీ చెప్పలేనంత నష్టం జరిగింది. అంత మహత్తరమైన స్పిరిట్ నిష్క్రమణతో ఏర్పడిన శూన్యం అర్థం కావడానికి ఎంతో కాలం పట్టదు.

జీవ ప్రకృతి అభివృద్ధి నియమాన్ని డార్విన్ కనిపెట్టినట్టుగా మార్క్స్ మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు: ఈ నియమం, భావజాలం అతిగా పెరగడంతో ఇంతకాలం మరుగున పడిపోయిన ఒక సరళమైన సత్యం - మానవాళికి మొట్టమొదటగా కూడు, గూడు, గుడ్డ ఉండాలి, అప్పుడే రాజకీయాలను, విజ్ఞానాన్ని, కలను, మతాన్ని మొదలయిన వాటిని ముందుకు తీసుకువెళ్లగలుగుతుంది; అందువల్ల తక్షణ పాదార్థిక సాధనాల ఉత్పత్తి, తత్ఫలితంగా నిర్దిష్ట ప్రజానీకం కాని నిర్దిష్ట యుగంలో కాని సాధించిన ఆర్థిక అభివృద్ధి స్థాయి, సంబంధిత ప్రజల రాజ్యాంగ సంస్థలు, చట్టబద్ధ సూత్రీకరణలు, కళ, అలాగే మతానికి సంబంధించిన భావాలు రూపొందడానికి పునాదిని ఏర్పరుస్తాయి, అందువల్ల ఇంతకాలం జరిగిన దానికి విరుద్ధంగా, వాటి వెలుగులోనే వీటిని వివరించాలి.

అంత మాత్రమే కాదు. ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని, ఈ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ నిర్దేశిస్తున్న ప్రత్యేక చలన సూత్రాన్ని కూడా మార్క్స్ కనుగొన్నాడు. బూర్జువా ఆర్థికవేత్తలు, సోషలిస్టు విమర్శకులూ చేసిన గత సమస్త పరిశోధనలూ చీకట్లో వెతుకులాడుతూండగా వాటిని పరిష్కరించే ప్రయత్నంగా అదనపు విలువ ఆవిష్కరణ హఠాత్తుగా ఈ సమస్య పై వెలుగును ప్రసరింపజేసింది.

ఒక జీవితకాలానికి అటువంటి రెండు ఆవిష్కరణలు చాలు. అటువంటి ఒక ఆవిష్కరణ చేసినందుకు పేరు పొందిన మనిషి సంతోషంగా ఉంటాడు. కానీ మార్క్స్ పరిశోధించిన ప్రతి ఒక్క రంగంలోను - ఆయన అనేక రంగాలను పరిశోధించాడు, ఏదీ పైపైన చేయలేదు - గణితంతో సహా ఈ ప్రతి రంగంలోను ఆయన స్వతంత్ర ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞానశాస్త్ర ఖని ఆయన. అయితే ఇది ఆ మానవుడిలో సగం కూడా కాదు. మార్క్స్ దృష్టిలో విజ్ఞానశాస్త్రం చారిత్రకంగా ఒక గతిశీల, విప్లవాత్మక శక్తి. ఆచరణలో ఇంకా రుజువు కానప్పటికీ ఒక సైద్ధాంతిక విజ్ఞానశాస్త్ర నూతన ఆవిష్కరణ జరగగానే దానిని ఎంత గొప్ప ఆనందంతో స్వాగతించాడో, ఆ ఆవిష్కరణ పరిశ్రమలోను, మొత్తంగా చారిత్రక అభివృద్ధిలోనూ తక్షణ విప్లవాత్మక మార్పులను తీసుకుచ్చినప్పుడు అంతగానూ మరో రకమైన ఆనందాన్ని అనుభవించాడు. ఉదాహరణకు, విద్యుత్తు రంగంలోను, ఇటీవల మార్సెల్ డిప్రెజ్ చేసిన ఆవిష్కరణల అభివృద్ధిని ఆయన సన్నిహితంగా పరిశీలించాడు.

ఎందుకంటే అన్నిటికీ మించి మార్క్స్ ఒక విప్లవవాది. ఏదో ఒక పద్ధతిలో పెట్టుబడిదారీ సమాజాన్ని, అది ఉనికిలోకి తీసుకువచ్చిన దాని రాజ్యాంగ సంస్థలను కూల్చివేయడానికి దోహదపడడం, ఏ ఆధునిక కార్మికవర్గం ఆయన ద్వారా మొట్టమొదటిసారిగా తన స్థానాన్ని, అవసరాలను గురించిన చైతన్యం, తన విముక్తికి కావలసిన పరిస్థితుల గురించిన చైతన్యం పొందిందో, ఆ కార్మికవర్గ విముక్తికి దోహదం చేయడం ఆయన జీవిత లక్ష్యం. పోరాటం ఆయన మూల స్వభావం. ఆయనలా ఒక ఆవేశంతో, దృఢంగా, విజయం పొందుతూ పోరాటం చేసిన వాళ్లు బహు కొద్ది మంది ఉంటారు. మొదటి రీనిష్ జీటంగ్ (1842), పారిస్ *వోర్‌వార్ట్స్* (1844), *డ్యుషె బ్రసెలర్ జీటంగ్* (1847), *న్యు రీనిష్ జీటంగ్* (1848–49), *న్యూయార్క్ ట్రిబ్యూన్* (1852–61)లలో ఆయన పని చేశాడు, ఇవే కాకుండా అనేక మిలిటెంటు కరపత్రాలు రాశాడు, పారిస్, బ్రసెల్స్, లండన్‌లలో సంస్థలలో పని చేశాడు. వీటన్నింటికీ తలమానికంగా, మహత్తర **ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్** (అంతర్జాతీయ కార్మికుల సంస్థ)ను స్థాపించాడు. మరొక పనేదీ చేయకపోయి ఉండినప్పటికీ ఆయన గర్వించడానికి ఇది చాలు.

తత్ఫలితంగా ఆ కాలంలో మార్క్స్ అత్యంత ద్వేషించబడ్డ, అత్యంత దూషించబడ్డ వ్యక్తి. అబ్‌సొల్యుట్, రిపబ్లికన్ పార్టీలు రెండూ తమ భూభాగాల నుంచి ఆయనను తరిమివేశాయి. బూర్జువా మితవాదులు, ప్రజాస్వామిక విప్లవకారులూ ఆయన మీద అపవాదులు వేయడానికి ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. దీనంతటినీ ఆయన సాలెగూటిని ఊడ్చినట్టుగా ఊడ్చి పక్కన పెట్టాడు. వాటిని పట్టించుకోలేదు. అత్యంత అవసరం అయినప్పుడు మాత్రమే జవాబు ఇచ్చాడు. సైబీరియా గనుల నుంచి కాలిఫోర్నియా వరకు, ఐరోపా, అమెరికాలలో అన్ని ప్రాంతాలలోనూ – లక్షలాది విప్లవ సహచర కార్మికులకు ఆయన ప్రియమైనవాడు, గౌరవనీయుడు. ఆయన మరణానికి వారంతా దుఃఖించారు – ఆయనకు ఎందరో ప్రత్యర్థులు ఉండవచ్చు కానీ వ్యక్తిగత శత్రువు ఒక్కరు కూడా లేరని నేను ధైర్యంగా చెప్పగలను.

ఆయన పేరు, ఆయన చేసిన కృషి యుగాల తరబడి నిలిచి ఉంటుంది. ✦

# ఫ్రెడరిక్ ఏంగెల్స్ జీవిత చరిత్ర

- లెనిన్

*ఎంతటి వివేచనా జ్యోతి అస్తమించెనోహో,*
*ఎంతటి హృదయము పరిస్పందన విరమించెనోహో!*



1895 ఆగస్టు 5వ తేదీన (నూతన కేలండర్) ఫ్రెడరిక్ ఏంగెల్స్ లండన్‌లో చనిపోయాడు. ప్రఖ్యాతి పొందిన మహాపండితులలోనూ, నాగరిక ప్రపంచమంతటా ఉన్న యావత్తు ఆధునిక శ్రామికవర్గానికి గురువర్యులైన వారిలోనూ, తన మిత్రుని కారల్ మార్క్స్ (1883లో చనిపోయాడు) తరువాత ఏంగెల్సే ద్వితీయ స్థానాన్ని అలంకరిస్తున్నాడు. విధికృతంగా కారల్ మార్క్సు, ఫ్రెడరిక్ ఏంగెల్సు ఒకరితో ఒకరికి పరిచయం కలిగిన నాటి నుండి, ఈ మిత్రులొండొరుల జీవిత కార్యం సమిష్టి కర్తవ్యంగా పరిణమించింది. ఈ కారణం వల్ల ఫ్రెడరిక్ ఏంగెల్స్ శ్రామికవర్గానికి చేసిన సేవను తెలుసుకోవాలంటే, సమకాలిక కార్మికోద్యమాభివృద్ధికి గాను మార్క్స్ గావించిన కృషి యొక్క, ఉపదేశాల యొక్క ప్రాముఖ్యతను గూర్చి స్పష్టంగా తెలుసుకోవాల్సి ఉంటుంది. బూర్జువా వర్గంతో కలిసి శ్రామికవర్గాన్ని సృష్టించి, నిర్మాణయుతం గావించుతున్నట్టి నేటి ఆర్థిక విధానం యొక్క తప్పనిసరైన ఫలితమే కార్మికవర్గమూ, దాని కోర్కెలూ అని మార్క్స్, ఏంగెల్స్‌లే ప్రప్రథమంగా నిరూపించారు. కేవలం ఉదాత్త మనస్కులైన ఎవరో కొందరు వ్యక్తులు సదుద్దేశ్యంతో సలిపిన ప్రయత్న ఫలితం కాకుండా, సంఘటితపడిన శ్రామికవర్గం సాగించే వర్గపోరాటమే ఇప్పుడు మానవాళిని దోపిడీ చేస్తున్న దుర్మార్గం నుండి విముక్తి చేయగలుగుతుందని వారు నిరూపించారు. తాము రచించిన శాస్త్రీయ గ్రంథాల్లో, సోషలిజం అనేది స్వాప్నికుల ఆవిష్కరణ కాదనీ, ఆధునిక సమాజంలో ఉన్న ఉత్పాదక శక్తుల క్రమాభివృద్ధి యొక్క అంతిమ ఆశయమూ, అనివార్యమైన ఫలితమనీ మొట్టమొదటిసారిగా మార్క్స్, ఏంగెల్స్‌లే వివరించి చెప్పారు. లిఖితపూర్వకమైన మానవ చరిత్ర అంతా కూడా వర్గపోరాటం యొక్క, నిర్దిష్ట కొన్ని సామాజిక

వర్గాలపై విజయాన్ని సాధించి, వారిపై సాగించిన పరిపాలనా పరంపర యొక్క చరిత్రే తప్ప మరొకటి కాదు. వర్గపోరాటానికీ, వర్గపాలనకూ పునాదులైనట్టి వ్యక్తిగత ఆస్తీ, అరాచక సామాజిక ఉత్పత్తీ అదృశ్యం కానంత వరకూ ఇది ఇలా సాగుతూనే ఉంటుంది. శ్రామికవర్గ ప్రయోజనాలు క్షేమంగా ఉండాలంటే ఈ పునాదులు నిర్మూలించబడాల్సిందే; కాబట్టి వీటి నిర్మూలనకై సంఘటితపడిన కార్మికుల చైతన్యవంతమైన వర్గపోరాటం కొనసాగి తీరాలి. అంతే కాదు, ప్రతి వర్గపోరాటమూ రాజకీయ పోరాటమే.

తమ విముక్తికై పోరాడుతున్న శ్రామికులందరూ మార్క్స్, ఏంగెల్స్‌ల అభిప్రాయాలను నేడు అవలంభించి ఆచరణలో పెడుతున్నారు. కాని 1840లలో ఈ మిత్రులిద్దరూ ఆనాటి సోషలిస్టు సాహిత్య సృష్టిలోనూ, సామాజికోద్యమాలలోనూ పాల్గొన్న కాలంలో అట్టి అభిప్రాయాలు కేవలం నూతనంగా ఉండేవి. ఆ రోజుల్లో తెలివితేటలు గలవారు, తెలివి తక్కువ వారూ, నిజాయితీపరులూ, దగాకోరులూ అనేకులు రాజకీయ స్వేచ్ఛా పోరాటంలోనూ, ఏకఛత్రాధిపతుల, పోలీసుల, మతగురువుల నిరంకుశత్వాన్ని ప్రతిఘటించే పోరాటంలో నిమగ్నులైనప్పటికీ, వారెవ్వరూ కూడా బూర్జువా వర్గ ప్రయోజనాలకూ, శ్రామికవర్గ ప్రయోజనాలకూ ఉన్న వైషమ్యాన్ని గ్రహించలేక పోయారు. ఒక స్వతంత్రమైన సామాజిక శక్తిగా కార్మికులు వ్యవహరించగలుగుతారనే తలంపును ఈ వ్యక్తులు ఏ మాత్రం సహించలేక పోయేవారు. ఆ కాలంలో అమలులో ఉన్న సామాజిక వ్యవస్థ యొక్క అధర్మాన్ని గురించి రాజులకూ, పాలకవర్గాల వారికీ నచ్చచెప్పి వారిని ఒప్పించగలిగితే ఇక ఆపైన ప్రపంచంలో శాంతినీ, సర్వమానవ శ్రేయస్సునూ సులువుగా స్థాపించవచ్చని కలలుగన్న స్వాప్నికులు, మహామేధావులు కూడా అనేకులు ఉండేవారు. వీరందరే కాక, ఆ కాలపు సోషలిస్టులూ, కార్మికవర్గపు శ్రేయోభిలాషులూ ఇంచుమించు అందరూ కూడా శ్రామికవర్గాన్ని ఒక పుండులాగా చూస్తూ, పారిశ్రామికాభివృద్ధితో పాటు ఈ పుండు కూడా పెరుగుతుండడం చూసి భయంతో హడలెత్తి పోయేవారు. ఈ కారణం చేత, పారిశ్రామికాభివృద్ధినీ, శ్రామికవర్గాభివృద్ధినీ ఏ విధంగా నిలిపివేయడమా అని వీరందరూ యోచించ సాగారు. శ్రామికవర్గం యొక్క దినదినాభివృద్ధిని చూసి, అందరితోపాటు తాము కూడా భయపడడానికి మారుగా శ్రామికవర్గం యొక్క నిరంతరాభివృద్ధి పైనే మార్క్స్, ఏంగెల్స్‌లు తమ ఆశలన్నింటినీ పెట్టుకున్నారు. శ్రామికుల సంఖ్య ఎంత పెరిగితే విప్లవవర్గంగా వారి శక్తి అంత అభివృద్ధి పొందుతుందనీ, సోషలిజం అవతరణ అంత దగ్గర పడుతుందనీ, అందుకు అంత సదవకాశం ఏర్పడుతుందనీ వారు విశ్వసించారు. కార్మికవర్గానికి మార్క్స్, ఏంగెల్స్‌లు చేసిన సేవను నాలుగు మాటల్లో చెప్పాలంటే ఈ విధంగా చెప్పవచ్చు : **కార్మికవర్గం తన్ను తాను తెలుసుకొని, తన శక్తిని చైతన్యవంతంగా తెలుసుకోవడం ఎలాగో వారు బోధించారు; కలల స్థానే విజ్ఞానశాస్త్రాన్ని నెలకొల్పారు.**

ఈ కారణం వల్లనే ప్రతి కార్మికునికీ ఏంగెల్స్ పేరు, అతని జీవిత చరిత్ర తెలిసి ఉండడం ఎంతైనా అవసరం. రష్యన్ కార్మికులలో వర్గచైతన్యాన్ని కలిగించడమే మన ప్రచురణల లక్ష్యం కాబట్టి, ఈ వ్యాస సంపుటిలో ఆధునిక శ్రామికవర్గపు ఇద్దరు మహోపాధ్యాయులలో ఒకడైన ఫ్రెడరిక్ ఏంగెల్స్ జీవిత చరిత్రనూ, ఆయన చేసిన కృషినీ తెలియజేయడం మన విద్యుక్త ధర్మం.

ఏంగెల్స్ 1820లో ప్రష్యా రాజ్యానికి చెందిన రైన్ రాష్ట్రంలోని బార్మెన్ నగరంలో జన్మించాడు. అతని తండ్రి ఒక కార్ఖానా స్వంతదారుడు. కుటుంబ పరిస్థితి మూలంగా హైస్కూలు చదువు పూర్తి చేయకుండానే ఏంగెల్స్ 1838లో బ్రేమెన్ పట్టణంలో ఒక వర్తక కంపెనీలో గుమాస్తాగా చేరవలసి వచ్చింది. వర్తక వ్యాపారానికి చెందిన కార్యకలాపాలలో అతడు నిమగ్నుడై ఉండినప్పటికీ విజ్ఞానశాస్త్ర, రాజకీయ అధ్యయనానికి ఏ విధంగానూ వాటిని అడ్డుపడనిచ్చేవాడు కాదు. హైస్కూలులో చదువుతుండే రోజుల్లోనే ప్రభుత్వ నిరంకుశ పరిపాలన పట్లా, అధికారుల ప్రజాపీడన పట్లా అతనికి ద్వేషం ఏర్పడింది. తత్వశాస్త్ర అధ్యయనం అతనిని మరింత ముందుకు తీసుకొని పోయింది. ఆ రోజుల్లో జర్మన్ తత్వశాస్త్రంలో హెగెల్ ఉపదేశాలకే అత్యంత ప్రాబల్యం ఉండేది. అందువల్ల ఏంగెల్స్ కూడా హెగెల్ అనుచరులలో చేరాడు. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఉద్యోగం చేస్తూ ప్రష్యన్ కొలువులో ఉన్న హెగెల్ నిరంకుశ పాలనను సాగిస్తున్న ప్రష్యన్ రాజ్యాన్ని చూసి తన వరకు తాను మెచ్చుకొన్నప్పటికీ, హెగెల్ బోధనలు మాత్రం విప్లవకరమైనవే. మానవ హేతువాదనా సామర్థ్యం పైనా, దాని హక్కుల పైనా హెగెల్‌కి ఉన్న పరిపూర్ణ విశ్వాసమూ, నిరంతరం జరిగే మార్పుకూ, క్రమాభివృద్ధికీ ప్రపంచం లోనవుతూ ఉంటుందనే అతని తత్వశాస్త్రానికంతటికీ మూలసిద్ధాంతమైన సూత్రమూ, ఈ రెండు విషయాలూ, ఆ బెర్లిన్ ప్రొఫెసర్ యొక్క అప్పటి పరిస్థితులతో రాజీపడలేని శిష్యవర్గంలో కొందరికి, ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడడం, నాడు ప్రబలి ఉన్న అన్యాయానికీ, చలామణీ అవుతున్న దుర్మార్గానికి వ్యతిరేకంగా పోరాడడం అనేవి శాశ్వతాభివృద్ధి అనే విశ్వవ్యాప్త నియమంలో ఒక భాగమనేది వారికి అర్థమవడం మొదలైంది. విశ్వంలో ఉన్న అన్ని వస్తువులకు క్రమాభివృద్ధి ఉన్నప్పుడు, పాత సంస్థలు మార్పుచెంది, వాటి స్థానే నూతన సంస్థలు ఏర్పడే స్థితిలో ప్రష్యా రాజు, రష్యన్ జారుల నిరంకుశ పాలనే ఎల్లకాలమూ ఎందుకు శాశ్వతంగా ఉండాలి? అత్యధిక సంఖ్యలో ఉన్నవారి పొట్టలు కొట్టి అత్యల్ప సంఖ్యలో ఉన్న ఏ కొద్దిమంది వ్యక్తులో భోగభాగ్యాలను అనుభవించడం కలకాలమూ ఎందుకు శాశ్వతంగా సాగాలి? హెగెల్ తత్వశాస్త్రం మనస్సు యొక్క, భావాల యొక్క క్రమాభివృద్ధిని గురించి చెప్పింది; అది భావవాద పంథాలో ఉంది. మనస్సు క్రమాభివృద్ధిని పొందుతుందనే సూత్రం నుండి, ప్రకృతి, మానవుడు, మానవ, సామాజిక సంబంధాలు, వీటన్నిటి క్రమాభివృద్ధిని హెగెల్ తత్వశాస్త్రం తార్కిక పద్ధతిలో వివరించింది. హెగెల్ శాశ్వత క్రమాభివృద్ధి

అభిప్రాయాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అంగీకరించి, అతడు అకారణంగా ఊహించుకున్న భావవాద అభిప్రాయాలను మాత్రం వారు తిరస్కరించారు; మానవ జీవిత విషయాల వైపు వారు తమ దృష్టిని సారించినప్పుడు, ప్రకృతి క్రమాభివృద్ధిని వివరించేది మనస్సు యొక్క క్రమాభివృద్ధి కాదనీ, తద్భిన్నంగా మనస్సు యొక్క వివరణ ప్రకృతి నుండే, పదార్థం నుండే గ్రహించాల్సి ఉంటుందని వారికి స్పష్టంగా అర్థమైంది. మార్క్స్, ఏంగెల్స్‌లు హెగెల్ లేదా ఇతర హెగెల్‌వాదుల వంటి వారు కాదు. మార్క్స్, ఏంగెల్స్‌లు భౌతికవాదులు. ప్రపంచాన్నీ, మానవాళినీ భౌతికవాద దృష్టితో పరిశీలించి చూడగా, ప్రకృతిలో ఉన్న ఘటనలన్నింటికీ భౌతిక కారణాలే ఏ విధంగా మూలాధారాలుగా ఏర్పడి ఉన్నాయో, సరిగా ఆ విధంగానే మానవ సామాజిక క్రమాభివృద్ధి కూడా భౌతిక ఉత్పాదక శక్తుల క్రమాభివృద్ధికి పరిమితమై నిర్దేశించబడుతున్నది. మానవ అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేసుకునేందుకు మానవులు ఒకరితో మరొకరు ఏర్పరచుకొనే పరస్పర సంబంధాలు, ఉత్పాదకశక్తుల క్రమాభివృద్ధి పైనే ఆధారపడి ఉంటాయి. ఈ సంబంధాలలోనే అన్ని సామాజిక జీవిత ఘటనలూ, అన్ని మానవ ఆశయాలూ, అభిప్రాయాలూ, అలవాట్లూ వీటన్నిటి వివరణ కూడా ఇమిడి ఉంది. ఉత్పత్తి శక్తుల క్రమాభివృద్ధే స్వంత ఆస్థి ప్రాతిపదిక పైన ఏర్పడిన సామాజిక సంబంధాలను సృష్టిస్తుంది; కాని కేవలం ఈ ఉత్పాదక శక్తుల క్రమాభివృద్ధే, అధిక సంఖ్యాకవర్గీయుల నుండి వారి ఆస్తిని గుంజుకొని, దానిని అత్యల్ప సంఖ్యాక వర్గీయులైన బహుకొద్దిమంది చేతుల్లో సాంద్రీకృతం చేస్తున్నది. కాని ఈ ఉత్పాదక శక్తుల క్రమాభివృద్ధే ఆధునిక సామాజిక వ్యవస్థకు మూలమైన వ్యక్తిగత ఆస్తిని నాశనం చేసి, సోషలిస్టులందరూ తమ ఆశయసిద్ధికి ఏ గమ్యాన్నయితే ఏర్పరచుకున్నారో, పూర్తిగా ఆ గమ్యపు దిశగానే ఇది కూడా పాటుపడుతుంది. **సామాజిక శక్తులలో ఏ శక్తి అయితే ఆధునిక సమాజంలో దానికున్న స్థానాన్ని బట్టి సోషలిజం అవతరణ పట్ల అభిలాషను కనబరుస్తున్నదో, ఆ శక్తిని గుర్తించి, ఆ శక్తి దాని ప్రయోజనాలను, దాని చారిత్రక కర్తవ్యాన్నీ గుర్తించేలా దానికి చైతన్యాన్ని కలుగజేయడంలోనే ఉంది సోషలిస్టుల కర్తవ్యం అంతా. ఈ శక్తే శ్రామికవర్గం.**

తన తండ్రి భాగస్వామిగా ఉన్న ఒక వ్యాపార సంస్థలో 1842లో ఏంగెల్స్ ఉద్యోగిగా ప్రవేశించి, బ్రిటీష్ పారిశ్రామిక కేంద్రమైన మాంచెస్టర్‌లో ఉన్నప్పుడు, ఇంగ్లండులోని ఈ శక్తి (శ్రామికవర్గం)తో పరిచయం చేసుకున్నాడు. మాంచెస్టర్‌లో ఏంగెల్స్ తాను పనిచేస్తున్న ఫ్యాక్టరీ ఆఫీసులోనే కూర్చొని ఉండిపోకుండా, కోళ్ల గూళ్లలా ఉన్న ఇళ్లల్లో నివశిస్తున్న కార్మికులున్న మురికిపేటల్లో తిరుగుతూ, వారి పరిస్థితులనూ, వారి దారిద్ర్యాన్నీ, వారి దౌర్భాగ్యపు జీవితాన్నీ కళ్లారా చూశాడు. తన స్వంత పరిశీలనలతోనే తృప్తి పడక, బ్రిటీష్ కార్మికుల దురవస్థను గురించి తాను స్వయంగా చూసిన దానినంతా పుస్తకాల్లో చదివి, తనకు దొరికిన ప్రభుత్వ

ప్రచురణలనన్నింటినీ ఏంగెల్స్ అధ్యయనం చేశాడు. ఈ అధ్యయన, పరిశీలనల ఫలితమే 1845లో "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు" అనే రచన. ఈ గ్రంథాన్ని రచించడం మూలంగా అతడు చేసిన గొప్ప సేవ గురించి ముందే పేర్కొన్నాం. ఏంగెల్స్‌కు ముందే అనేకులు శ్రామికవర్గం అనుభవిస్తున్న కష్టాలను వర్ణించి, కార్మికవర్గానికి సహాయం చేయాల్సిన అవసరాన్ని గూర్చి రాశారు. అయితే శ్రామికవర్గం బాధలను అనుభవిస్తున్న వర్గమవడంతో పాటు, అవమానకరమైన ఈ ఆర్థిక దుస్థితే శ్రామికవర్గాన్ని నిరాఘాటంగా ముందుకు తీసుకొనిపోతూ, ఇక విధిలేక అది తన అంతిమ విముక్తికై యుద్ధం చేసేలా వాస్తవంగా నిర్బంధం చేయబడి తీరుతుందని అందరి కంటే ముందు ఏంగెల్సే చెప్పాడు. అంతేకాదు, యుద్ధం చేయడానికి భయపడని ఈ శ్రామికవర్గం తన స్వయం సహాయం పైనే ఆధారపడుతుంది. కార్మికవర్గం యొక్క రాజకీయోద్యమం ఫలితంగా సోషలిజం ఒక్కటే తమకు పరిష్కారాన్ని చేకూర్చగలదని కార్మికులు తప్పనిసరిగా గ్రహించి తీరుతారు. ఇక రెండో వైపున, ఎప్పుడైతే సోషలిజమే కార్మికవర్గ రాజకీయ పోరాటం యొక్క లక్ష్యం అవుతుందో, అప్పుడే సోషలిజం ఒక శక్తిగా రూపొందగలుగుతుంది. ఇంగ్లండులోని కార్మికవర్గపు స్థితిని గురించిన తన రచనలో వెల్లడించిన అభిప్రాయాల్లో ఇవి ముఖ్యమైనవి. వివేచనా శక్తిని కలిగినట్టీ, పోరాటాన్ని సాగించుతున్నట్టీ శ్రామికులంతా నేడు ఈ అభిప్రాయాలను స్వీకరించారు. కాని ఆ రోజుల్లో అవి కొత్తగా ఉండేవి. ఈ భావాలన్నీ మనస్సులో నాటుకొని పోయే శైలిలో రచించబడి, ఇంగ్లండులోని శ్రామికవర్గ దుస్థితిని ప్రామాణికంగానూ, హృదయవిదారకంగానూ వర్ణించబడి ఈ గ్రంథంలో విపులంగా వివరించబడ్డాయి. పెట్టుబడిదారీ విధానంపైనా, బూర్జువా వర్గం పైనా ఒక ఘోరమైన నేరారోపణపత్రమే ఈ గ్రంథం. ఈ గ్రంథం గొప్ప సంచలనాన్ని కలిగించింది. ఆధునిక శ్రామికవర్గ స్థితిగతులను యథార్థంగా చిత్రించిన గ్రంథం ఇదొక్కటేనంటూ ప్రతిచోటా అందరూ ఉదాహరిస్తుండేవారు. వాస్తవానికి 1845కు ముందుగానీ, తర్వాతగానీ కార్మికవర్గపు దౌర్భాగ్యస్థితిని ఇంత అద్భుతంగానూ, యథార్థంగానూ ప్రదర్శించిన రచన మరేదీ నాటికీ, నేటికీ వెలువడలేదు.

ఏంగెల్స్ సోషలిస్టు కావడం అతడు ఇంగ్లండుకు వచ్చిన తర్వాతనే. మాంచెస్టర్‌లో ఆ రోజుల్లో బ్రిటీష్ కార్మికోద్యమంలో చురుకుగా పనిచేస్తున్న వ్యక్తులతో అతను సంబంధాలు పెట్టుకొని, ఇంగ్లీషు సోషలిస్టు పత్రికలకు వ్యాసాలు రాయడం మొదలుపెట్టాడు. 1844లో అతను జర్మనీకి తిరిగి ప్రయాణం చేస్తున్నప్పుడు అతనికి మార్క్స్‌తో పరిచయం ఏర్పడింది; అంతకు ముందే అతను మార్క్స్‌తో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతుండేవాడు. మార్క్స్ పారిస్‌లో ఉన్నప్పుడు, ఫ్రెంచి సోషలిస్టులూ, ఫ్రెంచి జీవితమూ – వీటి ప్రభావ ఫలితంగా అతడు సోషలిస్టు అయ్యాడు. పారిస్‌లోనే మిత్రులిద్దరూ కలిసి సమిష్టిగా "పవిత్ర కుటుంబం, లేక విమర్శనాత్మక విమర్శనకు విమర్శ" అనే గ్రంథాన్ని రచించారు. "ఇంగ్లండులో కార్మికవర్గం యొక్క స్థితి"

వెలువడడానికి ఒక ఏడాది ముందే వెలువడినట్టీ, అత్యధిక భాగం మార్క్స్ రచించినట్టీ ఈ పుస్తకంలో, పైన మనం దేని ప్రధాన అభిప్రాయాలనైతే వ్యాఖ్యానించామో ఆ విప్లవాత్మక సోషలిజం యొక్క పునాదులు వివరించబడ్డాయి. "పవిత్ర కుటుంబం" అన్నది తత్వశాస్త్రజ్ఞులైన బౌవర్ సోదరులనూ, వారి అనుచరులనూ ఎద్దేవ చేసేందుకు వారికి మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టిన మారుపేరు. యావత్తు వాస్తవికతకూ, రాజకీయాలకూ, పార్టీలకూ అతీతమైనట్టీ, ఎట్టి క్రియాశీల కార్యాచరణనైనా నిరాకరించే, చుట్టూ ఉన్న ప్రపంచాన్నీ, ప్రపంచంలో జరుగుతున్న ఉదంతాలను కేవలం "విమర్శనాత్మకంగా" నిర్వికల్పంగా ధ్యానిస్తూ ఉండాలనే తత్వాన్ని ఈ పెద్ద మనుషులు బోధించారు. ఈ పెద్ద మనుష్యులు, బౌవర్ సోదరులు శ్రామికవర్గాన్ని అహంకారంతో చూస్తూ, దానిని విమర్శనా జ్ఞానంలేని ముక్కడిమూక కింద జమకట్టారు. అసందర్భమైనట్టీ, హానికరమైనట్టి ఈ పోకడను మార్క్స్, ఏంగెల్స్‌లు అతి తీవ్రంగా ఎదిరించారు. వాస్తవమైన ఒక మానవ వ్యక్తి తరపున – పరిపాలనాధికారాన్ని చెలాయిస్తున్న వర్గాల యొక్క, రాజ్యాంగయంత్రం యొక్క పాదాల కింద పడి నలిగిపోతున్న కార్మికుని తరపున – నిలబడి, నిర్వికల్ప ధ్యానం కాదు చేయాల్సింది; చేయాల్సిందల్లా ఉత్తమ సామాజిక వ్యవస్థ స్థాపనకై పోరాటమే మార్గమని ఎలుగెత్తి చాటారు మార్క్స్, ఏంగెల్స్‌లు. ఈ పోరాటాన్ని సాగించటానికి స్తోమత కలిగిన శక్తీ, ఈ పోరాటంపై శ్రద్ధాసక్తులను కలిగినదీ శ్రామికవర్గమే అని వారు సహజంగానే గుర్తించారు. "పవిత్ర కుటుంబం" వెలువడక ముందే, మార్క్స్, రూగేల సంపాదకత్వం కింద ప్రచురించబడిన "జర్మన్ ఫ్రెంచి ఇతిహాస వార్షిక సంచికలు" అనే పత్రికలో, "అర్థశాస్త్ర విమర్శనా వ్యాసాలు"[28] అనే శీర్షికతో ఏంగెల్స్ కొన్ని వ్యాసాలు రాశాడు. ఈ వ్యాసాల్లో, సోషలిస్టు దృక్పథంతో సమకాలిక ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్షంగా కనిపిస్తున్న ప్రధానమైన ఘటనలను పరిశీలించి, ప్రైవేటు ఆస్థి చెలాయించుతున్న రాజ్యాధికారం యొక్క అనివార్య ఫలితాలే ఇవి అని అతడు పర్యవసానం తేల్చాడు. ఏ శాస్త్రంలోనైతే మార్క్స్ రచించిన గ్రంథాలు వాస్తవమైన ఒక విప్లవాన్నే తీసుకొచ్చాయో, అట్టి అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయాలని మార్క్స్ కృతనిశ్చయుడవడానికి ఏంగెల్స్ సాహచర్యమే ఒక ప్రబల కారణమని మనం నిస్సందేహంగా చెప్పవచ్చు.

1845 నుండి 1847 వరకు ఏంగెల్స్ బ్రస్సెల్స్‌లోనూ, పారిస్‌లోనూ నివసిస్తూ, తన విజ్ఞానశాస్త్ర అధ్యయనాన్ని బ్రస్సెల్స్‌లోనూ, పారిస్‌లోనూ ఉన్న జర్మన్ కార్మికుల మధ్య ఆచరణాత్మక కార్యకలాపంతో మిళితం చేస్తూ జీవించాడు. ఈ పట్టణాల్లో ఉన్నప్పుడే రహస్యంగా పనిచేస్తున్న జర్మన్ "కమ్యూనిస్టు లీగ్"తో మార్క్స్, ఏంగెల్స్‌లు సంబంధాలు ఏర్పరచుకొన్నారు. మార్క్స్, ఏంగెల్స్‌లు అప్పటికే రూపొందించినట్టి సోషలిజం ముఖ్యసూత్రాలకు ఒక వ్యాఖ్యానం రాయాలని వారిని ఈ సమితి కోరింది. మార్క్స్, ఏంగెల్స్‌లచే రచించబడి 1848లో ప్రచురించబడిన ప్రఖ్యాత "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" ఈ విధంగా అవతరించింది. ఈ చిన్న పుస్తకం ఎన్నో

గ్రంథాలకు సరిసమానమైనది. దీని భావమే మొత్తం నాగరిక ప్రపంచమంతటా సంఘటితమవుతున్న శ్రామికవర్గాన్ని ఈనాటికీ కూడా ఉత్తేజపరుస్తూ నడుపుతోంది.

ఫ్రాన్స్‌లో మొదట ఆరంభమై తరువాత పశ్చిమ యూరప్ దేశాలకు వ్యాపించిన 1848 విప్లవం ఫలితంగా మార్క్స్, ఏంగెల్స్‌లు తమ స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు. స్వదేశానికి వెళ్లిపోయిన తర్వాత, ప్రష్యా రాజ్యపు రైన్ రాష్ట్రంలో ఉన్న కలోన్ పట్టణంలో ప్రచురితమవుతున్న ప్రజాస్వామ్య పత్రిక అయిన "నోయె రైనిషె సైటుంగ్"ను నడపడానికి పూనుకున్నాడు. ఆనాడు ప్రష్యా దేశపు రైన్ రాష్ట్రంలో విజృంభించినట్టి విప్లవాత్మక ప్రజాస్వామిక ఆశయాలన్నింటికీ ఈ మిత్రులిద్దరూ ఆయువు పట్టుగానూ, గుండెకాయ గానూ ఉంటూ పనిచేశారు. ప్రజా ప్రయోజనాలనూ, ప్రజాస్వేచ్ఛను అభివృద్ధి నిరోధక శక్తుల బారి నుండి అడుగడుగునా చిట్టచివరి వరకూ వీరు రక్షిస్తూ వచ్చారు. ఆ పోరాటంలో అభివృద్ధి నిరోధక శక్తులదే పైచేయి అవడం మనకు తెలిసిన విషయమే. "నోయె రైనిషె సైటుంగ్"ను ప్రభుత్వం నిషేధించింది. వెనుక ప్రవాసంలో ఉన్న కాలంలో మార్క్స్ తన పౌరసత్వాన్ని కోల్పోయి ఉండడం చేత, అతనిని ఇప్పుడు దేశాన్నుండి వెళ్లగొట్టేశారు. ఏంగెల్స్ ప్రజాతిరుగుబాటులో పాల్గొని, మూడు యుద్ధాల్లో పోరాడి, తిరుగుబాటు ఓడిపోయిన తర్వాత స్విట్జర్లెండుకు తప్పించుకొని, అక్కడి నుండి లండన్ చేరుకున్నాడు.

అప్పటికే మార్క్స్ లండన్‌లో నివాసం ఏర్పరచుకొని అక్కడ స్థిరపడిపోయాడు. ఏంగెల్స్ మాంచెస్టర్ వెళ్లి, వెనుక తాను 1840లలో పనిచేసిన వర్తకపు కంపెనీ లోనే మళ్లీ గుమస్తాగా ప్రవేశించి, ఆ కంపెనీలోనే తర్వాత భాగస్థుడయ్యాడు. మార్క్స్ లండన్‌లోనూ, 1870 వరకు ఏంగెల్స్ మాంచెస్టర్‌లోనూ నివసించినప్పటికీ, అత్యంత ఉల్లాసకరమూ, మేధోసంపన్నమూ అయిన వారిద్దరి ఉత్తర ప్రత్యుత్తరాల సాంగత్యానికి ఇదేమీ ప్రతిబంధకం కాలేదు. వారిద్దరూ ఒకరి పేర ఒకరు ఇంచుమించు ప్రతిరోజూ ఉత్తరాలు రాసుకుంటూ ఉండేవారు. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలలో వారిద్దరూ విజ్ఞానాన్నీ, పరస్పరం ఒకరి అభిప్రాయాలను మరొకరు తెలుసుకుంటూ శాస్త్రీయ సోషలిజాన్ని స్థాపించే కృషిలో ఒకరికొకరు సహాయపడుతూ తమ పనిని సాగిస్తూ వచ్చారు. 1870లో ఏంగెల్స్ తన నివాసాన్ని లండన్‌కు మార్చుకున్నాడు. అత్యంత శ్రమోత్సాహాలతో కూడిన వారిద్దరి ఉమ్మడి వైజ్ఞానిక జీవితం 1883లో మార్క్స్ చనిపోయే వరకూ నిరాఘాటంగా సాగింది. మార్క్స్ వంతు, మన యుగంలో అర్థశాస్త్రంపై అద్వితీయమై మహోత్కృష్టమైన "పెట్టుబడి" అనే గ్రంథమూ, ఏంగెల్స్ వంతు చిన్న పుస్తకాలు మొదలుకొని పెద్ద గ్రంథాల వరకూ అనేక రచనల రూపంలోనూ ఈ సమిష్టి శ్రమ ఫలించింది. పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక వ్యవస్థ యొక్క క్లిష్ట సంఘటనల విశ్లేషణ, పరిశీలనపై మార్క్స్ కృషి చేశాడు. ఏంగెల్స్

తరచూ వాదోపవాదపూరితములైన గ్రంథాలనూ, సర్వసాధారణ శాస్త్రీయ సమస్యల పైననూ, భౌతిక చారిత్రక భావనా దృక్పథం నుండి, మార్క్సియన్ ఆర్థిక సిద్ధాంత దృక్పథం నుండి, గత, వర్తమాన కాలాల వివిధ ఘటనలను పరిశీలించి సులభశైలిలో గ్రంథాలను రచించాడు. ఏంగెల్స్ రచనలలో ఈ కింది వాటిని మనం పేర్కొనాలి: డ్యూరింగ్‌ని ఖండిస్తూ రాసిన వాదోపవాద పూరితమైన గ్రంథం (తత్వశాస్త్ర, ప్రకృతిశాస్త్ర, సాంఘిక శాస్త్రాలలో అత్యంత ప్రధానమైన అనేక సమస్యలు ఈ గ్రంథంలో పరిశీలించబడ్డాయి)*, "కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్యాంగాల పుట్టుక" (రష్యన్ భాషలో అనువదించబడి సెంట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రచురించబడింది, 3వ కూర్పు, 1895), "లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్"[31] (జి. ప్లెహానోవ్‌చే వివరణ సహితమైన రష్యన్ అనువాదం, జెనీవా, 1892), రష్యన్ ప్రభుత్వం యొక్క విదేశాంగ విధానంపై ఒక వ్యాసం (జెనీవాలో "సోత్సియాల్ డెమోక్రాట్" పత్రిక 1,2 సంచికలలో రష్యన్ అనువాదం ప్రచురించబడింది),[32] గృహవసతి సమస్యపై అద్భుతమైన వ్యాస పరంపర;[33] ఇక ఆఖరున పేర్కొనవలసింది: రష్యా ఆర్థికాభివృద్ధి గురించి, చిన్నవైనప్పటికీ అత్యంత విలువైన రెండు వ్యాసాలు ("రష్యాను గూర్చి ఫ్రెడరిక్ ఏంగెల్స్ రచనలు" పేరుతో జసూలిచ్‌చే రష్యన్ లోకి అనువాదం, జెనీవా, 1894).[34] పెట్టుబడిపై తాను రచించిన బ్రహ్మాండమైన గ్రంథాన్ని పూర్తి చేసే లోపలనే మార్క్స్ చనిపోయాడు. చిత్తు ముసాయిదా రూపంలో మాత్రం మార్క్స్ గ్రంథరచన పూర్తి చేశాడు. తన మిత్రుని మరణానంతరం "పెట్టుబడి" గ్రంథం యొక్క 2, 3 సంపుటాలను ముద్రణకు సిద్ధం చేసి ప్రచురించడమనే అత్యంత ప్రయాసభరితమైన కార్యాన్ని ఏంగెల్స్ స్వీకరించి, 2వ సంపుటాన్ని 1885లోనూ, 3వ సంపుటాన్ని 1894లోనూ ప్రచురించాడు (4వ సంపుటం ప్రచురణార్థం సిద్ధం చేయగలిగే లోపునే ఏంగెల్స్ చనిపోయాడు[35]). ఈ 2 సంపుటాలను ప్రచురించడానికి అతడు బ్రహ్మాండమైన కృషి చేయాల్సి వచ్చింది. ఆస్ట్రియా దేశపు సోషల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు ఆడ్లర్ ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, "పెట్టుబడి" గ్రంథం యొక్క 2వ సంపుటాన్నీ, 3వ సంపుటాన్నీ ప్రచురించడంలో తన మిత్రుడైన ప్రతిభాశాలి జ్ఞాపకార్థం మహనీయమైన చిహ్నాన్ని అతడు నిర్మించి, ఆ చిహ్నం పైన అప్రయత్నంగా తన పేరునే శాశ్వతంగా మలచుకొన్నాడు ఏంగెల్స్ అని అన్నాడు. వాస్తవానికి "పెట్టుబడి" గ్రంథం యొక్క ఈ 2 సంపుటాలు ఇద్దరు వ్యక్తుల – మార్క్స్, ఏంగెల్స్‌ల – రచన. పురాతన గాథలలో ఇద్దరు స్నేహితులను గురించి మనసు కరిగించేటట్టి అనేక దృష్టాంతాలున్నాయి. మానవ మైత్రిని కీర్తిస్తూ రచించబడి హృదయాన్ని ద్రవింపజేసే వివిధ కథల నన్నింటినీ మించిపోయినట్టి స్నేహపాశాలతో బంధింపబడిన పండితులూ, యోధులూ ఇరువురు తన శాస్త్రాన్ని సృష్టించారని యూరప్ ఖండపు శ్రామికవర్గం సగర్వంగా చెప్పుకోవచ్చు. ఏంగెల్స్ ఎల్లప్పుడూ కూడా – మొత్తం మీద సబబుగానే – మార్క్స్ పేరు ముందు చెప్పి తరువాత తన పేరు చెప్పుకునేవాడు. పాత స్నేహితుడు ఒకతని పేర

రాస్తూ: "మార్క్స్ జీవించిన రోజుల్లో నేను వెనకపాట పాడేవాణ్ణి"[36] అని రాశాడు ఏంగెల్స్. మార్క్స్ బతికున్నప్పుడు మార్క్స్ మీద అతనికున్న ప్రేమ, మార్క్స్ చనిపోయిన తర్వాత ఆయనను తల్చుకొని అతను చూపిన భక్తిగౌరవాలు అపారం. సాహసుడైన ఈ యోధునిలో, ఖచ్చితమైన ఈ తత్వజ్ఞానిలో ప్రేమపూరితమైన హృదయం స్పందించుతూండేది.

1848-1849 ఉద్యమం అనంతరం ప్రవాసంలో ఉన్న రోజుల్లో మార్క్స్, ఏంగెల్స్‌లు శాస్త్రీయ పఠనా వ్యాసంగంలోనే కాలం గడపలేదు. 1864లో మార్క్స్ "అంతర్జాతీయ కార్మికుల సంఘం" అనే సంస్థను స్థాపించి, ఒక దశాబ్దం పాటు దానిని నడిపాడు. ఈ సంఘ కార్యకలాపాల్లో ఏంగెల్స్ చాలా చురుకైన పాత్రనే వహించాడు. మార్క్స్ ఉద్దేశాల ప్రకారం అన్ని దేశాలలో ఉన్న శ్రామికులనూ సంఘటితపరచడానికి స్థాపించబడిన ఈ అంతర్జాతీయ సంఘం, కార్మికవర్గపు క్రమాభివృద్ధిలో బృహత్తర ప్రాధాన్యత వహించింది. 1870 సంవత్సరాల్లో ఈ అంతర్జాతీయ సంఘం అంతమొందినప్పటికీ, ఐక్యతా సాధనలో మార్క్స్, ఏంగెల్స్‌ల పాత్ర అంతటితో ఎంత మాత్రమూ ముగియలేదు. తద్భిన్నంగా కార్మికోద్యమమే నిరవధికంగా అభివృద్ధి పొందుతూండడం కారణంగా కార్మికోద్యమం యొక్క ఆధ్యాత్మిక నాయకులుగా వారి ప్రాముఖ్యత నానాటికి మరింతగా పెరిగిందనే చెప్పాలి. మార్క్స్ మరణానంతరం ఏంగెల్స్ ఒక్కడే యూరప్‌లోని సోషలిస్టులకు బోధకుడూ, నాయకుడూ అయ్యాడు. ప్రభుత్వం క్రూర నిర్బంధం సాగించినప్పటికీ, నిరంతరాయంగా దినదినాభివృద్ధి నొందుతూ పటిష్టమవుతున్నట్టి జర్మన్ సోషలిస్టులే కాకుండా, స్పెయిన్, రుమేనియా, రష్యా మొదలైన వెనుకబడిన దేశాల యొక్క – తాము తీసుకొనే ప్రాథమిక చర్యల ముందు వెనుకలు పునారాలోచించి ఆచి తూచి తీవ్రంగా ఆలోచించిన పిమ్మటే కార్యాచరణలోకి దిగవలసినట్టి – సోషలిస్టు ప్రతినిధులు కూడా సలహా కొరకూ, ఆదేశాల కొరకూ అతని వద్దకు వస్తుండేవారు. వయోవృద్ధుడైన ఏంగెల్స్ యొక్క విజ్ఞానానుభవ భాండారాన్ని వారందరూ స్వేచ్ఛగా వినియోగపరచుకునేవారు.

రష్యన్ భాషను పఠించి, రష్యన్ గ్రంథాలను చదవగలిగిన మార్క్స్, ఏంగెల్స్‌లు, ఆ దేశం పట్ల ఔత్సుకమైన ఆసక్తిని చూపుతూ, రష్యన్ విప్లవోద్యమ గమనాన్ని సానుభూతితో గమనిస్తూ, రష్యన్ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పుకుంటుండేవారు. సోషలిస్టులు కాకముందు వారిద్దరూ కూడా ప్రజాతంత్రవాదులు; ఆ కారణం చేత రాజకీయ నిరంకుశత్వం పట్ల ప్రజాస్వామ్యప్రియులకుండే ద్వేషం వారి హృదయాల్లో గాఢంగా నాటుకు పోయింది. ప్రత్యక్షమైన ఈ రాజకీయానుభవంతో మేళవించిన ప్రగాఢమైన సిద్ధాంత పరిజ్ఞానం వల్ల రాజకీయ నిరంకుశత్వానికీ, ఆర్థిక దోపిడీకి గల అవినాభావ సంబంధాన్ని గుర్తెరిగిన వారవడం చేతనూ, అపారమైన జీవితానుభవాన్ని సముపార్జించడం చేతనూ, ఖచ్చితంగా రాజకీయ దృక్పథాన్ని అవలంభించుతూనే అతిసున్నితమైన సహృదయానుభూతిని మార్క్స్, ఏంగెల్స్‌లు

ప్రదర్శింపగలిగేవారు. అచ్చంగా ఈ కారణం వల్లనే, అత్యంత బలోపేతమైనట్టి జారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టెడుమంది రష్యన్ విప్లవకారులు చేస్తున్న వీరోచిత ప్రతిఘటన, ఎన్నో అగ్ని పరీక్షలకు నిలిచిన ఈ విప్లవకారుల హృదయాల్లో గాఢమైన సానుభూతిని రేకెత్తించింది. ఇక రెండో వైపున, కేవలం భ్రమాజనితమైన ఆర్థిక ప్రయోజనాల కోసం ఆశపడి, రష్యన్ సోషలిస్టుల ప్రధాన కర్తవ్యమూ, తక్షణ కర్తవ్యమూ అయిన రాజకీయ స్వేచ్ఛను సాధించే లక్ష్యం పట్ల పెడముఖం పెట్టే వైఖరి సహజంగానే వారికి అనుమానాస్పదంగా కనపడడమే గాక, మహత్తరమైన సోషలిస్టు విప్లవోద్యమానికే ప్రత్యక్ష ద్రోహాన్ని తలపెట్టడమని వారు భావించారు. "శ్రామికవర్గ విమోచనను శ్రామికవర్గమే సాధించాలి"[37] అని మార్క్స్, ఏంగెల్స్‌లు నిరంతరం బోధిస్తూ ఉండేవారు. కాగా తన ఆర్థిక విమోచన సాధనకై పోరాడాలంటే, శ్రామికవర్గం కొన్ని రాజకీయ హక్కులను తన కోసం సంపాదించుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా, రష్యాలో రాజకీయ విప్లవం సంభవించే పక్షంలో పాశ్చాత్య యూరప్ దేశాల కార్మికోద్యమానికి కూడా అది మహత్తర ప్రాముఖ్యతను కలిగి ఉంటుందని వారు స్పష్టంగా గ్రహించారు. నిరంకుశ పరిపాలనను సాగిస్తున్న రష్యా సర్వసాధారణంగా యూరప్‌లోని అభివృద్ధి నిరోధకాన్నంతటినీ నిరంతరం పరిరక్షిస్తున్న ఒక అభేద్యమైన బురుజు వలే ఉంటున్నది. అనేక సంవత్సరాలుగా జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య వైషమ్య బీజాలను నాటినట్టి 1870 యుద్ధం ఫలితంగా, అంతర్జాతీయ రంగంలో రష్యా ఆక్రమిస్తున్న అత్యంత ఆశ్చర్యాన్ని గొలిపే అనుకూలమైన స్థానం, అభివృద్ధి నిరోధక శక్తిగా నిరంకుశ రష్యా యొక్క ప్రాముఖ్యతను సహజంగా మరింత ఇనుమడింపజేసింది. స్వేచ్ఛాయుతమైన రష్యా మాత్రమే, పోలెండ్, ఫిన్‌లాండ్, జర్మనీ, ఆర్మీనియా దేశస్థులనే కాకుండా మరేఇతర చిన్న జాతులనైనా సరే పీడించడానికిగానీ, ఫ్రాన్స్, జర్మనీలను ఒకదానిపై మరొక దానిని నిరంతరం ఉసిగొల్పడానికిగానీ అవసరంలేని రష్యా మాత్రమే, ఆధునిక యూరప్ ఖండాన్ని యుద్ధభారం నుండి తప్పించి, యూరప్‌లో ఉన్న అభివృద్ధి నిరోధక శక్తులనన్నింటినీ బలహీనపరిచి, యూరప్ దేశాలలోని కార్మికవర్గ శక్తిని పెంపొందించగలుగుతుంది. ఈ కారణం వల్లనూ, పాశ్చాత్య దేశాలలో ఉన్న కార్మికోద్యమ అభ్యుదయానికి సైతం రష్యాలో రాజకీయ స్వేచ్ఛ స్థాపనను ఏంగెల్స్ ప్రగాఢంగా వాంఛించాడు. ఏంగెల్స్ చనిపోవడంతో రష్యన్ విప్లవకారులు తమ ముఖ్య స్నేహితుణ్ని కోల్పోయారు.

**శ్రామికవర్గ యోధుడూ, శ్రామికవర్గ ప్రవక్త అయిన**
**ఏంగెల్స్ కీర్తి చిరస్మరణీయమై శాశ్వతంగా వర్ధిల్లుగాక !**

–1895 శరత్కాలం.

***

# అజేయమైన మార్క్సిజం అరుణపతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టండి! అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ పథంలో సాహసోపేతంగా ముందుకు సాగండి!

## *మార్క్స్ ద్విశతజయంతి ఉత్సవాలను 2018 మే5న దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో నిర్వహించండి!*

**- సి.సి. సి.పి.ఐ.(మావోయిస్టు)**

*"తత్వవేత్తలు ఈ ప్రపంచాన్ని పలు విధాలుగా వ్యాఖ్యానించడం మాత్రమే చేశారు; అయితే దాన్ని మార్చడమెలా అనేదే అసలు విషయం." - మార్క్స్*

అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ సిద్ధాంతకర్త, ప్రపంచ కార్మికులకు, శ్రమజీవులకు అత్యంత గౌరవనీయుడు, గొప్ప నాయకుడు, మహోపాధ్యాయుడు కామ్రేడ్ కారల్ మార్క్స్ 1818 మే 5వ తేదీన ప్రష్యా(జర్మనీ) దేశానికి చెందిన రైన్ రాష్ట్రంలోని ట్రీయర్ పట్టణంలో జన్మించాడు. ఆయన ద్విశత జయంతి రోజు - మే 5వ తేదీ సమీపించబోతోంది. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టు పార్టీలు-సంస్థలు, చైతన్యవంతులైన కార్మికులు, వివిధ పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజారాసులు ఆయన ద్విశత జయంతి ఉత్సవాలను గొప్ప విప్లవోత్సాహంతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా సి.సి., సిపిఐ (మావోయిస్టు) ఆయనకు అత్యంత శ్రద్ధాసక్తులతో ఘనంగా నివాళులర్పిస్తున్నది. ప్రపంచంలో కమ్యూనిస్టు సమాజ స్థాపన కొరకు ఆయన రూపొందించిన అంతర్జాతీయ కార్మికవర్గ సిద్ధాంతం-మార్క్సిజం మార్గదర్శకత్వాన ఆ లక్ష్యం చేరుకునే వరకు సామాజిక రంగాలన్నింటిలోనూ నిరంతరాయంగా విప్లవకర వర్గపోరాటం, విప్లవ నిర్మాణ కృషి కొనసాగిస్తానని ప్రతిన బూనుతున్నది. మన పార్టీ, పి.ఎల్.జి.ఏ., కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, విప్లవ ప్రజాకమిటీలు, సానుభూతిపరులు దేశం నలుమూలలా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మార్క్సిజాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి సోషలిజం-కమ్యూనిజం పట్ల ఆసక్తిని రేకెత్తించి వారి అవగాహన పెంపొందించడానికి వినియోగించాలని మన కేంద్రకమిటీ పిలుపునిస్తోంది. అలాగే ఈ సందర్భంగా, ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారతదేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని

విజయవంతం చేసి కమ్యూనిస్టు సమాజాన్ని నెలకొల్పే లక్ష్యంతో మార్క్సిజం పట్ల, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పట్ల, కార్మికవర్గ చారిత్రక కర్తవ్యం పట్ల లోతైన అవగాహన పెంపొందించుకోవడానికి మార్క్సిజాన్ని అధ్యయనం చేయాలని వీరందరికీ కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

అంతర్జాతీయ కార్మికవర్గ మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ జన్మించి ఈ మే 5వ తేదీకి 200 సంవత్సరాలు పూర్తవుతుంది. మార్క్స్, ఏంగెల్స్‌లు అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గ సిద్ధాంతం–మార్క్సిజం రూపొందించినప్పటి నుండి వర్గచైతన్యంతో కూడిన అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం ఆరంభమై 170 సంవత్సరాలు అవుతున్నది. వీరోచిత పారిస్ కమ్యూన్ అవతరణ జరిగి సుమారు 150 సంవత్సరాలు అవుతున్నది. మహత్తర రష్యా అక్టోబర్ సోషలిస్టు విప్లవం జరిగి వందేండ్లు కాగా, గొప్ప చైనా జనతా ప్రజాస్వామిక విప్లవం జరిగి సుమారు 69 ఏండ్లు అవుతున్నది. గడిచిన 170 ఏండ్ల కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం కార్మికవర్గంలో, పీడిత జాతులలో, పీడిత ప్రజలలో సోషలిజం పట్ల, దాని భవితవ్యం పట్ల, జాతీయ విముక్తి పట్ల ఎంతో విశ్వాసం కల్పించింది; వారిని మృత్యువును సైతం ధిక్కరించే సాహసానికి పురికొల్పి విప్లవ తుఫానులతో సామ్రాజ్యవాదులను, ప్రతీఘాతకులందరినీ భయకంపితులను చేసింది; సోషలిజం, జాతీయ ప్రజాస్వామికం అనే మహత్తర విజయాలను సాధించి మానవాళి చరిత్రనే గొప్ప మలుపు తిప్పింది. రష్యా, చైనా సోషలిస్టు సమాజాలు మనగలిగింది కొన్ని దశాబ్దాల కాలం మాత్రమే అయినా, ఆ సమాజాల్లో కార్మికవర్గ పార్టీల నాయకత్వాన కార్మికులు, శ్రమజీవులు సకల రంగాలలోనూ, మానవ సమాజం మున్నెన్నడూ ఎరుగని, పెట్టుబడిదారీ దేశాలు ఎన్నడు సాధించి ఉండని, ప్రత్యేకంగా సమాజంలోని 90% మంది ప్రజల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే, సమాజాన్ని కమ్యూనిజం వైపు పెద్దపెద్ద అంగలతో ముందుకు నడిపించే మహత్తర విజయాలు సాధించారు. అదే సమయంలో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ క్రమంలో తీవ్రమైన తప్పులు, లోపాలు కూడా జరగడంతో పాటు పెద్దపెద్ద ఓటములు కూడా సంభవించాయి. ముఖ్యంగా పారిస్ కమ్యూన్ నుండి చైనా సాంస్కృతిక విప్లవం వరకు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన ఎన్నో గొప్ప విజయాలను కోల్పోయాము. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గంపై, పీడిత జాతులపై, పీడిత ప్రజలపై వివిధ రూపాలలో తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడింది. ప్రపంచ సోషలిస్టు విప్లవం సాధించాల్సిన లక్ష్యాన్నీ, దీని దీర్ఘకాలిక స్వభావాన్నీ, దీని సంక్లిష్టతనూ, దీనిలో అనివార్యమైన ఆటుపోట్లను దృష్టిలో

పెట్టుకున్నప్పుడు మనం సాధించిన విజయాలు పాక్షికమైనవీ, పరిమితమైనవీ; మనం పొందిన ఓటములు తాత్కాలికమైనవి. మన ఈ తాత్కాలిక ఓటమినీ, మన తప్పులనూ, లోపాలనూ ఎత్తిచూపుతూ ప్రపంచంలోని సామ్రాజ్యవాదులు, సకల అభివృద్ధి నిరోధకులు, ప్రతీఘాతకులంతా నేటికీ మార్క్సిజంపై, కమ్యూనిస్టు ఉద్యమంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ శత్రువులంతా మార్క్స్ ద్విశతజయంతి సందర్భంగా మార్క్సిజం పట్ల, విప్లవం పట్ల, సోషలిజం-కమ్యూనిజం పట్ల, వీటి భవితవ్యం పట్ల ప్రపంచ కార్మికవర్గంలో, పీడిత ప్రజలలో నిరాశా నిస్పృహలు రేకెత్తించి, వారిలో తమ చారిత్రక కర్తవ్యం పట్ల అవిశ్వాసం కలిగించటానికీ, వారు తమ చారిత్రక కర్తవ్యాన్ని గుర్తించకుండా చేయడానికి తమ శక్తివంతమైన ప్రచార యంత్రాంగాన్ని వినియోగించి ఎడతెరిపిలేకుండా మానసిక యుద్ధాన్ని ముమ్మరం చేశారు. వీరు ఈ సందర్భంగా మార్క్సిజం, విప్లవం, జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం, కమ్యూనిజం అనేవి వెర్రికలలనీ; విప్లవ హింసను ప్రజాస్వామ్య వ్యతిరేకమనీ, అభివృద్ధి నిరోధకమనీ, టెర్రరిజమనీ; కమ్యూనిస్టు పార్టీ అంటేనే నియంతల సంస్థ అనీ; పెట్టుబడిదారీ విధానమే, బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే మేలైనవనీ, శాశ్వతమైనవనీ గోబెలియన్ ప్రచారం చేస్తున్నారు. కానీ ఇందుకు భిన్నంగా కమ్యూనిజం అనే భూతం సామ్రాజ్యవాదులను, సకల ప్రతీఘాతుక శక్తులను వెంటాడుతూనే ఉంది; వారిని భయకంపితులను చేస్తూనే ఉంది. వారి అంతిమ వినాశనం వరకు ఈ భూతం వారిని తరమడం అనేది సామాజిక పరిణామ నియమ ఫలితమే.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం నేడెంత బలహీనంగా ఉన్నప్పటికీ దాని చేతిలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజమనే అత్యంత శాస్త్రీయమైన, సర్వసమగ్రమైన, విప్లవాత్మకమైన, శక్తివంతమైన, సమరశీలమైన సిద్ధాంతం ఉంది. దానికి సుదీర్ఘమైన, సుసంపన్నమైన, అత్యంత విలువైన అనుభవం, గొప్ప చరిత్ర ఉన్నాయి. చైనా సోషలిస్టు సమాజంలో కార్మికవర్గ నియంతృత్వం కింద వర్గపోరాటం కొనసాగిస్తూ ఆధునిక రివిజనిజం ప్రమాదాన్ని, పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదాన్ని అరికట్టే లక్ష్యంతో, సోషలిజాన్ని సంఘటితం చేస్తూ కమ్యూనిజం సాధించేలక్ష్యంతో, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన వర్గ సమాజం నుండి సంక్రమించిన దోపిడీ పీడనలకు, అన్యాయానికి, అసమానతలకు, అణచివేతకు మూలమైన ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యం వల్ల ఏర్పడిన సంకుచిత స్వార్థపూరిత ఆలోచనలను, భావజాలాన్ని ప్రజల మెదళ్ల నుండి తొలగించి వారిని చైతన్యవంతులను చేయడానికి ఉపరితలంలో మహత్తర సాంస్కృతిక విప్లవం (చైనాలో) కొనసాగించిన గొప్ప అనుభవం అంతర్జాతీయ కార్మికవర్గానికి ఉంది.

నేడు పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థలో ప్రపంచవ్యాప్తంగా ధనవంతులకు, పేదలకు మధ్య; ధనిక దేశాలకు, పేద దేశాలకు మధ్య; ప్రతిదేశంలో ధనికులకు, పేదలకు మధ్య అంతరం మున్నెన్నటికంటే ఎక్కువగా పెరిగిపోయింది. 1990ల ఆరంభం నుండి సామ్రాజ్యవాదులు ముందుకు తెచ్చిన నయా ఉదారవాద విధానాల దుష్ఫలితమే ఈ పరిణామం. నేడు అత్యంత దురాశాపరులైన, స్వార్థపరులైన, రక్తపిపాసులైన సామ్రాజ్యవాదులచే, వారి తాబేదార్లచే ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం, పీడిత జాతులు, పీడిత ప్రజలు అత్యంత ఘోరమైన క్రూరకృత్యాలకు, హత్యాకాండలకు, దోపిడీ పీడనలకు, అన్యాయాలకు, అత్యాచారాలకు, అవమానాలకు, కష్టాలకు, కన్నీళ్లకు, పరాధీనతకు, విస్థాపనకు గురిచేయబడుతున్నారు. సామ్రాజ్యవాదులచే ఉత్పత్తి శక్తులు పెద్దెత్తున ధ్వంసం చేయబడుతున్నాయి. ప్రపంచ ప్రజల ఈ శత్రువులు అనుసరిస్తున్న దురాశాపూరిత, స్వార్థపూరిత, అశాస్త్రీయ విధానాల వల్ల మానవాళీ, ప్రకృతీ వినాశకర పరిణామాలకు నెడుతున్నాయి. వీరు నయా ఉదారవాద విధానాలను ఆరంభించినప్పటి నుండి, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం పతనం చెందినప్పటి నుండి ప్రపంచ మౌలిక వైరుధ్యాలు మరింత తీవ్రతరమైనాయి. కార్మికవర్గ విప్లవాలకు, పెట్టుబడిదారీ వ్యవస్థ వినాశనానికి పరిస్థితులు మరింత పరిపక్వమైనాయి. ప్రపంచ మానవాళిలో చైతన్యవంతులైన వారంతా సామ్రాజ్యవాదులను, వారి తొత్తులను తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు, ద్వేషిస్తున్నారు. ఇలాంటి విప్లవకర భౌతిక పరిస్థితులలో ప్రపంచ ప్రజల ద్వేషాన్నీ కసినంతటినీ నేటి ఈ కుళ్లు వ్యవస్థను కూల్చివేసే, ఇవేవీ లేని ఒక నూతన సమున్నత వ్యవస్థను నెలకొల్పే ఒక మహాశక్తిగా, ఒక మహాసంకల్పంగా మార్చాల్సిన గురుతర కర్తవ్యం అంతర్జాతీయ కార్మికవర్గం ముందు, దాని అగ్రగామి విప్లవకర కమ్యూనిస్టు పార్టీల-సంస్థల ముందు ఉంది. మార్క్స్ ద్విశత జయంతి సందర్భంగా, అంతర్జాతీయ కార్మికవర్గ మహోపాధ్యాయుడు మార్క్స్ రూపొందించిన సిద్ధాంతం (మార్క్సిజం) గురించీ, అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ పంథాను మనదేశ నిర్దిష్ట విప్లవ పరిస్థితులకు అన్వయించుకున్న తీరు గురించి పునరావలోకనం చేసుకుందాం. ఈ గొప్ప చారిత్రక సందర్భంగా మన పార్టీ యొక్క ప్రజల యొక్క ఆలోచనను, ఆచరణను మార్క్సిజంతో విప్లవీకరిస్తూ శక్తివంతం చేయడానికి సైద్ధాంతిక కర్తవ్యాలపై కేంద్రీకరిద్దాం.

## మార్క్సిస్టు సిద్ధాంతం

18వ శతాబ్దం మలిభాగం నుండి 19వ శతాబ్దం మధ్య వరకూ వాయవ్య యూరప్, ఉత్తర అమెరికా ప్రాంతాలలో పెట్టుబడిదారీ విధానం నాటకీయంగానూ, విప్లవకరంగానూ వృద్ధి చెందింది. ఫలితంగా పెట్టుబడిదారీ విధానం, ఆనాడు ప్రబలమైనదిగా ఉండిన భూస్వామ్య విధానం పైన తిరుగులేని విజయం సాధించింది. మార్క్సిజం రూపొందినది ఆ కాలంలోనే. ప్రపంచ చరిత్రలోని అతి గొప్ప పరిణామాలు సంభవించిన కాలమది. కొద్దిపాటి పశ్చిమ యూరప్ ప్రభుత్వాల, ప్రత్యేకించి బ్రిటీష్‌వారి ప్రపంచాధిపత్యం ఏర్పడిన కాలమది. ఆ ఆధిపత్యం పెట్టుబడిదారీ దేశాలలో విప్లవకరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తనకు దారితీసింది.

బ్రహ్మాండమైన ఈ మార్పులకు, ప్రపంచాన్ని కుదిపివేసిన రెండు విప్లవాలు గుండెకాయగా నిలిచాయి. అవి, బ్రిటన్ కేంద్రంగా సాగిన పారిశ్రామిక విప్లవం, 1789 నాటి ఫ్రెంచి విప్లవం. ఆ విప్లవాలు, అనేక బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలకు దారితీశాయి. విప్లవకర ఆధునిక బూర్జువా వర్గపు విజయవంతమైన పురోగమనానికి అవి ప్రాతినిధ్యం వహించాయి. శైశవ ప్రాయంలోని బూర్జువా వర్గం, అంతకు ముందటి శతాబ్దాలలో పెక్కు పోరాటాలు సాగించి ఆ విప్లవాలకు కొంతవరకు ప్రాతిపదికను తయారు చేసింది. వాటిలో 16వ శతాబ్దం నాటి మత సంస్కరణోద్యమమూ (ఏంగెల్స్ దృష్టిలో అది 'యూరప్‌లోని బూర్జువా విప్లవపు ప్రథమాంకం'), 17వ శతాబ్దపు మధ్యభాగం నాటి ఇంగ్లీషు విప్లవమూ ముఖ్యమైనవి. అంటే, ఈ కాలంలోని బూర్జువా పరివర్తనకు అవసరమైన సామాజిక, ఆర్థిక శక్తులూ, మేధోసాధనాలూ చాలా కాలంగా సన్నద్ధమవుతూ వచ్చాయి, పరిపక్వమౌతూ వచ్చాయి.

అయితే అదే సమయంలో, ఈ కాలంలోని విప్లవాలూ, పరివర్తనలూ భవిష్యత్తులో బూర్జువా వర్గాన్ని ప్రతిఘటించేటటువంటి, దానిని ఓడించేటటువంటి శక్తుల ఆవిర్భావానికి కూడా దారితీశాయి. విజయం సాధించిన ఆ నూతన వ్యవస్థ స్వయంగా పోరాటశీలమైన కార్మికవర్గానికి జన్మనిచ్చింది. సరిగ్గా ఈ దశలోనే, కనీసం యూరప్‌లో, పెట్టుబడిదారీ విధానపు చావును దర్శించగలిగిన శక్తులూ, భావాలూ జన్మించసాగాయి. ఆనాడు బలహీనమైనదిగానే ఉండిన ఆధునిక కార్మికవర్గమూ, దాని భావజాలమైన మార్క్సిజమూ కూడా బూర్జువా వర్గపు మహత్తరమైన ఆ విప్లవకర పరివర్తనా కాలపు ఫలాలే. ఆ కాలపు ఈ రెండు విప్లవాలకు ప్రతిచర్యగా విప్లవకర సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాలం ఆవిర్భవించింది. అది 1848 నాటికల్లా కమ్యూనిస్టు ప్రణాళికలో అత్యుత్తమంగా సూత్రబద్ధమైంది.

మానవజాతి అన్ని దేశాలలో కంటే అత్యంత పురోగమనాన్ని సాధించిన మూడు దేశాలలో, 19వ శతాబ్దంలోని ప్రధాన సైద్ధాంతిక స్రవంతులు మూడింటినీ – సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్రాన్నీ, సాంప్రదాయ ఇంగ్లీషు అర్థశాస్త్రాన్నీ, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలతో సహా ఫ్రెంచి సోషలిజాన్నీ – ఇంకా విప్లవాత్మకంగా అభివృద్ధి చేసి పరిణతికి తీసుకువచ్చిన మహా ప్రతిభాశాలి కారల్ మార్క్స్. అద్భుతమూ, సమగ్రమూ అయిన మార్క్స్ భావాలు వాటి సంపూర్ణ రూపంలో – ఆధునిక భౌతికవాదం, ఆర్థిక సిద్ధాంతం, ఆధునిక సోషలిజం – ప్రపంచ కార్మికోద్యమ సిద్ధాంతంగానూ, కార్యక్రమంగానూ, ఎత్తుగడలుగానూ రూపొందాయి.

మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టుబడిదారీ వర్గం అధికారంలోకి వచ్చి పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న కాలంలో జీవించారు. ఆ కాలంలో పెట్టుబడిదారీ విధానం స్వేచ్ఛాయుత పోటీ దశలో ఉంది. మార్క్స్, ఏంగెల్స్‌ల జీవితకాలం లోని చివరి దశలో పెట్టుబడిదారీ విధానపు స్వేచ్ఛాయుత పోటీ గుత్త పెట్టుబడిగా అభివృద్ధి చెందటం ప్రారంభించింది. పెట్టుబడిదారీ విధానంలోని అంతర్గత వైరుధ్యాలను పరిశీలించిన మార్క్స్, ఏంగెల్స్‌లు, ఆ వైరుధ్యాలను పరిష్కరించే కార్మికవర్గ విప్లవాల అనివార్యతను స్పష్టంగా ప్రకటించారు. తనను తాను విముక్తి చేసుకోవడం మాత్రమే గాకుండా, పీడిత ప్రజలందరినీ విముక్తి చేయగలిగే అద్భుతశక్తి గల సైద్ధాంతిక ఆయుధాలను వీరు సమాజంలో కెల్లా అత్యంత విప్లవకర వర్గమైన కార్మికవర్గం చేతుల్లో పెట్టారు.

*"మార్క్సిజం పుట్టుకకు కారణమైన వస్తుగత పరిస్థితులను ఎత్తిచూపుతూ కామ్రేడ్ మావో ఇలా అన్నారు : 'చరిత్రలో చాలా దీర్ఘకాలం పాటు మానవులు సమాజ చరిత్ర గురించిన అవగాహనలో అనివార్యంగానే ఏకపక్ష అవగాహనకు పరిమితమైపోయారు. దీనికి కారణం దోపిడీవర్గాల పక్షపాత బుద్ధి ఎల్లవ్వుడూ చరిత్రను వక్రీకరించటం ఒకటైతే, చిన్నతరహా ఉత్పత్తి మానవుల దృక్పథాన్ని పరిమితం చేయటం రెండవ కారణం. బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తుల (భారీ పరిశ్రమల)తో పాటు ఆధునిక కార్మికవర్గం ఆవిర్భవించిన తర్వాతనే మానవుడు సమాజాభివృద్ధిని గురించి సమగ్రమైన చారిత్రక అవగాహనను సంపాదించుకోగల్గాడు. ఆ జ్ఞానాన్ని ఒక విజ్ఞానశాస్త్రంగా, మార్క్సిజం అనే విజ్ఞాన శాస్త్రంగా మల్చుకోగల్గారు.' (ఆచరణ, మావో రచనలు, మొదటి సంపుటి, పేజీ 389).*

*" 'మార్క్సిజం అంతస్సారాన్ని కామ్రేడ్ స్టాలిన్ క్లుప్తంగా ఇలా క్రోడీకరించారు: 'మార్క్సిజం అంటే ప్రకృతి, మానవ సమాజాల అభివృద్ధిని నియంత్రించే నియమాల విజ్ఞాన శాస్త్రం, దోపిడీకి, పీడనకు గురయ్యే ప్రజారాశుల విప్లవ శాస్త్రం, సకల దేశాలలో సోషలిజానికి విజయాన్ని సాధించే శాస్త్రం, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే శాస్త్రం.'*

‘ పెట్టుబడిదారీ విధానంలో అంతర్నిహితంగా ఉన్న వర్గవైరుధ్యాలతో సహా, ఆ విధానపు చలన నియమాలను, దోపిడీ మూలాన్ని బట్టబయలు చేసిన, మార్క్స్ అర్థశాస్త్రానికి మూలస్థంభమైన అదనపు విలువ సిద్ధాంతాన్ని ఆవిష్కరించిన రాజకీయ అర్థశాస్త్రాన్ని అభివృద్ధి చేశారు; వర్గపోరాట సిద్ధాంతం పునాదిగా శాస్త్రీయ సోషలిజాన్ని అభివృద్ధి చేశారు. కార్మికవర్గపు వర్గపోరాట వ్యూహం, ఎత్తుగడలను నియంత్రించే సూత్రాలను రూపొందించారు.

“మార్క్స్, తత్వశాస్త్రానికి ప్రపంచాన్ని మార్చడం అనే విప్లవ కర్తవ్యాన్ని అప్పజెప్పారు. ‘ఫ్యూయర్‌బాపై సిద్ధాంతం’ అనే తన రచనలో మార్క్స్ యొక్క ప్రఖ్యాత వ్యాఖ్య ‘తత్వవేత్తలు ప్రపంచానికి భాష్యం మాత్రమే చెప్పారు, దాన్ని మార్చడమే మన కర్తవ్యం’ అనే దాంట్లో పై అంశం వ్యక్తీకరించబడింది.

“మార్క్స్, ఏంగెల్స్‌లు పదార్థాన్ని, అది వస్తుగతంగా అస్తిత్వంలో ఉండే భౌతిక వాస్తవికత అనీ, అది మానవ చైతన్యంలో ప్రతిఫలిస్తుందనీ నిర్వచించారు. ఆ విధంగా మార్క్సిస్టు తాత్విక భౌతికవాదం తత్వశాస్త్రంలోని మౌలిక సమస్యను – ఆలోచనకు అస్తిత్వానికి మధ్య సంబంధం – ఆత్మకు (స్పిరిట్) ప్రకృతికి మధ్య సంబంధం – సమస్యను పరిష్కరించింది.

“తత్వశాస్త్ర మౌలిక ప్రశ్నలోని రెండవ అంశమైన మానవ చైతన్యం వస్తుగత వాస్తవికతను సక్రమంగా ప్రతిఫలించగలుగుతుందా? అనే సమస్యను వారు అత్యంత శాస్త్రీయంగా రుజువు చేశారు. మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం అజ్ఞేయవాదం, సంశయవాదాలను పూర్తిగా తిరస్కరించింది. ఈ ప్రపంచంలో ఏదీ ఎప్పటికీ అజ్ఞేయంగా (తెలవకుండా ఉండి పోయేదిగా) లేదా ‘దానికదిగా ఉండిపోయే వస్తువు’గా (థింగ్ ఇన్ ఇట్ సెల్ఫ్) ఉండిపోదని అది నొక్కి చెప్పింది. సామాజిక ఆచరణే జ్ఞానానికి వనరని మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం వక్కాణించి చెప్తుతుంది. హేతువాద, అనుభవవాద ధోరణులను పూర్తిగా తిరస్కరించి అది సామాజిక ఆచరణే సత్యానికి కొలబద్ద అని కూడా పేర్కొంది.

“ ‘మార్క్స్ శతాబ్దాల తరబడి మానవాళి సంపాదించుకున్న జ్ఞానాన్ని సంశ్లేషించారు. జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్రం, ఇంగ్లీషు సాంప్రదాయిక రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతం, సోషలిస్టు సిద్ధాంతాలు – వీటిలో హేతుబద్ధమైన విషయాల పైనే ప్రధానంగా ఆధారపడుతూ మార్క్స్ చరిత్రకు సంబంధించిన గతితార్కిక భౌతికవాద భావనను ఆవిష్కరించారు. సామాజిక సంబంధాల సమాహారమే మానవ అంతస్సారమని ఆయన నిర్వచించారు.

రాజకీయ అర్థశాస్త్ర రంగంలో మార్క్స్ చేసిన మహత్తర కృషి పెట్టుబడి విశ్లేషణ.

“ ‘మార్క్స్ ‘పెట్టుబడి’ అనే తన రచనలో బూర్జువా (సరుకుల) సమాజంలో అతి మామూలుదైన, సర్వసాధారణమూ, మౌలికమూ, దైనికమూ అయిన సంబంధాన్ని, అనేక కోట్ల

సార్లు ఎదురయ్యే సంబంధాన్ని మొదట విశ్లేషించారు. ఈ అతి సాధారణ పరిణామంలో (బూర్జువా సమాజంలోని ఈ 'జీవకణం') విశ్లేషణ ఆధునిక సమాజంలోని అన్ని వైరుధ్యాల (లేదా అన్ని వైరుధ్యాల తాలూకు బీజాల)ను బయటపెడుతుంది. అటు తర్వాత వివరణ, ఈ వైరుధ్యాల మరియు విడివిడి భాగాల (మొత్తం) అయిన ఈ సమాజపు అభివృద్ధిని (పెరుగుదల మరియు చలనం రెండూ కూడా) మొదటి నుండి చివరి దాకా తెలియజెబుతుంది' అని లెనిన్ వివరించిన విషయాన్ని మావో 'వైరుధ్యాలు' అనే తన వ్యాసంలో ఉటంకించారు. (మావో రచనలు, మొదటి సంపుటి, పేజీ 417)

"ఈ విధంగా బూర్జువా అర్థశాస్త్రవేత్తలు వస్తువుల మధ్య సంబంధాన్ని చూసిన చోట (ఒక సరుకుకు మరో సరుకుతో జరిగే మారకం) మార్క్స్ మానవుల మధ్య ఉండే ఒక సంబంధాన్ని వెల్లడి చేశాడు. వ్యక్తిగత ఉత్పత్తిదారుల మధ్య మార్కెట్ ద్వారా ఉండే అనుబంధాన్ని సరుకుల మారకం వ్యక్తం చేస్తుంది.

శ్రమకు వేతనంతో జరిగే అసమాన మారకం కారణంగా దోపిడీ అనేది తలెత్తుతుందని సాంప్రదాయిక రాజకీయ అర్థశాస్త్రవేత్తలు చెప్పిన తప్పుడు అభిప్రాయాలను ఆయన ఖండించారు. ఈ విశ్లేషణ పైన, వైరుధ్య నియమం పైన ఆధారపడి మార్క్స్ పెట్టుబడిదారీ విధానంలోని మౌలిక వైరుధ్యాన్ని కనుగొన్నారు. కా. మావో ఆ విషయాన్ని ఇలా వివరించారు:

" 'మార్క్స్ పెట్టుబడిదారీ సమాజ ఆర్థిక వ్యవస్థ అధ్యయనంలో ఈ సూత్రాన్ని అన్వయించినప్పుడు, ఉత్పత్తి యొక్క సామాజిక స్వభావానికీ, యాజమాన్యపు ప్రైవేటు స్వభావానికి మధ్యనున్న వైరుధ్యమే ఈ సమాజంలోని మౌలిక వైరుధ్యమని కనుగొన్నారు. ఈ వైరుధ్యం విడివిడి పరిశ్రమలలోని ఉత్పత్తి సంఘటిత స్వభావానికి, మొత్తం సమాజంలోని ఉత్పత్తి తాలూకు అరాచక స్వభావానికి మధ్య నుండే వైరుధ్యంలో తన్ను తాను వ్యక్తపర్చుకుంటుంది. వర్గ సంబంధాల దృష్ట్యా, ఇది బూర్జువా వర్గానికి, శ్రామికవర్గానికి మధ్య వైరుధ్యంలో వ్యక్తమవుతుంది.' ('వైరుధ్యాలు', మావో రచనలు, మొదటి సంపుటి, పేజీ 429)

"మార్క్స్, పెట్టుబడిదారీ సంక్షోభాలను కూడా పెట్టుబడిదారీ విధానంలోని ఈ మౌలిక వైరుధ్యపు మరొక వ్యక్తీకరణగా వివరించారు.

"కామ్రేడ్ లెనిన్ సంక్షోభం గురించిన సిస్మోండియన్ అభిప్రాయాన్ని ఖండిస్తూ మార్క్సిస్టు అవగాహనను ఇలా వివరించారు : సంక్షోభాలు వ్యక్తమయ్యేది 'సరిగ్గా ఉత్పత్తి పరిస్థితులలో నుండే. దీనిని మరింత క్లుప్తంగా చెప్పాలంటే, వీటిలో మొదటి అభిప్రాయం (సిస్మోండియన్) సంక్షోభాలను అల్ప వినియోగం ద్వారా వివరిస్తుంది. కాగా, రెండవది (మార్క్సిస్టు అభిప్రాయం) వాటిని ఉత్పత్తిలోని అరాచకత్వం ద్వారా వివరిస్తుంది.' (ది కారెక్టరైజేషన్ ఆఫ్ ఎకనమిక్ రొమాంటిసిజం)

"పెట్టుబడిదారులు ఈ సంక్షోభాన్ని ఎలా పరిష్కరించుకోవాలని ప్రయత్నిస్తారో కమ్యూనిస్టు ప్రణాళిక ఇలా తేటతెల్లంగా వివరించింది :

" 'బూర్జువా సమాజ పరిస్థితులు ఆ సమాజమే సృష్టించే సంపదను ఇముడ్చుకోవడానికి సంబంధించి చాలా కురచవి. బూర్జువా వర్గం ఆ సంక్షోభాల నుండి ఎలా బయటపడుతుంది? అది ఒక వంక బలవంతంగా భారీఎత్తున ఉత్పత్తి శక్తులను ధ్వంసం చేయడం ద్వారా, మరో వంక నూతన మార్కెట్లను జయించడం ద్వారా పాత వాటిని ఇంకా ఇంకా క్షుణ్ణంగా దోచుకోవడం ద్వారా అంటే మరింత విస్తృతమైన, మరింత వినాశకరమైన సంక్షోభాలకు మార్గాన్ని సుగమం చేసే పద్ధతిలో అది ఆ పనిచేస్తుంది. తద్వారా అది సంక్షోభాలను నివారించడానికి ఉండే సాధనాలను క్షీణింపజేస్తుంది.'

"పై అవగాహనపై ఆధారపడి మార్క్స్, ఏంగెల్స్‌లు కార్మికవర్గం అత్యంత విప్లవకర సామాజిక వర్గంగా, సామాజిక అభివృద్ధికి చోదకశక్తిగా ఆవిర్భవించిందని గుర్తించారు. కార్మికవర్గం వేతన బానిసత్వాన్నుండి విముక్తిని సాధించే క్రమంలో మొత్తంగా సమాజాన్ని కూడా సకల వర్గదోపిడీ పీడనల నుండి విముక్తం చేసి, వర్గరహిత సమాజం దిశగా పురోగమిస్తుందని వారు గుర్తించారు. కార్మికవర్గం పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి తనను తాను విముక్తం గావించుకోవాలంటే అందుకోసం అది తనదైన స్వంత వర్గ భావజాలాన్ని రూపొందించుకోవాలనీ, తనను తాను అది తనలో తానుగా ఉన్న వర్గం స్థితి నుండి తనకోసం తానైన వర్గంగా పరివర్తన చెందించుకోవాలనీ, అది తన స్వంత పురోగామి నిర్మాణాన్ని, అంటే కార్మికవర్గ పార్టీని ఏర్పరచుకోవాలని వారు గుర్తించారు.

వర్గ సమాజంలో ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఉండే వైరుధ్యం వర్గవైరుధ్యంగా ప్రతిఫలిస్తుందని వారు నిరూపించారు. ఈ వర్గ పోరాటమే సమాజానికి చోదకశక్తిగా పనిచేస్తుంది. అందువల్లనే వారు వర్గ సమాజ చరిత్రంటే వర్గపోరాటాల చరిత్రేనని వర్ణించారు. మార్క్స్, ఏంగెల్స్‌ల అజరామరమైన రచన కమ్యూనిస్టు ప్రణాళిక 150 సంవత్సరాల క్రితం వెలువడింది. నేటికీ కూడా అది అంతర్జాతీయ కార్మికవర్గానికి మార్గదర్శిగా నిలిచి ఉంది.

" 'మానవ చరిత్రలో అతి గొప్ప మార్పులు సంభవిస్తూ, కొన్ని పాశ్చాత్య పెట్టుబడిదారీ రాజ్యాలు ప్రపంచంపై పెత్తనాన్ని నెలకొల్పుతూ ఉన్న కాలంలో మార్క్సిజం పుట్టింది. ఆ బూర్జువా ప్రజాస్వామిక విప్లవాల కల్లోల యుగంలో, 1848 నుండి 1871 నాటి పారిస్ కమ్యూన్ వరకు కార్మికవర్గ ఉద్యమం తన శైశవ దశలో ఉన్నది. ఆ కాలంలో, కమ్యూన్ పతనం తర్వాత కార్మికవర్గ విప్లవాలకు సన్నాహం జరిగిన సాపేక్షికంగా శాంతియుతమైన కాలంలో, ఆ శతాబ్దపు చివరి కల్లా, మార్క్సిజం సుస్థిర స్థానాన్ని సాధించింది. ఆ కాలంలోనే పారిస్ కమ్యూన్ వంటి

గొప్ప ఘటనలపై మార్క్స్, ఏంగెల్స్‌లు అందించిన సరైన విశ్లేషణ ద్వారా అది అలా సుస్థిర స్థానాన్ని సంపాదించింది. కమ్యూనిస్టు పార్టీలను, మొదటి ఇంటర్నేషనల్‌ను ఏర్పరచి, వాటికి మార్గదర్శకత్వాన్ని అందించడంలో మార్క్స్, ఏంగెల్స్‌లు ప్రధానమైన పాత్ర వహించారు. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి!' అంటూ వారు శంఖారావాన్ని పూరించి వివిధ దేశాలకు చెందిన కార్మికులకు అంతర్జాతీయ దృక్పథాన్ని, కామ్రేడ్లీ సౌహార్ద్రతను చాటారు.

"ప్రౌధాన్, బకునిన్‌ల వంటి అరాచకవాదుల వివిధ అరాచక ధోరణులు కార్మికవర్గం జరపాల్సిన రాజకీయ పోరాటపు అవసరాన్ని తిరస్కరించాయి. వారు కార్మికవర్గ పార్టీ అవసరాన్ని, కార్మికవర్గ నియంతృత్వపు అవసరాన్ని వ్యతిరేకించారు. బ్లాంక్విస్టు ధోరణి ప్రధానంగా కుట్రదారీ పద్ధతులపై ఆధారపడినది. ఇకపోతే లాసల్లే అవకాశవాద ధోరణి ప్రభుత్వ సబ్సిడీలతో నడిచే కోఆపరేటివ్‌ల వ్యవస్థను ప్రతిపాదించింది. తద్వారా అది క్రమ క్రమంగా పెట్టుబడిదారీ విధానాన్ని తొలగించి దాని స్థానంలోకి రావాలని చెప్పుతూ 'వేతనాల ఉక్కు నియమం' అనే పరమ అప్రతిష్టాకరమైన సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. ఆ సిద్ధాంతం ట్రేడ్ యూనియన్ పోరాటాలను, సమ్మెలను కూడా వ్యతిరేకించింది. మార్క్సిజం ఈ అరాచకవాద పెటీబూర్జువా ధోరణులన్నింటినీ ఓడించి, కార్మికవర్గం చేతుల్లోని సైద్ధాంతిక ఆయుధంగా అభివృద్ధి చెందింది.

"లాసెల్లే, రాజ్య సోషలిజం అనబడే దానిపై లేదా సార్వత్రిక ఓటింగు హక్కు ద్వారా రాజ్యాన్ని ప్రజాస్వామికీకరించడంపై విశ్వాసాన్ని కలిగి ఉండి బిస్మార్క్‌తో కుమ్మక్కయ్యాడు. అలాంటి అవకాశవాద లాసెల్లేతో కలిసి జర్మనీలో లీబ్‌నెక్, బెబెల్‌ల నాయకత్వంలోని విప్లవకర వామపక్షం ఒక కొత్త పార్టీని ఏర్పరచింది. ఆ పార్టీ గోథా కార్యక్రమం అనే ఒక అవకాశవాద కార్యక్రమాన్ని రూపొందించింది. దానిని మార్క్స్ విమర్శించారు.

"మార్క్స్ కార్మికవర్గ నియంతృత్వ సిద్ధాంతాన్ని కార్మికవర్గ పరిపాలన యొక్క ఒక రూపంగా, పెట్టుబడి పాలనను బలప్రయోగం ద్వారా కూలదోసే ఒక పద్ధతిగా అభివృద్ధిపరిచారు. బానిస సమాజం నుండి కమ్యూనిజం వరకు మానవ సమాజపు అభివృద్ధి క్రమంలో రాజ్యం ఎలా పుట్టి, అభివృద్ధి చెంది, అంతరించిపోతుందో మార్క్స్, ఏంగెల్స్‌లు వివరించారు. 'ఆధునిక రాజ్యం యొక్క పరిపాలనా విభాగమంటే, మొత్తంగా బూర్జువా వర్గం యొక్క ఉమ్మడి కార్యకలాపాలను చక్కబెట్టే ఒక కమిటీ తప్ప మరేంకాదు.' (కమ్యూనిస్టు ప్రణాళిక)

" 'కార్మికవర్గం అప్పటికే సర్వం సిద్ధంగా ఉన్న రాజ్య యంత్రాంగాన్ని సులువుగా స్వాధీనం చేసుకొని తన స్వంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోజాలదు' అన్నది మార్క్స్ అభిప్రాయం ప్రకారం, పారిస్ కమ్యూన్ అనుభవం నుండి లభించిన అత్యంత ముఖ్యమైన సూత్రం. మరో విధంగా చెప్పాలంటే కార్మికవర్గం రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి విప్లవకర మార్గాన్ని

*అనుసరించాలి. బూర్జువా వర్గపు మిలటరీ, బ్యూరాక్రటిక్ యంత్రాంగాన్ని ధ్వంసం చేయాలి. బూర్జువావర్గ నియంతృత్వం స్థానే కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పాలి.*

*"మార్క్సిస్టు రాజకీయ సిద్ధాంతంలో కార్మికవర్గ నియంతృత్వమనేది ఒక కీలకమైన భావన. 'వర్గపోరాటం ఆవశ్యకంగా కార్మికవర్గ నియంతృత్వానికి దారి తీస్తుందని, అన్ని వర్గాలు రద్దయిపోయి వర్గరహిత సమాజానికి జరిగే పరివర్తనగా ఉండేది ఈ నియంతృత్వమే' అని మార్క్స్ రుజువు చేశారు (వేడీ మేయర్‌కు మార్చి 1852లో రాసిన లేఖ). ఈ విధంగా మార్క్స్, ఏంగెల్స్‌లు అన్ని పెటీబూర్జువా ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలను ఓడించి శాస్త్రీయ సోషలిజం సూత్రాలను దృఢంగా పాదుకొల్పారు." (ఎం.ఎల్.ఎం. పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ డాక్యుమెంట్, పేజీలు 7-11)*

మార్క్స్ కార్మికవర్గ అగ్రగామి పార్టీ (కమ్యూనిస్టు పార్టీ), జాతులు-వలసలు, పాశ్చాత్యేతర సమాజాలు, కార్మిక-కర్షక మైత్రి, కుటుంబం-మహిళలు-పిల్లలు, సోషలిస్టు విద్య-సంస్కృతి, పర్యావరణం గురించిన విప్లవాత్మకమైన, నూతనమైన సిద్ధాంత ప్రతిపాదనలు చేశారు.

మార్క్స్ ఇదే మహత్తర కృషిలో నిమగ్నమై ఉన్న సమయంలోనే తీవ్ర అనారోగ్యానికి గురై తన 65వ ఏట (1883 మార్చి 14వ తేదీన లండన్‌లో) అంతిమ శ్వాస విడిచారు.

మార్క్స్ 19వ శతాబ్దంలోని అతిగొప్ప ప్రతిభాశాలి. ఆయన మహా విప్లవ స్వాప్నికుడు, నిరంతర అధ్యయనశీలి, అంతులేని జ్ఞానపిపాసి. ఆయన చివరి శ్వాస వదిలే వరకూ నిరంతరాయంగా అలుపెరగకుండా తదేక దీక్షతో అధ్యయనంలో, వ్యాస రచనలో, ఉత్తరప్రత్యుత్తరాలు రాయడంలో, గ్రంథ రచనలో, కార్మికవర్గ ఉద్యమ కార్యకలాపాలలో నిమగ్నమై ఉండేవారు. ఆయన భౌతిక వాస్తవాలను శోధించి సత్యాన్ని వెలికితీసిన గొప్ప శాస్త్రజ్ఞుడు. ఆయన స్వీయాత్మకతకు, వూహాజనిత భావాలకు చుక్కెదురు. ఆయనకు అందువల్లే విప్లవంలో కార్మికవర్గం నిర్వహించే నాయకత్వ పాత్ర పట్ల, పెట్టుబడిదారీ సమాజం కార్మికవర్గ విప్లవం ద్వారా సోషలిజం-కమ్యూనిజంగా పరివర్తన చెందుతుందనే విషయం పట్ల అచంచల విశ్వాసం ఉండేది. ఆయన వ్యక్తిత్వం మహోన్నత కమ్యూనిస్టు విలువల ప్రతిరూపం.

మార్క్స్ తాను దుర్భర దారిద్ర్యంలో మునిగిపోయి కూడా అంతర్జాతీయ కార్మికవర్గ విముక్తికై ఒక అత్యంత విప్లవకర భావజాలాన్నీ, సిద్ధాంతాలను, అంతర్జాతీయ కార్మికవర్గ అగ్రగామిదళ నిర్మాణాన్నీ రూపొందించారు.ఆయన కార్మికవర్గ విప్లవ ఆశయ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన తన రాజకీయ జీవిత కాలమంతా వివిధ యూరోపియన్ దేశాల

పాలకవర్గాలు ఆయనపై నిర్బంధాలు, నిషేధాలు ఎన్ని విధించినా, వాటి మూలంగా ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ రాజీలేని జీవితాన్ని గడిపారు. ఆయన తన కుటుంబంలోని ప్రతిఒక్కరి పట్ల, తన సహ కామ్రేడ్స్ పట్ల, తన పరిచయస్థులైన ఎందరో కార్మికవర్గ యాక్టివిస్టుల పట్ల ఎనలేని ప్రేమను కనబరిచారు. కార్మికవర్గ నిరాడంబరతకు ఆయన కమ్యూనిస్టు జీవితం సదా ఆదర్శనీయంగా నిలుస్తుంది. అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవకర కామ్రేడ్లీ సంబంధాలకు గొప్ప ఉదాహరణగా మార్క్స్, ఏంగెల్స్‌ల మైత్రి అజరామరమై నిలుస్తుంది.

మార్క్స్ దోపిడీదార్లచే పీడకులచే అత్యంత తీవ్రంగా ద్వేషించబడినవాడు మాత్రమే గాకుండా దోపిడీ పీడనలకు గురైన అసంఖ్యాక శ్రమజీవులచే అత్యంత గాఢంగా ప్రేమించబడినవాడు.

మార్క్స్ యావత్తు ప్రపంచంలోని కార్మిక తదితర శ్రమజీవులకు–కార్మిక తదితర శ్రమజీవి సంఘాలకూ, కార్మికవర్గ విప్లవకారులకు–కమ్యూనిస్టు పార్టీలకూ, అంతర్జాతీయ విప్లవ సంస్థలకు–కమ్యూనిస్టు ఇంటర్నేషనల్స్‌కు ఆదర్శనీయుడు మాత్రమే గాకుండా విద్యార్థి యువజనులకు–మేధావులకు, ప్రగతి కాముకులకు–ప్రగతిశీల సంస్థలకు గొప్ప ఆదర్శనీయుడు.

*"మార్క్సిజానికి ఏంగెల్స్ చేసిన గొప్ప చేర్పులు మార్క్సిజం నుండి విడదీసి చూడరానివి. ఏంగెల్స్‌తో సన్నిహితంగా కలిసే మార్క్స్ తన సిద్ధాంతాన్ని అభివృద్ధిపరిచారు. ఏంగెల్స్ మార్క్సుకు సహాయపడ్డారు. ఆయన రచనలను సుసంపన్నం చేశారు, అవసరమైన చోట వాటిని సరళీకరించి విశదపరిచారు. మార్క్స్ మరణానంతరం ఏంగెల్స్ కూడా తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజాలకు గొప్ప చేర్పులు చేశారు. ఆంథ్రపాలజీ (మానవ పరిణామం, అభివృద్ధుల శాస్త్రం) అందించిన నిదర్శనాలపై ఆధారపడుతూ ఏంగెల్స్ రచించిన వేగుచుక్క లాంటి రచన "కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్యాల ఆవిర్భావం", ఆయన ముఖ్య సేవలలో ఒకటిగా నిలుస్తుంది. ఆ రచనలో ఆయన మిగులు (సర్‌ప్లస్) ఉనికి లోకి రావడం, వర్గాల ఆవిర్భావంతోనే స్త్రీలపై అణచివేత మొదలైందని, ఇది కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్యాలతో పీటముడి వేసుకొని పోయి ఉందని తెలియజెప్పారు. ఈ మౌలిక అధ్యయనమే మహిళా సమస్యపై మార్క్సిస్టు అవగాహనకు ప్రాతిపదిక. ఏంగెల్స్ మహత్తర రచనలలో "సోషలిజం– ఊహాజనితం, శాస్త్రీయం" మరియు "డ్యూరింగ్ సిద్ధాంత ఖండన" అనేవి కూడా ఉన్నాయి. మార్క్సిజాన్ని పరిరక్షించి, రెండవ ఇంటర్నేషనల్ తొలిరోజుల్లో దానిలోని అవకాశవాదంతో జరిగిన సైద్ధాంతిక పోరాటానికి నాయకత్వం వహించారు. అందువల్ల ఏంగెల్స్ చేసిన చేర్పులు మార్క్సిజంలోని ఒక అనివార్యమైన భాగం."* (ఎం.ఎల్.ఎం. పార్టీ ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ డాక్యుమెంట్, పేజీ 11)

*“పెట్టుబడిదారీ విధానపు గుత్తాధిపత్య పూర్వ దశలో మార్క్సిజం, కార్మికవర్గ సిద్ధాంత, ఎత్తుగడల అభివృద్ధి ద్వారా కార్మికవర్గ భావజాలపు అభివృద్ధిలోని మొదటి దశగా సుస్థాపితమైంది. కార్మికవర్గ ప్రయోజనాల కోసం మార్క్స్ వివిధ అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా దృఢసంకల్పంతో సాగించిన పోరాటం ద్వారానే అది సాధ్యమైంది. విజ్ఞాన శాస్త్రాలు మొదలుకొని విప్లవ వ్యూహం-ఎత్తుగడల వరకు దాదాపుగా సకల శాస్త్రాలను అర్థం చేసుకొనేందుకు, అభివృద్ధిపరిచేందుకు మార్క్సిస్టు పద్ధతి స్వీకరించబడింది.”* (ఎం.ఎల్.ఎం. పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ డాక్యుమెంట్, పేజీ 11)

మార్క్స్ అభిప్రాయాల, ఉపదేశాల మొత్తమే మార్క్సిజం. మార్క్స్ అభివృద్ధి చేసిన విప్లవ దృక్పథం, రాజకీయ సిద్ధాంతం, గతితార్కిక పద్ధతి మొత్తంగా సర్వాన్ని ఆవరించిన ప్రాపంచిక దృక్పథం, అంటే మార్క్స్ సిద్ధాంతం, మార్క్సిజంగా పిలవబడుతుంది. మార్క్సిజాన్ని వివరించడమంటే - మార్క్సిస్టు విజ్ఞాన సంపదను, దాని విశిష్టతను వివరించడం; అంతర్జాతీయ కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్నీ, అంటే మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్నీ, కమ్యూనిజం భవిష్య దర్శనాన్ని వివరించడం. ఈ విషయాలు మార్క్స్ పేరుతో ముడివడి, ఆయన గ్రంథాలలో పొందుపరచబడి ఉన్నాయి. అది కార్మికవర్గ శాస్త్రీయ భావజాలపు అభివృద్ధిలోని మొదటి గొప్ప మైలురాయికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

మార్క్స్ సిద్ధాంతపర, ఆచరణాత్మక కృషి ద్వారా ప్రపంచ కార్మికవర్గానికీ, యావత్తు శ్రమజీవులకు చేసిన సేవ ఎనలేనిది. ఆయన అంతర్జాతీయ కార్మికవర్గ-శ్రమజీవుల ప్రయోజనాలకు, సకల ప్రగతిశీల మానవాళి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన రూపొందించిన సిద్ధాంతం మానవ చరిత్ర లోనే ఒక నూతన శకాన్ని ఆవిష్కరించింది. ఆయన చేసిన విప్లవాత్మక కృషి యావత్తు ప్రపంచాన్ని ఆసాంతం మౌలికంగా మార్చే దిశలో అంతర్జాతీయ కార్మికవర్గం, శ్రమజీవులు నడిచేలా చేసింది. ఈ విధంగా తన మహత్తర సైద్ధాంతిక ఆవిష్కరణల ద్వారా మానవ చరిత్రలోనే మొదటిసారిగా నూతన, సమున్నత సమాజానికి బలమైన పునాదులు వేశారు.

మార్క్స్, ఏంగెల్స్‌లు జర్మన్ దేశీయులే అయినా, వారు 19వ శతాబ్దంలో జీవించినా, యూరప్‌లోనే ఉండి తమ విప్లవ కార్యకలాపాలు నిర్వహించినా మార్క్సిజం కేవలం జర్మనీకీ, యూరప్‌కూ సంబంధించినది మాత్రమే కాదు, మార్క్సిజం అనేది సామాజిక పరిణామం యొక్క శాస్త్రీయ క్రోడీకరణ ఫలితంగా రూపొందించిన నియమాల విజ్ఞానశాస్త్రం. అది మొత్తం అంతర్జాతీయ పరిణామాల్లో వేళ్లూనుకొని ఉండడమే గాకుండా అది నూతన సమాజ భవిష్యదర్శనం. మార్క్సిజం శాస్త్రీయమైనది, అత్యంత విప్లవాత్మకమైనది, సర్వసమగ్రమైనది, సజీవమైనది,

సమరశీలమైనది. దాని ఆత్మ గతితార్కిక, చారిత్రక భౌతికవాదంలో ఉంది. మార్క్సిజం ఎంతమాత్రం పిడివాదం కాదు. అది నేటి ప్రపంచాన్ని సమూలంగా సమున్నతమైందిగా మార్చడానికి అంటే వర్గరహిత సమాజంగా మార్చడానికి ఆచరణకు మార్గదర్శకంగా ఉండే సజీవమైన కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం.

మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళిక రాసినప్పటి నుండి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాలను-మార్క్సిజాన్ని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం గుర్తించడం ఆరంభించి క్రమంగా ఈ గుర్తింపు ఆ శతాబ్దం చివరి దశాబ్దాలలో కార్మికోద్యమంతో పాటే ప్రపంచమంతా విస్తరించింది. తదనంతరం విప్లవకర కమ్యూనిస్టు పార్టీలచే, చైతన్యవంతులైన కార్మికులచే అంతర్జాతీయ కార్మికవర్గ విశ్వజనీన మార్గదర్శక సిద్ధాంతంగా స్వీకరించబడింది. ఈ క్రమంలోనే మార్క్స్ సిద్ధాంతం భిన్నమైన నూతన చారిత్రక పరిస్థితులలో లెనినిజంగా అంటే మార్క్సిజం-లెనినిజంగా అభివృద్ధి చెంది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించింది.

“”మార్క్స్, ఏంగెల్స్‌ల చివరి సంవత్సరాలలో పెట్టుబడిదారీ విధానంలోని స్వేచ్ఛాయుత పోటీ క్రమక్రమంగా గుత్తపెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. 1870ల నుండి ప్రారంభించి ఇరవయ్యో శతాబ్దంలోని ప్రారంభ సంవత్సరాల వరకు పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందింది. పెట్టుబడిదారీ దేశాల మధ్య ప్రపంచ మార్కెట్ విభజన పూర్తయింది. వలస విధానం ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ విధానంలోని వర్గవైరుధ్యాలన్నీ తీవ్రతరమైనాయి. లెనిన్, అంతర్జాతీయ కార్మికవర్గం విప్లవాలకు సన్నద్ధమవుతున్న సాపేక్ష శాంతి కాలంలో జన్మించి పెరిగి, విప్లవాల తొలికాలంలో రష్యా విప్లవానికే కాకుండా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికే నాయకత్వం వహించారు.”

సామ్రాజ్యవాద యుగపు చారిత్రక పరిస్థితులలో, సోషలిస్టు విప్లవ జ్వాలల నడుమ లెనిన్, మార్క్స్ ఏంగెల్స్‌ల విప్లవ బోధనలను వారసత్వంగా స్వీకరించారు. వాటిని దృఢంగా పరిరక్షించారు. వాటిని రష్యా విప్లవం, ప్రపంచ కార్మిక విప్లవాల నిర్దిష్ట ఆచరణకు సృజనాత్మకంగా అన్వయించి అభివృద్ధిపరిచారు. కామ్రేడ్ స్టాలిన్ లెనినిజాన్ని ఇలా సంక్షిప్తంగా క్రోడీకరించి చెప్పారు : “సామ్రాజ్యవాదం, కార్మికవర్గ విప్లవాల యుగానికి సంబంధించిన మార్క్సిజమే” లెనినిజం. “లెనినిజం అంటే సాధారణంగా కార్మికవర్గపు సిద్ధాంతం, ఎత్తుగడలు, ప్రత్యేకించి చెప్పాలంటే కార్మికవర్గ నియంతృత్వం యొక్క సిద్ధాంతం, ఎత్తుగడలు.”

కామ్రేడ్ లెనిన్ నూతన చారిత్రక పరిస్థితులలో మార్క్సిజంలోని మూడు అంతర్భాగాలను - మార్క్సిస్టు తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజంను సుసంపన్నం చేసే

గొప్ప చేర్పులను చేశారు. మార్క్సిజం అనే విజ్ఞానశాస్త్రం మార్క్సిజం-లెనినిజం అనే దాని రెండవ ఉన్నత దశకు ఒక గుణాత్మకమైన గెంతును తీసుకుంది. పెట్టుబడిదారీ విధానపు సామ్రాజ్యవాద దశలో రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నుండి, కార్మికవర్గ విప్లవ క్రమం నుండి మార్క్సిజం-లెనినిజం అనే ఈ గుణాత్మకమైన గెంతు సంభవించింది.

కార్మికవర్గ పార్టీ, సామ్రాజ్యవాదం, రివిజనిజం, సిద్ధాంత పోరాటం, కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వం, యుద్ధం-శాంతి, సోషలిస్టు సమాజంలో వర్గపోరాటం, రాజ్యాంగయంత్రం, జాతులు వలసల సమస్య, రైతు సమస్య, మహిళా సమస్య, సోషలిజం, కమ్యూనిజాల పైన లెనిన్ చేసిన బోధనలు ఇప్పటికీ జీవత్వంతో తొణికిసలాడుతూ అనుసరణీయంగా ఉంటాయి.

లెనిన్ సన్నిహిత సహచరుడైన కామ్రేడ్ స్టాలిన్ మార్క్సిజం-లెనినిజాన్ని కొన్ని రంగాలలో సృజనాత్మకంగా అన్వయించారు, పరిరక్షించారు, అభివృద్ధిపరిచారు. స్టాలిన్ చేర్పులు, లెనినిజంలోని అంతర్భాగమే. కామ్రేడ్ లెనిన్ సిద్ధాంత పునాదులపై ఆధారపడుతూ ఆయన ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు దేశమైన యు.ఎస్.ఎస్.ఆర్.లో సోషలిజాన్ని నిర్మించడంలోనూ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ గొప్ప నాయకత్వ పాత్ర పోషించారు.

లెనిన్ అనంతరం మావో వలస విధానానికి, నయా వలస విధానానికి, సోషల్ సామ్రాజ్యవాదానికి సంబంధించిన నూతన చారిత్రక పరిస్థితుల్లో ఎదురైన కార్మికవర్గ విప్లవ సమస్యలను పరిష్కరించి మార్క్సిజం-లెనినిజానికి నూతన ఆవిష్కరణలను జోడించారు. మావో మార్క్సిజం-లెనినిజం యొక్క సార్వజనీన సత్యాన్ని చైనా విప్లవాచరణకు, అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవాచరణకు సృజనాత్మకంగా అన్వయించారు. ఆయన మార్క్సిజం-లెనినిజాన్ని వారసత్వంగా పుణికిపుచ్చుకొని దానిని పరిరక్షించారు, అభివృద్ధిపరిచారు. మార్క్సిజంలోని మూడు అంతర్భాగాలను-మార్క్సిస్టు తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజంను, మార్క్సిజం-లెనినిజాన్ని ఆయన ఒక నూతనమైన ఉన్నత దశకు అభివృద్ధిపరిచారు. మార్క్సిస్టు-లెనినిస్టు వ్యూహం-ఎత్తుగడలను కామ్రేడ్ మావో మరింతగా అభివృద్ధిపరిచారు. పెట్టుబడిదారీ ఐరోపాకు పూర్తిగా భిన్నమైన పరిస్థితిలో, వలస, అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశమైన చైనాలో 28 ఏళ్ల విప్లవ పోరాట క్రమంలో దీర్ఘకాల ప్రజాయుద్ధ భావనను, నూతన ప్రజాస్వామిక విప్లవ భావనను అభివృద్ధి చేశారు. ఆయన రూపొందించిన ఈ సిద్ధాంతాలు మార్క్సిజం-లెనినిజం ఆయుధాగారానికి విలక్షణమైన చేర్పు.

1949లో చైనా విప్లవం విజయవంతంగా పరిపూర్తి చెందింది. అటు పిమ్మట చైనా కమ్యూనిస్టు పార్టీలో తలెత్తిన వివిధ రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని నడిపే క్రమంలో, కృశ్చేవ్ రివిజనిజానికి, ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా పోరాటాన్ని నడిపే క్రమంలో ఆయన కొన్ని అత్యంత అద్భుతమైన చేర్పులను చేశారు. ఆ పోరాటం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో గ్రేట్ డిబేట్‌గా సుప్రసిద్ధమైంది. ఆయన నయావలసవాదం, సోషల్ సామ్రాజ్యవాదం, యుద్ధం-విప్లవం, సోషలిస్టు నిర్మాణం, సోషలిస్టు సమాజంలో నిరంతరాయంగా జరిగే వర్గపోరాటం గురించిన గొప్ప సిద్ధాంతాలు చేశారు. ఆయన ప్రపంచాన్ని కుదిపివేసిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభించి దానికి నాయకత్వం వహించారు. ఆ సాంస్కృతిక విప్లవం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోని ఒక చారిత్రక మలుపును సూచిస్తుంది. ఈ కాలంలో, ఆయన పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించడం కోసం, సోషలిస్టు వ్యవస్థను, కార్మికవర్గ నియంతృత్వాన్ని దృఢతరం చేసి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం దిశగా పురోగమించడం అనే లక్ష్యంతో, కార్మికవర్గ నియంతృత్వం కింద విప్లవాన్ని కొనసాగించే సిద్ధాంతాన్ని అభివృద్ధిపరిచారు. వీటితో పాటు కళలు, సాహిత్యం, మహిళా సమస్య తదితర విషయాలలో మార్క్సిజం-లెనినిజానికి గొప్ప చేర్పులను చేశారు. మొత్తంగా చూస్తే కామ్రేడ్ మావో మార్క్సిజం-లెనినిజం అనే విజ్ఞాన శాస్త్రాన్ని దాని మూడవది, ఉన్నతమైనది, గుణాత్మకంగా నూతనమైనది అయిన దశకు, మావోయిజం అనే దశకు అభివృద్ధిపరిచారు.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజం నేడు ఒక సమగ్రమైన సిద్ధాంతం. ప్రపంచ కార్మికవర్గపు అత్యంత పురోగతి చెందిన శాస్త్రీయమైన భావజాలం. అది ఒక సమగ్రమైన తాత్విక వ్యవస్థ, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం, ప్రపంచాన్ని అర్థం చేసుకొని విప్లవం ద్వారా పరివర్తన చెందించే కార్మికవర్గ వ్యూహం-ఎత్తుగడలు. కార్మికవర్గానికి ఎం.ఎల్.ఎం. అత్యంత శక్తివంతమైన, అద్భుతమైన మహత్తర సైద్ధాంతిక ఆయుధం. మనం దీనితో బూర్జువా వర్గ భావజాలాన్ని, అన్ని రకాల రివిజనిజాన్ని ఎదిరించగలుగుతాం, ఓడించగలుగుతాం.

నేడు మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని తన మార్గదర్శక విశ్వజనీన సిద్ధాంతంగా స్వీకరించి విప్లవకర ఆచరణ కొనసాగిస్తున్న కమ్యూనిస్టు పార్టీయే నిజమైన మార్క్సిస్టు పార్టీ లేదా నిజమైన మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీ.

మావో మరణానంతరం ఆధునిక రివిజనిస్టు హువా-డెంగ్ విద్రోహ ముఠా ప్రతీఘాతుక కుట్ర ద్వారా అధికారం హస్తగతం చేసుకోవడంతో ప్రపంచ కార్మికవర్గం చిట్టచివరి విప్లవ

స్థావరాన్ని కోల్పోయింది. ప్రపంచ స్థాయిలో తాత్కాలికంగా విప్లవంపై ప్రతీఘాతుక విప్లవం, కార్మికవర్గంపై పెట్టుబడిదారీ వర్గం విజయం సాధించాయి. మరొక్కసారి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో గందరగోళం వ్యాపించింది. పలు దేశాల్లో విప్లవకర మార్క్సిజం (ఎం.ఎల్.ఎం)ని దృఢంగా అంటిపెట్టుకొని తమ స్వీయబలంపై, ప్రజలపై ఆధారపడి స్వతంత్రంగా పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు పార్టీలు విప్లవ ప్రతీఘాతుక డెంగ్ ఆధునిక రివిజనిజాన్ని తిరస్కరించాయి. ఇందుకు భిన్నంగా మాటల్లో మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని జపిస్తూనే ఆచరణలో డెంగ్ రివిజనిస్టు పంథాను అనుసరించిన కమ్యూనిస్టు పార్టీలు చాలా బలహీనపడ్డాయి లేదా పూర్తిగా కనుమరుగయ్యాయి. సంఘటిత ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం చాలా బలహీనపడింది. సోషలిస్టు దేశాలు ఉనికిలో ఉన్నప్పుడు ఆయా దేశాల కమ్యూనిస్టు పార్టీలలోని రివిజనిస్టు నాయకత్వం చేసిన ద్రోహంతో పాటు, ఈ పార్టీలలోని విప్లవకర సెక్షన్ సోషలిజాన్ని సంఘటితం చేయడానికి చేసిన కృషిలోనూ, సోషలిజానికి అడ్డుతగిలిన పెట్టుబడిదారీ మార్గీయులైన ఆధునిక రివిజనిస్టు సెక్షన్‌ను ఓడించటానికి చేసిన సైద్ధాంతిక, రాజకీయ కృషిలోనూ, సోషలిస్టు నిర్మాణంలో అశేష శ్రమజీవులను చైతన్యవంతంగా కదిలించడానికి చేసిన కృషిలోనూ దొర్లిన పొరపాట్ల వల్ల; ఆనాడు ప్రపంచంలో ఒక ప్రబలమైన వ్యవస్థగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిస్టు దేశాల్లోని ప్రజలపై కలిగించిన ప్రభావం వల్ల; సామ్రాజ్యవాదులు సోషలిస్టు వ్యవస్థను నాశనం చేయడానికి నిరంతరం వేయిన్నొక్క రకాలుగా పన్నిన కుట్రలు, కుహకాల వల్ల ప్రపంచ విప్లవానికి ఇంత తీవ్రమైన నష్టం కలిగింది.

అందువల్ల ప్రపంచ సోషలిస్టు విప్లవంలో ఎదురైన ఓటముల నుండి నేర్చుకొని – కార్మికవర్గ నియంతృత్వం కింద సోషలిస్టు సమాజంలో కమ్యూనిజం సాధన లక్ష్యంగా సోషలిస్టు నిర్మాణ క్రమం విజయవంతంగా పరిపూర్తి కావటానికి సరైన మౌలిక పంథాను, విధానాలను అవలంభించడంతో పాటు సకల రంగాల్లో కార్మిక తదితర విశాల శ్రామిక ప్రజారాశులను చైతన్యవంతంగా కదిలించాల్సి ఉంటుంది. సోషలిస్టు సమాజంలో కార్మికవర్గ నియంతృత్వం కింద కమ్యూనిజం సాధన లక్ష్యంతో సుదీర్ఘకాలం పాటు సాగే విప్లవాత్మక పరివర్తనా క్రమానికి అడ్డుతగిలే తిరోగామి (గత సమాజాల కాలంచెల్లిన అభివృద్ధి నిరోధక దోపిడీ వర్గాలకు నూతన రూపాల్లో ప్రాతినిధ్యం వహించే) శక్తులు నిరంతరాయంగా చేసే విప్లవ ప్రతీఘాతుక కృషిని ఓడించటానికీ, గత వర్గసమాజాల నుండి సంక్రమించిన భావజాలం నుండీ, సంస్కృతి నుండీ ప్రజలు సంపూర్ణంగా విముక్తి చెందటానికి నిరంతరాయంగా కొనసాగించే సాంస్కృతిక విప్లవాల్లో సాధించే విజయాలపై ఆధారపడీ; బయటి నుండి పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద దేశాలు చేసే జోక్యాన్ని, దాడిని విఫలం చేయడంపై ఆధారపడీ; వర్గదోపిడీ సామాజిక అణచివేత పునాదిగా,

స్వార్థపూరిత భావజాలం పునాదిగా కొనసాగే పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద సమాజాలు కలిగించే ప్రభావాన్ని సోషలిస్టు సమాజాలలోని కార్మికవర్గం, అశేష ప్రజానీకం తిప్పికొట్టేలా కమ్యూనిస్టు పార్టీ సమర్థవంతంగా నిర్వహించే నాయకత్వ పాత్రపై ఆధారపడీ; పెట్టుబడిదారీ పాలనను కూలదోసి సోషలిజం స్థాపించటానికి వివిధ దేశాల్లోని కార్మికవర్గం–విశాల ప్రజానీకం కొనసాగించే విప్లవాల విజయంపై ఆధారపడీ; ప్రపంచంలోని అన్ని సమాజాలు పరస్పరం నిరంతరాయంగా అభివృద్ధికరమైన దాన్నంతటినీ స్వీకరించి సృజనాత్మకంగా అన్వయించుకోవడంతో పాటు పురోగమనానికి అనుగుణంగా నూతన ప్రయోగాలు చేయడంపై ఆధారపడీ; వివిధ రంగాల్లో ముందుకు వచ్చే నూతన సవాళ్లను ఎదుర్కోవడంపై ఆధారపడీ అంతిమంగా ప్రపంచంలో వర్గ–సామాజిక అంతరాలు లేని సమాజం, అంటే వర్గరహిత సమాజం–కమ్యూనిజం ఉనికిలోకి వస్తుంది.

గతంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం రివిజనిస్టు ద్రోహానికి గురై ఎదురు దెబ్బలు తిన్న సందర్భంగా జరిగినట్లే రివిజనిజంతో విప్లవకర మార్క్సిజం (ఎంఎల్ఎం) తెగతెంపులు చేసుకొని, లొంగుబాటును తిరస్కరించి ప్రతిఘటనను కొనసాగిస్తున్నది. పలు అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాల్లో ప్రజాయుద్ధం కొనసాగిస్తున్న, పలు సామ్రాజ్యవాద దేశాల్లో విప్లవకర కర్తవ్యాలను నిర్వర్తిస్తున్న నిజమైన కమ్యూనిస్టు పార్టీలు అంతర్జాతీయ కమ్యూనిస్టు విప్లవ శిబిరానికి ప్రేరణనిస్తున్నాయి. ప్రపంచంలో సామ్రాజ్యవాదానికీ, ఆధునిక రివిజనిజానికీ, అభివృద్ధి నిరోధకత్వానికీ వ్యతిరేకంగా స్పాంటేనియస్‌గానూ, ప్రణాళికాబద్ధంగానూ కార్మికవర్గం, పీడిత జాతులు, పీడిత ప్రజలు విస్తృతంగా పోరాడుతున్నారు. పోరాట నేపథ్యాలు, పోరాట రూపాలు వేరయ్యాయే గానీ పోరాటాలు ఆగిపోలేదు. అజేయమైన మార్క్సిజం–లెనినిజం–మావోయిజం మార్గదర్శకత్వాన చైతన్యవంతులైన కార్మికులు, విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలో మున్నెన్నడూ కంటే కూడా అపార అనుభవాలతో సామ్రాజ్యవాదాన్నీ, ఆధునిక రివిజనిజాన్ని నిర్మూలించి జనతా ప్రజాస్వామ్యాన్ని, సోషలిజం–కమ్యూనిజాన్ని స్థాపించడానికి పున:సంఘటితమవుతున్నాయి. సామ్రాజ్యవాదుల, విప్లవ ప్రతీఘాతకుల విజయం ఎంతోకాలం నిలవదు.

గత 170 ఏండ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా వర్గపోరాట, ఉత్పత్తి, శాస్త్రీయ ప్రయోగ రంగాల్లోనూ అపూర్వమైన, ఆశ్చర్యజనకమైన, అద్భుతమైన విప్లవాత్మక మార్పులెన్నో జరిగాయి. వీటి ఫలితంగా నూతన సవాళ్లు, నూతన అవకాశాలు సామాజిక విప్లవాల ముందుకు వచ్చాయి. ఈ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి సామాజిక విప్లవాలకు సమర్థవంతంగా నాయకత్వం వహించాల్సిన గురుతర కర్తవ్యం విప్లవ పార్టీల ముందు, ప్రజాస్వామిక సంస్థల ముందు ఉంది.

గత 170 సంవత్సరాల్లో అంతర్జాతీయ విప్లవ కార్మికవర్గం, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తీవ్రమైన వర్గపోరాటాలు కొనసాగించడం ద్వారానే, భీషణమైన వర్గయుద్ధాలు చేయడం ద్వారానే కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఒక దశ నుండి మరొక దశకు అభివృద్ధి చేయగలిగింది. ప్రపంచ కార్మికవర్గం సాధించిన మహత్తర విజయాలన్నింటికీ ప్రధాన కారణం పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా, అభివృద్ధి నిరోధకత్వానికి వ్యతిరేకంగా తాను సకల రంగాల్లో కొనసాగించిన విప్లవకర వర్గయుద్ధాలే.

కార్మికవర్గానికి, పెట్టుబడిదారులకు మధ్య జరిగే ఈ వర్గ సంఘర్షణ సిద్ధాంత రంగంలో మార్క్సిస్టులకు, రివిజనిస్టులకు మధ్య జరిగే పోరాటంగా ప్రతిబింబించింది. ప్రపంచ విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగంగా విప్లవకర మార్క్సిజం రివిజనిజంతో రాజీ లేకుండా చేసిన సిద్ధాంత పోరాటం ద్వారానే అది అభివృద్ధి చెందుతూ వచ్చింది.

ప్రపంచ సోషలిస్టు మహావిప్లవం, పెట్టుబడితో జరిగే పోరాటంలో తన యుద్ధ కేంద్రాలను మార్చుకుంటూ పురోగమిస్తున్నది. ఇలాంటి పరిస్థితిలో భారతదేశంలో విప్లవకర కార్మికవర్గ అగ్రగామి సంస్థగా సిపిఐ(మావోయిస్టు) ప్రపంచ సోషలిస్టు విప్లవంలో తన వంతు పాత్రకు గల ప్రాధాన్యతను గుర్తించి అందుకు అనుగుణంగా పనిచేయటానికి కృషి చేస్తున్నది. ఇదే అవగాహనతో నేడు ప్రపంచంలోని చాలా దేశాల్లో విప్లవకర కార్మికవర్గ పార్టీలు–సంస్థలు తమ తమ దేశాల్లో విప్లవోద్యమాల నిర్మాణానికి సన్నద్ధమవుతున్నాయి లేదా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నాయి.

## అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ పంథా – భారత కమ్యూనిస్టు ఉద్యమం

"తామూ–అనగా తానూ ప్రఖ్యాతి వహించిన తన మిత్రుడూ–చేసిన ఉపదేశం ఒక పిడిసూత్రం కాదు, కార్యాచరణకు అది ఒక మార్గదర్శి".– ఏంగెల్స్

మనం "మార్క్సిజపు మూల సూత్రాలను ఎన్నడూ అతిక్రమించరాదు. అలా కాకపోతే, తప్పులు జరుగుతాయి. మార్క్సిజాన్ని అధిభౌతిక దృష్టికోణం నుండి చూసి, దాన్ని ఎదుగూ బొదుగూ లేని దాన్నిగా పరిగణించడం పిడివాదమే. మార్క్సిజపు మూలసూత్రాలను త్రోసిరాజనడమూ, దాని విశ్వజనీన సత్యాన్ని త్రోసిరాజనడమూ రివిజనిజమే." – మావో

మార్క్సిస్టు దృక్పథం ప్రకారం, *"వర్గాలుగా విడిపోయిన సమాజం ఆవిర్భవించిన నాటి నుండి ప్రపంచవ్యాప్తంగా సాగిన సామాజిక అభివృద్ధి చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రే. సామాజికాభివృద్ధి క్రమంలో భిన్న దేశాల ప్రజల విప్లవ పోరాటాలు భిన్న దశల గుండా సాగుతాయి. ఆ పోరాటాలకు వాటి వాటి ప్రత్యేక స్వాభావిక లక్షణాలు కూడా ఉంటాయి.*

అయితే అవి ఎల్లప్పుడూ చారిత్రకాభివృద్ధికి సంబంధించిన సాధారణ నియమాలకు లోబడే ఉంటాయి. వర్గపోరాటం ద్వారా సాగుతున్న ప్రపంచ చారిత్రకాభివృద్ధి గమనం వర్గాలులేని, దోపిడీలేని సమాజాన్ని నెలకొల్పే దిశగానే, సోషలిజం, కమ్యూనిజం దిశగానే సాగుతున్నది. భారత ప్రజల విప్లవోద్యమం కూడా విభిన్న దశల గుండానే పురోగమిస్తున్నది. దీనికి కూడా తన సొంత ప్రత్యేకతలు ఉన్నాయి. అయితే అది సోషలిజం, కమ్యూనిజాల దిశగా సాగే సాధారణ అభివృద్ధి నియమాల పరిధిలోనే ఉంటుంది.

అంతర్జాతీయ కార్మికవర్గపు, దాని అగ్రగామి దళమైన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల ప్రపంచవ్యాప్త చారిత్రక లక్ష్యం పూర్తిగా చారిత్రకాభివృద్ధి నియమాలకు అనుగుణ్యంగానే ఉన్నది. భారత కార్మికవర్గపు, మొత్తంగా ప్రపంచ కార్మికవర్గపు చారిత్రక లక్ష్యం ప్రపంచ వ్యాప్తంగా సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని నెలకొల్పడమే.

మహత్తర అక్టోబరు విప్లవం అంతర్జాతీయ కార్మికవర్గం, ప్రజలు సాగించిన విప్లవ పోరాటాల అనివార్యమైన ఫలితమే తప్ప వేరేమీ కాదు. ఇక మహత్తర చైనా విప్లవం ఆ క్రమం యొక్క కొనసాగింపే. భారత విప్లవం కూడా అంతర్జాతీయ కార్మికవర్గం, ప్రజలు సాగిస్తున్న విప్లవ పోరాటాలలో ఒక విడదీయరాని భాగమే.

"అందువలన 'మొత్తం ప్రపంచానికి, ప్రపంచ రాజకీయాలకు, ఆర్థికానికి సంబంధించిన వస్తుగత పరిస్థితుల సరైన వర్గ విశ్లేషణ, అంటే వర్తమాన ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాల గురించి, వాటి మధ్య పరస్పర సంబంధాలు, ప్రభావాల గురించి మార్క్సిజం-లెనినిజం ప్రాతిపదిక పైన చేసిన సరైన వర్గ విశ్లేషణా' లేకుండా అంతర్జాతీయ పరిస్థితిని, భారతదేశంలోని అంతర్గత పరిస్థితిని సరిగ్గా అంచనా కట్టడం అసాధ్యం; సకల దేశాల కార్మికవర్గం, ప్రజల విప్లవ పోరాటాల ప్రధాన దిశను నిర్ణయించే సాధారణ పంథాను రూపొందించడం లేదా దాని ప్రాధాన్యతను గుర్తించడం అసాధ్యం; ఆ సాధారణ పంథాకు అనుగుణంగా భారత విప్లవానికి వ్యూహం-ఎత్తుగడలను నిర్ణయించడం కూడా అసాధ్యమే. అంతర్జాతీయ పరిస్థితి వెలుగులో, ప్రపంచవ్యాప్త ప్రజా విప్లవ పోరాటాల వెలుగులో మాత్రమే భారతదేశపు నిర్దిష్ట వస్తుగత పరిస్థితిని, భారత విప్లవ సమస్యను అంచనా వేయగలుగుతాము." (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 11)

"ఏ విప్లవంలోనైనా గాని, ఎప్పుడైనా గాని ఆ నిర్దిష్ట విప్లవ దశను ఆ దశకు సంబంధించిన కార్యక్రమంపై ఆధారపడి విజయవంతంగా పరిపూర్తి చేయడమే వ్యూహం-ఎత్తుగడల లక్ష్యంగా ఉంటుంది. సిద్ధాంతం కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహించాలి, కార్యక్రమం వ్యూహానికి మార్గదర్శకత్వం వహించాలి, వ్యూహం ఎత్తుగడలకు మార్గదర్శకత్వం వహించాలి అంటూ

*కామ్రేడ్ స్టాలిన్ సూచించిన మార్గదర్శక సూత్రాన్ని దృష్టిలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత, కార్యక్రమాల నుండి సమకూరిన సమాచారం (డేటా) పైనా, సిద్ధాంత, కార్యక్రమాల నుండి రాబట్టిన నిర్ధారణల పైనా ఆధారపడడం ద్వారా మాత్రమే వ్యూహాన్ని సరిగ్గా రూపొందించగలుగుతాం.*

*మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సార్వత్రిక సత్యాన్ని మన దేశంలో నెలకొని ఉన్న నిర్దిష్ట పరిస్థితులను సృజనాత్మకంగా అన్వయించడం ద్వారా భారత విప్లవ వ్యూహాన్ని, ఎత్తుగడలను రూపొందించాలి. అంటే వ్యూహం, ఎత్తుగడలు భారత సమాజంలోని వర్గాల వస్తుగత విశ్లేషణపైన, భారత రాజ్యపు స్వభావంపైన, మౌలిక వైరుధ్యాలపైన, ప్రధాన వైరుధ్యంపైన ఆధారపడి, భారత పరిస్థితికి సంబంధించిన విశిష్ట స్వాభావిక లక్షణాలను, ప్రత్యేక లక్షణాలను, ప్రత్యేకతలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా రూపొందించుకోవాలని అర్థం.*

*అందువలన భారత విప్లవపు ప్రస్తుత దశకు సంబంధించిన వ్యూహం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతంగా పరిపూర్తి చేసి నూతన ప్రజాస్వామిక కార్యక్రమాన్ని సాధించేందుకు దోహదపడేదిగా ఉండాలి. వివిధ ప్రాంతాలలో వివిధ సమయాలలో ఉద్యమం యొక్క ప్రతి మలుపులోనూ రూపొందించాల్సిన ఎత్తుగడలు పైన పేర్కొన్న ఆ వ్యూహానికి లోబడి ఉంటూ, దాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడేవిగా ఉండాలి. భారత విప్లవపు కార్యక్రమానికి, వ్యూహం-ఎత్తుగడలకు మధ్య ఉన్న గతితార్కిక సంబంధం అలాంటిది."* (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 7)

*"క్లుప్తంగా చెప్పాలంటే, వర్తమాన ప్రపంచపు వస్తుగత పరిస్థితి నేటి ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలలోనూ, వాటి మధ్య అంతర్గత సంబంధాలు అంతర్గత ప్రభావాలలోనూ వ్యక్తమౌతుంది. ఆ మౌలిక వైరుధ్యాలు ఇవి : ఎ) సామ్రాజ్యవాదానికి, పీడిత జాతులకు, ప్రజలకు మధ్య ఉన్న వైరుధ్యం; బి) పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గానికి బూర్జువా వర్గానికి మధ్య ఉన్న వైరుధ్యం; సి) వివిధ సామ్రాజ్యవాద దేశాల మధ్య ఉన్న వైరుధ్యం."* (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 11-12)

నేటి ప్రపంచంలో సామ్రాజ్యవాదానికి పీడిత జాతులతో, పీడిత ప్రజలతో ఉన్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం. సామ్రాజ్యవాదులను, ప్రతీఘాతకులను అధికారం నుండి కూలదోసి జాతీయ స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని సాధించే జాతీయ ప్రజాస్వామిక విప్లవాలకూ, జాతీయ విముక్తి ఉద్యమాలకు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాదం గణనీయంగా బలహీనపడి, ప్రపంచవ్యాప్తంగా

జాతి విముక్తి పోరాటాలు వృద్ధి చెందుతున్నందువల్ల ప్రత్యక్ష వలస పాలన ముగియడంతో, సామ్రాజ్యవాదులకు తమ మాజీ వలసలలో దోపిడీకి, అజమాయిషీకి, పాలనకు కొత్త పద్ధతులను అంటే నయా వలసవాదాన్ని చేపట్టడం తప్పనిసరైంది. ఈ విషయంలో వారు ఎంపిక చేసి తర్ఫీదునందించిన ఈ దేశాల్లోని తమ దళారీలపై ఆధారపడతారు. ఈ నయా వలస పాలన అనేది మరింత మోసపూరితమైన, మరింత దుర్మార్గమైన, మరింత వినాశకరమైన రూపంలోని వలసవాదం. అది తన ఆక్టోపస్ టెంటకిల్స్‌ను మొత్తంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలన్నింటికి విస్తరింపజేసింది. అయితే వలసవాదానికి వ్యతిరేకంగా పీడిత జాతులు, పీడిత ప్రజలు పోరాడినట్లే నయావలసవాదానికి వ్యతిరేకంగా కూడా పోరాడుతున్నారు. తర్వాతి కాలంలో కూడా ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాల ఫలితంగా సామ్రాజ్యవాద దేశాలలోనూ, వలస, అర్ధవలస దేశాలలోనూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా, సాంస్కృతికంగా, సాంకేతికంగా, పర్యావరణపరంగా చాలా వేగంగా గణనీయమైన మార్పులు జరిగి కార్మికోద్యమాలను గణనీయంగా ప్రభావితం చేశాయి. ఈ మార్పులను నూతన పరిస్థితులలో సామ్రాజ్యవాదులు, సోషల్ సామ్రాజ్యవాదులు అనుసరించిన నయావలస విధానంలో భాగంగా కూడా చూడాలి. వీటిని విప్లవకర కార్మికవర్గ పార్టీలు గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథంతో సమగ్రంగా అర్థం చేసుకోవడం ద్వారా సరైన ఎత్తుగడలను అభివృద్ధి చేసుకోగలుగుతాయి. తద్వారా కార్మికవర్గ పార్టీలు నూతన పరిస్థితులలో నూతన ఎత్తుగడలతో విప్లవోద్యమాలను విజయవంతంగా పురోగమింపజేయగలుగుతాయి. మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళిక రాసినప్పటి నుండీ కార్మికవర్గ పార్టీలు ఇలాంటి శాస్త్రీయ పద్ధతుల్లో జరిపిన విప్లవకర కృషి ద్వారానే పురోగమించిన ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర, సాధించిన మహత్తర విజయాల గొప్ప చరిత్ర మన ముందుంది. ఆయా దేశాలలోని సామాజిక పరిస్థితిని విశ్లేషించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవలసిన ముఖ్యమైన అంశాలివి.

కామ్రేడ్ లెనిన్ నాయకత్వాన రష్యాలో మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతమైన తర్వాత మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం మన దేశంలో ప్రాచుర్యంలోకి వచ్చింది. రష్యా అక్టోబర్ సోషలిస్టు విప్లవ ప్రభావంతోనూ, మార్క్సిజం-లెనినిజం ప్రభావంతోనూ, బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేసిన వీరోచిత పోరాటాల ఫలితంగానూ, 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పడింది. అయితే సిపిఐ ఏర్పడినప్పటి నుండి వీరోచిత చారిత్రాత్మక నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు వరకూ, 1947కు ముందు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మిక, రైతాంగ, ఆదివాసీ, దళిత, విద్యార్థి తదితర సెక్షన్ల సమరశీల ఉద్యమాల వెల్లువలు పెల్లుబుకుతూ మహత్తర విప్లవ అవకాశాలు ముందుకు వచ్చాయి. తర్వాత సామ్రాజ్యవాదానికీ, దాని దళారీలకు

వ్యతిరేకంగా సాయుధ వ్యవసాయ విప్లవ ఉద్యమ నిర్మాణానికి అత్యంత అనుకూలమైన విప్లవ పరిస్థితి నెలకొని ఉంది. అయినా సిపిఐ నాయకత్వం వీటిని వినియోగించుకోవడంలో ఘోరాతిఘోరంగా విఫలం కావడమే గాకుండా వీరోచిత తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి ద్రోహం చేసి బూర్జువా పార్లమెంటరీ పార్టీగా దిగజారిపోయింది. అప్పటి నుండి ఈ రివిజనిస్టు నాయకత్వం పాలకవర్గాలకు తోడుదొంగలా, నమ్మినబంటులా వ్యవహరించింది. ఈ రెండు పార్టీల రివిజనిస్టు నాయకత్వం విప్లవ విద్రోహకర ఆధునిక రివిజనిస్టు కృశ్చేవ్ రివిజనిజానికి వకాల్తాదారుగా వ్యవహరించింది. వీరోచిత నక్సల్బరీ తిరుగుబాటు పట్ల సిపిఐ(ఎం) సోషల్ ఫాసిస్టు వైఖరి నవలంభించగా, సిపిఐ ఈ తిరుగుబాటును సంపూర్ణంగా వ్యతిరేకించింది. ఈ పార్టీలది మాటల్లో మార్క్సిజం, ఆచరణలో రివిజనిజం. ఈ విధంగా మొదటి నుండి 1951 వరకు సిపిఐ నాయకత్వం ప్రధానంగా మితవాద అవకాశవాద పంథాను అనుసరించింది; స్వల్పకాలం అతివాద పంథాననుసరించింది. ఈ నాయకత్వం ఇలాంటి మితవాద, అతివాద సైద్ధాంతిక, రాజకీయ తప్పిదాలు చేస్తూ వినాశకర అవకాశవాద పంథాల్లో కొట్టుకొనిపోతూ భారత విప్లవానికి ఘోరమైన అపచారం చేసింది.

దీనికి మూలం ఈ నాయకత్వం మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్నీ, మార్క్సిజపు విప్లవతత్వాన్నీ, అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ పంథాని తప్పుగా అర్థం చేసుకోవడంలో ఉంది. వీరిది భావవాద దృక్పథం, వామపక్ష బూర్జువా జాతీయవాదం. అందువల్లనే సిపిఐ ఏర్పడే నాటికే అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గంచే, వాటి పార్టీలచే ఆమోదించబడిన, సరైనవిగా రుజువైన మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాలను, అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్ర, ప్రత్యేకంగా వీరోచిత పారిస్ కమ్యూన్, మహత్తర రష్యా అక్టోబర్ విప్లవ విజయం, గొప్ప చైనా నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం-దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా అందించిన అమూల్యమైన పాఠాలను సిపిఐ-సిపిఎం నాయకత్వాలు ఎన్నడు కూడ నిజాయితీగా స్వీకరించలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మూలసూత్రాలకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించారు. అందువల్లే ఈ రివిజనిస్టు నాయకత్వం ఒక నిజమైన విప్లవకర మార్క్సిస్టు పార్టీ అనుసరించాల్సిన సైద్ధాంతిక, రాజకీయ పంథా ప్రాధాన్యతను గుర్తించలేదు. ఈ విషయంలో కామ్రేడ్ మావో ఇలా చెప్పారు. "సైద్ధాంతిక, రాజకీయ పంథా యొక్క సవ్యాపసవ్యాలే అన్నింటినీ నిర్ణయిస్తుంది."

అయినప్పటికీ, సిపిఐకి చెందిన వీరోచిత శ్రేణులు పోరాడే ప్రజలతో భుజం భుజం కలిపి అనేక విప్లవ పోరాటాలకు నాయకత్వం వహించారు. భారత ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసే ఉన్నతాశయాన్ని సాధించడం కోసం ఎంతోమంది తమ విలువైన ప్రాణాల్ని అర్పించారు. విప్లవ శ్రేణులకు ప్రాతినిధ్యం వహించే ఎంతోమంది నిజమైన విప్లవకర కేడర్లు ప్రజలతో

మమేకమై వారి పోరాటాలకు ముందుపీఠీన నిలిచారు. వీరు, సి.పి.ఐ.లో పెత్తనం చెలాయిస్తున్న నాయకత్వపు అవకాశవాద తప్పుడు, రివిజనిస్టు పంథాలతోనూ, వారి వెన్నుపోటులతోనూ, అటు తర్వాత అదే తరహాలోని సి.పి.ఐ.(ఎం)తోనూ సైద్ధాంతికంగా, రాజకీయంగా పోరాడుతూ వచ్చారు. ఇలాంటి క్యాడర్లు నిరంతరం నాయకత్వ కక్షసాధింపుకు గురయ్యారు. ముందు ఈ కేడర్లు, వీరి సైద్ధాంతిక, రాజకీయ పోరాటం చెల్లాచెదరుగా ఉండినప్పటికీ క్రమంగా వీరిందులో అనుభవం సంపాదిస్తూ సంఘటితపడసాగారు. దీనితో క్రమంగా అవకాశవాద నాయకత్వం, పార్టీ శ్రేణుల్లో మరింతగా బట్టబయలై పోతూ వచ్చింది. కానీ 1950వ దశకం చివరలోనూ, 1960వ దశకంలోనూ ఈ పోరాటం పూర్తిగా కొత్త కోణాల్ని సంతరించుకుంది. కామ్రేడ్ మావో సే టుంగ్ నాయకత్వం కింద చైనా కమ్యూనిస్టు పార్టీ కృశ్చేవ్ ముఠా ముందుకు తెచ్చిన ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా కొనసాగించిన గ్రేట్ డిబేట్ ఈ నూతన ఆరంభానికి సంకేతంగా నిలిచింది. ఈ గ్రేట్ డిబేట్ ఎలా ఇంకా ఇంకా తీవ్రతరమవుతూ, చివరకు భూమిని కంపింపజేసిన శ్రామికవర్గ మహత్తర సాంస్కృతిక విప్లవానికి దారితీసిందో అలాగే మనదేశంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా విప్లవ కేడర్లు నిర్వహిస్తూ వచ్చిన సైద్ధాంతిక, రాజకీయ పోరాటం కూడా ఇంకా ఇంకా తీవ్రతరమైంది.ఇది రివిజనిస్టు నాయకత్వం తోనూ, వారు అనుసరిస్తూ వచ్చిన రివిజనిస్టు పంథాతోనూ పూర్తిగా తెగతెంపులు చేసుకొనే స్థాయికి చేరుకుంది. శ్రామికవర్గ మహత్తర సాంస్కృతిక విప్లవారంభం ఈ క్రమానికి ఒక మూలమలుపుగా నిలిచింది. ఈ క్రమపు ప్రత్యక్ష ప్రభావంతో అప్పుడు సి.పి.ఐ., అనంతరం సి.పి.ఐ.(ఎం) నాయకత్వపు రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ప్రాతినిధ్యం వహించే శక్తులు సైద్ధాంతికంగానూ, అంతకంటే ముఖ్యంగా తమ విప్లవ కార్యాచరణలోనూ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని సమర్థించి అవగాహన చేసుకోసాగారు. దాంతో ఈ శక్తులు సి.పి.ఐ.(ఎం) 7వ కాంగ్రెస్ కార్యక్రమాన్ని రివిజనిస్టు కార్యక్రమం అనీ, దీని నాయకత్వం ఆధునిక రివిజనిస్టు ముఠా అని ఖండించాయి. ఈ విధంగా కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ ఛటర్జీల వంటి మొదటి శ్రేణి, గొప్ప నాయకులతో సహా పెద్ద సంఖ్యలోని మావోయిస్టు శక్తులు విప్లవ రాజకీయ రంగం మీదకు వచ్చాయి. కామ్రేడ్ చారు మజుందార్ భారత నూతన ప్రజాస్వామిక విప్లవ మౌలిక సమస్యలను పరిష్కరిస్తూ ఎనిమిది డాక్యుమెంట్లు రాసి విడుదల చేయడంతో పాటు డార్జిలింగ్ ప్రాంత రైతాంగంలో సాయుధ వ్యవసాయ విప్లవానికి సన్నాహాలు చేయడం; కామ్రేడ్ కన్హయ్ ఛటర్జీ నాయకత్వంలో చింతా-దక్షిణదేశ్‌ల ద్వారా భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ కృషి ఆరంభించడం, వీటన్నింటి గొప్ప ముగింపే కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో మే 1967లో బద్దలైన మహత్తర నక్సల్బరీ సాయుధ వ్యవసాయ

విప్లవ తిరుగుబాటు. ఇది 'భారతదేశంలో వసంతకాల మేఘ ఘర్జన'కు శంఖారావమైంది. అప్పటి నుండి, దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర గుణాత్మకమైన నూతన మలుపును తీసుకుంది. నక్సల్బరీ తిరుగుబాటుతో, విప్లవ శక్తులు ఆచరణాత్మకంగా రివిజనిజాన్ని గొప్పగా ఎండగట్టి, దానితో శాశ్వతంగా తెగతెంపులు చేసుకొని, నూతన విప్లవ కమ్యూనిస్టు నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవటానికి తోడ్పడడమే గాక, అది మొట్టమొదటి సారిగా భారత ఉపఖండంలో సైతం ఎం.ఎల్.ఎం.నూ, కామ్రేడ్ మావో అప్పటికే రూపొందించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం అనే ఉజ్వల బాట యొక్క మొట్టమొదటి చైతన్యపూర్వక అన్వయానికి సంకేతంగా నిలిచింది.

ఒక్కమాటలో చెప్పాలంటే, నక్సల్బరీ తిరుగుబాటుకుగానీ, కార్మికవర్గ విప్లవ అగ్రగామి పార్టీగా సిపిఐ(ఎం.ఎల్)(1969 ఏప్రిల్ 22న) మరియు ఎం.సి.సి. (1969 అక్టోబర్ 20న) ఏర్పాటుకుగానీ, భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్నీ-దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్నీ ఆరంభించటానికి గానీ ప్రధాన కారణం భారత కమ్యూనిస్టు ఉద్యమంలోని నిజమైన విప్లవ శక్తులు మార్క్సిజాన్నీ, అంతర్జాతీయ కార్మికవర్గ పంథాను సరిగా అర్థం చేసుకొని, దాని సాఫల్యానికి సాహసోపేతంగా కార్యాచరణలోకి దూకడమే.

దేశవ్యాప్తంగా ప్రతీఘాతుక విప్లవదాడి తీవ్రంగా కొనసాగడం వల్ల, విప్లవశక్తుల స్వీయ పొరపాట్లు-అనుభవరాహిత్యం వల్ల, విప్లవ శక్తుల్లోనే తలెత్తిన మితవాద, అతివాద, అవకాశవాద శక్తుల విచ్ఛిన్నకర చర్యల వల్ల ఐదు సంవత్సరాల్లోనే విప్లవోద్యమం తాత్కాలిక వెనుకపట్టు పట్టింది. అయినప్పటికీ, అనేక ఒడిదుడుకుల మధ్య ఎం.ఎల్.ఎం. వెలుగులో సి.పి.ఐ.(ఎం.ఎల్.) లోని నిజమైన విప్లవ శక్తులకు ప్రాతినిధ్యం వహించే నాయకత్వం, ఎం.సి.సి. నాయకత్వంగత ఆచరణ నుండి గుణపాఠాలు తీసుకొని తప్పులను సరిదిద్దుకుంటూ, పార్టీ శ్రేణులను సమైక్యపరిచాయి. ఈ రెండు పార్టీల నాయకత్వం సామాజిక పరిస్థితులకు తగిన ఎత్తుగడలు రూపొందించుకొని, విప్లవోద్యమాన్ని నిర్మించటానికి కృషి చేశాయి. దీనితో 1970ల చివరి నాటికి భారత విప్లవోద్యమంలో మరొక నూతన వెల్లువ ఆరంభమైంది. ఈ రెండు మావోయిస్టు విప్లవ ప్రవంతులు సరైన విప్లవపంథాపై ఆధారపడి వివిధ రకాల రివిజనిజానికీ, మితవాద, అతివాద అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతికంగా పోరాడాయి. సరైన విప్లవ పంథాపై ఆధారపడుతూ, ఆత్మవిమర్శనా వైఖరితో తప్పులను సరిదిద్దుకున్నాయి. ఆంతరంగికంగా పార్టీలో ముందుకు వచ్చిన మితవాద, అతివాద అవకాశవాద ధోరణులను ఓడించాయి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలోని విప్లవకరమైన అంశాలన్నిటి వారసత్వాన్ని కొనసాగించాయి. ఈ క్రమంలోనే వివిధ నిజమైన విప్లవ శక్తులను తమతో ఐక్యం చేసుకున్నాయి. దీని ఫలితంగానే 2004 సెప్టెంబర్ 21న ఈ రెండు ప్రవంతులు విలీనమై ఒకే మావోయిస్టు పార్టీగా,

సిపిఐ(మావోయిస్టు)గా ఏర్పడడం జరిగింది. సిపిఐ(మావోయిస్టు) ఏర్పాటు అనేది అంతర్జాతీయ కార్మికవర్గ పంథాను మనదేశ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయిస్తూ ఈ పంథాను మరింత సుసంపన్నం చేసిన ఫలితమే. ఇది భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో మరొక గొప్ప ముందడుగు.

మన పార్టీ–సిపిఐ(మావోయిస్టు) ఏర్పడిన తర్వాత భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల దన్నుతో మున్నెన్నడూ లేనంత తీవ్రంగా ఎడతెరిపిలేకుండా కొనసాగించిన ప్రతీఘాతుక విప్లవ అణచివేత క్యాంపెయిన్లను మన పార్టీ నాయకత్వంలో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం, ప్రజలు సాహసోపేతంగా తిప్పికొట్టారు. ఈ క్రమంలో వేలాది మృతవీరుల త్యాగాలతో మున్నెన్నడూ సాధించని గొప్ప విజయాలెన్నింటినో సాధించాం. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో సాగే, వ్యవసాయ విప్లవం ఇరుసుగా ఉండే, నూతన ప్రజాస్వామిక విప్లవ సాధారణ పంథాను సృజనాత్మకంగా అమలుచేసిన ఫలితంగా విముక్తి ప్రాంతాలను స్థాపించే నిర్దిష్ట రూపంగా దేశంలోని కొన్ని గెరిల్లాజోన్లలో గెరిల్లా బేస్‌లను నిర్మించాం. ఇందులో భాగంగా నూతన ప్రజాస్వామిక రాజకీయ అధికార సంస్థలను–విప్లవ ప్రజాకమిటీలను ఏర్పరిచాం. వీటిని గ్రామస్థాయి నుండి డివిజన్ స్థాయి వరకు సంఘటితం చేశాం. దేశంలోని పలు ప్రాంతాలలో ప్రజలను భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో సమీకరిస్తూ గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం, తీవ్రతరం చేశాం. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ముందుకు వచ్చిన ప్రచండ–భట్టారాయ్‌ల ఆధునిక రివిజనిస్టు పంథాకు వ్యతిరేకంగా పోరాడాం; అవాకియన్ ముందుకు తెచ్చిన ఆధునిక రివిజనిజాన్నివ్యతిరేకించాం. అంతర్జాతీయ కార్మికవర్గ అగ్రగామికి సంబంధించిన ఒక డిటాచ్‌మెంట్‌గా ఎం.ఎల్.ఎం. వెలుగులో భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్నాం. ఈ విధంగా కార్మికవర్గ అంతర్జాతీయ అరుణపతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టాం. ఆంతరంగికంగా ముందుకు వచ్చిన మితవాద అవకాశవాద, అతివాద అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతికంగా పోరాడి ఓడించడం ద్వారా పార్టీ పంథాను మరింత పటిష్టం చేశాం, పార్టీ సమైక్యతను పెంపొందించాం. పార్టీని, ప్రజాగెరిల్లా సైన్యాన్ని, ప్రజాసంఘాలను సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా సుశిక్షితం చేయడానికీ, పార్టీలోని తప్పుడు ధోరణులను సరిదిద్దటానికి ఎడ్యుకేషన్–రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌ను, బోల్షివైజేషన్ క్యాంపెయిన్‌ను నిర్వహించాం. దేశవ్యాప్తంగా విప్లవోద్యమంపై పాలకవర్గాలు కొనసాగిస్తున్న తీవ్రమైన అణచివేత మధ్యనే దేశంలో విప్లవ, ప్రజాస్వామిక శక్తుల రాజకీయ సమీకరణకు మరింత అనుకూలమైన పరిస్థితిని సృష్టించుకోగలిగాం. దేశంలో విప్లవోద్యమం , మన పార్టీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ ఆచరణ క్రమంలో సంపాదించిన విలువైన పాఠాలతో ఎంతటి కఠిన పరిస్థితిలోనైనా పోరాడి పురోగమించగలిగే బోల్షివిక్ స్పిరిట్‌ని సంతరించుకుంది.

అయితే ప్రజాయుద్ధ స్థాయికీ విస్తృతికి తగినట్లు, ప్రతీఘాతుక విప్లవ దాడికి తగినట్లు, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులలోని మార్పులకు తగినట్లు, నిర్దిష్ట లక్ష్యాల సాధనకు రూపొందించుకున్న కర్తవ్యాలకు తగినట్లు పార్టీనీ, ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్నీ, ప్రజాపునాదిని పరిమాణంలోనూ, గుణంలోనూ అభివృద్ధి చేయడానికి చేయాల్సిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, పోరాట కృషిలోని లోపాల వల్ల, పొరపాట్ల వల్లనే మన ఉద్యమం గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఈ లోపాలను, పొరపాట్లను సరిదిద్దుకోవడం ద్వారా మన స్వీయశక్తిని కాపాడుకొని పెంపొందించగలుగుతాం. ఈ క్రమంలోనే కన్సాలిడేట్ అవుతూ పరిమాణంలోనూ, గుణంలోనూ మన స్వీయశక్తినీ, ప్రజాపునాదిని పెంపొందించుకోగలం. ఈ విధంగానే మన పార్టీ దేశంలో తిరిగి మరింత శక్తివంతమైన పార్టీగా అభివృద్ధి చెందుతూ, ప్రజలను విస్తృతంగా రాజకీయ రంగంలోకి సమీకరిస్తూ గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం, తీవ్రతరం చేయగలుగుతుంది. ఈ విధంగానే మన పార్టీ భారత విప్లవోద్యమంలో మరొక పోరాట వెల్లువను సృష్టించగలుగుతుంది.

మన పార్టీ భారత కార్మికవర్గపు సంఘటిత అగ్రగామి దళంగా మార్క్సిస్టు మహోపాధ్యాయులు మార్క్స్ ఏంగెల్స్‌లచే స్థాపించబడి, లెనిన్, స్టాలిన్, మావోలచే అభివృద్ధి చేయబడిన అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ పంథాలో భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయం వైపుకు పురోగమింపజేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సోషలిజం, కమ్యూనిజాలు స్థాపించబడేవరకు దృఢంగా అదే దిశలో ముందుకు కొనసాగుతుంది.

భారత కార్మికవర్గ అగ్రగామి దళంగా మన పార్టీ కార్మికవర్గ అంతర్జాతీయతకు కట్టుబడి ఉంటుంది. భారతదేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్నీ, అంతర్జాతీయంగా ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో ప్రపంచంలోని అన్ని నిజమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో–సంస్థలతో–శక్తులతో ఐక్యతను ఏర్పరచుకోవడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గంతో, పీడిత జాతులతో, పీడిత ప్రజలతో ఐక్యతను నెలకొల్పుకుంటుంది; గత, వర్తమాన దేశ, అంతర్జాతీయ కార్మికోద్యమాల నుండీ, వర్గపోరాటాల నుండీ పాఠాలు నేర్చుకుంటుంది; దేశంలోనూ, ప్రపంచంలోనూ నిరంతరం కార్మికోద్యమానికీ, వర్గపోరాటానికి ఆటంకం కల్పించే ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగానూ వివిధ రూపాలలో తలెత్తే అతివాద, మితవాద, అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగానూ సైద్ధాంతిక పోరాటం కొనసాగిస్తుంది; ప్రపంచంలో సామ్రాజ్యవాదులకు, ప్రతీఘాతకులకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మికోద్యమాలకూ, పీడిత జాతుల ఉద్యమాలకూ, పీడిత ప్రజల ఉద్యమాలకు మద్దతుగా నిలవడంతో పాటు వీటి సమన్వయానికీ, వీటిని సంఘటితపరచడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. ఇందుకు నేటి పరిస్థితులకు తగిన నిర్మాణరూపంగా అంతర్జాతీయ విప్లవ కమ్యూనిస్టు పార్టీల కేంద్రం ఏర్పాటుకు తన వంతు పాత్ర నిర్వహిస్తుంది.

భారతదేశం సామ్రాజ్యవాదానికీ, ప్రపంచ ప్రతీఘాతుకానికి గల అతి బలమైన స్థావరాల్లో ఇది ఒకటి. అందుకనే భారతదేశంలో సామ్రాజ్యవాదం, దళారీ బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గం, భూస్వామ్య విధానాలపై ఎక్కుపెట్టబడిన నూతన ప్రజాస్వామిక విప్లవ పురోగమనం, విజయం సామ్రాజ్యవాద నిర్దాక్షిణ్యమైన దోపిడీ అణచివేతల నుండి భారత ప్రజల్ని విముక్తి చేయడమే కాక, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజాల కోసం, శాంతి కోసం మొత్తం ప్రపంచ ప్రజలు చేసే పోరాటాన్ని నూతన దశకు చేరుస్తుంది. ప్రపంచ కార్మికవర్గ సోషలిస్టు విప్లవాన్ని త్వరితం చేయడంలో భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం, భారతదేశంలో జనతా ప్రజాస్వామిక ప్రభుత్వ స్థాపన ముఖ్య భూమికను పోషిస్తాయి. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం, ఒక మనిషిని మరో మనిషి దోచుకోవడాల నుండి స్వేచ్ఛను పొందిన నూతన ప్రపంచ స్థాపనకై జరిగే కృషిలో ఇది ఒక ముఖ్యమైన, చారిత్రకమైన పురోగమనానికి సంకేతంగా నిలుస్తుంది.

*"మన పార్టీ భారత నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమాన్ని ప్రజల ముందు ఉంచుతూ, ఈ గొప్ప విప్లవ ఆశయం కోసం తనను తాను అంకితం చేసుకుంటూ, సోషలిజం సాధించే కర్తవ్యాన్ని తనకు తాను నిర్దేశించుకుంటోంది. మన అంతిమ లక్ష్యం కమ్యూనిజం. ప్రజల ప్రజాస్వామిక విప్లవం తర్వాత, దోపిడీదారులకూ పీడితులకూ మధ్య వర్గవ్యత్యాసాన్ని నిర్మూలించే క్రమంలో క్రమక్రమంగా ఉత్పత్తి సంబంధాలను విప్లవీకరిస్తుంది. శాస్త్రీయ సోషలిస్టు దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా బ్రాహ్మణవాద భావజాలాన్ని, కుల తదితర సామాజిక పీడనలను, సామాజిక వివక్షతలను రూపుమాపే తన కృషిని అది కొనసాగిస్తుంది. కార్మికవర్గ నియంతృత్వం కింద విప్లవాన్ని కొనసాగించడం ద్వారానూ, తద్వారా ప్రపంచ కార్మికవర్గ విప్లవానికి బలమైన స్థావర ప్రాంతంగా సోషలిస్టు సమాజాన్ని సంఘటితపర్చడాన్ని కొనసాగించడం ద్వారాను అది పురోగమిస్తుంది. కొద్దిమంది దోపిడీదారులపై నియంతృత్వాన్ని చెలాయిస్తూ విశాల మెజారిటీ ప్రజానీకానికి ప్రజాస్వామ్యాన్ని దఖలుపరిచే కార్మికవర్గ నియంతృత్వంగా ఈ సోషలిస్టు ప్రభుత్వం ఉంటుంది. కార్మికవర్గ నియంతృత్వం కింద నిరంతరాయంగా విప్లవాన్ని కొనసాగించడం అనే మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు సూత్రాలకు అనుగుణంగా సోషలిస్టు సమాజంలో కూడా వర్గాలూ, వర్గ వైరుధ్యాలూ, వర్గపోరాటాలూ ఉంటాయనే అవగాహనతో అది కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని నడుపుతుంది. తద్వారా పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు పెట్టుబడిదారీ మార్గీయులూ, సామ్రాజ్యవాదులూ, ఆధునిక రివిజనిస్టులూ చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఎదిరించి ఓడిస్తుంది. ఈ క్రమం ద్వారా సోషలిస్టు సమాజంలో ప్రవేశపెట్టే ఎటువంటి వక్రీకరణలనైనా అది ఎదిరించి పోరాడుతుంది. ముఖ్యంగా పార్టీ, ప్రజాసైన్యం, ప్రభుత్వాలలోని నాయకత్వంలో*

*తలెత్తే బ్యూరోక్రసీకి వ్యతిరేకంగా పోరాడుతుంది. తద్వారా ప్రజలు కార్మికవర్గ పార్టీ నుండి గానీ, సోషలిస్టు రాజ్యం నుండి గానీ పరాయీకరణ చెందకుండా చూసి, వాళ్లు రాజ్యంలో చైతన్యవంతంగా, క్రియాశీలంగా పాల్గొనేలా ఖాయం చేస్తుంది. మిగిలిపోయిన అసమానతలను అది సృజనాత్మకంగా నిర్మూలించాల్సి ఉంటుంది. సోషలిస్టు సమాజంలో ఉనికిలో ఉన్న వైరుధ్యాలను పరిష్కరించాల్సి ఉంటుంది. సోషలిస్టు సమాజంలో ఉనికిలో ఉన్న వైరుధ్యాలను పరిష్కరించడానికీ, ఈ సమాజంలో మిగిలిపోయిన అసమానతలను తొలగించడానికి అది కమ్యూనిజం స్థాపనా లక్ష్యంతో సృజనాత్మకంగా, చైతన్యవంతంగా కృషి చేస్తుంది. ఆ క్రమంలో వర్గ సమాజం రద్దు వైపుగా, తద్వారా రాజ్యం అంతరించే వైపుగా అంటే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం స్థాపన వైపుగా పురోగమించాలి."* (పార్టీ కార్యక్రమం, పేజీ 30)

## కర్తవ్యాలు

**మార్క్సిజాన్ని లోతుగా, విస్తృతంగా అధ్యయనం చేసి సమగ్రంగా అర్థం చేసుకుందాం ; మన ప్రాపంచిక దృక్పథాన్ని ప్రగాఢం చేసుకుందాం** . మార్క్సిస్టు మహోపాధ్యాయులు- మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో - మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించడానికీ, అభివృద్ధి చేయడానికి తమ జీవితాలనే ధారపోశారు. ఈ సిద్ధాంతాలు వారి అసంఖ్యాకమైన, అత్యంత విలువైన రచనలలో పొందుపరిచారు. మనం వీటిని చాలా ముఖ్యమైన చారిత్రక విప్లవకర సారస్వతంగా స్వీకరించాలి. ఉజ్వలమైన వారి కృషిని ఆదర్శంగా తీసుకొని మన యావత్తు పార్టీ - కేంద్రకమిటీ సభ్యుల నుండి ప్రాథమిక సభ్యుల వరకు మార్క్సిజాన్ని ఓపికతో, పట్టుదలతో శ్రద్ధగా, లోతుగా అధ్యయనం చేయాలి; ప్రత్యేకంగా వీటిలో నుండి పలు ముఖ్యమైన రచనలను అధ్యయనం చేయాలి. వీటిలో విలువైన దాన్నంతటినీ గ్రహించాలి. వీటిని మనం నేటి మన నిర్దిష్ట విప్లవాచరణకు సృజనాత్మకంగా అన్వయించుకోవాలి. ఇలా చేయడం ద్వారానే సిద్ధాంతం వెలుగులో ఆచరణ కొనసాగించి సామాజిక పరిణామ నియమాలకు అనుగుణంగా దేశాన్ని, ప్రపంచాన్ని మార్చగలుగుతాం; ఆచరణ క్రమంలో సిద్ధాంతాన్ని మరింత అభివృద్ధి చేయగలుగుతాం. మన అధ్యయనానికి రెండు పద్ధతులున్నాయి: ఒకటి - సరైన పద్ధతి, అంటే మార్క్సిస్టు పద్ధతి; రెండవది - తప్పుడు పద్ధతి, అంటే పిడివాద పద్ధతి. మార్క్సిజం పిడివాద పద్ధతికి పూర్తిగా వ్యతిరేకమైనది.

మనం మార్క్సిజంతో పాటు వర్తమాన దేశ, ప్రపంచ పరిస్థితులను, మన దేశ చరిత్రను, మన విప్లవోద్యమ చరిత్రను, దీనితో పాటే సాగిన ప్రతీఘాతుక విప్లవ చరిత్రను, అలాగే మన ఉద్యమంతో పాటు వివిధ సామాజిక-రాజకీయ స్రవంతుల ఉద్యమాలను, వివిధ తాత్విక

ధోరణులు - వాటి మధ్య జరిగిన, జరుగుతున్న ఘర్షణలను, అవి సమాజంపై ప్రత్యేకంగా పరస్పరం కలిగించిన, కలిగిస్తున్న ప్రభావం గురించి అధ్యయనం చేయడం పట్ల శ్రద్ధ వహించాలి. ఇలా అధ్యయనం పట్ల శ్రద్ధ పెట్టడం ద్వారానే వాస్తవిక నిర్దిష్ట పరిస్థితులను మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంతో నిర్దిష్టంగా, సరిగ్గా సంశ్లేషించి సృజనాత్మకంగా అన్వయించుకోగల్గుతాం. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారానే నిరంతరం చలనంలో ఉండే సామాజిక, వర్గపోరాట పరిస్థితులకు అనుగుణంగా మన ఎత్తుగడలను అభివృద్ధి చేసుకొని అశేష ప్రజారాశులను రాజకీయంగా వర్గపోరాటంలో సమీకరించగలుగుతాం. ఈ పద్ధతిని అనుసరించడంలో జరిగే లోపాల వల్ల, అంటే స్వీయాత్మక ధోరణి వల్ల ఆచరణలో జరిగే పొరపాట్లను నివారించలేకపోవడమే గాకుండా ఉద్యమానికి సమర్థవంతంగా నాయకత్వాన్నందించడంలో విఫలమౌతాం. అందువల్ల ఈ పద్ధతిని తప్పనిసరిగా అనుసరించాల్సి ఉంటుంది.

**మొత్తం పార్టీని ఐక్యం చేయటానికి సిద్ధాంతపరమైన ఎడ్యుకేషన్‌పై కేంద్రీకరించాలి.** *"సిద్ధాంతపరమైన ఎడ్యుకేషన్ పార్టీ కార్యకలాపాలన్నిటిలోని అత్యంత ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటి. మార్క్సిజం అనే విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేయడం, దాని సూత్రాలను అన్వయించడం అనేది ఒక అంశం కాగా, వర్గపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గోవడం, ప్రజల నుండి నేర్చుకోవడం మరో అంశం. పై క్రమంలో సంపాదించిన జ్ఞానంపై ఆధారపడి పార్టీ విధానాలను మరింతగా సుసంపన్నం చేసుకోవాలి. పార్టీ శ్రేణులను సైద్ధాంతికంగా అభివృద్ధి చేయాలి. అందువలన మొత్తం పార్టీని ఐక్యం చేయడానికి అధ్యయనం, సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా అన్వయించడం ప్రాతిపదిక పైన ఒకే విధమైన ఎడ్యుకేషన్ అవసరం. అందువల్లనే మావో సిద్ధాంత ప్రాధాన్యతను ఒక్క వాక్యంలో ఇలా వివరించారు: 'మొత్తం పార్టీని ఐక్యం చేయడానికి సంబంధించి సిద్ధాంతపరమైన ఎడ్యుకేషన్ కీలకమైనది. అది లేకుంటే పార్టీ ఒక్క రాజకీయ కర్తవ్యాన్నైనా సాధించజాలదు.'..."* (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 85) మన పార్టీ కేంద్రస్థాయి నుండి ప్రాథమిక స్థాయి వరకు నిర్వహించుకునే పొలిటికల్ క్లాసులను సిద్ధాంతం వెలుగులో మన విప్లవ నిర్దిష్ట సమస్యలను సరిగా అర్థం చేసుకొని సవ్యంగా పరిష్కరించి ఉద్యమ పురోగమనానికి తోడ్పడేలా మరింత రెగ్యులర్‌గా, ప్రభావవంతంగా నిర్వహించడంపై పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీలు కేంద్రీకరించాలి.

**సాంస్కృతిక రంగంలో నిరంతరాయంగా విప్లవం కొనసాగించాలి.** *"సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతి, భావాలే ప్రాథమికంగా భారతదేశంలో ప్రాబల్యం వహిస్తున్నాయి.*

మౌలికంగా ఈ సామ్రాజ్యవాద భూస్వామ్య సంస్కృతినే పాలకవర్గాలు విస్తృతంగా వ్యాపింపజేస్తున్నాయి. ఈ భావాలే సమాజమంతటా విస్తృతంగా చొచ్చుకొని పోయాయి. సామ్రాజ్యవాద సంస్కృతికి పాశ్చాత్య దేశాలను ఆదర్శంగా చూపుతూ శిష్ట వినిమయ వస్తు వ్యామోహ సంస్కృతిని పెంపొందిస్తూ మౌలికంగానే దేశభక్తి విలువలను ధ్వంసం చేస్తుంది. భూస్వామ్య సంస్కృతి ప్రాథమికంగా పుట్టుకతోనే ఆధిక్యతా భావం మూర్తీభవించి ఉన్న కులపునాదిపై నిలిచిన బ్రాహ్మణవాద సంస్కృతే. ఈ బ్రాహ్మణవాద సంస్కృతి శ్రమ పట్ల వైఖరి నుండి మొదలుకొని మహిళల పట్లా, పీడిత కులాలు, ఇతర ప్రజా సమూహాల పట్ల, వివాహ ప్రమాణాలు, పుట్టుక, చావు, భాష వగైరాల పట్ల వైఖరి దాకా సమాజపు పరస్పర సంపర్కం, ఆలోచనకు సంబంధించిన ఇంచుమించుగా అన్ని అంశాల పైనా తన ముద్రను వేస్తుంది. దానికి అనేకానేక కుల చిహ్నాలు కూడా ఉన్నాయి. విచిత్రమేమిటంటే, ఆధునిక సామ్రాజ్యవాద సంస్కృతిగా పిలవబడేది కాలం చెల్లిపోయిన తిరోగమనవాద బ్రాహ్మణవాద సంస్కృతితో తేలికగానే సర్దుబాటు చేసుకుంటుంది. సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతులు రెంటినీ నిరంతరం వ్యతిరేకించాలి. ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతిని వాటి స్థానంలోకి తేవాలి. నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పడం, అంటే, అర్ధవలస, అర్ధభూస్వామ్య సంస్కృతిని ఆధునిక రివిజనిస్టు భావజాలంతో పాటు కుళ్లగించివేసి, శాస్త్రీయమైన ప్రజాస్వామిక ప్రజా సంస్కృతిని నెలకొల్పడమే ప్రస్తుత విప్లవ దశలో సాంస్కృతిక రంగంలోని కర్తవ్యం. జనతా ప్రజాస్వామిక సంస్కృతి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక సంస్కృతి. అది, చరిత్ర తరతరాలుగా అందించిన పీడిత ప్రజారాశుల సుసంపన్న సాంస్కృతిక వారసత్వంలోని లౌకిక, నిజమైన ప్రజాస్వామిక, శాస్త్రీయ అంశాలన్నిటికి అది వారసురాలు.

మావోయిజం పునాదిగా గల ప్రజల ప్రజాస్వామిక సంస్కృతిని విస్తృతంగా ప్రచారం చేయకుండా ప్రజలను భావజాలపరంగా సాయుధం చేయడమూ, వారిని చైతన్యవంతులను చేసి, ప్రజాయుద్ధం కోసం సంఘటితం చేయడమూ అసాధ్యం. మావో చెప్పినట్లు, "ఒక రాజకీయాధికారాన్ని కూలదోయడానికి, భావజాల రంగంలో పనిచేయడమూ, ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం అన్నదే మొదటి, రెగ్యులర్ కర్తవ్యం అవుతుంది." దోపిడీ వర్గాలను, వారి రాజ్యాంగయంత్రాన్ని కూలదోయడానికిగాను నూతన ప్రజాస్వామిక విప్లవం పొడవునా చేపట్టవలసిన మొట్టమొదటి కర్తవ్యం భావజాలపరమైన పోరాటాన్ని సాగించడం, వ్యవసాయక విప్లవ యుద్ధానికి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం.

*రివిజనిజమే ప్రధాన ప్రమాదమని మావో చెప్పారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికీ, ప్రజల ప్రజాస్వామిక భావజాలానికీ, విప్లవానికీ ఆధునిక రివిజనిజం ముఖ్యమైన శత్రువుల్లో ఒకటి. ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడకుండా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాసంస్కృతిని నెలకొల్పలేము. ఈ విషయంలో ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అత్యంత బలమైన ఆయుధం.*

*అంతేకాక, భారతదేశంలో భూస్వామ్య ఆలోచనా సరళి లోతుగా వేళ్లూనుకొని ఉంది. అది పలు రూపాలలో వ్యక్తమవుతూ ఉంటుంది. ప్రత్యేకించి కులతత్వం, మతమైనారిటీల పట్ల ఆపోహలు, మతపరమైన సంకుచితత్వం, మతమౌఢ్యం, అంటరానితనం, పితృస్వామ్యం తదితర అనేక రూపాలలో వ్యక్తమవుతుంది. ఇటువంటి ప్రజాస్వామ్య వ్యతిరేక విలువలు, సంస్కృతుల కన్నిటికీ వ్యతిరేకంగా ప్రజారాశులకు బోధన గరపాలి. వాటి స్థానంలో సమానత్వం, ఆత్మగౌరవం, లౌకికవాదం, శ్రమను గౌరవించడం, కార్మికవర్గ దృక్పథంపై ఆధారపడి ఉన్న విలువలు, సంస్కృతులను ప్రవేశపెట్టాలి.*

*భారత విప్లవ విజయానికిగాను సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక సంఘటనను సంఘటితపర్చి దానిని నిరంతరాయంగా పటిష్టపరచాలి. జనతా ప్రజాస్వామిక సంస్కృతి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక విప్లవ ప్రజా ఐక్యసంఘటనలో విడదీయరాని ఒక భాగంగా ఉండాలి. కార్మికులను, రైతాంగాన్ని, శ్రామిక ప్రజారాశులను సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వ్యవసాయిక విప్లవం గురించి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం గురించి బోధన గరపడమనేది ఈ సాంస్కృతిక రంగపు కర్తవ్యాలలో ఒకటిగా ఉంటుంది." (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 33-34)*

మనం తప్పనిసరిగా కాలంచెల్లిన, అభివృద్ధినిరోధక, యథాతథ సిద్ధాంతాలను నిశితంగా విమర్శించాలి. ప్రజల మెదళ్ల నుండి కార్మికవర్గేతర భావజాలాన్నీ, వాటి ప్రభావాన్ని తొలగించి వారిని విప్లవీకరించి ఒక విప్లవాత్మక భౌతికశక్తిగా మలచాల్సిన సైద్ధాంతిక కర్తవ్యం మన ముందుంది. సుదీర్ఘకాలం నుండి సమాజంలో ప్రజలను భావజాలపర బానిసత్వంలో కట్టిపడవేసి ఉంచడానికి నెలకొని కొనసాగుతూ వస్తున్న, ఇటీవలి దశాబ్దాలలో దూకుడుగా ప్రవేశపెట్టబడుతున్న అహేతుకమైన, కాలం చెల్లిన బ్రాహ్మణీయ భావజాలమైన కుల, మత, జాతి దురహంకారాన్ని, జాతీయోన్మాదం తదితర అభివృద్ధినిరోధక, ప్రతీఘాతుక భావజాలాన్నీ, సిద్ధాంతాలను సమాజం నుండి కూకటివేళ్లతో పెళ్లగించివేయడానికి పోరాడకుండా నూతన, శాస్త్రీయ, ప్రగతిశీల,

ప్రజాస్వామిక, సోషలిస్టు భావజాలాన్ని నెలకొల్పలేము. భావజాల రంగంలో పోరాటం పార్టీలోనే గాకుండా సామాజిక రంగాలన్నింటిలోనూ నిరంతరాయంగా కొనసాగించాల్సి ఉంటుంది. మన పార్టీ ఈ రంగంలో అంతర్గతంగానే గాకుండా నేటి సమాజంలో ప్రభావవంతమైన పాత్ర నిర్వహించాల్సిన అవసరం ఉంది. మన పార్టీలో భావజాలపర సమైక్యతను పెంపొందిస్తూ సమాజంలో మన పార్టీని శక్తివంతమైన, సమర్థవంతమైన నాయకత్వ సంస్థగా స్థాపించడానికీ, ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీల పాత్ర పెంపొందించడానికీ నేడు మనం మన భావజాలపర దాడిని ప్రధానంగా దేశంలోనూ, అంతర్జాతీయంగానూ బ్రాహ్మణీయ భావజాలంపై, ఆధునిక రివిజనిజంపై, పోస్ట్‌మోడర్నిజంపై  ఎక్కుపెట్టాలి. మనం ప్రజల మధ్య సిద్ధాంత, రాజకీయ ప్రచారాన్ని ప్రభావవంతంగా కొనసాగించటానికి తగిన నిర్మాణాలు కూడా ఏర్పరచుకోవాలి.

**నిరంతరాయంగా పార్టీ డీక్లాసిఫై కావడానికి కృషి చేయాలి.** విప్లవకర కార్మికవర్గ పార్టీ తన ప్రాపంచిక దృక్పథాన్నీ, కార్మికవర్గ స్వభావాన్నీ, కార్మికవర్గ పంథానూ, చారిత్రక మిషన్ అయిన సోషలిజం–కమ్యూనిజం స్థాపననీ, పనిశైలినీ, జీవనశైలినీ ప్రగాఢం చేసుకుంటూ, సరిదిద్దుకుంటూ, ఇందుకు తోడ్పడేలా వర్గపోరాటంలో భాగంగా ఆంతరంగిక పోరాటం కొనసాగిస్తూ భావజాలపరంగా పునర్నిర్మాణం కావాల్సిన (డీక్లాసిఫై కావాల్సిన) అవసరం ఉంటుంది. నేడు మాత్రమే కాదు, నూతన ప్రజాస్వామిక విప్లవానంతరమే కాదు, సమాజానికి కమ్యూనిస్టు పార్టీ యొక్క అవసరం ఉండేంత వరకు, కమ్యూనిజం చేరుకునేంతవరకు కమ్యూనిస్టు పార్టీ సమిష్టిగానూ, ఇందులోని సభ్యులు వ్యక్తిగతంగానూ చైతన్యపూర్వకంగా నిరంతరాయంగా కృషి చేయాల్సి ఉంటుంది. తద్వారానే, సమాజంలో అత్యధికులుగా ఉండే ప్రజలు మన సరైన భావజాలంతో, రాజకీయాలతో, వర్గపోరాటంతో, ఆచరణతో ప్రభావితమవుతూ మెట్టు మెట్టుగా కమ్యూనిస్టు పార్టీకీ, ప్రజలకూ మధ్య తేడా అంతర్ధానమైపోయే స్థితి ఏర్పడుతుంది. ఇందుకు తోడ్పడేలా నిరంతరాయంగా ఎం.ఎల్.ఎం.ను అధ్యయనం చేయడం, సిద్ధాంతాన్ని ఆచరణకు జోడించడం, వర్గపోరాటంలో పాల్గొనడం, ప్రజలతో దృఢంగా సమైక్యం కావడం, నిజాయితీగా విమర్శ, స్వయంవిమర్శ కొనసాగించడం, ఆచరణ నుండి నేర్చుకోవడం, రెక్టిఫికేషన్ క్యాంపెయిన్లలో చురుగ్గా పాల్గోవడం, పార్టీలో అంతర్గతంగా జరిగే రెండు పంథాల మధ్య సైద్ధాంతిక, రాజకీయ పోరాటంలో సరైన పంథా వైపు నిలబడడం మొదలైన వాటిలో ప్రభావవంతమైన పాత్ర నిర్వహించాలి. వీటిని పైపైన, సాక్షికంగా, మొక్కుబడిగా, యథాలాపంగా కొనసాగించరాదు.

నేడు మన ఉద్యమానికి, పార్టీకి 50 ఏండ్లు గడచి పార్టీలో మూడవ తరానికి చెందిన కామ్రేడ్సే ఎక్కువ మంది ఉన్నారు. వీరిలో అత్యధికులు రైతాంగంలోని, పెటీబూర్జువా వర్గంలోని వివిధ సెక్షన్లకు చెందిన కామ్రేడ్సే ఉన్నారు. వీరి ప్రాపంచిక దృక్పథం, పనిశైలి, జీవనశైలిలతో పాటు పై విషయాలన్నిటిలోనూ మరింత లోతుగా డీక్లాసిఫై చేయాల్సిన తక్షణ కర్తవ్యం మన ముందుంది. మిగతా కామ్రేడ్స్‌లో ఎక్కువ మంది పాత కామ్రేడ్సే అయినప్పటికీ, వారి సామాజిక నేపథ్యం వల్లగానీ, నేటి సమాజం కలిగించే ప్రభావాల వల్లగానీ వారు కూడా నిరంతరం ప్రగాఢంగా డీక్లాసిఫై కావలసిన అవసరం ఉంటుంది. ఇందుకు వారు మరింత చైతన్యపూర్వకంగా కృషి చేయాల్సిన అవసరం ఉంటుంది.

అందువల్ల మన పార్టీ సాధించాల్సిన తక్షణ లక్ష్యాన్నీ, ఈ లక్ష్య సాధనకు అనుసరించే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ స్వభావాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు తనని తాను భావజాలపరంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా సమైక్యమైన, సుదృఢమైన, బలమైన, సమర్థవంతమైన కార్మికవర్గ అగ్రగామి సంస్థగా ఎదిగించుకోవడానికి నిరంతరం చైతన్యపూర్వకంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాల్సి ఉంటుంది. ఇలా చేయగలిగినప్పుడు మాత్రమే ప్రజలను ప్రజాయుద్ధంలో సమర్థవంతంగా ముందుకు నడిపించగలుగుతాం. నేటి కృషినంతటినీ విజయానంతరం సోషలిస్టు సమాజ నిర్మాణానికి పునాదిగా వినియోగించుకోగలుగుతాం. అంటే తక్షణ లక్ష్యసాధన కోసం చేసే కృషినంతటినీ భవిష్యద్దర్శనంతో (సోషలిజం-కమ్యూనిజం స్థాపన లక్ష్యంతో) కొనసాగించగలుగుతాం.

## ముగింపు

సామ్రాజ్యవాదాన్నీ, సకల అభివృద్ధి నిరోధకులనూ కూలదోసేందుకై ప్రపంచ కార్మికులారా, సకల పీడిత జాతులారా, సకల పీడిత ప్రజలారా మార్క్సిజం అరుణ పతాకను చేబూనండి! దృఢంగా సమైక్యం కండి! ధైర్యంగా పోరాడండి! అంతిమ విజయం ప్రజలదే! సామ్రాజ్యవాదుల, అన్ని రకాల అభివృద్ధి నిరోధకుల, రివిజనిస్టుల, సోషల్ డెమోక్రాట్ల దోపిడీ పీడకవర్గ స్వభావాన్నీ, వారి విధానాల దివాలాకోరు విధానాన్నీ, వారి మోసకారి జిత్తులను గ్రహించండి! జాగృతం కండి! సామ్రాజ్యవాదులు, సకల అభివృద్ధి నిరోధకులు, వారి తొత్తులంతా తక్షణ పోరాటం దృష్ట్యా చూసినప్పుడు ఎత్తుగడలపరంగా నిజమైన పులులుగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవంగా దీర్ఘకాలిక దృష్టితో చూసినప్పుడు వారు వ్యూహాత్మకంగా కాగితం పులులేననే సత్యాన్ని గ్రహించి వీరికి వ్యతిరేకంగా పోరాడ సాహసించి విజయాన్ని చేజిక్కించుకోండి! పెట్టుబడిదారీ సంకెళ్లనే

గాకుండా, సకల వర్గ, కుల, జాతి, లింగ, మత తదితర సంకెళ్లన్నింటినీ తునాతునకలు చేసి మానవజాతి విముక్తి గీతాన్ని పాడ ముందుకు సాగండి! మార్క్సిజం వెలుగులో కార్మికవర్గం, పీడిత ప్రజలు సాధించిన విజయాలు మానవజాతి చరిత్రలో అపూర్వమైనవి. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అనే సర్వశక్తివంతమైన సిద్ధాంత ఆయుధాన్ని దృఢంగా చేబూనిన అంతర్జాతీయ కార్మికవర్గం ప్రపంచ సోషలిస్టు విప్లవం ద్వారా పాత ప్రపంచాన్ని నాశనం చేసి నూతన ప్రపంచాన్ని సృష్టించి తీరుతుంది.

మార్క్సిజం వెలుగులో సిపిఐ(మావోయిస్టు) నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవంలో కార్మికులు, కర్షకులు, మధ్యతరగతి ప్రజలు, జాతీయ పెట్టుబడిదారులు, వివిధ పీడిత సామాజిక సెక్షన్ల - దళిత, ఆదివాసీ, మహిళా, మతమైనారిటీ - ప్రజలు, పీడిత జాతుల ప్రజలు సమైక్యమై పోరాడిన రోజు, ప్రజాయుద్ధ పెనుజ్వాలలు దేశవ్యాప్తంగా రగిలిన రోజు దేశంలో సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూస్వాములు, వారి క్రూర రాజ్య యంత్రాంగం భస్మీపటలమై మహత్తర సోషలిజం-కమ్యూనిజం పర్‌స్పెక్టివ్ కలిగిన స్వేచ్ఛాయుత జనతా ప్రజాస్వామిక రిపబ్లిక్కుల సమాఖ్య అవతరించడాన్ని ఈ భూమండలంపై ఏ శక్తీ అడ్డుకోజాలదు. అపుడు ప్రపంచ మానవాళి సామ్రాజ్యవాద అభివృద్ధి నిరోధకుల చీకటి శకానికి శాశ్వితంగా తెరదించడానికి ప్రధాన మీటగా పనిచేసే అంతర్జాతీయ కార్మికవర్గ చారిత్రిక కర్తవ్యాన్ని భారత నూతన ప్రజాస్వామిక విప్లవం, నిర్వర్తిస్తుంది.

మార్క్సిజం అనే శాస్త్రీయమైన మహత్తర సిద్ధాంత శస్త్రాన్ని ధరించిన విప్లవకర కార్మికవర్గం, దాని అగ్రగామిగా కమ్యూనిస్టు విప్లవకారులు సూత్రబద్ధతకు, సిద్ధాంత నిబద్ధతకు, కార్మికవర్గ సమైక్యతకు, కార్మికవర్గ అంతర్జాతీయతకు, విమర్శనాత్మక దృష్టికి, నిస్వార్థతకు, నిర్భీతికి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తారు. అత్యంత కష్టభూయిష్టమైన, క్రూరమైన, ఎగుడుదిగుళ్లతో మలుపులు మెలికలతో కూడిన, దీర్ఘకాలిక స్వభావం కలిగిన ప్రపంచ సోషలిస్టు విప్లవం నిర్వహిస్తున్నామని వీరికి తెలుసు. వీరు ఈ విప్లవ క్రమంలో సాధించిన మహత్తర విజయాలెన్ని కోల్పోయినప్పటికీ, ఎన్ని ఓటములు పొందినప్పటికీ, ఈ క్రమంలో సంపాదించిన అత్యంత విలువైన అనుభవాలను క్రోడీకరించి రూపొందించుకున్న అజేయమైన విప్లవ సిద్ధాంతాల వెలుగులో తుదివిజయ సాధన వరకూ మళ్లీ మళ్లీ పోరాడుతూనే ఉంటారు. ఈ లక్ష్య సాధనపై సాగిస్తున్న పోరాటం నుండి వీరిని తప్పించగలిగిన శక్తి ఈ భూమండలంపై ప్రతీఘాతకులెవ్వరికీ

లేదు. పీడిత ప్రజల అపజయాలు తాత్కాలికమైనవి; ప్రజా శత్రువుల విజయాలు కూడా తాత్కాలికమైనవే. సామాజికాభివృద్ధి నియమాల ననుసరించి అంతిమంగా ప్రజాశత్రువులకు శాశ్విత వినాశనం, పీడిత ప్రజలకు శాశ్విత విజయం లభించి తీరుతాయి.

కామ్రేడ్స్,

కారల్ మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని ఉత్తేజకరమైన ఆయన జీవితం గురించీ, మార్క్సిజం గురించీ, మార్క్సిజం నూతన చారిత్రిక-వర్గపోరాట-సోషలిజం నిర్మాణ పరిస్థితులలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజంగా అభివృద్ధి చెందిన విషయం గురించీ, ఈ సిద్ధాంత మార్గదర్శకత్వాన కార్మికవర్గం-పీడిత ప్రజల మహత్తర విజయాలు-వీటి ప్రాధాన్యత గురించీ, ఈ క్రమంలో పొందిన అపజయాలు-చేసిన పొరపాట్లు-అనుభవ రాహిత్యం గురించీ, వీటన్నింటి నుండి నేర్చుకున్న పాఠాల గురించీ మన పార్టీలోనూ-విప్లవ ప్రజానిర్మాణాలన్నిటిలోనూ-ప్రజలలోనూ ప్రచారం చేయాలి; మహోపాధ్యాయుల ప్రముఖ రచనలు అధ్యయనం చేయాలి; మా-లె-మా మౌలిక సూత్రాలపై, అంతర్జాతీయ కార్మికవర్గ పంథాపై, మన దేశ నిర్దిష్ట పరిస్థితులలో వీటిని అన్వయించి అచరణ నుండి నేర్చుకున్న పాఠాలపై మన పార్టీలో ఎడ్యుకేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలి. అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ సిద్ధాంతకర్త, విప్లవపథ నిర్దేశకుడు, మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ చూపిన మార్గంలో, మార్క్సిజం విప్లవ పతాకను సమున్నతంగా ఎత్తిపట్టి కమ్యూనిజం అంతిమ లక్ష్యంతో ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగంగా నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధనకై దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో  దృఢంగా సాహసోపేతంగా ముందుకు సాగుతామని భారత విప్లవకర కార్మికవర్గ అగ్రగామి సంస్థగా సిపిఐ (మావోయిస్టు) సగర్వంగా  ప్రకటిస్తున్నది.

* మార్క్సిజం-లెనినిజం-మావోయిజం విప్లవ పతాక కింద సమైక్యం కండి!
* ప్రపంచ కార్మికులారా! ఏకంకండి!
* ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!
* పెట్టుబడిదారీ విధానం-సామ్రాజ్యవాదం నశించాలి!
* ప్రపంచ సోషలిస్టు విప్లవంలో నేలకొరిగిన లక్షలాది మృతవీరులకు జోహార్!

✦

సర్క్యులర్ : 1/2018

## ప్రజా పునాదిని పెంచుకుంటూ, పార్టీనీ, పీఎల్‌జీఏనూ పటిష్టం చేసుకుంటూ

## ప్రజా పోరాటాలను, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం!

## భారత విప్లవోద్యమ నిర్మూలనకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న

## విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఓడిద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్!**

దండకారణ్యంలోని బుర్కపాల్ ఆంబుష్ అనంతరం గత సంవత్సరం మే నెలలో కేంద్ర ప్రభుత్వం రానున్న 5 ఏళ్ళల్లో (2017-2022) భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించే దుష్ట లక్ష్యంతో విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడి పథకాన్ని, వ్యూహం-ఎత్తుగడలను రూపొందించిన విషయం మనందరికీ తెలిసిందే. 2009 నుండి 2017 మే వరకు దేశంలో కొనసాగిన విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడి లాగానే, ఈ 'సమాధాన్' దాడి కూడా భారతదేశంలోని పీడిత వర్గాలపై, పీడిత సామాజిక సముదాయాలపై, పీడిత జాతులపై, మత మైనారిటీలపై-మొత్తంగా భారత ప్రజలందరిపై యుద్ధంగానే, దాడిగానే కొనసాగుతున్నది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ లాగే సమాధాన్ దాడి కూడా వ్యూహాత్మక దాడియే.

గత సంవత్సర కాలంగా కేంద్రప్రభుత్వం 'నవ భారత్' నిర్మాణం గురించి ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. అవినీతి రహిత, టెర్రరిస్టు రహిత, కులతత్వ-మతతత్వ రహిత, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడమే 'నవ భారత' నిర్మాణపు లక్ష్యాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినప్పటికీ, ఈ ప్రకటిత ఎజెండా వెనక దాగివున్న నిజమైన లక్ష్యాలు వేరు-సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల దోపిడీ ప్రయోజనాలకు ఎలాంటి ఆటంకాలు లేని భారతదేశాన్ని నిర్మించడమే, వారి అధికారాన్ని సుస్థిరం చేయడమే 'నవ భారత' నిర్మాణపు అసలైన లక్ష్యాలు. ఒక వైపు చైనాను ఎదుర్కోవడంలో భాగంగా దక్షిణాసియాలో భారతదేశాన్ని విస్తరణవాద శక్తిగా నిలపడం; మరో వైపు దేశంలో నయా ఉదారవాద విధానాలు దూకుడుగా అమలు జరుపుతూ కార్మిక, రైతాంగ తదితర శ్రమజీవులను, ప్రకృతి సంపదలను విచ్చలవిడిగా కొల్లగొడుతూ శ్రామిక ప్రజల ప్రతిఘటనను కాలరాచి వేయడం; దేశంలో పీడక కులాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడం కోసం పీడిత కులాలను ప్రత్యేకించి దళితులను, ఆదివాసులను, మత మైనారిటీలను అణచివేయడం ద్వారా బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని బలోపేతం చేయడం; సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ బూర్జువాజీకి, బడా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని, సాయుధ పోరాటాన్ని నడిపే మావోయిస్టులను అణచివేయడం

ద్వారా, కశ్మీర్, ఈశాన్య జాతుల విముక్తి పోరాటాల్ని అణచివేయడం ద్వారా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చే 'బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాజ్యాన్ని' స్థాపించడం – ఇవే 'నవ భారత' నిర్మాణపు అసలు లక్ష్యాలు. సంఘటిత శక్తిగా, సాయుధ శక్తిగా ఉన్న మావోయిస్టు ఉద్యమం నవ భారత నిర్మాణానికి ప్రధాన అడ్డంకి కాబట్టి దానిపై ప్రధానంగా కేంద్రీకరిస్తూ, 'నవ భారత' నిర్మాణానికి అడ్డుగా నిలిచే పీడిత వర్గాలపై, పీడిత సామాజిక సముదాయాలపై, పీడిత జాతులపై, మత మైనారిటీలపై దాడి చేయడం ద్వారా 'నవ భారతాన్ని' నిర్మించడమే 'సమాధాన్' దాడి లక్ష్యం. ఈ రెండింటిని కలిపి అర్థం చేసుకున్నప్పుడే 'సమాధాన్' దాడి ఫాసిస్టు స్వభావపు తీవ్రత, విస్తృతి అర్థమవుతుంది.

'సమాధాన్' దాడి పథకం కూడా తిరుగుబాటు వ్యతిరేక (కౌంటర్ ఇన్‌సర్జెన్సీ), గెరిల్లా యుద్ధ వ్యతిరేక (కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్) సిద్ధాంతమైన మంద్రస్థాయి యుద్ధవ్యూహం (లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్–ఎల్ఐసీ) ఆధారంగా రూపొందించినదే. ప్రజా తిరుగుబాట్లను అణచివేయడానికి ఎల్ఐసీని అనుసరించి దశలవారీ (ఫేజ్‌ల వారీ) అణచివేత పథకాల్ని రూపొందిస్తారు. క్లియర్ (తుడిచివేత), హోల్డ్ (నియంత్రణ), బిల్డ్ (నిర్మాణం), డెవలప్ (అభివృద్ధి) అనేవే ఆ దశలు (ఫేజ్‌లు). ఈ దశలలో సాధించాల్సిన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని సైనిక ఆపరేషన్లతో పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను, మానసిక ఆపరేషన్లను సమన్వయించి కొనసాగిస్తారు. ప్రస్తుతం దేశంలో మన ఉద్యమం కొనసాగే అత్యధిక ప్రాంతాల్లో రెండవ, మూడవ దశలు అయిన హోల్డ్, బిల్డ్ ఆపరేషన్లు సాగుతుండగా, ఉద్యమం బాగా బలంగా ఉన్న 30 జిల్లాల్లో ప్రధానంగా క్లియర్, హోల్డ్ ఆపరేషన్లు సాగిస్తూ వాటిలో సాధించే విజయాల ఆధారంగా బిల్డ్ ఫేజ్ ఆపరేషన్లు సాగుతున్నాయి. ఉద్యమం తాత్కాలికంగా సెట్‌బ్యాక్‌కు గురయిన ప్రాంతాల్లో డెవలప్ ఫేజ్ ఆపరేషన్లు సాగుతున్నాయి. ఈ ఫేజ్‌ల వారీ ఆపరేషన్లు ఎప్పుడూ ప్రధానంగా మనం సాగించే గెరిల్లా యుద్ధంపై, అది సాధించే ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. అందుకే ఈ ఫేజ్‌ల వారీ ఆపరేషన్లలో శత్రువు సాధించే ఫలితాలను సాపేక్షికంగానే అర్థం చేసుకోవాలి. ఒక ప్రాంతంలో శత్రువు హోల్డ్ ఆపరేషన్లు చేపడుతున్నాడంటే ఆ ప్రాంతంలో మనల్ని మొత్తమే తుడిచి పెట్టాడని అర్థం కాదు. ఆ ప్రాంతంలో స్థానిక నిర్మాణాల వారిని పెద్దఎత్తున అరెస్టు చేసి జైళ్ళకు పంపి, స్థానిక నిర్మాణాలపై, గెరిల్లా బలగాలపై దాడులు చేసి కొంతమందిని చంపివేసి ప్రజాపునాదినీ, ప్రజా సంఘటిత శక్తినీ బలహీనపరచిన తరువాత ఆ ప్రాంతంలో పార్టీ, గెరిల్లా బలగాలు పని చేస్తున్నప్పటికీ శత్రువు అక్కడ హోల్డ్ ఆపరేషన్లు మొదలు పెడుతాడు. మిగతా ఫేజ్‌ల ఆపరేషన్లు కూడా ఇలాగే నడుపుతాడు. మనం రాజకీయ, నిర్మాణ కృషినీ, ప్రజా పోరాటాలనూ, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేసి పాజిటివ్ ఫలితాలు సాధించడం ద్వారా వాడి ఈ ఫేజ్‌ల స్థితిని తారుమారు చేయవచ్చు.

'సమాధాన్' దాడి మొదలయినప్పటి నుండి దేశవ్యాప్తంగా మన ఉద్యమ ప్రాంతాల్లో శత్రు బలగాలు (వివిధ రకాల పారా మిలిటరీ బలగాలు, వివిధ రాష్ట్రాల పోలీసు బలగాలు, రకరకాల పేర్లతో ఉన్న కేంద్ర, రాష్ట్రాల కమాండో బలగాలు) దూకుడుగా (ఆక్రామక-అఫెన్సివ్) ఆపరేషన్లు చేపట్టి తీవ్రంగానూ, విస్తృతంగానూ కొనసాగిస్తున్నాయి. ట్రైజంక్షన్ ప్రాంతంలో నిరంతరం శత్రు బలగాల ఆపరేషన్లు కొనసాగుతూనే ఉన్నాయి. దేశంలో విప్లవ-ప్రజాస్వామిక శక్తుల ప్రభావాన్ని తగ్గించడానికి దేశవ్యాపితంగా పట్టణ ప్రాంతాలలో కొనసాగుతున్న విప్లవ కార్యకలాపాలపై, ప్రత్యేకంగా ప్రజాసంఘాల యాక్టివిస్టులపై పాలకవర్గాలు ఫాసిస్టు పద్ధతుల్లో తీవ్రమైన దాడి కొనసాగిస్తున్నాయి.

శత్రు ఫాసిస్టు దాడిలో దేశవ్యాపితంగా ఈ సంవత్సరంన్నర కాలంలో 305 మంది విప్లవకారులు, విప్లవ ప్రజానీకం అమరులయ్యారు. వీరిలో మన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ కుప్పు దేవరాజ్, పశ్చిమ కనుమల స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ అజితతో పాటు డీసీ/జడ్‌సీ/డీవీసీ/సీవైపీసీ కామ్రేడ్స్ 10 మంది, సబ్‌జోనల్ కమిటీ కామ్రేడ్స్ 5 గురు, ఏసీ/పీపీసీ స్థాయి కామ్రేడ్స్ 56 మంది, పార్టీ సభ్యులు 62 మంది (55 మంది పిఆర్‌లు, 7 గురు పార్ట్‌టైమర్లు), పీఎల్‌జీఏ సభ్యులు 100 మంది, స్థానిక నిర్మాణాల కామ్రేడ్స్ 44 మంది (ప్రజాసంఘాల కార్యకర్తలు 10 మంది, మిలీషియా కార్యకర్తలు 34 మంది), విప్లవ ప్రజానీకం 20 మంది ఉన్నారు.

ఈ దాడులన్నీ 'సమాధాన్' దాడి తీవ్రతనూ, దాని ఫాసిస్టు స్వభావాన్నీ తెలియజేస్తున్నాయి. ఈ ఫాసిస్టు దాడిని ఓడించే లక్ష్యంతో ఈ కాలంలో మన పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ బలగాలు, వ్యూహాత్మక-ఎత్తుగడలపర ఐక్యసంఘటనలు కఠిన పరిస్థితులలో సైతం ప్రజా పోరాటాలను, గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేసేందుకు కృషి చేసాయి. శత్రు దాడిని నిలువరిస్తూ ఈ సంవత్సరంన్నర కాలంలో ప్రజాపునాదిపై ఆధారపడి పీఎల్‌జీఏ బలగాలు 550కి పైగా చిన్న, మధ్య, పెద్ద గెరిల్లా చర్యలను నిర్వహించి, 198 మంది స్పెషల్ పోలీసు, పారామిలటరీ, కమాండో బలగాలను నిర్మూలించి, 357 మందిని గాయపరిచాయి. 50 ఆధునిక ఆయుధాలను, 3,781 మందుగుండును స్వాధీనం చేసుకున్నాయి. 13 మంది ప్రజావ్యతిరేక రాజకీయ నాయకులను, 148 మంది శత్రు ఏజెంట్లను నిర్మూలించాయి. వ్యూహాత్మక-ఎత్తుగడలపర ఐక్యసంఘటనల ఆధ్వర్యంలో ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక మొదలైన మౌలిక, దైనందిన సమస్యలపై వివిధ ప్రజా పోరాటాలు, దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న రాజ్యహింసకు వ్యతిరేకంగా పలు ప్రజా పోరాటాలను, నిరసనలను, ప్రతిఘటనా పోరాటాలను దేశవ్యాప్తంగా నిర్వహించాయి. ఇవన్నీ గడ్డు పరిస్థితుల్లో సైతం విప్లవోద్యమాన్ని నిలదొక్కుకునేలా చేసేందుకు తోడ్పడ్డాయి.

భారత విప్లవోద్యమ నిర్మూలనకై, 2017 ప్రారంభం నుండి కొనసాగిన దాడులతో పాటు 'సమాధాన్' వ్యూహాత్మక దాడి మొదలయి కొనసాగుతూ ఉన్న గత 10 నెలల కాలపు (2017 మే-2018 మార్చి) ఫలితాలను కేంద్ర హోంశాఖ సమీక్షించింది. ఈ సమీక్ష తర్వాత తాము కొనసాగిస్తున్న 'సమాధాన్' వ్యూహాత్మక దాడి ఫలితంగా దేశంలోని 126 "నక్సలైట్ ప్రభావిత" జిల్లాల్లో నుండి 44 జిల్లాలను "నక్సల్‌రహిత" (నక్సల్ ముక్త్) జిల్లాలుగా మార్చగలిగామని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. నక్సలైట్ (మావోయిస్టు) ఉద్యమ "ప్రభావం" అత్యధికంగా ఉన్న 35 జిల్లాల నుండి 5 జిల్లాలను ఆ శ్రేణి (కేటగిరి) నుండి తొలగించగలిగామని కూడా ప్రకటించింది. 44 జిల్లాలను "నక్సల్‌రహిత" జిల్లాలుగా మార్చిన ఫలితంగా నక్సలైట్ ఉద్యమ (మావోయిస్టు ఉద్యమ) "ప్రభావిత" ప్రాంతాలు కుదించబడుతున్నాయని కూడా ప్రకటించింది. పశ్చిమ కనుమల్లోని తమిళనాడు, కేరళం, కర్నాటక రాష్ట్రాల కూడలి ప్రాంతాలోని కొన్ని జిల్లాల్లో, అసోంలోని కొన్ని జిల్లాల్లో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో మావోయిస్టు ఉద్యమ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లుగా కేంద్ర ప్రభుత్వపు దృష్టిలో ఉన్నప్పటికీ వాటిని ఇప్పటి వరకు "మావోయిస్టు ప్రభావిత" జిల్లాల కేటగిరిలో చేర్చలేదు.

మన ఉద్యమం బలహీనపడిన జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు మోహరించిన కేంద్ర పారామిలిటరీనీ, రాష్ట్ర బలగాలనూ వాటితో పాటు ఆ జిల్లాల్లో మోహరించిన ఐపీఎస్, ఇతర పోలీసు అధికార్లను ఉద్యమం బలంగా ఉన్న జిల్లాల్లోకి తరలిస్తున్నాయి. దీంతో విప్లవోద్యమ అణచివేత చర్యల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సాపేక్షికంగా వెసులుబాటు లభించగా, విప్లవోద్యమ ప్రాంతాలపై సాపేక్షికంగా ఒత్తిడి పెరుగుతుంది, దాడుల తీవ్రత పెరుగుతుంది.

దోపిడీ పాలక వర్గాలు "నక్సల్ ప్రభావిత" జిల్లాల సంఖ్య హెచ్చింపు, తగ్గింపులను ఉద్యమ బలాబలాలను ఎల్ఐసీ సైద్ధాంతిక చట్రం ఆధారంగా విశ్లేషిస్తాయి. అవి ఏ విశ్లేషణ చేసినా, విప్లవ శిబిరపు ఆత్మవిశ్వాసం పెరగకుండా ఉండడం కోసం ఉద్యమ బలాన్ని ఎల్లప్పుడూ తక్కువ చేసి, తమ బలాన్ని ఎక్కువ చేసి చూపిస్తాయి. ఇది మానసిక యుద్ధంలో భాగం. అందుకే మనం ఉద్యమ బలాబలాలను మావోయిస్టు ప్రజాయుద్ధ నియమాల ఆధారంగా, మన వ్యూహం-ఎత్తుగడల ఆధారంగా (ఆయా ప్రాంతాలు శతృదాడి, మన ప్రజాయుద్ధం ఫలితంగా ప్రస్తుతం ఎర్ర ప్రతిఘటన ప్రాంతాలుగా ఉన్నాయా, గెరిల్లా జోన్లుగా ఉన్నాయా, దెబ్బతిన్న గెరిల్లా జోన్లుగా/తాత్కాలికంగా సెట్‌బ్యాక్‌కు గురైన ప్రాంతాలుగా ఉన్నాయా, గెరిల్లా బేసులుగా ఉన్నాయా) విశ్లేషించుకోవాలి. ఈ విశ్లేషణ ఆధారంగా ఆయా ప్రాంతాల బలాబలాలకు తగిన ఎత్తుగడలను రూపొందించుకోవాలి.

2011-12 నాటికే విప్లవోద్యమం బలహీనపడ్డ, దెబ్బతిన్న జిల్లాల్లో తిరిగి మన ఉద్యమం బలపడని జిల్లాలను "నక్సల్‌రహిత" జిల్లాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే బిహార్-ఝార్ఖండ్‌ల్లో మనం గత రెండు సంవత్సరాలుగా గెరిల్లాజోన్లుగా నిలబెట్టలేని జిల్లాలను కేంద్ర ప్రభుత్వం "నక్సల్‌రహిత" (నక్సల్‌ముక్త్) జిల్లాలని ప్రకటించింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో అంబికాపూర్, జశ్పూర్, కొరియా జిల్లాలను కేంద్రం "నక్సల్‌రహిత" జిల్లాలుగా ప్రకటించింది. ఇతర రాష్ట్రాల్లోని ఇలాంటి జిల్లాలనే, కేంద్ర ప్రభుత్వం "నక్సల్‌రహిత" జిల్లాలని ప్రకటించింది.

గత సంవత్సరకాలంగా తాము కొనసాగిస్తున్న 'సమాధాన్' దాడిని సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం బిల్డ్‌ఫేజ్‌లో కొనసాగుతున్న ఆపరేషన్లను డెవలప్ ఫేజ్‌కు తీసుకెళ్ళేలా నిర్ణయం తీసుకుంది. దానినే, సాధారణ భాషలో, కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు, ఉద్యమ "ప్రభావిత" రాష్ట్రాలను, జిల్లాలను "మావోయిస్టు రహిత" రాష్ట్రాలుగా, జిల్లాలుగా మార్చుతామని ప్రకటన చేస్తోంది. **ఉద్యమాన్ని ఓటమి పాల్జేసి, మావోయిస్టు ఉద్యమం తిరిగి తలెత్తకుండా ప్రచార, "అభివృద్ధి", నిఘా, దాడి ఆపరేషన్లను నడుపుతూ దోపిడీ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడమే డెవలప్ ఫేజ్ ఆపరేషన్ల లక్ష్యం.** ఈ లక్ష్య సాధన కోసం ఇపుడు దండకారణ్యంతో సహా దేశంలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలంతటా నిర్ణయాత్మక యుద్ధం సాగిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. పార్టీ, పీఎల్‌జీఏ బలగాల, ప్రజా నిర్మాణాల, ప్రజల మొత్తంగా విప్లవ క్యాంపు మనోస్థైర్యాన్ని దెబ్బతీయడం కోసం లేదా అందులోని బలహీన శక్తులను లొంగదీయడం కోసం ప్రభుత్వాలు మావోయిస్టులు ఇపుడు ఓడిపోయే యుద్ధం చేస్తున్నారని ప్రకటిస్తున్నాయి. హల్బి తుమిరిగుండ-కసనూర్ ఘటన జరిగే వరకు దేశంలో మరోసారి మావోయిస్టుల ఘటనల తీవ్రత-విస్తృతి పెరుగుతుందంటూ 2022 నాటికి కూడా దేశంలో మావోయిస్టులను అణచివేయడం సాధ్యం కాదంటూ, ఆ గడువును మరో సంవత్సర కాలం పొడిగించాల్సి రావచ్చునంటూ పారా మిలిటరి అధికారులు, ఇతర పోలీసు అధికారులు మాట్లాడుతూ వచ్చారు. హల్బి తుమిరిగుండ-కసనూర్, ఆయిపేంట ఘటనలు జరిగిన తరువాత ఇందుకు భిన్నంగా, మావోయిస్టు ఉద్యమాన్ని 2022కు ముందే అణచివేస్తామనీ, అందువల్ల మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి సరెండర్ కావాలనీ, లేకపోతే కసనూర్ లాంటి ఘటనల ద్వారా మావోయిస్టులను నిర్మూలిస్తామని ప్రకటనలు విడుదల చేస్తున్నారు.

గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న 'సమాధాన్' దాడినీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలను మనం ఎలా అర్థం చేసుకోవాలి? దేశంలోని విప్లవోద్యమం కొనసాగుతున్న రాష్ట్రాలను, జిల్లాలను "మావోయిస్టు రహిత" రాష్ట్రాలుగా, జిల్లాలుగా మార్చడం కోసం శత్రువు అనుసరిస్తున్న వ్యూహం-ఎత్తుగడలు ఏమిటి? శత్రుదాడిని ఓడించడం కోసం మనం అనుసరించాల్సిన వ్యూహం-ఎత్తుగడలు ఏమిటి? పద్ధతులు ఏమిటి? అనేది చూద్దాం.

ముందు నుండి కొనసాగుతున్న శత్రు దాడులతోపాటు గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న 'సమాధాన్' దాడి ఫలితంగా మన స్వీయాత్మక శక్తులు కొన్ని దెబ్బతిన్న మాట వాస్తవమే. వీరిలో కొద్దిమంది శత్రుదాడిలో అమరులు కాగా, బలహీనులు కొద్దిమంది సరెండరయ్యారు. విప్లవోద్యమ ప్రాంతాలు కొన్ని బలహీనపడ్డాయి, కొన్ని తాత్కాలికంగా సెట్‌బ్యాక్‌కు గురయ్యాయి. ప్రజావిముక్తి గెరిల్లాసైన్యం (పీఎల్‌జీఏ) ఏర్పాటు తరువాత శత్రు అధికారాన్ని ధ్వంసం చేస్తూ కొనసాగించిన గెరిల్లాయుద్ధం ఫలితంగా కొన్ని ఏరియాల్లో, జిల్లాల్లో/జోన్లు/డివిజన్లలో విప్లవ ప్రజా కమిటీలు (ఆర్‌పీసీలు) నిర్మాణమై గెరిల్లాబేసులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతాల్లో ఇపుడు "కార్పెట్ సెక్యూరిటీ"తో పాటుగా శత్రువు రోడ్డు, రవాణా, కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ వ్యవస్థలను నిర్మించడంలో సాపేక్షికంగా సఫలమవుతున్న మాట వాస్తవమే. ఈ వ్యవస్థల నిర్మాణాన్ని వెన్నంటి ఇప్పటివరకు దోపిడీ ప్రభుత్వ యంత్రాంగం బలహీనపడ్డ చోట తిరిగి బలపడుతుండడం, ధ్వంసమయిన చోట పునర్నిర్మాణమవుతూ ఉండడం కూడా వాస్తవమే. తన విజయాల గురించిన శత్రు ప్రకటనల్లో ఓ మేరకు వాస్తవికత ఉన్నప్పటికీ, వాటిలో మానసిక యుద్ధపు దాడి కూడా ఉంది. భారత విప్లవోద్యమం వ్యూహాత్మక ఆత్మరక్షణ దశలో గెరిల్లా యుద్ధం సాగిస్తున్న స్థితిలో ఉంది. కాబట్టి శత్రు ప్రకటనలను మనం మాలెమా దృష్టితో విశ్లేషించుకోవడం అవసరం. శత్రుదాడి ఫలితంగా ఆయా పోరాట ప్రాంతాల స్వభావంలో మౌలికమైన మార్పు రానంతవరకు ఎదురయ్యే ప్రతికూలతలన్నీ పరిమాణాత్మక మార్పులే. అయితే ఈ పరిమాణామాత్మక మార్పుల ఫలితంగానే అయినప్పటికీ ఆయా స్పెషల్ ఏరియాల్లో/స్పెషల్‌జోన్లలో/రాష్ట్రాల్లో; జిల్లాల్లో/జోన్లలో/డివిజన్లలోని వర్తమాన ఉద్యమ స్థితి ఏమిటి? శత్రు బలాబలాల స్థితి, మన బలాబలాల స్థితి ఏమిటి? ప్రజల పోరాట సంసిద్ధత, మిత్రశక్తుల స్థితి, పాలకవర్గాల మధ్య వైరుధ్యాల స్థితి ఏమిటి? అనే విషయాలను ఎక్కడికక్కడే సంబంధిత రీజనల్ బ్యూరోలు, స్పెషల్ ఏరియా/స్పెషల్ జోనల్/రాష్ట్ర కమిటీలు నిర్దిష్టంగా చర్చించి, సరైన అంచనాకు రావాలి. ఆ అంచనాపై ఆధారపడి, ఈ సర్క్యులర్ గైడెన్స్‌లో, తమతమ ప్రాంతాల స్థితిలో పురోభివృద్ధి తీసుకరావడానికి తగిన కార్యక్రమాల్ని, ఎత్తుగడలను రూపొందించుకోవాలి.

**భారత విప్లవోద్యమ నిర్మూలన కోసం శత్రువు అనుసరిస్తున్న బహుముఖ ఎత్తుగడలు :**

భారత విప్లవోద్యమ అణచివేత కోసం కేంద్రప్రభుత్వం రూపొందించిన విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహం-ఎత్తుగడలు గురించి ఇప్పటికే మన పార్టీ కేంద్రకమిటి, కేంద్ర మిలటరీ కమీషన్ వివిధ సందర్భాల్లో రాసినందున, ఇక్కడ కొన్ని ముఖ్యమైన విషయాలనే పేర్కొంటున్నాం.

1. **విప్లవోద్యమ ప్రాంతాల్లో పెద్దఎత్తున పారా మిలటరీ, కమాండో, స్పెషల్ పోలీసు బలగాలను మోహరించి కార్పెట్ సెక్యూరిటీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం. కార్పెట్ సెక్యూరిటీ**

**ఆధారంగా కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్‌ను తీవ్రతరం చేయడం, కార్డన్, సెర్చ్ అండ్ కిల్ (చుట్టివేత, వెతకడం, చంపడం) ఆపరేషన్స్‌ను తీవ్రతరం చేయడం.**

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబంగ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లతో పాటు తమిళనాడు, కేరళం, కర్ణాటక, అసోం రాష్ట్రాల్లో విప్లవోద్యమ అణచివేత కోసం ఐదున్నర లక్షల పారా మిలిటరీ, కమాండో, పోలీసు బలగాల్ని మోహరించారు. ఈ సంవత్సరంన్నర కాలంలోనే 30,000 పారా మిలిటరీ, కమాండో, స్పెషల్ పోలీసు బలగాల్ని మోహరించారు. 2017 నవంబర్ నుండి 2018 మే మధ్య కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో కొత్తగా 16 చోట్ల క్యాంపుల్ని ఏర్పాటు చేశారు. మరో 28 క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఇంత పెద్దఎత్తున బలగాలను మోహరించి "సమాధాన్" దాడిని ఫాసిస్టు పద్ధతుల్లో నడుపుతున్నప్పటికీ మావోయిస్టుల నిర్మూలన కోసం ఈ బలగాలు సరిపోవంటూ శతృవు మరిన్ని బలగాలను కోరుకుంటున్నాడు. అందుకే శతృవు నిరంతరం విప్లవోద్యమ ప్రాంతాల్లో పోలీసు, కమాండో బలగాల్ని, పారా మిలిటరీ బలగాలనూ పెంచుతున్నాడు. అందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మూడు ఛత్తీస్‌గఢ్ సాయుధ పోలీసు (సీఏఎఫ్) బెటాలియన్లను ఏర్పాటు చేస్తున్నది. 2016 నిర్ణయాన్ని అనుసరించి 2018 జూన్ నాటికి నాలుగు ఇండియన్ రిజర్వు బెటాలియన్లను, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక బస్తరియా బెటాలియన్‌ను నిర్మించి ఫీల్డ్ ఆపరేషన్స్‌లో (ఉద్యమ అణచివేత చర్యల్లో) మోహరించారు. వీటితో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పెషల్ టాస్క్‌ఫోర్సు (ఎస్‌టీఎఫ్), డిస్ట్రిక్ రిజర్వు గ్రూపు (డీఆర్‌జీ) పేర్లతో ఉన్న కమాండో బలగాల శక్తి, సమర్థతలు విప్లవోద్యమ అణచివేతకు సరిపోవడం లేదనీ పేర్కొంటూ ఆంధ్ర–తెలంగాణల్లోని గ్రేహౌండ్స్ బలగాల లాంటి కౌంటర్ గెరిల్లా ఆపరేషన్లను నడిపే కమాండో బెటాలియన్‌ను బ్లాక్‌పాంథర్స్ (నల్ల చిరుతలు) పేరుతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ సంవత్సర కాలంలో విప్లవోద్యమ ప్రాంతాలన్నింటిలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు బలగాలను పెంచివేశాయి. తెలంగాణలో కొత్తగా రెండు రాష్ట్ర పోలీసు బెటాలియన్లను నిర్మించి జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మోహరించారు. దండకారణ్య భూభాగం నుండి తెలంగాణలోకి మావోయిస్టుల ప్రవేశాన్ని నిరోధించడం కోసమే ప్రత్యేకించి వీటిని మోహరించారు.

దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో ప్రాంతంలోని మన పీఎల్‌జీఏ బెటాలియన్‌పై చుట్టివేయడం, వెతకడం, చంపడం (కార్డన్, సెర్చ్ అండ్ కిల్) అనే ఆపరేషన్ల కోసం బస్తర్ ప్రాంతంలోని జిల్లాలతో పాటు రాజ్‌నంద్‌గావ్ నుండి పోలీసు, పారా మిలిటరీ, కమాండో బలగాలను తరలించి 50 వేల మందితో ఈ సంవత్సరం జూన్ నెలలో ఆపరేషన్ ప్రహార్–3 పేరుతో శతృవు దాడులు నిర్వహించాడు. ఇందులో పోలీసు బలగాలే నష్టపోయాయి. అయితే రానున్న

రోజుల్లో పెరిగిన 'కార్పెట్ సెక్యూరిటీ' ఆధారంగా మావోయిస్టులను చుట్టుముట్టి, వెతికి, నిర్మూలించే ఆపరేషన్లను (కార్డన్, సెర్చ్ అండ్ కిల్) మరింత తీవ్రతరం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి.

విప్లవోద్యమ ప్రాంతాల్లో 'కార్పెట్ సెక్యూరిటీ' పెరిగిన ఫలితంగా మన పార్టీ, పీఎల్‌జీఏ యూనిట్ల కదలికలకు-ప్రయాణాలకు; మాస్‌వర్క్‌కు-మిలటరీ వర్కుకు తీవ్రమైన ఆటంకాలు ఎదురవుతున్నాయి. మైదాన ప్రాంత టెర్రయిన్ ఉన్నచోట, ప్రజా పునాది బలహీనంగా ఉన్న చోట మనకు మరిన్ని తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. కాబట్టి 'కార్పెట్ సెక్యూరిటీ' ప్రాంతాల్లోని టెర్రయిన్, ప్రజా పునాది, పీఎల్‌జీఏ ఫార్మేషన్లు అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని మాస్‌వర్క్, మిలటరీ వర్కు పద్ధతులను రూపొందించుకోవాలి.

**2. గెరిల్లా బేసులలో, వ్యూహాత్మక ప్రాంతాలలో, ఉద్యమం నూతనంగా విస్తరించిన ప్రాంతాలలో కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్‌ను తీవ్రతరం చేయడం :**

పెరిగిన 'కార్పెట్ సెక్యూరిటీ'పై ఆధారపడి ఒక్కో ఏరియాను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటిని నాలుగు వైపుల నుండి చుట్టివేస్తూ చుట్టివేత, వెతకడం, చంపడం అనే ఆపరేషన్స్‌ను తెరపిలేకుండా చేస్తున్నారు. అలాగే, ఈ సంవత్సర కాలంలో చేసినట్లుగా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలపై, గెరిల్లా బేసులపై, వ్యూహాత్మక ప్రాంతాలపై, విస్తరణ ప్రాంతాలపై కేంద్రీకరించి దాడులు చేస్తున్నారు.

ఈ కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్‌లో భాగంగా కేంద్రకమిటీ నుండి మొదలుకుని స్థానిక స్థాయి నాయకత్వం వరకు నిర్మూలించే ఆపరేషన్స్‌ను చేపడుతున్నాడు. 'మావోయిస్టుల స్థావరాల్లోకి చొరబడి దూకుడుగా దాడులు చేస్తామనీ, మావోయిస్టులను చుట్టుముట్టి (కార్డన్ ఆఫ్) నిర్మూలిస్తామనీ' ప్రకటిస్తున్నాడు. విప్లవోద్యమానికి నాయకత్వాన్ని అందించే నాయకత్వ శక్తులను నిర్మూలించడం ద్వారా, విప్లవోద్యమాన్ని ఓటమిపాలు చేయడానికి శతృవు ఇలాంటి ఆపరేషన్స్ ద్వారా ప్రయత్నిస్తున్నాడు. గెరిల్లా బేసులపై, వ్యూహాత్మక ప్రాంతాలపై దాడుల్ని పెంచి, గెరిల్లా యుద్ధ నిర్వహణకు గెరిల్లా స్థావరాలు లేకుండా చేసి గెరిల్లా యుద్ధ నిర్వహణలో పీఎల్‌జీఏ చొరవను కోల్పోయే స్థితికి నెట్టివేయాలని చూస్తున్నాడు. వ్యూహాత్మక ప్రాంతాలపై దాడులు చేస్తూ మన సమన్వయ వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాడు, అలాగే విస్తరణ ప్రాంతాలపై దాడుల్ని పెంచి మన విస్తరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. వీటిని ఎదుర్కోవడానికి మనం తగిన ఎత్తుగడలను, పని పద్ధతులను రూపొందించుకోవాలి. ఇప్పటికే రూపొందించుకున్న వాటిని శత్రు దాడికి దీటుగా అభివృద్ధి చేసుకోవాలి, మార్చుకోవాలి.

**3. ఇంటలిజెన్స్ వ్యవస్థను బలోపేతం-విస్తృతం చేసుకుని ఫలితాలు సాధించేలా కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్ నడపడం :**

'సమాధాన్' వ్యూహం అమలులో భాగంగా శత్రువు గత సంవత్సరం నుండి ఇంటలిజెన్స్ వ్యవస్థను మరింత విస్తరించి, పటిష్టం చేస్తున్నాడు. హ్యూమన్ ఇంటలిజెన్స్, టెక్నికల్ ఇంటలిజెన్స్ వ్యవస్థలను విస్తృతం, పటిష్టం చేయడం కోసం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తూ ఇంటలిజెన్స్ సేకరిస్తున్నాడు. మావోయిస్టు గెరిల్లాల కదలికలను గుర్తించడం కోసమే ప్రత్యేకించి ఇజ్రాయిల్ దేశపు మద్దతుతో ఒక శాటిలైట్‌ను నిర్మిస్తున్నాడు. మనకు సివిల్, మిలిటరీ సప్లయిలు అందించే వ్యక్తులను, ఇతరత్రా పనులు చేసిపెట్టే వ్యక్తులను ఇన్‌ఫార్మర్లుగా మార్చుకోవడానికి, కోవర్టులను తయారు చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. మన కమ్యూనికేషన్స్‌ను ఇంటర్‌సెప్ట్ (అడ్డగించి వినడం) చేయడానికి శత్రువు అధునాతన టెక్నాలజీని ఉపయోగిస్తున్నాడు. మనం మొబైల్ ఫోన్లపై ఆధారపడి చేసే పనులపై శత్రువు నిఘా పెడుతున్నాడు. మనం వాడుతున్న మొబైల్‌ఫోన్లు, టాబ్లెట్లు, కంప్యూటర్లు దాడుల్లో శత్రువుకు దొరికినప్పుడు వాటి ద్వారా మనకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఉద్యమ ప్రాంత గ్రామాలన్నింటిలో ఒకరి నుండి 10 మందిని ఇన్‌ఫార్మర్లను తయారు చేసుకుంటున్నది. అలాంటి ఇంటిలిజెన్స్ వ్యవస్థ ద్వారా శత్రువు మన నాయకత్వ కామ్రేడ్స్ కదలికలను, మన గెరిల్లా యూనిట్ల కదలికలను, మనం చేసే పనులను పసిగట్టి, ట్రాక్‌చేసి (వెంబడించి) మనపై దాడులు చేస్తున్నాడు. గెరిల్లా యుద్ధ నియమాల అమలులో మన లోపాలు, ప్రత్యేకించి రహస్య పనివిధానపు అమలులోని లోపాలు వాడి ఇంటిలిజెన్స్ సేకరణకు ఒక వనరుగా మారి మనపై శత్రువు దాడులు చేయడానికి అవకాశాలు పెరుగుతున్నాయి. కనుక శత్రు టెక్నికల్ ఇంటలిజెన్స్‌కు అందకుండా మన గెరిల్లా యూనిట్ల కదలికలు ఉండేలా పార్టీ కమిటీల-కమాండ్ల అవగాహనను పెంపొందించడం, శిక్షణను అందించడం, ఆచరణలో వాటి అమలుకై తగిన ప్లాను ఉండేలా చూసుకోవడం, ప్లాను అమలును నిరంతరం తనిఖీ చేయడంపై మనం శ్రద్ధ పెట్టాలి. శత్రు నెట్‌వర్క్‌పై ఎటువంటి ఉదారవాదాన్ని ప్రదర్శించకుండా, దాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించి దెబ్బతీయడంపై కేంద్రీకరించాలి.

### 4. ఆదివాసీ ప్రాంతాల్లో పెరుగుతున్న పెటి బూర్జువా సెక్షన్లను విప్లవోద్యమం వైపు వెళ్ళకుండా సంస్కరణలను అమలు చేయడం :

సమాజంలోని మధ్యస్థ సెక్షన్లలో (పాలకపక్షం, విప్లవపక్షం కాకుండా మధ్యస్థంగా ఉండే సెక్షన్) అత్యధికులను ఏ పక్షం తమ పక్షాన నిలబెట్టుకోగలుగుతుందో ఆ పక్షం విజయం సాధిస్తుంది అనేది సాధారణ యుద్ధసూత్రం. ఎల్ఐసీలోని ముఖ్యమైన సూత్రాల్లో కూడా అది ఒకటి. దోపిడి వర్గం, పీడిత వర్గాలను, పీడిత సామాజిక సముదాయాలను, పీడిత జాతులను మున్నెన్నటికన్నా ఎక్కువగా దోపిడీ, పీడనలకు గురి చేస్తూనే తామే పీడిత ప్రజల అభివృద్ధికి పాటు పడుతున్నామనీ విప్లవపక్షం (వర్గ, సామాజిక, జాతి విముక్తి కోసం పోరాడే పోరాటకారులు)

పీడిత ప్రజల అభివృద్ధికి వ్యతిరేకమనీ గోబెల్స్ ప్రచారం చేస్తోంది. ఒక సెక్షన్‌ను తమ పక్షాన నిలబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులోభాగంగానే భారత ప్రభుత్వం (కేంద్ర ప్రభుత్వం), ఐక్యరాజ్య సమితి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా నవంబర్ 2017లో ప్రపంచ ఆదివాసీ వ్యాపార, పారిశ్రామికవేత్తల సదస్సును దంతెవాడలో నిర్వహించాయి. ఈ సదస్సు అనంతరం బస్తర్ ప్రాంతంలోని ఆదివాసీ సమాజంలో పెరుగుతున్న పెటీ బూర్జువా (విద్యార్థి-యువజనులు, మేధావులు, వ్యాపారులు, వగైరా) సెక్షన్లకు కొన్నింటికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ-గవర్నెన్స్, ఈ-బిజినెస్/బ్యాకింగ్ వ్యవహారాలు నడిపే సిబ్బందిగా, ఈ-లిటరసి (ఎలక్ట్రానిక్ అక్షరాస్యత) పెంచే కార్యకర్తలుగా, ఈ-రిక్షా (ఎలక్ట్రికల్ రిక్షా) నడిపేవారిగా, కడక్‌నాథ్ కోళ్ళ పెంపకదార్లుగా, అమ్మకందార్లుగా, రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రీయ ఎరువులతో వరి ధాన్యాన్ని పండించి అమ్మేవారుగా, ట్యూలిప్ (అలంకరణ కోసం వినియోగించే ఒక రకమైన పూలు) పూలతోటల పెంపకందార్లుగా, అమ్మకందార్లుగా స్థానిక ఆదివాసుల్లోని పెటీ బూర్జువా సెక్షన్లకు, మధ్యతరగతి సెక్షన్లకు కొన్నింటికి ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నారు. ఆదివాసీ సమాజంలో పెరిగే పెటీ బూర్జువా సెక్షన్లను సంస్కరణల ద్వారా విప్లవోద్యమం వైపు వెళ్ళకుండా చేసే ప్రయత్నాలు గతం నుండి ఉన్నప్పటికీ ఇలాంటి సదస్సుల అనంతరం అవి మరింతగా పెరిగాయి.

ఈ సంవత్సరం ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని 115 జిల్లాలను 'ఆకాంక్ష జిల్లాలు'గా ప్రకటించింది (ప్రస్తుతం వీటిని 105కు తగ్గించారు). మన ఉద్యమ 'ప్రభావం' ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని 10 జిల్లాలను ఈ ఆకాంక్ష జిల్లాల్లో చేర్చారు. గత 5-6 సంవత్సరాల నుండి బస్తర్ ప్రాంతంలోని 7 జిల్లాల నుండి ఎంపిక చేసిన కొంతమంది ఆదివాసీ విద్యార్థులను దంతెవాడ జిల్లాకు తెచ్చి 'అభివృద్ధి' చేసే కార్యక్రమాలు 'ఆకాంక్ష జిల్లా' యోజనలో భాగంగా మరింత ఊపందుకున్నాయి. దంతెవాడ జిల్లాలో గీదం-జవాంగ ఎద్యుకేషనల్ సిటీలో 18 విద్యా సంస్థలున్నాయి. వీటిలో 5,500 మంది విద్యార్థులకు ప్రాథమిక స్థాయి విద్య నుండి మొదలుకుని టెక్నికల్, ప్రొఫెషనల్ విద్యా కోర్సుల్లో విద్యను, శిక్షణను అందిస్తున్నారు. అలాగే 'ఛూలో ఆస్‌మాన్' (ఆకాశాన్ని అందుకోండి) అనే కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల కోసం శిక్షణను అందిస్తున్నారు. మరో 1,000 మంది విద్యార్థులను దేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్నారు. మహిళా స్వయం-ఉపాధిలో భాగంగా 1,500 మంది మహిళలకు ఈ-రిక్షాలను నడిపేలా డ్రైవింగ్ శిక్షణను ఇవ్వడంతో పాటు 150 మంది మహిళలకు ఈ-రిక్షాలను అందించారు. భూమ్‌గాదీ పేరుతో ఉన్న సేంద్రీయ వ్యవసాయ కంపెనీ 1,600 మంది రైతులను సమీకరించి 'ఆదిమ్' బ్రాండ్ వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసి వ్యాపారం చేస్తోంది.

వీటన్నింటి ద్వారా బస్తర్ ప్రాంతంలోని ప్రకృతి వనరులను దోపిడీ చేయడం కోసం దేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు సేవ చేసే ఉద్యోగులను తయారు చేయడమే కాకుండా వారిని తమకు సామాజిక పునాదిగా దోపిడీ వర్గాలు ఉపయోగించుకుంటున్నాయి. మరో వైపు వీరిని ముందుంచి ఆదివాసులను అభివృద్ధి చేస్తున్నట్లుగా చెప్పుకుంటున్నాయి.

ఈ సంవత్సరం ఏప్రిల్‌లో జాంగ్లా-బీజాపూర్‌ల నుండి ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఆయుష్మాన్ భారత్' పథకం ప్రారంభించడంతో పాటు వన్-ధన్ యోజన కూడా ప్రారంభించాడు. ఇందులో భాగంగా అటవీ ఉత్పత్తుల సేకరణ, నిల్వచేయడం, ప్రాసెసింగ్ చేయడం, బ్రాండింగ్ చేయడం, అమ్మకం-ఎగుమతి చేయడం వరకు ఆదివాసులలోని సంపన్న శక్తులకే అవకాశాలు కల్పించి వారినే ఆదివాసీ వ్యాపారవేత్తలుగా మలిచే ప్రయత్నాలు చేస్తున్నారు. బస్తర్‌లోని సంపదలను దేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టే క్రమంలో స్థానిక ఆదివాసుల్లోని అతి చిన్న సెక్షన్‌ను ట్రక్కు యజమానులుగా (ట్రాన్స్‌పోర్టర్స్), మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నిర్మాణంలో రోడ్డు తదితర కాంట్రాక్టర్లుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మార్చి వీరినే ఆదివాసి ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా, పెట్టుబడిదార్లుగా నిలబెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆదివాసీ సమాజంలోని పిడికెడుమందిని ముందుపెట్టి అత్యధికులను దోపిడీ, పీడనలకు, వినాశనానికీ గురిచేసి దానినే ఆదివాసుల అభివృద్ధిగా చిత్రించే దోపిడీ వర్గాల కుట్రలను, మోసాన్ని రాజకీయంగా ఎండగట్టాలి.

**5. 'అర్బన్ మావోయిస్టుల' పేరుతో ప్రజాసంఘాల కార్యకర్తలపై దాడుల్ని తీవ్రతరం చేయడం.**

'సమాధాన్' దాడి కేవలం గెరిల్లాజోన్ ప్రాంతాలపైన, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల పైన మాత్రమే సాగేది కాదు. భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే దుష్ట లక్ష్యంతో పట్టణ ప్రాంతాల్లోని ప్రజాసంఘాల కార్యకలాపాల్ని అణచివేయడం కోసం 'అర్బన్ మావోయిస్టులు' ప్రమాదకరమైన శక్తులనే ప్రచారానికి లంకించుకొని జూన్ నెలలో ఢిల్లీ, నాగపూర్, పూణేల నుండి 5 గురు ప్రజాసంఘాల కార్యకర్తలను అరెస్టు చేసి అక్రమ కేసులు మేపి జైళ్లకు పంపారు. రానున్న రోజుల్లో దేశంలోని ప్రజాసంఘాల కార్యకర్తలపై పెరగనున్న దాడులకు ఇది సంకేతం. రానున్న రోజుల్లో ప్రజాసంఘాల కార్యకర్తలపై ఫాసిస్టు దాడులు తీవ్రతరమవుతాయి.

**6. పార్టీకి నిధులు అందకుండా నిరోధించడం :**

విప్లవోద్యమ అణచివేత చర్యల్లో భాగంగా కేంద్రప్రభుత్వం మన పార్టీకి నిధులు అందే మార్గాలను గుర్తించి, వాటిని అడ్డుకునేలా కార్యాచరణ పథకాన్ని (ఆక్షన్ ప్లాన్‌ను) చేపట్టింది. ఈ ఆక్షన్ ప్లాన్ అమలు కోసం కేంద్ర హెూంశాఖలో బహుళ నియంత్రణ కార్యాచరణ బలగాన్ని (మల్టీ డిసిప్లినరీ టాస్క్‌ఫోర్స్) ఏర్పాటు చేసింది. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ),

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఏ)లు, మరో రెండు ఏజెన్సీలు సభ్య సంస్థలుగా ఉన్నాయి. ఈ టాస్క్‌ఫోర్సు, రాష్ట్రప్రభుత్వాలతో కలసి విప్లవోద్యమ ప్రాంతాల్లో సాగే తునికాకు, వెదురు, వ్యాపారం, మైనింగ్, మౌలిక సదుపాయాల నిర్మాణం, రియల్ ఎస్టేట్ తదితర వ్యాపార, పారిశ్రామిక, సేవారంగాల వ్యక్తుల కార్యకలాపాలపై, లావాదేవీలపై నిఘా పెడుతుంది. మనకు డబ్బు అందించే వారిగా అనుమానించే వారందరిపై ఈ నిఘా ద్వారా కేసులు మోపుతుంది. ఈ లక్ష్యంతోనే కేంద్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం తునికాకు టేకేదార్లను మనకు నిధులు ఇవ్వకుండా అడ్డగించాయి. టేకేదార్లను, మేనేజర్లను ఇన్‌ఫార్మర్లుగా మార్చుకోవడానికి ప్రయత్నాలు చేశాయి, నిధుల వసూలు సందర్భంగా మనపై దాడులు జరిగాయి.

**'సమాధాన్' దాడిని ఓడించడం కోసం మనలో కొనసాగుతున్న తీవ్రమైన స్వీయాత్మకత, ఉదారవాదాల నుంచి బయటపడటానికి గతితార్కిక చారిత్రక భౌతికవాద విశ్లేషణా పద్ధతినీ, వర్గపంథానీ అమలు చేద్దాం; మావోయిస్టు పోరాటశైలికి పదునుపెడుతూ నష్టాలను తగ్గిద్దాం; ఉద్యమ ప్రాంతాల్లో లభిస్తున్న పాజిటివ్ అనుభవాల ఆధారంగా ప్రజా పునాదిని పెంచుకుందాం, పార్టీనీ, పీఎల్‌జీఏనూ పటిష్టం చేసుకుందాం; ప్రజా యుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం.**

శత్రుదాడిని ఓడించడం కోసం బహుముఖ ప్రతిదాడి ఎత్తుగడల గురించి గతంలో సీసీ, ఎస్ఏసీ/ఎస్‌జడ్‌సీ/ఎస్‌సీలు రాసిన వాటిలో అత్యధికం ఇప్పటికీ మనకు గైడెన్స్‌గానే ఉంటాయి. కాబట్టి, 'సమాధాన్' దాడిని ఓడించడం కోసం కొన్ని ముఖ్యమైన విషయాలనే ఇక్కడ పేర్కొంటున్నాం.

**1. శత్రుదాడిలో వచ్చిన తీవ్రమైన మార్పును అర్థం చేసుకోవడంలో మన సైద్ధాంతిక, రాజకీయ, సైనిక అవగాహనలో మార్పు రావాలి :**

శత్రుదాడిలో వచ్చిన తీవ్రమైన మార్పును అర్థం చేసుకోవడంలో, గెరిల్లాయుద్ధ సాధారణ సూత్రాలను, మన పార్టీ పై కమిటీల తీర్మానాలు, సర్క్యులర్లను నిర్దిష్ట పరిస్థితులకు జోడించి సృజనాత్మకంగా అమలు చేయడంలో, స్వీయాత్మకత, ఉదారవాదం, వ్యక్తివాదం, స్పాంటేనిటీ, సెక్టేరియనిజం పార్టీ కమిటీలలో, కమాండ్లలో తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. వీటితో పాటు కమిటీలు, కమాండ్లు బాధ్యతారహితంగా వ్యవహరించినచోట తీవ్రమైన నష్టాలు పొందాం. అందువల్ల అవి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమస్య మూలాల్లోకి వెళ్లి విశ్లేషించుకొని తమ సైద్ధాంతిక, రాజకీయ, సైనిక బలహీనతలను అధిగమించేందుకు కృషి చేయాలి. తమ ఆచరణలో పరివర్తన తీసుకొని రావాలి. యుద్ధంలో ఇరుపక్షాలలో జరుగుతున్న మార్పులను

గుర్తించాలి. రెండు పక్షాలలో బలమైన, బలహీనమైన అంశాలను గుర్తించి శత్రు బలహీనతలపై కేంద్రీకరించి దెబ్బతీసి ఓడించాలి. మనలో పాక్షిక దృష్టి, అల్పదృష్టి వల్ల పరిస్థితిని సమగ్రంగా అర్థం చేసుకోలేకపోతున్నాం. శత్రు బలాన్ని తక్కువగా చూడడం లేదా అతిగా చూడడం, అలాగే మన బలాన్ని అతిగా చూడడం లేదా తక్కువగా ఆలోచించడం ఉంటున్నది. అంటే వాస్తవ పరిస్థితులను వాస్తవికంగా విశ్లేషించకపోవడం, అనుకూల పరిస్థితులనే అర్థం చేసుకొని గడ్డు పరిస్థితిని అర్థం చేసుకోకపోవడం ఉంటున్నది. ఇది అనుభవవాదం రూపంలో వ్యక్తమవుతున్నది. మనం ఈ స్వీయమానసిక ధోరణిని విడనాడాలి. యదాలాపకత రూపంలో ఉదారవాదం, అనుకున్న నిర్ణయాలను, పద్ధతులను అమలు చేయని, పాటించని రూపంలో వ్యక్తివాదం, విశాల ప్రజానీకాన్ని వర్గ పోరాటంలో సమీకరించకుండా కొద్దిమందికే పరిమితమయ్యే రూపంలో సెక్టేరియనిజం మనలో ఉంది. వీటన్నింటినీ విడనాడాలి.

మనం అనేక అనుభవాల నుండి విప్లవ గెరిల్లాయుద్ధ ఎత్తుగడలను మన నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసుకున్నాం. ఐఏడిలు, ఆంబుష్‌లు, రెయిడ్లు, ఫైర్ అండ్ మూవ్‌మెంట్, అనార్మ్‌డ్ కంబాట్, బిఎంసి, పీఎల్‌జిఏ హ్యాండ్ బుక్, కంపెనీ డ్రిల్స్, బెటాలియన్ డ్రిల్స్, బూబీట్రాప్స్, మైన్ యుద్ధతంత్రం మొదలైన వాటిపై అనేక రకాల ట్రైనింగ్ క్యాంపులు జరుగుతున్నాయి. అయినప్పటికీ, వాటిని ఉదారవాదంతో నిర్దిష్టంగా పార్టీ నాయకత్వం, పోరాటయోధులు అమలు చేయలేకపోతున్నారు. ఉదారవాదం నుంచి బయటపడి నాయకత్వం క్రియాశీలంగా, చురుకుగా ఉంటే తప్పులను, క్రమశిక్షణను ఎప్పటికప్పుడు సరిచేసి నష్టాలను తగ్గించగలరు. శత్రువుకు వ్యతిరేకంగా రాజకీయంగా వర్గకసితో పోరాడగలరు.

**2. ఆత్మరక్షణ నియమాల, పద్ధతుల అమలులోని లోపాలను సరిదిద్దుకోవాలి :**

దోపిడీ పాలకవర్గాలు దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సమగ్ర వ్యూహంతో దాడి చేస్తున్నాయి. శత్రువు వివిధ గెరిల్లాబేసులు, గెరిల్లాజోన్లు, ఎర్రప్రతిఘటనా ప్రాంతాలపై కేంద్రీకరించి దాడి చేస్తున్నప్పటికీ, దండకారణ్యం వాడి ప్రధాన లక్ష్యం. శత్రు దాడి తీవ్రత పెరుగుతున్న కొలదీ శత్రు బలగాల సంఖ్య, ఆయుధాలు, శిక్షణ, వాటి విన్యాసాలు, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలు, ఇందుకోసం బడ్జెట్ కేటాయింపులు పెద్దెత్తున పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న 'సమాధాన్' దాడిని ఓడించాలంటే మనం క్రియాశీల ఆత్మరక్షణా యుద్ధాన్ని కొనసాగించాలి. మన శక్తులలో నిరంతరం యుద్ధ సంసిద్ధతను పెంచాలి.

ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా మనకు జరిగిన నష్టాలు ఒక వైపు పెరిగిన శతృదాడి తీవ్రతకు మరోవైపు గెరిల్లాయుద్ధ నియమాల అమలులో, రహస్య పనివిధానపు అమలులో

మన పార్టీ, పీఎల్‌జీఏలోని వివిధ స్థాయి నాయకత్వ శ్రేణుల, కార్యకర్తల, బలగాల లోపాలకు, బలహీనతలకు సూచికలు. శత్రు బలాధిక్యత ఫలితంగా మనం యుద్ధంలో కొన్నిసార్లు నష్టపోతాం. కానీ మనం గెరిల్లా యుద్ధ నియమాలను, రహస్య పని పద్ధతులను ఆచరిస్తే ఇందులో అత్యధిక నష్టాలను నివారించుకోగలుగుతాం.

మన నియమాలకు, తీర్మానాలకు భిన్నంగా ప్రజా వ్యతిరేకులతో సప్లయిల కోసం, ఇతరత్రా అవసరాల కోసం సంబంధాలు కొనసాగించడం వల్ల, శత్రు నెట్‌వర్క్‌పై విమర్శనాత్మక పరిశీలన లేకపోవడం వల్ల, సాపేక్షికంగా వెసులుబాటు కాలంలో మనం అలవర్చుకున్న పాత పద్ధతులూ, అలవాట్లూ, పనిశైలిలోని లీగలిస్టు ధోరణులు ఇప్పటికీ మనలో కొనసాగడం వల్ల మన సమాచారం పోలీసులకు అందుతున్నది. ప్రత్యేకించి మనం భారీగా నష్టపోయిన తుమిరిగుండ–కసనూరు ఎన్‌కౌంటర్‌లో, అడ్వాన్స్–రిట్రీట్‌కు అవకాశం లేనివిధంగా ఇంద్రావతి నది ఒడ్డున పెద్ద మడుగు పక్కన డేరా వేయడం, శతృవు మన డేరాపై దాడి చేసిన తరువాత డివిజనల్ కమిటీ సభ్యులు గానీ, ఆ ఫార్మేషన్‌కు కమాండర్‌గా ఉన్న డీవీసీ కామ్రేడ్ గానీ చొరవతో కమాండింగ్ చేయకపోవడం, శతృదాడి మొదలయిన తరువాత కవర్లలో ఉంటూ ప్రతిఘటిస్తూనే డేరాను శతృవు ఎన్‌సర్కిల్ చేయకముందే రిట్రీట్ కాకుండా రెండు గంటల పాటు డేరాలోనే ఉండి ప్రతిఘటనను కొనసాగించడం, రిట్రీట్‌కు మార్గం లేదని భావించి మన కామ్రేడ్ ఒకరు 'మడుగులోకి దూకండి' అంటూ తొందరపాటుతో కాషన్ ఇవ్వడం, దాన్ని అనుసరించి చాలా మంది కామ్రేడ్స్ నీటి మడుగులోకి దూకగా, వారిలో కొందరు ఆయుధాలతో సహా ఈదలేకపోవడం వల్ల, కొందరు శత్రు తూటాలు తగలడం వల్ల, అంటే శత్రు కాల్పుల్లో డేరాలో అమరులైనవారి కన్నా నీటి మడుగులో ఎక్కువ సంఖ్యలో అమరులు కావడం లాంటి తీవ్రమైన లోపాలు జరిగాయి. నీలంబూర్ ఎన్‌కౌంటర్‌లో, సైద్ధాంతికంగా, రాజకీయంగా, మిలటరీపరంగా స్వీయాత్మకత, ఉదారవాదం, లీగలిజం కారణంగా శత్రువును తక్కువగా అంచనా వేయడం, సీసీ, ఎస్‌జడ్‌సీల దిశానిర్దేశాన్ని ఉల్లంఘించడం, గెరిల్లాయేతర పద్ధతుల్ని అవలంభించడం, మన శక్తుల్ని అందులో భాగంగా పార్టీ నాయకత్వాన్ని, పార్టీ రహస్యాలను కాపాడటంలో కమ్యూనిస్టు గెరిల్లా విలువల్ని పాటించడంలో తీవ్రమైన బలహీనతల కారణంగా ఉన్నతస్థాయి నాయకత్వాన్ని కోల్పోయాం.

గెరిల్లా యుద్ధ నియమాలను అనుసరించి మన గెరిల్లా యూనిట్ ఏదయినా (ఎల్‌జిఎస్ కావచ్చు, ప్లాటూన్, కంపెనీ, బెటాలియన్ కావచ్చు), అవి కేంద్రీకృత బలగాలుగా ఉన్నా, వికేంద్రీకృత బలగాలుగా ఉన్నా; రోజువారీ కార్యకలాపాల్లో ఉన్నా, ప్రత్యేక క్యాంపెయిన్‌లలో ఉన్నా తమ కదలికల్ని రహస్యంగా సాగించాలి. రాత్రిపూట ప్రయాణాలు చేయడం, అడవి

గుండా ప్రయాణాలు చేయడం, రోడ్డు, కాలిబాటలు వదిలి ప్రయాణాలు చేయడం, ప్రయాణంలో ముందుగా స్కౌట్లను పంపుకోవడం, నమ్మకమైన ప్రజలను, స్థానిక నిర్మాణాల కామ్రేడ్స్‌ను ప్రయాణంలో ఫ్లాంకులలో, రియర్‌లో స్కౌట్లుగా, గైడ్స్‌గా ఉపయోగించుకోవడం, డేరాలు అడ్వాన్స్-రిట్రీట్‌లకు అనుకూలంగా ఉండేలా చూసుకోవడం, డేరాల్లో కేమోఫ్లేజ్, కవర్, కన్‌సీల్‌మెంట్ ఉండేలా చూసుకోవడం, డేరా పరిసరాల్లో అనుకున్న విధంగా రోజూ పెట్రోలింగ్ చేయడం, సెంట్రీ, అబ్జర్వేషన్ పోస్టులు పెట్టుకోవడం, పరిస్థితికి అనుగుణంగా సెంట్రీ, పెట్రోలింగ్, అబ్జర్వేషన్ వ్యవస్థలో మార్పులు చేసుకోవడం, ఆంబుష్ టీములను మోహరించడం, మైన్స్, క్లేమోర్స్‌తోపాటు రకరకాల అబ్‌స్టకిల్స్ (అడ్డంకులను)ను ఏర్పాటు చేసుకోవడం, పోలీసు కదలికలను రాత్రయినా, పగలయినా గమనించిన వెంటనే ప్రజలను, పార్టీ, పీఎల్‌జీఏ బలగాలను అలర్టు చేయడానికి మిలీషియా ఉన్న ప్రతి గ్రామంలో ఆ మిలీషియాకూ, మిలీషియా లేనిచోట వ్యక్తులుగా ఒకరిద్దరికి టపాకాయలు, కార్డెక్స్ బాంబులు, విల్లుకాడీ బాంబులు పేల్చేలా, బాధ్యతలు ఇచ్చే పద్ధతులను అభివృద్ధి చేసుకోవడం అవసరం. శత్రువు దాడి స్థితిలో ఉన్నందున, వాడు ఎప్పుడు దాడికి వచ్చినా నష్టపరిచే/నిర్మూలించే విధంగా వాడు కదలికలు జరిపే మార్గాలలో నిరంతరం మన బలగాలలో ఒక భాగం మాటుగాసి ఉండాలి. సాయుధ మిలీషియా నుంచి మొదలుకొని సెకండరీ బలగాలైనా, ప్రధాన బలగాలైనా, అంటే పీఎల్‌జీఏలోని ఏ యూనిట్ అయినప్పటికీ మనం రూపొందించుకున్న మిలటరీ నియమాలను తప్పనిసరిగా అమలు చేయాలి. వీటన్నింటి ద్వారా మనం 'కార్పెట్ సెక్యూరిటీ' వ్యవస్థ మధ్యలో ఉన్నా, పెద్దఎత్తున శత్రు బలగాలు దాడికి వచ్చినా శత్రు దాడులకు గురికాకుండా తప్పుకోగలగడమే కాకుండా శత్రువునే నష్టపరచగలుగుతాం. ఒకవేళ మనం శత్రుదాడికి గురయితే గెరిల్లా యుద్ధ నియమాలను అనుసరించి ఆత్మరక్షణ-దాడి పద్ధతులను సరిగా అమలుచేయాలి. సి-4ను సరిగా అమలు చేయాలి. ప్రత్యేకించి కమాండింగ్ సరిగా ఉండాలి. మనం శత్రుదాడికి గురయినప్పుడు శత్రువు మన మకాంను ఎన్‌సర్కిల్ చేయకముందే రిట్రీట్‌అయ్యేలా మన ఫైర్ అండ్ మూవ్‌మెంట్ పద్ధతులుండాలి. ఒక గ్రూపు/సెక్షన్ శత్రువును నిలవరించేలా ఫైరింగ్-అఫెన్స్ చేస్తుంటే మరోగ్రూపు/సెక్షన్ రిట్రీట్ కావాలి. ప్రతి సెక్షన్/ఎల్‌ఓఎస్ తప్పనిసరిగా విల్లుకాడీ బాంబులను, బీజీఎల్స్ (బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్స్)ను పట్టుకోవాలి. వాటిని శత్రువుపై ఉపయోగించడం ద్వారా మన అడ్వాన్స్-రిట్రీట్‌లకు అవకాశాల్ని సృష్టించుకోవాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ధైర్యసాహసాలతో శత్రువును ప్రతిఘటించాలి.

గెరిల్లా యుద్ధ నియమాలు అమలు చేయడానికి మొదట మన నాయకత్వ శ్రేణుల, కమాండర్ల, బలగాల్లోని యథాలాపాన్ని, పెటి బూర్జువా బలహీనతలను, గెరిల్లా జీవన శైలికి పొసగని జీవనశైలిని-అలవాట్లను, సోమరితనాన్ని వదిలించుకోవాలి. కష్టపడేతత్వాన్ని పెంచుకోవాలి.

'కార్పెట్ సెక్యూరిటీ' పరిస్థితుల్లో బలగాల కేంద్రీకరణ–వికేంద్రీకరణలో అనుభవం, నైపుణ్యం సంపాదించాలి. టీసీఓసీ కాలాల్లో గానీ, ఇతర పనుల సందర్భంగా గానీ సన్నాహాలన్నీ వికేంద్రీకృత బలగాలు చేస్తే, బలగాలు కేంద్రీకృతమయిన వెంటనే నిర్ణీత పనిని పూర్తి చేసుకుని విడిపోవాలి. ఒక వేళ నిర్ణీత పనిలో ఆటంకాలు ఎదురవుతే తిరిగి వికేంద్రీకృతమయ్యి, ఆటంకాలను తొలగించుకుని మళ్ళీ కేంద్రీకృతం కావాలి. బలగాలు కేంద్రీకరించబడ్డప్పుడు ఆ బలగాల్లో మిలిటరీపరంగా సమర్థులైన, సాహసికులైన వారినే కమాండర్లుగా నియమించాలి. వాళ్ళు ఆత్మరక్షణ–దాడికి సంబంధించిన విషయాల్లో చొరవగా కమాండింగ్ చేయాలి.

సప్లయిల వ్యవస్థలోని లోపాల వల్లా, డంపుల మెయింటెనెన్స్‌లోని లోపాల వల్లా ఎంతో విలువైన యుద్ధ సామగ్రి చెడిపోయి యుద్ధచర్యల నిర్వహణలో చాలా పరిమితులకు గురవుతున్నాం. ఈ లోపాలను సరిదిద్దుకుని యుద్ధచర్యల విస్తృతిని పెంచాలి.

పైన పేర్కొన్న ఆత్మరక్షణ–దాడి పద్ధతుల్లో అత్యధికం దీర్ఘకాలం నుండి మనం రాసుకుంటున్నవే, చెప్పుకుంటున్నవే. వీటిని సరిగా అమలు చేయకపోవడం మన తీవ్రమైన బలహీనత. కాబట్టి నాయకత్వ శ్రేణులు ఈ లోపాన్ని సరిదిద్దడంలో ఉదారవాదాన్ని, బలహీనతలను వదిలించుకోవాలి, సరిదిద్దాలి. తద్వారా మన ఆత్మరక్షణ–దాడి పద్ధతులను నేటి పరిస్థితులకు తగినట్లుగా మార్చాలి.

**3. 'సమాధాన్' దాడిని ఓడించాలంటే మన పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటన రంగాల్లోని నాయకత్వ శక్తులు మరింతగా బోల్షెవీకరించబడాలి, అన్యవర్గ ధోరణులను కచ్చితంగా సరిదిద్దుకోవాలి :**

మన పార్టీలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకోవడంలో తగిన ఫలితాలు సాధించకపోవడం కూడా గడ్డుస్థితి తలెత్తడానికి దారితీసిన ముఖ్యమైన కారణాల్లో ఒకటి. కాబట్టి కేంద్రకమిటి, ఆయా రీజినల్ బ్యూరోలు, స్పెషల్ ఏరియా కమిటీలు/స్పెషల్ జోనల్ కమిటీలు/రాష్ట్ర కమిటీలు ఆయా ప్రాంతాల్లో గుర్తించిన అన్యవర్గ ధోరణులను ఇప్పటికయినా తీవ్రంగా కృషి చేసి సరిదిద్దాలి. మొదట నాయకత్వ కాడర్లు అన్యవర్గ ధోరణులను మార్చుకుని, కింది స్థాయి కాడర్లను బలగాలను మార్చాలి. అన్యవర్గ లక్షణాలతో మొండిఘటాలుగా మారిన వారిపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

బోల్షెవీకరణ క్యాంపెయిన్‌ను ప్రారంభించని చోట ప్రారంభించి కిందివరకు తీసుకెళ్ళాలి. మొదటి విడత బోల్షెవీకరణ పూర్తయిన చోట్ల నాయకత్వ శక్తులు (సీసీ, ఎస్‌జెడ్‌సీ, డీవీసీ) తమ మాలెమా సైద్ధాంతిక అవగాహనను, అధ్యయన కృషిని పెంచుకోవాలి. అంటే మాలెమా నియమాలను తమ తమ ప్రాంతాల్లోని సామాజిక పరిస్థితులకు, వర్గపోరాట–ప్రజాయుద్ధ నిర్దిష్ట పరిస్థితికి అన్వయించడంలో ఆ కృషి తోడ్పడాలి. ఇందులో భాగంగా సామాజిక పరిశోధన

చేయాలి. ఆయా ప్రాంతాల ఉత్పత్తి సంబంధాల్లో, వర్గ సంబంధాల్లో మార్పులను గుర్తించి సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాల్ని తీవ్రతరం చేసే, ప్రజా యుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేసే ఎత్తుగడలను రూపొందించాలి. వీటి ఆధారంగా గడ్డుస్థితిని, తాత్కాలిక సెట్‌బ్యాక్ స్థితిని అధిగమించేలా ప్రజా పునాదిని పెంచాలి. బలమైన ప్రజా పునాది ఆధారంగా ప్రజా యుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేస్తూ 'సమాధాన్' దాడిని ఓడించాలి.

ఆదివాసీ ప్రాంతాల్లో, పెరుగుతున్న పెటీబూర్జువా సెక్షన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా, పారిశ్రామిక వేత్తలుగా మలచుకునే సంస్కరణల వల్ల గానీ, ఇతరత్రా ఆర్థిక, సామాజిక, రాజకీయ సంస్కరణల వల్ల గానీ కలుగుతున్న మార్పులను సామాజిక పరిశోధనలో గుర్తించాలి. ఆదివాసీ సమాజంలో పెరుగుతున్న పెటి బూర్జువా సెక్షన్లను విప్లవోద్యమంలో సమీకరించేలా ఒక రాజకీయ కార్యక్రమాన్ని, దాని సాధన కోసం తగిన పోరాట-నిర్మాణ రూపాలను వారి ముందుంచాలి. ఇందులో భాగంగానే ఆదివాసీ స్వయం ప్రతిపత్తి (అటానమి) సమస్యపై పోరాటాలు చేపట్టాలి. విప్లవ ప్రజా కమిటీలు (ఆర్‌పీసీ) ఉన్నచోట ఆదివాసీ, గైరాదివాసీ పెటీబూర్జువా సెక్షన్లను నూతన ప్రజాస్వామిక ఆర్థిక, రాజకీయ వ్యవస్థ నిర్మాణంలో విస్తృతంగా భాగస్వాములను చేయడం ద్వారా దోపిడీ వర్గాల సంస్కరణల వైపు వెళ్ళకుండా చేయాలి.

**4. శత్రుదాడిలో నిర్మాణాలు దెబ్బతిన్న చోట సంఘటితీకరణ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలి :**

శత్రువు మన ఉద్యమ ప్రాంతాల్లో నిరంతరాయంగా ఆపరేషన్లు నిర్వహిస్తూ ఎన్‌కౌంటర్లు, బూటకపు ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, బూటకపు లొంగుబాటు పథకాల ద్వారా వివిధ స్థాయిల్లో మన పార్టీ, పీఎల్‌జీఏ, యుఎఫ్ (విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ ప్రజా కమిటీలు) నిర్మాణాలను దెబ్బతీస్తున్నాడు. శత్రు దాడిలో ఈ విధంగా దెబ్బతింటున్న నిర్మాణాలను గ్రామ స్థాయి నుంచి పునర్నిర్మాణం-పునస్సంఘటితం చేయడంపై నిరంతరం మనం శ్రద్ధ వహించాలి. ఇందుకోసం ఆయా ప్రాంతాల నిర్దిష్ట పరిస్థితులను బట్టి తగిన పద్ధతులను ఎంచుకోవాలి. దెబ్బతిన్న ప్రాంతాలతో సంబంధాలు దీర్ఘకాలం పాటు తెగిపోతే, విప్లవ కార్యకలాపాలు పునరుద్ధరించకపోతే అక్కడ శత్రువు తిరిగి పూర్తిగా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకుంటాడు. అందుకు శత్రువుకు అవకాశం ఇవ్వకుండా చూడాలి.

**5. రాజకీయరంగంలో, నిర్మాణరంగంలో లభిస్తున్న పాజిటివ్ అనుభవాల ఆధారంగా విశాల ప్రజారాశులను సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటంలో సమీకరిద్దాం, ప్రజా పునాదిని పెంచుకుందాం, నూతన నాయకత్వ శక్తులను తర్ఫీదు చేసుకుందాం :**

ఈ మధ్యకాలంలో మనకు రాజకీయరంగంలో కొన్ని పాజిటివ్ అనుభవాలు లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని గడ్డు పరిస్థితి నుంచి బయటపడేసేందుకు మన ఉద్యమం కొనసాగుతున్న వివిధ స్పెషల్ ఏరియాలు/స్పెషల్ జోన్లు/రాష్ట్రాలలో మన పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ బలగాలు, విప్లవ ప్రజా నిర్మాణాలు, ప్రజలు వివిధ స్థాయిల్లో గెరిల్లా యుద్ధాన్ని-ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీ పథకం ప్రకారం విప్లవోద్యమాన్ని నూతన ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నది. తీవ్రమైన నిర్బంధం-దిగ్బంధనం మధ్యనే ప్రజాపునాదిపై ఆధారపడి సాహసోపేతంగా పోరాడుతూ శత్రు బలగాలను, వారి ఏజెంట్లను, ఇన్‌ఫార్మర్-కోవర్టు నెట్‌వర్క్‌లను నిర్మూలిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి సమస్య కేంద్రంగా వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయడం, విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాలను నిర్మించి అభివృద్ధి చేస్తూ విప్లవకర భూసంస్కరణలను అమలు చేయడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడంలో భాగంగా భూమి సమతలీకరణ కార్యక్రమాల్లో, ఉత్పత్తిని పెంచే ఉద్యమాలలో ప్రజలను భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ, దైనందిన సమస్యలపై, ప్రత్యేకించి జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్ కోసం, విస్థాపన సమస్యపై, రాజ్యహింసకు వ్యతిరేకంగా మనం అనేక పోరాటాలు నిర్మిస్తూ ప్రజాపునాదిని పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఝార్ఖండ్‌లో సిఎన్‌టీ, ఎస్‌పీటీ చట్టాలలో, భూసేకరణ చట్టం-2013 చట్టంలో సవరణలకు వ్యతిరేకంగా బద్దలైన ప్రజా ఆందోళనలను ప్రజాయుద్ధంతో జోడించాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డప్పటికీ, ప్రజల మౌలిక సమస్యలు గానీ, దైనందిన సమస్యలు గానీ పరిష్కారం కావని ప్రజలకు స్పష్టమవుతుండడంతో ప్రజాస్వామిక తెలంగాణ కోసం ప్రజల్ని రాజకీయంగా సమీకరించే, ప్రజా ఉద్యమాన్ని నిర్మించే కృషికి పూనుకోవడం మంచి ప్రయత్నం. ట్రైజంక్షన్ ప్రాంతంలో ప్రజల రాజకీయ, ఆర్థిక, దైనందిన సమస్యలను చేపట్టి ప్రజలను కూడగట్టడం ద్వారా అక్కడ ఉద్యమం క్రమంగా వేళ్లూనుకుంటున్నది. అక్కడ ప్రజల మౌలిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించే కర్తవ్యాన్ని చేపట్టి ఉద్యమాన్ని పురోగమింపజేయడం ద్వారా ప్రజాపునాదిని పెంపొందించుకోవాలి. పోరాట క్రమంలో మన స్వీయాత్మక శక్తులను పెంపొందించుకొని సంఘటితం చేసుకునేందుకు శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. పార్టీనీ, పీఎల్‌జీఏనూ బోల్షివీకరించేందుకు, సంఘటితం చేసుకునేందుకు కొన్ని చోట్ల శిక్షణా కార్యక్రమాలు, దిద్దుబాటు కార్యక్రమాలు కొనసాగించాం. మరి కొన్ని చోట్ల కొనసాగిస్తున్నాం. గత నాలుగైదు సంవత్సరాలుగా సిఆర్‌బి ప్రాంతంలో లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఎల్‌టీపీ), మిలటరి రంగ నాయకత్వ తర్ఫీదు (ఎమ్ఎల్‌టిపి) కార్యక్రమాలు నూతన నాయకత్వ శక్తుల్ని తర్ఫీదు చేయడంలో మంచి అనుభవాన్ని అందిస్తున్నాయి. వీలైన చోట్ల విప్లవ ప్రజాసంఘాల మహాసభలు కింది నుంచి పై వరకూ నిర్వహించి వాటి నాయకత్వాన్ని పటిష్టం చేస్తూ

ప్రజాసంఘాల నిర్మాణాలను రెగ్యులర్‌గా పనిచేయిస్తూ బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం. పట్టణ ప్రాంతాల్లో మన శక్తులు ఉన్నచోట విశాల ప్రాతిపదికన విద్యార్థి, కార్మిక, మహిళా రంగాల్లోనూ ఉద్యమాలు నిర్మిస్తున్నాయి. విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కిరాయి ప్రభుత్వ బలగాలు, వారి రహస్య హంతక ముఠాలు కొనసాగిస్తున్న రాజ్యహింసకు వ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమాలు నిర్మిస్తున్నాయి. 'నూతన భారతదేశ' నిర్మాణం పేరుతో దేశంలో 'హిందూ రాజ్యాన్ని' స్థాపించే లక్ష్యంతో మతమైనారిటీలపై, దళితులపై, ఆదివాసులపై, మహిళలపై, పీడిత జాతులపై, ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులపై హిందూ ఫాసిస్టు శక్తుల దాడికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ప్రజా ఉద్యమాలు నిర్మిస్తున్నాయి. వివిధ రాజకీయ అంశాలపై విప్లవ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తూ విప్లవ శక్తులలో విప్లవ స్ఫూర్తిని నింపేందుకు కృషి చేస్తున్నాయి.

ఈ రకంగా అన్ని స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్/రాష్ట్ర, జోనల్/జిల్లా/డివిజనల్ కమిటీలు వర్తమాన రాజకీయ పరిస్థితుల్లో విశాల ప్రజల సమీకరణకు ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించుకోవడం, సమరశీలతతో, ధైర్య సాహసాలతో ఆ పోరాటాలకు నాయకత్వాన్ని అందించడం, శత్రు దాడికి వెరువని ధీరోదాత్తత, ప్రాణ త్యాగ సంసిద్ధత అనేవి నేటి పరిస్థితుల్లో విశాల ప్రజారాశులను వర్గపోరాటంలో సమీకరించడానికి, ప్రజా పునాదిని పెంచుకోవడానికి, గడ్డుస్థితిని అధిగమించడానికి మార్గాన్ని ఏర్పరుస్తాయి. అన్ని స్థాయిల్లో, అన్ని రంగాల్లో గత అనుభవాలను అధ్యయనం చేయాలి. అందులో భాగంగా పట్టణ ప్రాంత ఆర్గనైజేషన్, మైదాన ప్రాంతాల ఆర్గనైజేషన్, మైదాన ప్రాంతాల్లో గెరిల్లాయుద్ధ నిర్వహణ, గడ్డుస్థితిలో గెరిల్లాయుద్ధాన్ని నడిపే ఎత్తుగడలపై మన అనుభవాలను అధ్యయనం చేయడం, నెగెటివ్‌ను వదిలించుకోవడం, పాజిటివ్ అనుభవాలను సంఘటితపరచుకోవడం ద్వారా నూతన శక్తులను నాయకత్వ శక్తులుగా అభివృద్ధి చేసుకోవడం ద్వారా 'సమాధాన్' దాడిని ఓడిద్దాం.

**6. దేశంలోని విప్లవోద్యమ ప్రాంతాల్లో సైనిక రంగంలో లభిస్తున్న అనుభవాల ఆధారంగా ప్రజాయుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం-తీవ్రతరం చేస్తూ 'సమాధాన్' దాడిని ఓడిద్దాం:**

దేశవ్యాప్త విప్లవోద్యమం గడ్డుస్థితిలోకి వెళ్ళినప్పటి నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ నిర్వహణకు అవసరమైన మిలిటరీ సప్లయిలు ఏవీ అందకుండా చేస్తున్నా మనం గత 5 సంవత్సరాలుగా శత్రుదాడిని ఎదుర్కొనడమే కాకుండా, 'మిషన్ 2016', 'మిషన్ 2017'ల ద్వారా భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలనుకున్న దోపిడీ పాలక వర్గాల పథకాల్ని వమ్ము చేస్తూ ప్రజాయుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాం. ఈ 5 సంవత్సరాల కాలంలో ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల్లో, గెరిల్లా జోన్లలో, గెరిల్లా బేసుల్లో ప్రజా యుద్ధ-గెరిల్లా యుద్ధ నిర్వహణలో ఎన్నో విలువైన అనుభవాలు లభించాయి. దండకారణ్యంలో స్థానిక వనరుల

ఆధారంగా ప్రాథమిక స్థాయి ఇంప్రూవైజ్డ్ ఆర్టిల్లరీని నిర్మించుకోవడం, స్నైపర్లను తయారు చేసుకోవడం, స్నైపర్ టీములు ఆచరణలో కొన్ని మంచి ఫలితాలు సాధించడం, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌ల ద్వారా, ప్రాథమిక ఆర్టిలరీ ద్వారా, మైన్ యుద్ధతంత్రాన్ని తీవ్రతరం–విస్తృతం చేయడం, వివిధ రకాల వేలాది సాంప్రదాయక ట్రాపుల ద్వారా ట్రాప్ యుద్ధాన్ని కొనసాగించడం అనే అనుభవాలు లభించాయి. దండకారణ్యంలో మన పీఎల్‌జీఏ బెటాలియన్ కేంద్రంగా దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో ప్రాంతంలోని సెకండరీ బలగాలు, తెలంగాణ బలగాలు కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించి బుర్కపాల్ ఆంబుష్‌ను విజయవంతం చేయడం ఈ మధ్యకాలపు అనుభవాల్లో ఉన్నతమైనది. బిహార్–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియాలో, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్స్ ఆధారంగా పెద్దఎత్తున ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజులు (ఐఈడీ) తయారు చేసుకుని విశాల ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం, ఆంబుష్‌ల్లో, ఏరియా ఆంబుష్‌ల్లో వాటిని ఉపయోగించి శతృవును దెబ్బతీయడం అనే అనుభవాలు లభించాయి. వీటితో పాటు శత్రు బలగాలపై ఆంబుష్‌ల నిర్వహణలో వచ్చిన నెగెటివ్ అనుభవాల నుంచి కూడా మనకు అనేక విలువైన గుణపాఠాలు లభించాయి. ఏ రకమైన ఆంబుష్‌లోనైనా మన అస్సాల్ట్ పార్టీలకు మద్దతుగా స్కౌట్/సెక్యూరిటీ/స్టాప్ పార్టీలను మోహరించడం, వివిధ రకాల విన్యాసాలు సాగిస్తూ శత్రు బలగాలలో ఒక భాగాన్ని (అది చిన్నదైనా, పెద్దదైనా) వేరుచేసి, చుట్టుముట్టి నిర్మూలించే విధంగా కచ్చితమైన పథకం ఉండాలి. దాన్ని అమలు చేసేలా నిర్దిష్టంగా రిహార్సల్స్ చేసి పట్టు సంపాదించాలి. ఈ విషయంపై కమాండ్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే బిజె, డికెలలో శత్రువు చేపట్టిన భారీ అణచివేత ఆపరేషన్లను కౌంటర్ దాడుల ద్వారా వీరోచితంగా తిప్పికొట్టడమైంది. ఏఓబీ గెరిల్లాజోన్ రామగూడ వంటి భారీ నష్టాన్ని కూడా తట్టుకుంటూనే చిన్న, మధ్యరకపు చర్యల ద్వారా గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిస్తూ, విప్లవోద్యమం కొనసాగుతుందనే అనుభవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తున్నది. అక్కడ ఎమ్‌కేవీబీ (మల్కన్‌గిరి–కోరాపుట్–విశాఖ బార్డర్) డివిజన్‌లో మిలీషియానే స్వతంత్రంగా 20 రోజుల పాటు టీసీఓసీ చేపట్టి సఫలం చేసింది. శత్రు దాడుల నుండి మన పార్టీని కాపాడుకోవడానికి మిలీషియా అనేక రూపాల్లో క్రియాశీలకంగా పనిచేస్తోంది.

పైన పేర్కొన్న అనుభవాలను మనం పరస్పరం దేశవ్యాప్తంగా అందించుకోవాలి. వాటి ద్వారా దేశవ్యాప్తంగా ఎర్రప్రతిఘటనా ప్రాంతాల్లో, గెరిల్లాజోన్లలో, గెరిల్లా బేసుల్లో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేయాలి. శతృవు 'కార్పెట్ సెక్యూరిటీ'లో భాగంగా పోలీసు స్టేషన్లను, క్యాంపులను ఎంత విస్తృతం–బలోపేతం చేసినా అవన్నీ వాడికి మరణ క్షేత్రాలుగా (కిల్లింగ్ ఫీల్డ్స్), సమాధులుగా మారిపోయేలా చేయాలి. శతృ బలగాలు రాత్రి గాలింపు చేసినా, పగలు గాలింపు చేసినా వాటి కదలికలను బహిరంగం చేస్తూ ప్రజలను, గెరిల్లా

బలగాలను అలర్టు చేసేలా రకరకాల పేలుడు పదార్థాలతో ప్రజలను/మిలీషియాను సాయుధం చేయాలి. ప్రజలు ఉపయోగించే సాధనాల ద్వారా శత్రు కదలికలను సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్ని గ్రామాలకు అందేలా తగిన పద్ధతులను అభివృద్ధి చేసుకోవాలి.

ఈ ప్రాంతాలన్నింటిలో ప్రజా మిలీషియా, విప్లవ ప్రజా కమిటీలు ఉన్నచోటనయినా, లేనిచోటనయినా సాంప్రదాయక ఆయుధాలను పెద్దఎత్తున తయారు చేసుకునేలా స్థానిక నిర్మాణాలకే బాధ్యతనివ్వాలి, ఆ ఆయుధాలతో ప్రజలను, ప్రజా మిలీషియాను, స్థానిక నిర్మాణాలను సాయుధం చేయాలి. వాటి ద్వారా 'కార్పెట్ సెక్యూరిటీ' ప్రాంతంలో ప్రతి రోజు శత్రు బలగాలు గాయపడేలా-చచ్చేలా ప్రజా యుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేయాలి. పీఎల్‌జీఏలోని అన్ని శక్తులనూ ఏదో ఒక ఆయుధాన్ని అందించి సాయుధం చేయాలి. నాయకత్వ శక్తులు యుద్ధచర్యల్లో, క్యాంపెయిన్లలో పట్టుదలగా పాల్గొన్న చోట లభిస్తున్న సకారాత్మక ఫలితాల అనుభవాల ఆధారంగా ఈ పద్ధతిని అంతటికి విస్తరింపజేయాలి. అన్ని రకాల ఆయుధాలను, అన్ని రకాల పోరాట రూపాలను ఉపయోగించి కార్పెట్ సెక్యూరిటి వ్యవస్థను నిర్వీర్యం చేయాలి. ఈ రకంగా ప్రజాయుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేస్తూ సమాధాన్ దాడిని ఓడించాలి.

'కార్పెట్ సెక్యూరిటీ' ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో మాస్‌వర్క్-మిలటరీ వర్క్ చేయడంలో ఎదురవుతున్న సమస్యలను, ప్రతికూలతలను అధిగమించడం కోసం ఎక్కడికక్కడ రీజినల్ బ్యూరోలు, స్పెషల్ ఏరియా/స్పెషల్‌జోన్/రాష్ట్రకమిటీలు, సబ్‌జోనల్ బ్యూరోలు, జోనల్/జిల్లా/డివిజనల్ కమిటీలు కొన్ని తీర్మానాలు చేస్తున్నాయి. ఆచరణలో కొన్ని పాజిటివ్ ఫలితాలు కూడా వస్తున్నాయి. ఆచరణలో వస్తున్న పాజిటివ్ అనుభవాలను సంశ్లేషించి రీజినల్ బ్యూరోలు, స్పెషల్ ఏరియా/స్పెషల్‌జోన్/రాష్ట్రకమిటీలు ఈ సమస్య పరిష్కారానికి కొన్ని గైడ్‌లైన్స్ రూపొందించాలి. దానికోసం ఇక్కడ పేర్కొంటున్న విషయాలను గమనంలో ఉంచుకోవాలి. శత్రుదాడి ఎంత తీవ్రంగా ఉన్నా పార్టీ ప్రజలను అంటిపెట్టుకుని ఉండాలి, ప్రజల మధ్య ఉండాలి. ప్రజల మౌలిక సమస్యలపై, రోజువారీ సమస్యలపై; రాజకీయ సమస్యలపై, ఆర్థిక, సామాజిక సమస్యలపై పోరాటాల్లో ప్రజలను కదిలించాలి. మన మిలటరీ నిర్మాణాలు ప్రజలను, ప్రజా మిలీషియాను ప్రజాయుద్ధంలో-గెరిల్లాయుద్ధంలో కదిలించాలి. వీటిని గమనంలో ఉంచుకుని 'కార్పెట్ సెక్యూరిటీ' ప్రాంతాల్లో పార్టీ, మిలటరీ నిర్మాణ వ్యవస్థ అంటే మాస్‌వర్క్ చేసే, మిలటరీ వర్క్ చేసే యూనిట్ల నిర్మాణ వ్యవస్థ ఉండాలి.

భారత విప్లవోద్యమ నిర్మూలనకు శత్రువు రూపొందించుకున్న 'సమాధాన్' నూతన వ్యూహాన్ని ఓడించడం కోసం మనం కార్మికవర్గ దృక్పథంతో, వర్గపంథాపై, ప్రజాయుద్ధ-గెరిల్లాయుద్ధ

నియమాలపై ఆధారపడి మన పార్టీ, పీఎల్‌జీఏల శక్తి-సమర్థతలను పెంచుకోవాలి. శత్రు స్మార్ట్ లీడర్‌షిప్ (చురుకైన నాయకత్వం)ను ఎదుర్కోవడం కోసం మన పార్టీ, పీఎల్‌జీఏ శక్తులు కార్మికవర్గ చురుకుదనాన్ని పెంచుకోవాలి. వాడి అగ్రెసివ్ స్ట్రాటజీ (దూకుడు వ్యూహం)ని ఎదుర్కోవడం కోసం మన గెరిల్లా యుద్ధాన్ని అగ్రెసివ్ (దూకుడుగా)గా సాగించాలి. శత్రు మోటివేషన్‌ను, ట్రైనింగ్ (ప్రేరణ, శిక్షణ)ను ఎదుర్కోవడం కోసం మన పార్టీ, పీఎల్‌జీఏ శక్తులు నిరంతరం కార్మికవర్గ రాజకీయాలతో ప్రేరణ పొందుతూ; శత్రువు అనుసరించే కౌంటర్ గెరిల్లాయుద్ధ ఎత్తుగడలను తిప్పికొట్టేలా మన శిక్షణలో అభివృద్ధి తీసుకురావాలి. శత్రు యాక్షనబుల్ ఇంటలిజెన్స్ (కార్యాచరణకు ఉపయోగపడే సమాచారం)ను ఎదుర్కోవడం కోసం అశేష ప్రజారాశులపై ఆధారపడి ప్రజా ఇంటలిజెన్స్‌ను విస్తృతపరచుకోవాలి. డాష్ బోర్డ్ బేస్డ్ ఇండికేటర్స్ (చేతికి అందుబాటులో ఉండే సూచికలు) ఆధారంగా శత్రువు చేసే దాడులను తిప్పికొట్టి, ఓడించడం కోసం మన ఉద్యమ ప్రాంతాల్లోని శత్రు ఇంటలిజెన్స్ గురించి, ఆ ప్రాంతాల టెర్రయిన్ గురించి, మన బలగాల బలాబలాల గురించి ఎప్పటికప్పుడు మన సమాచారాన్ని వర్తమాన పరిస్థితులకు తగినట్లుగా ఉన్నతీకరించుకుంటూ (అప్‌డేట్ చేసుకుంటూ), అభివృద్ధి పరచుకోవాలి. నో యాక్సిస్ టూ ఫైనాన్సింగ్ (ఆర్థిక వనరులను అడ్డగించడం)ను ఎదుర్కోవడం కోసం ప్రజలపై ఆధారపడి ఆర్థిక వనరులను పెంచుకోవాలి.

**7. శతృ ఇంటలిజెన్స్ వ్యవస్థను దెబ్బతీయాలి. ఆధునిక టెక్నాలజీ ఆధారంగా శతృవు మన సమాచారాన్ని సేకరించడానికి చేస్తున్న ప్రయత్నాలను వమ్ము చేయాలి :**

ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను ఎదుర్కోవడంలో ఉదారవాదానికి, యథాలాపానికీ గురికాకూడదు, అలాగే సెక్టేరియనిజానికీ గురికాకూడదు. ప్రజాపంథా-వర్గపంథాను అనుసరిస్తూనే యాంత్రికతకు గురికాకుండా ఉండాలి. శతృవు ఎంత పెద్దఎత్తున ఇన్‌ఫార్మర్లను తయారు చేసినా ప్రజల నిఘా ద్వారా వారిని గుర్తించి వేర్వేరు రూపాల్లో కంట్రోల్ చేయడం, కీలకమైన కొద్దిమంది ఇన్‌ఫార్మర్లను నిర్మూలించడమే మన పద్ధతి.

శతృవు తన ఇంటలిజెన్స్ వ్యవస్థను విస్తృతం చేసుకోవడంలో భాగంగా ఉద్యమ ప్రాంతాలంతటా ఇన్‌ఫార్మర్లను పెద్దఎత్తున తయారు చేసుకుంటున్నాడు. ఇన్‌ఫార్మర్లలో అత్యధికులు ప్రజా వ్యతిరేకులు, లంపెన్‌శక్తులు అయినప్పటికీ పేద-మధ్యతరగతికి చెందిన ఆదివాసీ, దళిత, వెనకబడిన తరగతుల వాళ్ళే. కాబట్టి తమ వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఇన్‌పార్మర్లుగా మారకుండా పీడిత ప్రజానీకంలో నిరంతరం రాజకీయ కృషిని కొనసాగించాలి. ఉద్యమ ప్రాంతాలంతటా ఇన్‌ఫార్మర్ల సమస్యపై ప్రజలలో రాజకీయ, సైనిక క్యాంపెయిన్‌లు చేపట్టాలి. గ్రామాల్లో సభలు-సమావేశాలు నిర్వహించడం, ఇన్‌ఫార్మర్లుగా తేల్చినవారితో విడిగా మాట్లాడి నచ్చచెప్పడం, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అర్థం చేయించడం, హెచ్చరికలు చేయడం,

అవసరమైన చోట దేహశుద్ధి చేయడం, అతి కొద్ది మందిని నిర్మూలించడం అనే పద్ధతి ద్వారా ఈ సమస్యను నిరంతరం ఎదుర్కోవాలి. ఇన్‌ఫార్మర్లుగా పనిచేసే టీచర్స్, అంగన్‌వాడీలు, నర్సులయితే వారి వారి సంగాల ద్వారా కంట్రోల్ చేయించాలి. అప్పటికీ కంట్రోల్ కాకపోతే దేహశుద్ధి, ఖతం చర్యలు తీసుకోవాలి. అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలను ఆర్గనైజ్ చేసి ప్రజా పునాది పెంచుకోవడం ద్వారా ఇన్‌ఫార్మర్ల సమస్య తీవ్రతను తగ్గించాలి.

వివిధ రకాల ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ద్వారా, కమ్యూనికేషన్ పరికరాల ద్వారా (వాకీటాకీలు వగైరా) శత్రువుకు మన సమాచారం అందకుండా రూపొందించుకున్న పద్ధతులను పాటించాలి.

**8. తీవ్రతరం కానున్న దాడులను ఎదుర్కొనేలా ప్రజాసంఘాలను తీర్చిదిద్దుకోవాలి.**

'సమాధాన్' దాడి కేవలం గెరిల్లాజోన్లపైన, సాయుధ గెరిల్లాల పైన మాత్రమే కాదు. ప్రజాసంఘాల కార్యకర్తలపై రానున్న రోజుల్లో విప్లవ ప్రతీఘాతుక దాడులు తీవ్రతరమవుతాయి. 'అర్బన్ మావోయిస్టులు ప్రమాదకారులు' అంటూ, ఇంకా ఇతరత్రా పేర్లతో ప్రజాసంఘాల కార్యకర్తలపై శత్రుదాడులు తీవ్రతరమవుతాయి. గతంలో శత్రు దాడులను ఎదుర్కొని నిలిచిన అనుభవాల ఆధారంగా ఈ సమాధాన్ దాడిని కూడా ఎదుర్కోవడానికి ప్రజాసంఘాలు సిద్ధం కావాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాల్లోకి విస్తృతంగా ప్రజానీకాన్ని సమీకరించి, ఆ పోరాటాల్లో కదిలే ప్రజానికాన్ని ప్రజాసంఘాల్లో సంఘటితం చేసుకొని బలపడడం ద్వారానే సమాధాన్ దాడిని ఎదుర్కోవాలి. శత్రువు మోసకారి పద్ధతుల్లో మన కార్యకర్తలపై చేసే దాడులను ఎదుర్కోవడానికి తగిన జాగ్రత్తల్ని, పని పద్ధతుల్ని రూపొందించుకోవాలి.

**9. మన పార్టీకి ఆర్థిక నిధుల్ని అందకుండా చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్ట పథకాల్ని విఫలం చేద్దాం.**

మన ఆర్థిక పాలసీని అనుసరించి ప్రతి రాష్ట్రకమిటీ మూడు సంవత్సరాలకు సరిపడే ఆర్థిక నిల్వలుండేలా చూసుకోవాలి. తమ తమ ప్రాంతాల్లో నిధుల సేకరణకు ఉన్న అన్ని వనరులను, అవకాశాలను గుర్తించి తగిన జాగ్రత్తలతో, రహస్యంగా నిధులు వసూలు చేయాలి. విప్లవోద్యమానికి నిధులు అందించే చైతన్యం ప్రజల్లో పెంచుతూ, ప్రజల నుండి అవకాశం ఉన్న మేరకు నిధులు సేకరించుకోవాలి. అన్ని మార్గాల నుండి సేకరిస్తున్న నిధులను రాజకీయ ప్రచారానికీ, యుద్ధ అవసరాల కోసం ప్రాధాన్యతనిచ్చి కేటాయింపులు చేయాలి. మనం అలవాటుపడి చేస్తున్న దుబారాను అరికట్టాలి, పొదుపును పాటించాలి. అప్పుడే మనకు నిధులు అందకుండా చేసి విప్లవోద్యమాన్ని దెబ్బతీయాలనే శత్రు పథకాన్ని విఫలం చేయగలుగుతాం.

**కామ్రేడ్స్!**

భారత విప్లవోద్యమాన్ని ఓటమి పాల్జేసేందుకు శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడిని మనం వ్యూహాత్మకంగా, ఎత్తుగడలపరంగా విశ్లేషించుకోవాలి. ఎత్తుగడలపరంగా శత్రుదాడిని 'నిజమైన పులి దాడి'గానే భావించి పైన పేర్కొన్న ఆత్మరక్షణ-దాడి పద్ధతులన్నింటిని సీరియస్‌గా అమలు చేయాలి. వ్యూహాత్మకంగా చూసినపుడు శత్రుదాడి పథకాన్ని 'కాగితపు పులి దాడి'గానే తీసుకోవాలి. ఎందుకంటే వర్గాలున్నంతకాలం, దోపిడీ వర్గాలు, పీడిత వర్గాలపై ఎంతటి క్రూరమైన దాడులు చేసినా సమాజంలో వర్గ పోరాటాన్ని నిర్మూలించలేవు. ఇది ఎలాంటి మినహాయింపు లేని సార్వజనీన నియమం. దోపిడీ వర్గాల క్రూరమైన దాడుల మధ్యనే పీడిత వర్గాలు సాగించే నిరసనలకు, ప్రతిఘటనలకు, పోరాటాలకు సరైన రాజకీయాల్ని, సరైన ఎత్తుగడల్ని అందిస్తే అవి సంఘటితపడి, సాయుధమయ్యి దోపిడీ వర్గాలను కూలదోస్తాయి, నిర్మూలిస్తాయి. వర్తమాన రాజకీయరంగంలో దేశీయంగా, అంతర్జాతీయంగా మౌలిక వైరుధ్యాలన్నీ పదునెక్కుతున్న ఫలితంగా అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలు పోరాడుతున్నారు. ఈ భౌతిక పరిస్థితే శత్రువును ఓడించడానికి పెద్ద వనరు, ప్రాతిపదిక. మనం గతంలో సల్వాజుడుంను ఓడించాం. మిషన్ 2016, 2017లను ఆపరేషన్ గ్రీన్ హంట్ పథకాన్ని విఫలం చేసాం. మన నాయకత్వ శ్రేణుల్ని, కమాండర్లను, మన బలగాలను శత్రు దాడుల్లో నష్టపోకుండా కాపాడుకుందాం. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా కదులుతున్న విశాల ప్రజారాశులను సంఘటితం చేసి, సాయుధం చేసి ప్రజా పునాది పెంచుకుందాం. పెరిగే ప్రజా పునాదిపై ఆధారపడి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేస్తూ 'సమాధాన్' దాడిని ఓడిద్దాం.

**దేశీయంగా, అంతర్జాతీయంగా పెంపొందుతున్న విప్లవానుకూల పరిస్థితులను ఉపయోగించుకుని శత్రుదాడిని ఓడిద్దాం :**

**కామ్రేడ్స్!**

అంతర్జాతీయంగా, దేశీయంగా మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్న ఫలితంగా పరిస్థితులు విప్లవానికి అనుకూలంగా పెంపొందుతున్నాయి. 2008లో మొదట అమెరికాలో, ఆ తరువాత యూరప్‌లో తలెత్తిన ద్రవ్య, ఆర్థిక సంక్షోభాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అధికోత్పత్తి సంక్షోభం సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థను పట్టిపీడిస్తూనే ఉంది. తాజాగా ఫ్రాన్స్‌లో ఒక రెడీమేడ్ దుస్తుల కంపెనీ 200 కోట్ల రూపాయల కంటే అధిక విలువ గల దుస్తులను ధ్వంసం చేయడం ఇందుకు ఒక ఉదాహరణ. తాజాగా అమెరికా ఆర్థికరంగంలో అనుసరిస్తున్న రక్షణ విధానాలు యూరప్, చైనాలతో దానికి వైరుధ్యాలు పెంచాయి. అవి క్రమంగా వ్యాపార యుద్ధాలకు దారి తీస్తున్నాయి. ఈ సంవత్సరం మార్చ్ 1న చైనా నుండి దిగుమతి చేసుకునే

ఉక్కు దిగుమతులపై 25%, అల్యుమినియంపై 10% దిగుమతి సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అది కేవలం ఉక్కు, అల్యుమినియం ఉత్పత్తుల మేరకే కాకుండా 50 బిలియన్ డాలర్ల (దాదాపు 3.4 లక్షల కోట్లు రూ.) విలువైన ఇతర 1300 రకాల చైనా ఉత్పత్తులపై 25% సుంకం విధించింది. దీనికి ప్రతిగా చైనా కూడా అమెరికాకు చెందిన 106 వస్తువులపై 3.4 లక్షల కోట్ల రూ. దిగుమతి సుంకాలను విధిస్తున్నట్లుగా, యూరోపియన్ యూనియన్ కూడా అమెరికాపై దిగుమతి సుంకాలు ప్రకటించింది. ఈ రకంగా అమెరికా–చైనాల మధ్య వాణిజ్యయుద్ధం కొనసాగుతూ ఉండగానే, యూరప్ దేశాల కార్లు తదితర దిగుమతులపై కూడా అమెరికా సుంకాల్ని పెంచే నిర్ణయం తీసుకుంది. జపాన్‌పై కూడా సుంకాలు విధిస్తానని బెదిరించింది. దీంతో అమెరికాకు, యూరప్‌కు మధ్య, అమెరికాకు, జపాన్‌కు మధ్య కూడా వాణిజ్య యుద్ధాలు కొనసాగే స్థితి నెలకొంది. ఈ పరిణామాలన్నీ సాపేక్షికంగా ఆర్థికంగా బలహీనపడుతున్న అమెరికాను 'అమెరికా ఫస్ట్' అంటూ తిరిగి దానిని బలమైన శక్తిగా నిలబెట్టడానికి ట్రంప్ అనుసరిస్తున్న రక్షణ విధానాల ఫలితాలే. దీంతో జపాన్ జులై 1న యూరోప్, చైనాలతో సహా 10 ఆసియా దేశాలతో కలిసి జపాన్ రీజనల్ అండ్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ (ఆర్‌సిఇపి)ను ఏర్పాటు చేసింది. మరోవైపు అమెరికా డాలర్, చైనా యువాన్‌ల మధ్య చెలరేగిన కరెన్సీ యుద్ధం కూడా తీవ్రతరమైంది. రానున్న రోజుల్లో ఈ ఘర్షణలు మరింత పెరుగుతాయి. ఆర్థికరంగంలోని ఘర్షణలు సైనిక రంగంలోకి విస్తరించే ప్రమాదం లేకపోలేదు. వీటివల్ల కలిగే దుష్ఫలితాలు ప్రపంచమంతటనీ పీడిస్తాయి.

మధ్య ప్రాచ్యం (పశ్చిమాసియా)లో సిరియా అంతర్యుద్ధాన్ని పరిష్కారం కానివ్వడం లేదు. అది అమెరికా, రష్యా కూటముల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి (కోల్డ్‌వార్) వేదికగా మారింది. సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య శతృత్వాన్ని పెంచి పోషించడానికి అమెరికా నిరంతరం కుట్ర పన్నుతూనే ఉంది. ఇజ్రాయిల్, సిరియాల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయి. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా అమెరికా గుర్తించడం, అక్కడకు తన రాయబార కార్యాలయాన్ని మార్చడంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ విస్తరణవాద దాడులు తీవ్రస్థాయికి చేరాయి. దీనికి వ్యతిరేకంగా పాలస్తీనా జాతి ప్రజలు తీవ్ర ఆగ్రహంతో మిలిటెంటు పోరాటాలు సాగిస్తున్నారు.

కొరియా ద్వీపకల్పంలో అణ్వాయుధ నిరాయుధీకరణ గురించి జూన్ నెలలో అమెరికా, ఉత్తర కొరియా అధ్యక్షులిద్దరూ సింగపూర్‌లో సమావేశమయ్యి జరిపిన చర్చలను సామ్రాజ్యవాద కార్పొరేట్ మీడియా ఆకాశానికి ఎత్తినప్పటికీ ఆ సమావేశం సహజంగానే ఎలాంటి ఫలితాలు సాధించకుండానే ముగిసింది.

సిరియా–మధ్యప్రాచ్యం, కొరియా ద్వీపకల్పం, దక్షిణ చైనా సముద్ర ప్రాంతం ఇప్పటికీ సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణ కేంద్రాలుగా కొనసాగుతూ ప్రపంచ శాంతికి ప్రమాదంగానే ఉన్నాయి.

మన దేశంలో వ్యవసాయరంగంపై, రైతాంగంపై సామ్రాజ్యవాదం, భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న దోపిడీ, పీడనల ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చితికిపోయి, రైతాంగపు బతుకులు దుర్భరంగా మారడంతో గత రెండు సంవత్సరాలుగా రైతాంగం సమరశీల పోరాటాలు సాగిస్తున్నది. దానికి తాజా ఉదాహరణ, మార్చ్ 1న మహారాష్ట్రలోని నాసిక్ నుండి మొదలయి 12కు ముంబయి చేరిన 180 కి.మీ. రైతు కూలీల, ఆదివాసుల లాంగ్‌మార్చ్. రైతాంగాన్ని, గ్రామీణ ప్రజానీకాన్ని వారి సమస్యలపై, సంఘటితం చేసి, పోరాడడానికి అనుకూలమైన పరిస్థితులు రోజురోజుకు పెరుగుతున్నాయని గత రెండు సంవత్సరాల రైతాంగ పోరాటాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

గత నాలుగు సంవత్సరాలుగా దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు దేశవ్యాప్తంగా అన్ని వర్గాలపై, సామాజిక సముదాయాలపై, పీడిత జాతులపై చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా పీడిత ప్రజా సముదాయాలన్నీ క్రమంగా సమైక్యంగా, సంఘటితమవుతూ, సమరశీల పోరాటాలకు సిద్ధమవుతున్నాయి.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరు కార్చడానికి సుప్రీంకోర్టు మార్చ్20న తీర్పు ఇవ్వడాన్ని నిరసిస్తూ దేశంలోని దళిత సంఘాలు ఇచ్చిన ఏప్రిల్ 2 నాటి భారత బంద్‌లో దళిత, ఆదివాసీ, విద్యార్థి, యువజనుల సమరశీల భాగస్వామ్యం బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించడానికి బలమైన ప్రాతిపదికగా ఉంది.

ఈ సంవత్సరం జనవరి 1నాడు మహారాష్ట్రలోని భీమా కోరేగావ్‌లో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు చేసిన దాడికి వ్యతిరేకంగా వారం రోజుల పాటు మహారాష్ట్ర అంతా దళిత, బహుజనుల తీవ్ర నిరసనలు చెలరేగాయి. మహారాష్ట్రలోనే కాకుండా దేశవ్యాప్తంగా బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా దళితుల్లో పెరుగుతున్న చైతన్యానికి, సమరశీలతకు ఆందోళన చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఢిల్లీ, నాగపూర్, పూణేల నుండి 5 గురు ప్రజాసంగాల కార్యకర్తలను అరెస్టు చేసి భీమా కోరేగావ్‌లో హింస, ప్రధానిని హత్యచేసే బూటకపు కుట్రకేసు మోపి జైలు పాల్జేశారు. అయితే ఈ అణచివేత ఫలితంగా దళితుల్లో పెరుగుతున్న సమరశీలత మరింత పెరుగుతున్నదే కాని తగ్గడం లేదు.

నరేంద్రమోదీ నాలుగేళ్ళ పాలన ప్రజల్లో ఆయనపై ఏర్పడిన భ్రమల్ని తొలగిస్తోంది. 'అచ్ఛేదిన్ లాయేంగే' (మంచి రోజులు తెస్తాం) అంటూ గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వ నాలుగేళ్ళ పాలనలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలూ, పెరుగుతున్న పెట్రోల్-డీజిల్ ధరలూ; సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న చోట ఈ నాలుగేళ్ళల్లో ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోవడమూ, 45 వేల మంది రైతుల ఆత్మహత్యలూ, పెద్దనోట్ల రద్దు-జీఎస్టీ ద్వారా కుదేలయిన ఆర్థిక వ్యవస్థా, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మొండి బకాయిలు (నాన్ పెర్ఫార్మింగ్ ఆస్సెట్స్) పెరిగిపోవడం, బ్యాంకు కుంభకోణాలు సహా ఇతరత్రా కుంభకోణాలూ-వీటన్నింటి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు 'బూరే దిన్ (చెడురోజులు)' దాపురించాయి. దేశంలో ప్రతిరోజు ఏదో ఒక చోట దళితులపై, ఆదివాసులపై, మత మైనారిటీలపై దాడులు, మహిళలపై లైంగిక దాడులతో, హత్యలతో 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' నినాదపు బూటకత్వం, మోసం బహిరంగమైపోతున్నది. మోదీ వల్లిస్తున్న నినాదాలన్నీ సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల, భూస్వాముల ప్రయోజనాల కోసమేనని సగటు ప్రజానీకంలో బహిర్గతమయిపోతున్నాయి. అందుకే ఇప్పుడు హిందుత్వవాదులు తమ బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించే ఎజెండాలో భాగంగా ఒక పక్క 'వికాస్' (అభివృద్ధి) నినాదాన్ని వల్లిస్తూనే మరో వైపు అయోధ్యలో రామ మందిర నిర్మాణ నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రానున్న పార్లమెంటు, అసెంబ్లీల ఎన్నికల్లో గెలిచే కుట్రలు చేస్తున్నారు. 'వేర్పాటువాదుల' పట్ల మెతకవైఖరి వహించిందంటూ కశ్మీర్‌లో పీడీపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించి, రాష్ట్రపతి పాలన నెలకొల్పడం వెనక బీజేపీది పెద్ద కుట్ర దాగి ఉంది. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నదనీ, 'వేర్పాటువాదులకు' అన్ని రకాల మద్దతునిస్తున్నదనీ, సరిహద్దులలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తుందనే ఆరోపణలతో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా, కశ్మీర్ జాతి విముక్తి పోరాటానికి వ్యతిరేకంగా జాతీయోన్మాదాన్ని, హిందూ మతోన్మాదాన్నీ, బూటకపు దేశభక్తిని రెచ్చగొడుతూ పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్ర పన్నుతోంది.

మోదీ ప్రభుత్వ వైఫల్యాలనూ, అది సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు పాటుపడుతూ దేశద్రోహకర, ప్రజా వ్యతిరేక, హిందూ ఫాసిస్టు విధానాలను అనుసరిస్తున్న తీరునూ ప్రజల్లో బహిర్గతం చేయాలి. హిందూ మతోన్మాదానికి, జాతీయోన్మాదానికి బలికాకుండా ప్రజల్లో నిరంతరం రాజకీయ ప్రచారాన్ని కొనసాగించాలి. తద్వారా నరేంద్ర మోదీ నాయకత్వంలో పెచ్చరిల్లుతున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి

వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విశాల ప్రాతిపదికన ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేయాలి.

అయోధ్యలో రామమందిరం నిర్మాణం పేరుతో ప్రజల్లో హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి; సామాజిక విభజనను, మతపరమైన విభజనను రెచ్చగొట్టి కశ్మీర్ సమస్య పేరుతో, సరిహద్దు సమస్య పేరుతో పాకిస్తాన్ వ్యతిరేక జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టి రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీయే తిరిగి అధికారంలోకి రావచ్చు లేదా కాంగ్రెస్ నాయకత్వంలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడవచ్చు. ఒకవేళ బీజేపీయే తిరిగి అధికారంలోకి వస్తే 'సమాధాన్' ఫాసిస్టు దాడి మరింత తీవ్రతరమవుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా అది 'సమాధాన్' కాకున్నా మరో పేరుతో విప్లవోద్యమంపై దాడి తీవ్రతరమవుతుంది. ఈ దాడికి కూడా ఎల్ఐసీ సిద్ధాంతమే గైడెన్స్‌గా ఉంటుంది. దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని నిర్మూలించే దాడే కొనసాగుతుంది. ఈ దాడిని ఓడించడం కోసం కృషి చేయడమే మన కర్తవ్యం. అందుకోసం రీజినల్ బ్యూరోల గైడెన్స్‌లో అన్ని స్పెషల్ ఏరియా/స్పెషల్ జోనల్/రాష్ట్రకమిటీలు రానున్న నాలుగేళ్ళ కాలానికి వర్తించే ఒక సాధారణ పథకాన్ని, రెండేళ్ళ కాలానికి వర్తించే నిర్దిష్ట పథకాన్ని రూపొందించుకోవాలి. ఇందులో ఆత్మరక్షణ-దాడి; కేంద్రీకరణ-వికేంద్రీకరణ-కమాండ్; జోన్/జిల్లా/డివిజన్ పరిధి నుండి స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్/రాష్ట్ర పరిధి వరకు ఏరియాలను పెంచుకుని విశాల పరిధిలో, ఏరియాల్లో పురోగమన, తిరోగమన పద్ధతులను అనుసరించడం వగైరా అంశాల గురించిన గైడ్‌లైన్స్ ఉండాలి. అవన్నీ ప్రజాపునాదిని పెంచుకోవడానికీ, పార్టీనీ, పీఎల్‌జీఏనూ పటిష్టం చేసుకోవడానికి, పోరాటశక్తినీ పోరాటశైలిని పెంపొందించుకోవడానికి తోడ్పడేలా ఉండాలి.

పై కర్తవ్య సాధన కోసం వర్గ సమస్యలతోపాటు వివిధ సామాజిక సెక్షన్ల సమస్యలపైన, పీడిత జాతుల సమస్యలపైన చట్టబద్ధ-చట్ట వ్యతిరేక, బహిరంగ-రహస్య పోరాట రూపాలలో పోరాడుదాం. ఈ క్రమంలో రాజకీయ సమీకరణ శక్తిని, నిర్మాణ, పోరాట శక్తిని పెంపొందించుకుందాం. తద్వారా విప్లవానుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకొని 'సమాధాన్' దాడిని ఓడించి, భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేద్దాం.

**విప్లవాభినందనలతో**

25-7-2018 **సెంట్రల్ మిలటరీ కమీషన్**

**సిపిఐ (మావోయిస్టు)**

✦

(....144 పేజీ తరువాయి)

మానవులు అన్యశక్తులైన ప్రకృతి శక్తుల, సామాజిక శక్తుల అధీనంలో ఉన్నంతకాలం, మతం సుకరమైన, అనువైన ఈ రూపంలో కొనసాగగలదు. వారిపై పెత్తనం చేసే శక్తులతో వారికి గల తక్షణ సంబంధం, అనగా ఊహాత్మక సంబంధం, ఆ రూపంలో కొనసాగగలదు. అనగా, మతం ఏకేశ్వర భావంగా కొనసాగుతుందన్నమాట. అయితే, ఇప్పుడున్న బూర్జువా సమాజంలో మానవులు తాము సృష్టించుకొన్న ఆర్థిక పరిస్థితులకు తామే లోబడి పోతున్నారనీ, వారు నిర్మించుకొన్న ఉత్పత్తి సాధనాలు వారినే లోబరుచుకొన్నాయనీ (అన్యశక్తి మాదిరిగా) మనం పదే పదే తెలుసుకుంటూ వచ్చాం. అందుచేత, మతం ఏ బింబీకృత క్రమంనుంచి ఉద్భవిస్తుందో, ఆ ప్రాతిపదిక ఇప్పటికీ యథాప్రకారంగానే ఉంది. దానితోబాటు మతైక ప్రతిబింబంకూడా యథాప్రకారంగానే ఉంది. ఈ అన్యశక్తుల ఆధిపత్యానికిగల కారణాన్ని బూర్జువా అర్థశాస్త్రం కొంతలోతుగా పరిశీలించినప్పటికీ, ప్రధానమైన వ్యత్యాసమేమీలేదు. బూర్జువా అర్థశాస్త్రం సాధారణ సంక్షోభాల్ని నివారించనూలేదు. వ్యక్తిగత పెట్టుబడిదారుల్ని నష్టాలనుంచీ అక్రమరుణాలనుంచీ, దివాళానుంచీ కాపాడనూలేదు. అలాగే, వ్యక్తిగత కార్మికుల్ని అది నిరుద్యోగం నుంచీ, దారిద్ర్యం నుంచీ రక్షించలేదు. మానవుడు తలచుకుంటే, దేవుడు (అనగా, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అన్యశక్తిగా చెలాయించే అధిపత్యం) అనుగ్రహిస్తాడనే సూక్తి ఇప్పటికీ నిజమే. సామాజిక శక్తుల్ని సమాజం అధీనం క్రిందికి తేవడానికి జ్ఞానం ఒక్కటే చాలదు. ఆ జ్ఞానం బూర్జువా అర్థశాస్త్రం ఇచ్చిన దానికంటే గొప్పదీ, గాఢమైనది కావచ్చు. అందుకు అన్నిటికంటే ముఖ్యంగా సామాజిక చర్య అవసరం. ఎప్పుడైతే ఆచర్య కొనసాగుతుందో, సమాజం ఎప్పుడైతే ఉత్పత్తి సాధనాలన్నిటినీ స్వాధీనం చేసుకొని, ప్రణాళికాబద్ధంగా వాటిని ఉపయోగించుకొని, తద్వారా తన్నుతానూ ఇతరులందర్నీ విముక్తి చేస్తుందో, ఆ విధంగా మానవుడు ఎప్పుడైతే తలచుకొన్నదానిని అందుకుంటాడో-అప్పుడు మతంలో ఇప్పటికీ ప్రతిబింబించే ఆఖరి అన్యశక్తి అంతమవుతుంది. దానితోబాటు మతైక ప్రతిబింబం కూడా అంతమవుతుంది. ఎందుచేతంటే, అప్పుడిక ప్రతిబింబింపబడేది ఏదీ ఉండదు.

**"అంటీ డూరింగ్" నుంచి (1876-78)**

✦

# మతం గురించి ఫ్రెడరిక్ ఎంగెల్స్

మతం విషయం చూద్దాం. మానవుల నిత్య జీవితాన్ని అదుపులో పెట్టే బాహ్యశక్తులు వారి మనస్సులలో ఊహలుగా ప్రతిబింబిస్తాయి. మతం అంటే ఆ ప్రతిబింబాల సమాహారం తప్ప మరొకటి కాదు. మతంలో ఐహిక శక్తులు మానవాతీత శక్తుల రూపం ధరిస్తాయి. చరిత్ర తొలి దశలో అలా ప్రతిబింబించినవి ప్రకృతిశక్తులు. తర్వాత ముందడుగిడిన పరిణామ క్రమంలో, అవి వివిధ జాతుల ప్రజల్లో అసంఖ్యాకమైన, రకరకాలైన మానవ రూపాలు ధరించాయి. ప్రాచీన గాథా సంప్రదాయాల పోలికలను పరిశీలిస్తే, కనీసం ఇండో యూరోపియన్ జాతుల విషయంలో ఈ తొలి పరిణామ క్రమం మనకు గోచరిస్తుంది ముఖ్యంగా, భారతదేశపు వేదాల్లో ఇది గోచరిస్తుంది. ఇంకా ముందుకుపోతే, అది భారతీయుల్లోను, పర్షియన్లలోను, గ్రీకుల్లోను, రోమన్లలోను, జర్మన్లలోను, ఆధారాలు లభించినంతవరకు కెల్టులలోను, లితుయేనియన్లలోను, స్లావ్‌లలో ఇంకా వివరంగా ద్యోతకమవుతుంది. కాని, త్వరలోనే ప్రకృతి శక్తుల సరసన సామాజిక శక్తులు కూడ చురుగ్గా పనిచేయసాగాయి. ఇవి మానవుని ముందు ప్రకృతిశక్తులంత అన్యశక్తులుగానూ నిలబడ్డాయి. మొదట్లో అవి ప్రకృతి శక్తులంత అనిర్వచనీయంగా ఉండేవి. వాటితో సమానంగా అవి మానవునిపై పెత్తనం చేయసాగాయి. ఆ పెత్తనం పైకెంతో సహజ సిద్ధమైన ఆవశ్యకతగా కనబడేది. తొలిదశలో నిగూఢమైన ప్రకృతి శక్తుల్ని మాత్రమే ప్రతిబింబించిన మార్మిక, దురవగాహమూర్తులు ఈ దశలో సామాజిక లక్షణాలను సంతరించుకొన్నాయి. అవి చారిత్రక శక్తుల ప్రతినిధులుగా తయారయాయి. ఇంకా ఉన్నతమైన పరిణామ దశలో, అసంఖ్యాక దేవతల ప్రకృతి లక్షణాలు, సామాజిక లక్షణాలు సర్వశక్తులతో అలరారే ఏకేశ్వరునికి బదలాయింపయ్యాయి. అతడు అనిర్దిష్ట మానవుని ప్రతిబింబం మాత్రమే. ఏకేశ్వర భావం ఉద్భవించింది ఇలాగే. చారిత్రకంగా చూస్తే, ఇది గ్రీకుల్లో తర్వాతివారు సృష్టించిన చిట్టచివరి నకిలీ తత్వశాస్త్రం. ఇది యూదుల ప్రత్యేక జాతీయ దైవమైన జిహోవాగా అవతరించింది.

(మిగతా 143వ పేజీలో....)